ద్వాదశాదిత్యులు

(రామకృష్ణ - ధూర్జటి - సూరన - చిన్నయసూరి)



ప్రణేత

కావ్య స్వరూప సారజ్ఞ - సారప్రకాశ నాభిజ్ఞ

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

Vujjanraiu Srinivasa Rao
www.adwitaVedanta.in

ద్వాదశాదిత్యులు

(రామకృష్ణ - ధూర్జటి - సూరన - చిన్నయసూరి)

మూడవ భాగము

ప్రణేత

కావ్యస్వరూప సారజ్ఞ - సారప్రకాశ నాభిజ్ఞ

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

గ్రంథ నామము : **ద్వాదశాదిత్యులు** (మూడవ భాగము)

ప్రణేత : **యల్లంరాజు శ్రీనివాసరావు**

ముద్రణము : ప్రథమము

ముద్రణ కాలము : **నందన - చైత్రమాసము**

ఏప్రిల్ - 2012

గ్రంథ మూల్యము : **రూ.100/-**

ప్రతులు : **200**

డి.టి.పి. : **రితిక్ ఇమేజస్**

విజయవాడ - 520 002

సెల్ : 9490 33 4097

ముద్రాపకులు : **పూర్ణిమ బుక్ హౌస్,**

విజయవాడ - 2

ప్రాప్తి స్థానము : **యల్లంరాజు శ్రీనివాసరావు**

వేంకటసాయి టవర్స్,

పాపరాజు వీధి, సత్యనారాయణపురం,

విజయవాడ - 520 011

ఫోన్ : 2538526

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

విషయ సంగ్రహము

1. రామకృష్ణుని - వికటకవిత్వము 5

2. ధూర్జటి శివతాండవము 65

3. సూరన కల్పనా ప్రపంచము 124

4. చిన్నయసూరి వచనామృతము 185

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

రామకృష్ణుని - వికటకవిత్వము

మనమింత వరకూ భట్టుమూర్తి చిత్రకవిత్వంలో మునిగితేలాము. పోతే ప్రస్తుతం మరొక మహాకవి బయలుదేరి వచ్చాడు మన ముందుకు. ఎవరయ్యా మీరని అడిగితే ఎవరో మీకు తెలియదా- ఆయన చిత్రకవి అయితే నేను వికటకవినని. వికటకవి అంటే ఎవరంటారా తెలుగు వారయి ఉండి ఆ మాత్రం తెలియదా మీకు. సరే నా నోటనే వినాలని ఉందా అయితే చెబుతాను వినండి. నా పేరు తెనాలి రామకృష్ణుడు. ఇప్పుడైనా అర్థమయిందా మీకు నేనెవరో. మన తెలుగు భాషలో కవులనే వారు ముగ్గురే తెలుసుకోండి. కవి యల్లసాని పెద్దన- కవి తిక్కన సోమయాజి గణుతింపంగా కవి నేను రామకృష్ణుడ. ఇక ఎవరినైనా మీరు కవులని గణుతిస్తే గణించండి. నేను కాదన లేదు. కాని కవియను నామంబు నీటికాకికి కూడా ఉందని గమనించి దాన్ని కూడా కవుల జాబితాలో చేర్చుకోండి పరవాలేదంటాడు.

ఇదేమిటీ మహానుభావుడిలా మాటాడుతాడని నన్నడుగుతారే మీరు. ఇంకా నయం అసలు వీళ్లెవరూ కవులుగారు. నేనొక్కడనే కవినని చాటినా చాటవచ్చు. ఆశ్చర్యం లేదు. అదేమంటే నా వరకూ దేనికి నా

గొప్పతనాన్ని మెచ్చుకొనే మా విరూరి వేదాద్రి మంత్రి చేతనే చెప్పిస్తా వినండి. 'ఉదయం బస్తనగంబు సేతువు హిమవ్యూహంబునుం జుట్టిరా. విదితంబైన మహిన్ మహాంధ్రకవితా విద్యాబల ప్రౌఢి నీకెదురేరీ సరసార్ధ బోధఘటనా హేలా పరిష్కార శారద నీరూపము' అని ఎప్పుడో ఇచ్చారు కితాబు. ప్రబంధ కవిత్వంలోనే గాదు. ఆ మాటకు వస్తే 'చాటు కవిత్వ తత్త్వరస సాగర పారగుణ్ణి' గూడా - అప్పటికప్పుడాశువుగా చెప్పినా చెప్పగలను- కూచొని ఎప్పటికీ నిలిచేలాగా ఒక మహాకావ్యం వ్రాయనూ గలను. సాక్షాత్తూ శారదాదేవే నారూపమైనప్పుడు నాకేమి లోపమని కూడా నిర్భయంగా చాటగలను.

అవును మఱి. కృష్ణదేవరాయలతో ముడిబడ్డ జీవితమని చారిత్రకంగా చెప్పగలమో లేమో గాని మొత్తంమీద ఈ మహాకవి పేర చలామణి అవుతూ వచ్చిన చాటు పద్యాలన్నీ ఇన్నీ గావు. రింగుమని మోగుతున్నాయి తెలుగువారి చెవులలో ఇప్పటికీ. ఒక కరిభిద్గిరిభిత్తనే పద్యమే గాదు. మేక తోకకు మేకే గాదు నరసా విరసా తుసాబుసాయే గాదు- అల్లసాని వారినే ఆక్షేపిస్తూ చెప్పిన రెండూ పద్యాలూ రెండు బంగారు కణికలు.

'ఉమెతక్కయదిని సెపితో
క్రమమెఱుగక వెట్టి పుచ్చకయ దివిసెపితో
యెమి దినిసెపితిని కపితము
అమవస నిసియనెడు మాట అలసని పెదనా'
కలనాటి ధనము లక్కఅ
గలనాటికి దాపఁగమల గర్భుని వశమా
నెలనడిమి నాటి వెన్నెల
యల వడునే గాదెఁబోయ 'నమవ స నిసికిన్'

అని పెద్దనగారు పద్యం చివర అమావాస్య నిశి నమ వస నిసి అని కుదించి చెప్పాడో లేదో ఇక పట్టుకొన్నాడు. తాను ఆ కుదింపుకు తగినట్లు పద్యంలో ప్రతి మాటా కుదించి తాను దానికి ప్రతిగా మరొక పద్యం చెబుతాడెంతో చమత్కారంగా.

ఇది చమత్కారంగా నైతే మరొకటి ఎంతో రసస్ఫోరకంగా చెప్పట మింకా ప్రశంసనీయం. అదేమిటో కవి జీవితాలతో పరిచయమున్న ప్రతి ఒక్క పాఠకుడికీ తెలిసిందే. అయినా సందర్భం వచ్చింది కాబట్టి గుర్తు చేసుకుందాం తప్పేముంది.

శరసంధాన బలక్షమాది వివిధైశ్వర్యంబులుం గల్గి-దు
ర్భరషండత్వబిలప్రవేశ చలన బ్రహ్మాఘ్నత ల్మానినన్
నరసింహ క్షితి మండ లేశ్వరుల నెన్నన్వచ్చు నీసాటిగా
నరసింహ క్షితి మండలేశ్వరుని కృష్ణా రాజకంఠీరవా"

ఇది అల్లసానివారు కృష్ణరాయల గుణగణాలను కీర్తిస్తూ ఆశువుగా చెప్పిన అద్భుతమైన పద్యం. అన్ని విధాలా అద్భుతమే ఇది. అయినా అందులో కూడా సందు చేసుకొన్న ఒక చిన్న దోషం కనిపెట్టాడు రామకృష్ణుడు. ఏమిటది అంటారేమో. సింహానికెంత బలముందో నరసింహ రాయలకూ ఉందంతటి బలమే. దానితో పోల్చవచ్చు నారాజు గారిని. కాని అది అంత బలమున్నా బిలంలో దాగి ఉంటుంది. అలాంటి బిలప్రవేశం చేసే పిటికితనం లేదా రాజుకు. అలాంటి వాని కుమారుడీ రాయలు అని ప్రశంసిస్తాడు కృష్ణరాయలను. అలా ప్రశంసించిన వాడు దానికి విరుద్ధంగా రాజకంఠీరవా అని ఆ సింహంతో మరలా పోల్చి వర్ణించట మేమి బాగు.

సరే ఆక్షేపించావు బాగానే ఉంది. మఱి ఇలాటి ఆక్షేపణకు తావు లేకుండా నీవెలా చెబుతావో చెప్పమని అడిగే లోపల అంతకన్నా మహోద్భుతమైన పద్యమొకటి ఆశువుగా సెలవిస్తాడు. వినండి.

కలనం దావక ఖడ్గ ఖండిత రిపుక్ష్మాభర్త మార్తండ మండల భేదం బొనరించి యేగు నెడఁ దన్మధ్యం బునన్ హారకుండల కేయూర కిరీట భూషితుని శ్రీ నారాయణుంగాంచి తోఁ గలగం బాఱుచు నేగు నీవయను శంకం గృష్ణరాయాధిపా. చూడండి. ఈ పద్యంలో నరసింహక్షితి మండలాదులను కాదని నరసింహక్షితీశ్వరుణ్ణి కీర్తించి అలాంటి వాని తనయుడని తద్ద్వారా రాయలవారిని డొంక తిరుగుడుగా కీర్తించటం గాదు కవి. సాక్షాత్తుగా శ్రీ మహావిష్ణువుతోనే పోల్చి వర్ణించాడు. అందులో 'నావిష్ణుః పృధివీ పతిః' అన్నట్టు రాజుగారు విష్ణ్వంశ సంభూతుడనే గొప్ప భావంకూడా తొంగిచూస్తున్నది.

ఇలా ఎన్నో ఉన్నాయి రామకృష్ణుని పేర వెలసిన చాటువులు మచ్చుకు ఒకటి రెండుదుహరించాను. మరి ఆశువుగా అప్పటికప్పుడు చెబుతూ వచ్చిన పద్యాలే ఇంత హృద్యంగా ఉంటే ఇక ఈ హాస్యరసాన్నీ భావగాంభీర్యాన్ని సమపాళ్లలో మేళవించి రచించిన పద్య గద్య ప్రబంధ రచన ఎంత నవనవోన్మేష బంధురంగా ఉంటుందో ఆలోచించండి. వికట కవి అన్నందుకు వికటంగానే సాగాలి రచన కూడా. ఆ మాటకు వస్తే రచనకు ముందు మాటా మాటకుముందాలోచనా. ఆలోచన లేకుండా ఒక మహాకవి మాటాడడు. మాటాడకుండా రచన చేయడు. ఈ మూడింటిలోనూ వికటత్వమే రామకృష్ణుడిది.

అకటా వికట మన్నట్టు ఈ వికటత్వమేమిటా అని మీరడగ బోతున్నారు. నాకు తెలుసు. ఆశ్చర్యపోకండి. వికటమంటే మీరేమను

కొంటున్నారో. చిత్రమంటే ఏమిటో దానికెన్నర్థాలున్నాయో చెప్పా మింతకు ముందు భట్టుమూర్తిని విమర్శిస్తూ. దానికి మనమనుకొన్న అర్థమెలాకాదో – దీనికీ అలాగే కాదిక్కడ కూడా. సంస్కృత మహాకవి భట్టబాణుడొక అద్భుతమైన మాట అన్నాడొక చోట – హర్షచరిత మనే కావ్యం వ్రాస్తూ దాని ఉపోద్ఘాతంలో ఉత్తమ కావ్య లక్షణాలెలా ఉండాలో చెబుతూ ఏమన్నాడంటే.

'నవోర్థో జాతి రగ్రామ్యా- శ్లేషోఽక్లిష్టః స్ఫుటోరసః
వికటాక్షర బంధశ్చ – కృత్స్నమేకత్ర దుర్లభమ్'

ఒక ఆదర్శప్రాయమైన కావ్యంలో అన్ని గుణాలూ ఆదర్శంగానే ఉండాలి. ఏమిటవి. నవోర్థః – అందులో వర్ణించే ఇతివృత్తం సరిక్రొత్తగా ఉండాలి. జాతి రగ్రామ్యా – దాని శైలి ఉదాత్తంగా ఉండాలి. శ్లేషోక్లిష్టః – శ్లేషాద్యలంకారాలు వాడినా అవి పాఠకుణ్ణి ఇబ్బంది పెట్టగూడదు. సుగమంగా ఉండాలి. స్ఫుటోరసః – అన్నిటికన్నా ముఖ్యమైనవి రసభావాలు. అవి ఎలాటి ఆటంకం లేకుండా వెంటనే మనసుకు స్ఫురించి ఆహ్లాదదాయకం కావాలి. అంతేకాదు. వీటన్నింటినీ బయటపెట్టే అక్షర విన్యాసం వికాటాక్షర బంధంగా నిబంధించాలి కవి. అక్షరాల కూర్పే పదాలు. పదాల విన్యాసమే వాక్యాలు. వాక్యాల గుంభనమే గద్యపద్యాలు కావ్యంలో. కాబట్టి అక్షరమంటే మొత్తం కావ్య నిర్మాణానికంతటికీ ఉపలక్షణమైన మాట. అలాంటపుడక్షరాలు వికటంగా ఉంటే ఏమి బాగుంటుందంటారా. వికటమంటే బాణ భట్టు ఉద్దేశం వేరు. వికటమంటే ఎద్దెమంటే తెడ్డెమని గాదు. వింత విలక్షణమైనదని అర్థం. నలుగురూ నడిచే బాటలో బాణీలోగాక ఒక సరిక్రొత్త బాణీలో చెబితే దానికి వికటమని పేరు. ఇంతెందుకు. వక్రోక్తిః కావ్య జీవిత'

మన్నాడు కుంతకుడనే ఆలంకారికుడు. వక్రమంటే అక్కడ వంకర టింకర అని గాదు గదా. చమత్కారమని అర్థం. అలాగ 'సౌందర్య మలం కారః' అని అలంకారాన్ని నిర్వచించాడు వామనుడు. అలంకారా లంటే శబ్దార్థాలంకారాలని పారిభాషికం కాదది. కావ్యంలో ఏదైనా అందంగా చెబితే అదంతా అలంకారమేనని ఆయన ఆంతర్యం. అలంకరోతి- చక్కగా దిద్దిచూపేదని అసలైన అర్థంలో ప్రయోగించాడా మాట ఆయన.

అలాగే వికటమనే మాట కూడా ఒక విలక్షణమైన వినూత్నమైన మార్గమనే భావాన్ని చెబుతుందిక్కడ. అందుకే కృత్స్న మేకత్ర దుర్లభమ్- ఈ గుణాలన్నీ ఒకచోట పొందుపరిచి చెప్పటం మామూలు విషయం కాదంటాడు బాణుడు. వికటమనేది అల్లాటప్పా మాట అయితే అంత దుర్లభమని ఎందుకంటాడు. కాబట్టి పైకి ఆషామాషీ అయిన గాడిలో మనకందించినా లోపల దిగి చూస్తే చాలా వేడి అయిన వాడి అయిన భావాన్ని స్ఫురింప చేసేదేదో అదీ వికటత్వమంటే మన మర్థం చేసుకోవలసింది. ఒకవిధంగా చెబితే 'వైకట్యం భావనైశిత్యం పరిహాస సమావృత' మని దానికొక క్రొత్త నిర్వచనం చేయవచ్చు మనం. పైకి చూస్తే హాస్యం ఆలోచిస్తే లోపల ఒక గొప్ప అర్థం భాస్యం. ఇదీ మన రామకృష్ణుని జీవిత కవితా- కవితా జీవితం రెండూ కూడా. రెండింటిలోనూ ఒకదానితో ఒకటి పెనవేసుకొని కనిపిస్తుంది మనకు కొనా మొదలూ. ఒక్కొక్క కవి కొక్కొకటి అయితే ఈ మహాకవికిదీ ప్రత్యేకత. జీవితమెలా సాగిందో ఆయన కవితా జీవితమూ అలాగే సాగింది. ఏదీ సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడు. అలా సీరియస్సే అంతకంతకు లోతుకు దిగుతూ పోతే. ఇది ఒక రకమైన Paradox ఆ మహాకవిలో.

అసలీ కవి కృష్ణదేవరాయల కాలంలో ఉన్నాడా లేడా అని చాలామందికి సందేహం. దానికి కారణం లేకపోలేదు. ఆయన తన కావ్యాన్ని రాయలవారి కంకిత మీయలేదు. పెద్దన తిమ్మనలలాగా తానూ ఒక గొప్ప స్థాయిలో ఉన్న కవి గదా. వారిలాగా తాను కూడా రాయలకు చాలా సన్నిహితుడే అయి ఉండాలి. అలాంటప్పుడాయనకు తన కావ్యమంకిత మివ్వక పోవటమేమిటి. తప్పకుండా ఇచ్చి ఉండేవాడు. అంతేగాక రాయల తరువాత రాజ్యానికి వచ్చిన సమకాలీన రాయలకూ గాక ఆయన క్రింద మహామండలేశ్వరుడుగా ఉన్న మంగయ గురవరాజు కుమారుడు పెద్ద సంగభూపాలుని కార్యనిర్వాహకుడు విరూరి వేదాద్రి కంకితం చేశాడు తన కావ్యం. దీన్నిబట్టి చూస్తే రాయల కాలంలో ఉన్నాడా లేదా. ఉన్నాడంటే చరిత్ర ఒప్పుకోదు. లేడందామంటే రాయలను సంబోధిస్తూ చెప్పిన అన్నన్ని గొప్ప చాటువుల కర్థం లేదు. ఎలాగా మరి అని ప్రశ్న వస్తుంది. దీనికొక్కటే సమాధానం. రాయలకాలంలో చాలా చిన్నవయసు వాడయి ఉంటాడు రామకృష్ణుడు. అప్పట్లో చాటువుల వరకే పరిమితమయి ఉంటుందతని కవితా ధోరణి. ఆ తరువాత రాయల యుగమయి పోయి సదాశివ రాయల హయాము వచ్చేసరికి బాగా ప్రౌఢ వయస్కుడై మూడు పూలారు కాయలుగా విజృంభించి ఉంటుందది.

చాలా చిన్నవయసు కాబట్టి కవితా ధోరణితోపాటు అంతకంత కొంటెతనం కూడా చోటు చేసుకొని ఉంటుందతడు చెప్పిన చాటువులలో. పైకి కొంటెగా చెప్పినా దాన్ని సమర్థించుకొనే సామర్థ్యం కూడా లేక పోలేదు. అప్పుడు కూడా అది కొట్టవచ్చినట్టు కనిపిస్తూనే ఉంటుంది మనకు బాగా తడవి చూస్తే. అంతెందుకు. అమవస నిసి అని పెద్దన్న

గారన్నారంటే అది అమావాస్యానిశ అనే సంస్కృత పదానికి తద్భవం. తత్సమ పదాలెంతో తద్భవాలు కూడా లాక్షణికాలే గాని అసాధువులు గావు. అది తెలియని వాడు గాదు రామకృష్ణుడు. అయినా ఇలా తద్భవ శబ్దాలతోనే నింపుతూ పోతే పద్యమెంత విడ్డూరంగా తయారవుతుందో చూపటానికి 'ఉమెతక్కయదినిసెపి'తో అని ఒక పద్యమప్పటికప్పుడు కృత్రిమంగా తయారుచేసి చదివాడాశువుగా. అలాగే రాజకంఠీరవా అంటే రాజసింహా రాజ శ్రేష్ఠా అని లాక్షణికమైన ప్రయోగం. వాచ్యార్థం చెప్పగూడదక్కడ. అంతేకాదు. నరసింహరాయలు నరులకు మాత్రమే సింహమైతే నీవు నరేంద్రులైన రాజులకే సింహం లాంటివాడవని కృష్ణరాయలకొక గొప్ప కితాబిది. ఇది కూడా తెలియనివాడు కాదు రామకృష్ణుడు. అయినా ఇంకా పెద్ద కితాబిస్తే బాగుండు గదా అని శ్రీమన్నారాయణుడితోనే పోల్చి చెప్పాడు. వికటకవి గనుక తనకన్నా వయసులో పాండిత్యంలో పెద్దలైన కవులను కొంచె మాట పట్టించాలని ఇలాంటి చురుక్కులూ చమక్కులూ చూపుతూ పోవటం కుట్టివాడుగా అతని కొక సరదా.

పోతే కరిభి ద్గరిభి త్తనేది చాలా అద్భుతమైన పద్యం. భావం చాలా గొప్పది. దాన్ని ఆవిష్కరించిన రచన చాలా చిత్ర విచిత్రమైనది. కరిభిత్తు శివుడు. గిరిభిత్తు దేవేంద్రుడు. కరిభిద్గిరి కైలాసం. గిరిభిత్కరి ఐరావతం. కరిభిద్గిరిభిత్తురంగా లొకటి వృషభం మరొకటి ఉచ్చైఃశ్రవం అనుకొంటే సరిపోతుంది. ఇవన్నీ తెల్లని వర్ణమే కాబట్టి కృష్ణరాయల స్వచ్ఛమైన కీర్తితో పోల్చి చెప్పటమెంతో సంతోషదాయకం. మరి ఎవడో ఒక వాచాలుడూ అహంభావీ అయిన కవీశ్వరుడు వచ్చి ఆస్థాన మహాకవులందరికీ 'రాజనందన రాజ రాజాత్మజులు సాటి' అని ఒక

సీసపద్యం చదివి పరీక్ష పెడితే - దానికి ప్రతిగా 'మేకతోకకుమేక' అని మరొక సీసమాశువుగా చెప్పి దీని అర్థం చెప్పుచూతామని పరీక్ష పెట్టాడు రామకృష్ణుడు. ఏమిటాంతర్యం. ఓరి పిచ్చివాడా. ఇలాంటి జిమ్మిక్కులు కాదురా కవిత్వమంటే ఇవన్నీ పూతమెఱుంగులు పసర పూప బెడంగులు. మా పెద్దనామాత్యుల నడగండి రసవంతమైన కవిత్వమేదో నీకు శిక్షణ ఇస్తారని కవితా శిల్ప గౌరవాన్ని తన్మూలంగా చాటి చెప్పటమిది.

ఇలా పైకి కొంటెతనం లోపల గడుసుదనం రామకృష్ణకవిది. ఇదే వికటకవి వికటత్వమంటే. అతని చాటువులలోనే ఇంత పాటవముంటే తరువాత ప్రౌఢవయస్కుడై అదేపనిగా కూచొని రచించిన ప్రబంధంలో ఎంత గొప్ప శిల్పకళ ఉట్టి పడాలో మీరే ఊహించగలరు. ఈ కవి రచించిన కావ్యాలు మనకు తెలిసి రెండే రెండు. ఒకటి ఉద్భటారాధ్య చరిత్ర - ఇంకొకటి పాండురంగ మాహాత్మ్యము. రామలింగడై మొదటిది రచిస్తే - రామకృష్ణుడై రెండవది రచించి ఉంటాడు బహుశ. ఉద్భటారాధ్యం ఇంకా వైష్ణవం ముదరక ముందు కవి రచించిన గ్రంధం. పోతే రెండవదైన పాండురంగ కావ్యం తాను ముద్రాంకితుడై కూర్చిన ప్రబంధం. భట్టరు చిక్కాచార్యు లీతనికి వైష్ణవ దీక్ష నొసంగిన గురువర్యులు. అయితే ఒక్కమాట. ఎంత వైష్ణవ ముద్రా ముద్రితమైనా అది శరీరం వరకేనేమో. కవి వాక్కును మాత్రమాముద్రలేవీ ముద్రితం చేయలేదు. అది ఎంత విష్ణుస్తోత్రపరమో అంత శివస్తోత్ర ధురంధరం. ఇంతెందుకు శివుని సోదరి లక్ష్మి - విష్ణువు సోదరి గౌరి. ఒకరి చెల్లిలిని నొకరు చేసుకొన్నారీ మహానుభావులిద్దరూ. ఇది మనం గాదు. కవిగారు సెలవిచ్చిన మాటే.

అంచేత వైష్ణవం పుచ్చుకొన్నాడని మాటేగాని వీర వైష్ణవుడు గాడీ కవి. శివకేశవులకు భేదమెప్పుడూ చూడడు. ఇద్దరి యెడల సమానమైన భక్తిప్రపత్తులున్నవాడు. అసలు కాశీపుర వర్ణనతోనే ప్రారంభమవు తుంది పాండురంగ మాహాత్మ్యం. పాండురంగ మాహాత్మ్యమే ఇతడు రచించిన రెండు కావ్యాలలోనూ సర్వాంగ సుందరమైన మహాప్రబంధం. అయిదాశ్వాసాలున్నా యిందులో. అగస్త్యముని యాత్రతో మొదలు పెట్టి నారదముని పాత్రతో ముగించాడు కవి ఈ కావ్యం. మహర్షులిద్దరూ కైలాసవాసిని దర్శించి ఆయనవల్ల హరికథా శ్రవణం చేసినవారే. హరితత్త్వ మెఱిగిన వాడు హరుడు గాక మఱెవ్వడు. అగస్త్యాదులను వెంటబెట్టుకొని పోయి సాక్షాత్తూ శివకుమారుడైన కుమారస్వామే తండ్రిగారి వలన తెలుసుకొంటాడు పండరీ క్షేత్ర మాహాత్మ్యం. అది కేంద్రస్థానం కథా వస్తువుకంతటికీ. క్షేత్రం తీర్థం దైవతం. మూడు ఒనగూడిందక్కడేనట. అంతరార్థమేమంటే తేజో బన్నాత్మక మీ సృష్టి. తేజస్సుకు ప్రతీక దైవం. జలానికి తీర్థం. అన్నమంటే పృథివి. దానికి ప్రతీక క్షేత్రం. కనుక ఇవి మూడూ సృష్టి అయితే మూడూ కలిసి సృష్టి కర్తను పట్టివ్వటానికి సంకేతమవుతాయి. దీని ద్వారా ఆ మూలతత్త్వాన్ని పట్టుకోవాలని తాత్పర్యం. ఇక దానికనుబంధమైన కథ లిన్ని అన్ని గావు. అన్నిటిలో ముఖ్యమైనవి పుండరీకుని చరిత్రా – రాధా దేవి చరిత్రా నిగమ శర్మ చరిత్ర – అయుతనియుతులనే ముని బాలకుల చరిత్రా ఇవి నాలుగూ మహాకవి కవితా పాటవానికి గీటురాళ్లు.

కవి తన వికటకవితా వైభవాన్ని వెల్లివిరియ జేస్తాడు అడుగడుగునా. కథ ఎంతగా సాగిందో వర్ణన లంతగా సాగాయి. దేవదేవుని స్వరూప విభూతులెంతగా కీర్తిస్తాడో మానవమాత్రుల జీవిత

చరిత్ర నంతగా చిత్రిస్తాడు. ఒక మానవులేమిటి. ఆ మాటకు వస్తే పశుపక్షి సరీసృపాదులూ వనవదీ పురపుర్వతాదులూ – ప్రకృతిలో ఏ దృశ్యమూ తప్పిపోలేదు మహాకవి దృష్టికి. అయితే ద్యోతలం మొదల భూతలం దాకా ఎక్కడ ఏది వర్ణించినా సవ్యంగా వర్ణించడు. అలా వర్ణించట మాయన కిష్టం లేదు కూడా. ఎంతో కొంత వికటత్వమందులో తొంగి చూడవలసిందే తప్పదు. అది తన ఇష్టదైవతమైన విష్ణువు గానీ మహేశ్వరుడు దాని ఆ సూత్రానికి మాత్ర మపవాదం లేదు. అసలు రామకృష్ణ కవి భావనలోనే ఉంది వికటత్వం. దాని ననుసరించి భాషలో ప్రవేశించింది. భాష అంటే అది పద్యమే గావచ్చు. వాక్యమే గావచ్చు. శబ్దమే గావచ్చు. చివరకు ఒక అక్షరమే గావచ్చు. అదంతా బాణ భట్టు చెప్పినట్టు వికటాక్షర విన్యాస భాసురమే. కాబట్టి మనమీ మహాకవి కవితా శిల్పమెలాంటిదో విమర్శించి చూడాలంటే ఆయన కెందులో మంచి అభినివేశముందో దాన్నే పట్టుకొని సాగించాలా విమర్శ. అది ఆయన కావ్యానికంతా ఆయువు పట్టైన ఈ వికట రచనా చాతుర్యమే. కాగా ప్రస్తుత మిక ఆ చాతుర్యమెలాంటిదో దాని నా మహాకవి ఎలా ప్రదర్శించాడో కంటిలో వత్తి పెట్టుకొని దర్శిస్తూపోవాలి మనం. అలాగే సాగిద్దాము మన ప్రయాణం.

మొట్టమొదట దేవతా స్తుతి చేయటంలోనే కనిపిస్తుంది కొంత హాస్యరసం చూడండి. ఇది ఈశ్వరుణ్ణి కవిసోత్రం చేసిన పద్యమెంత నర్మగర్భంగా నడిచిందో. 'ఈ చిపురాకు – నీ ప్రసవ మీ పువుఁదేనియ యెంత యెప్పెడిం జూచితిరే యటంచు తన చుట్టు శుకాదులు గొల్వగాఁ గపర్దాచిత చంద్ర గాంగ జలమైన శివాహ్వయ కల్ప శాఖి వేదాచల మంత్రి కీర్తి కలశాబ్ధిని వెన్నెల చూడ్కిఁజూచుతన్ఁ' ఇదీ పద్యం. ఈ పద్యభావం కొంచెం తిలకించండి. శివుడని పేరేగాని అది ఒక

కల్పవృక్షం. వృక్ష మెప్పుడయిందో దానిమీద చిగుళ్లుంటాయి. పూలుంటాయి. – ఆ పూలలో మకరందం కూడా ఉంటుంది. మరి ఈ చెట్టు మీద ఏముందయ్యా అంటే ఉన్నాయిక్కడా నంటాడు కవి. జటా జూటమే చిగురు జొంపం. అందులో చంద్రరేఖే పుష్పం. గంగాజలమే ఆ పుష్పం నుంచి జాలువారే మకరందం. ఆహా ఇవి ఎంత బాగున్నాయి మన మాస్వాదించటానికి కని చెప్పి ఆ చెట్టు చుట్టూ చేరాయట. ఏమిటి శుకాదులు. చిలుకలూ, పావురాలూ మొదలైన పక్షులని ఒక అర్థం. శుకవామ దేవాది మహర్షులని మరొక అర్థం. చెట్టేమిటి పక్షులేమిటి. పైకి హాస్యం. లోపల ఎంత గొప్పభావమో చూడండి. పక్షులు వృక్ష సంపద ననుభవించటానికి చేరినట్టే చేరుతారు మహర్షులు శివ సాయుజ్య సుభాన్ని అనుభవించటానికని మహాకవి ఆంతర్యం.

ఇలాగే తరువాత కవిగారిని ఒక మహాకావ్యం వ్రాసి తన కంకిత మివ్వమని కోరుతూ వేదాద్రి మంత్రి ఆయనకు కర్పూర తాంబూల మందిస్తాడు. అది వర్ణిస్తున్నాడు చూడండి మన వికటకవి.

‘పలుకుం దొయ్యలి మౌళికాంతి కెనయౌ బాగాలు-
నయ్యంతి చెక్కలఁబోలుం దెలనాకు-లయ్యువిద పల్కుల్వంటి కప్రంపుఁ
బల్కులతోఁగూడిన వీడియమట అది. ఆ తాంబూలంలోని
లోని ఆ తాంబూలం వక్కలెలా ఉన్నాయో తెలుసా. సరస్వతీ దేవి కేశాలలాగా నల్లని పీటీ వక్కలవి. ఆకులో. అవి ఎంత తెల్లగా కోమలంగా ఉన్నాయంటే ఆ దేవత చెక్కిళ్లే అవి. మరి అందులోని పచ్చకర్పూరం పలుకులో. ఆయమ్మ నోట ఉచ్చరించే పలుకులే ఆ పలుకులు. అంతా సరస్వతీ రూపమే ఆ తాంబూలం. మరి శారద నీ రూపమని గదా కీర్తించాడు తన్ను ఆ మంత్రివర్యుడు. శారదాదేవే తన రూపమైనప్పుడు తాను చేతికి తీసుకొన్న తాంబూల మాదేవి రూపం కాకపోవటమేమిటి.

ఎంత చమత్కారమైన వర్ణన. ఆ వర్ణనలో కవి కెంతటి దేవతా తాదాత్మ్య భావన. ఆలోచించే కొద్దీ ఆనందకరం.

ఇంతేనా. తన్ను అంతగా సత్కరించిన ఆ మంత్రివర్యుని కృపా దృష్టితో చూడమని అహోబల నారసింహుణ్ణి తన ఇష్ట దైవతాన్ని వర్ణిస్తున్నాడు చూడండి. ఎంత హాస్యమో.

‘మిగులఁగన్నొదవిన బిగువ యెక్కుడు గాని
కారణ్యమొలుకు వీక్షణము వాడు
దంష్ట్రా విటంక వర్ధనమ యెక్కుడు గాని
ముదురుఁజిందురు నేలుమోము వాడు
నరమృగదేహ విస్ఫురణ మెక్కుడు గాని
బహుకోటి మదన రూపంబువాడు.’

నరసింహస్వామి ఆకార వర్ణనమిది. స్వామివారి దశావతారాలలోనూ నరసింహ అనగానే మన మనస్సుల కొక వికృతమైన రూపం గుర్తు వస్తుంది. కొంతకు కొంత భయం కూడా వేస్తుంది. ఆ గుడ్లు ఆ జూలు ఆ ముఖమూ ఆ దంష్ట్రలూ అదీ ఇదీ గాని ఆ వేషమూ ఏది మనసుకు వచ్చినా భయమే. సౌందర్యమూ సౌకుమార్యమనేది ఏ కోశానా కనిపించదు. అలాంటి ఆ రూపాన్ని కాదనకుండానే దాన్ని బయటపెడుతూ అయినా పరవాలేదు స్వామి సుందరాకారుడేనని కొంటెగా సమర్థిస్తాడు రామలింగ కవి. కన్నొకటి ఎగుడు దిగుడుగా ఉందేగాని ఆ చూపులో ఎంత కారుణ్యమేమి కథ – ఆ దంతాలంత కన్నా సాగి భయంకరంగా కనిపిస్తాయని పేరే గాని చంద్రబింబం లాంటి ఎంత అందమైన ముఖమది. ఇది నరుడా ఇది సింహమా అని మనం విస్తుపోనక్కర లేదు. అయితే అయింది. అయినా ఎంత మన్మథుడి

లాంటి మనోహరమైనదా రూపం చూచి తీరాలని నచ్చజెబుతాడు మనకు. ఎంత వేళాకోళం. ఎంత ఎకసెక్కం. చూడబోతే కన్నొక్కటి లేదు గాని కంతుడు గాడే' అని ఒక మెల్లకంటి రాజును తానింతకు పూర్వమెప్పుడో వర్ణించి చెప్పిన పద్యం మనసుకు వచ్చి ఉంటుంది మన వికటకవికి. స్వామివారినిలా వర్ణించటంలో గాంభీర్యమేమంటే నిర్గుణమైన మూర్తి సగుణంగా ఏ మూర్తి ధరించినా ధరించగలడు. సర్వస్వతంత్రుడు పరమాత్మ. వికృతంగానూ కనపడగలడు. అవికృతంగానూ కనిపించ గలడు. కనిపించే ఈ ప్రపంచమంతా ఆయన విభూతే అయినప్పుడేదైనా ఆయన గారి స్వరూపమే. అలా భావించటంలోనే ఉంది అందమూ ఆనందమూ నని కవి హృదయం.

అనలా మాటకు పస్తే నరుడేమిటి మృగమేమిటి. దశావతారాలనూ కలిపి ముద్ద చేసి ఒక పడవ రూపంలోకి చొప్పించి జీవులందరూ పచ్చి ఇందులో కూచోండి ఈ సంసార సాగరాన్ని అవలీలగా తరించి పోగలరని మనందరికీ పుండరీకుడనే ఒక మహాభక్తుడి ద్వారా హామీ ఇప్పిస్తాడు గూడా మహాకవి.

అయినా స్వామివారు పడవేమిటి – పడవెలా అయ్యాడని అడిగితే వినిపిస్తున్నాడు చూడండి మన వికటకవి.

'నీటిలోఁ జివుకక నిలిచి క్రుమ్మరు పూన్కి
కఠిన కర్పరపు చుక్కాను బిగువు'

మొదటిది మత్స్యావతారం. రెండవది కూర్మావతారం. మత్స్యం నీళ్లలో తిరిగినట్టే యధేచ్ఛగా తిరుగుతుందీ పడవ. ఈ పడవకు చుక్కాను కూర్మం తాలూకు కర్కశమైన వీపు చిప్ప. **'దంష్ట్ర నెత్తిన మహీతలపు గాడుపు చీర'** పోతే వరాహావతారంలో స్వామి తన దంష్ట్రాగ్రం మీద

పైకెత్తిన భూమండలమే తెరచాప ఆ పడవకు. **'ఉరుదారు కలనయం దుదయమగుట'** - ఇది నృసింహావతారం. కొయ్య స్తంభంలో నుంచి గదా ఆవిర్భవించాడాయన. పడవ కూడా కొయ్యలో నుంచే గదా తయారయి వస్తుంది. ఇలా చూస్తూ పోతే పద్యం పై ఎనిమిది చరణాలు క్రింది తేటగీత మొదటి రెండు చరణాలూ పది చరణాలలోనూ స్వామివారి పది అవతారాలూ పడవలోని పది లక్షణాలకూ చక్కగా సరిపోయేలాగా వర్ణిస్తాడు కవి. పైగా పడవ ఆసరా లేకపోతే ఈ భవార్ణవమెలా దాటగలమని ప్రశ్నిస్తాడు మనలను. పైకి తమాషాగా చెప్పినా ఈశ్వరాను గ్రహం లేకపోతే తరణోపాయం వేరే ఏముందని భగవత్ప్రపత్తి నెలా మనకు భంగ్యంతరంగా చాటి చెబుతున్నాడో చూడండి మహాకవి.

అసలు మొదట తనకు కృష్ణస్వామి సాక్షాత్కరించగానే ఆ విగ్రహాన్ని చూచి అన్నమాటేమిటో తెలుసా పుండరీకుడు.

పొదలు నీ పొక్కిటి పువ్వు కాన్పునఁగదా
పెనుమాయ పిల్లలఁ బెట్టు టెల్ల
సొబగు నీ తెలిచూపు పసఁగదా యిది రాత్రి
యిది పగలను మేర లెఱుఁగఁ బడుట.

చూడగానే ఆయనగారి బొడ్డు కనిపించింది భక్తుడికి. అందులో ఒక తామర. దానిలో ఒక కుట్టువాడు. అతని నాసరా చేసుకొని ఒక పెనుమాయ. ఇక చూడండి పిల్లపాపలను ఈనుతూనేపోతున్నదట అది. ఇక ఆయన కళ్లు. రెంటికీ రెండు చూపులు. మార్చి మార్చి చూస్తుంటే ఒకటి రాత్రి ఒకటి పగలని తెలుస్తున్నదట మనకు. అంతేకాదు. 'భువన ఘటనకు మొదలి కంబమును బోలె నీవాది భూతి వగుచు -

నిట్టనిలుచున్కి చేఁగాదె నెట్టుకొనియె' నంటాడు. స్వామివారీ ప్రపంచమనే భవనాన్ని నిర్మించాడంటే ఆయన గారే దీనికి మూలస్తంభమై నిట్టనిలుచున్నాడట. అలా నిలుచోబట్టే ఈ నిర్మాణం జరిగిందంటాడు ఎంత వెటకారం. ఎంత చమత్కారం.

ఇదా అదా. వీరా వారా అని చూడడు రామకృష్ణుడు. చీమ మొదలు బ్రహ్మదేవుడి వరకుకేది వర్ణించినా వికటమే వినోదమే. దేవతలైనా సరే. ఊరకపోనీయడు. శివుడి నోటనే మాధవుడి స్వరూపాన్ని ఎలా చాటిస్తాడో చూడండి.

వెడద కన్నుల వాని – వెయి నామముల వాని
వ్రేతల వలపించు వెరవుగాని
చిప్పకూకటి వాని చిన్ని నవ్వుల వాని
చెరివిన మంచి పించియము వాని
పులుగు తత్తడి వాని పొడవుల తుదవాని
పొక్కిటి వెలిదమ్మి పూవువాని
మినుకు టూర్పుల వాని మిసిమి మేతలవాని
మెఱుగుఁ జామన చాయ మేని గాని
దిస్సమొలవాని పసిఁగాన ద్రిప్పువాని
మురళి గలవాని మువ్వంక మురువు నాని –

వాని వాని వాని అవి వర్ణిస్తున్నాడు. ఈ వాడెవడో మీరు తెలుసుకో గలరా – తెలిస్తే చెప్పండి అని మనకొక పొడుపు కథ ఇస్తున్నాడా అనిపిస్తుంది మన వికటకవి. మాకు తెలియదు మీరే చెప్పండి అని అడిగితే బయట పెడుతున్నాడు చివరకు ఎవరోగాదాయన విట్ఠలా ధీశుడని. కృష్ణుడా విట్ఠలుడా అని మనమడిగితే చెప్పానుగదా **'పసి**

గాన ద్రిప్పువాడైతే' కృష్ణుడు. 'దిస్సమొలవాడైతే' విట్ఠలుడు. ఎవడైతేనేమి - అంతా భగవద్విభూతేనని వ్యంగ్యంగా మనకు సమాధాన మిస్తున్నట్టుంది ఈ పద్య భావ మాలోచిస్తుంటే.

ఇలాగే భగవన్మూర్తినే గాక మూర్తా మూర్తమైన ఆయా గుణాలు వర్ణిస్తాను వాటి ద్వారా మీరే పోల్చుకోండి ఆ మూర్తి ఎవరోనని కూడా ఒక ప్రహేళిక పాఠకుల కిస్తున్నట్టుంటుంది వికటకవి చేసే ఆయా వర్ణనలు చూస్తే. నారదుడు కైలాసమునకు పోయి పరమేశ్వరుని సందర్శించిన సందర్భాన్ని వర్ణిస్తాడు చూడండి మహాకవి. అత్యద్భుతం. చివరిదాకా ఎవరిని చూచాడో మహర్షి బయటపెట్టడు మహాకవి. అది ఒక సస్పెన్సు. చివర ఆ సస్పెన్సుకు డిస్పెన్సు. ఎంత గడుసుతనమో చూడండి వికటకవిది.

'ఆ కొండ నెత్తాన హైమ సాలావళీ
వేల్లి తంబగు బత్తి వీడుగాంచె
నావీటి నడుచక్కి నభిరామ శుభవిభా
ధగధగాయిత మొక్క నగరు గాంచె
నా మహాప్రాసాద మల్లనల్లన డాసి
వాకిటనొక కీశ వదను గాంచె
నా కపిలపనుచే నను మతుండై చొచ్చి
చని యొక్క ముత్యాల చవికెగాంచె
నందు విధుకాంత వేదికాభ్యంతరమున
ద్వీపిచర్మోపరిస్థలి దీపితార్క
కోటినిభమైన యొక నిరాఘాట నిరఘు
నిరుపమ ప్రభగాంచె నిర్నిమిష దృష్టి'

కాంచి విరించి నందనుడు కన్నులు బిమ్మిటి నొందడింది - యొక్కించుక కొంకు దేటి కనియెఁ దదుగ్ర మహోగ్ర దీప్తిలో, బంచ ముఖున్ - శిభీక్షణ విభాసిలలాటు - మరుజ్ఝరీ ధరున్ సంచిత సత్కృపారస వశంవదు - నాదికపిన్ వృషాకపిన్ -

ఇదీ ఆ నారదుడు చూచిన రూపం. అంత చిలువలు పలువలు పెట్టి వర్ణించి చివరకది ఒక ఆదికపి అట వృషాకపి అట. ఇంతకూ ఈశ్వరుడా కపీశ్వరుడా. ఇదే వికటకవి వికట కవిత్వమంటే. ఏమిటయ్యా ఇంత కొంటెతనమని మనం నిష్కారమాడితే కొంటెతనమేముందండీ కంపిబతీతి కపి - నిత్య నిరవధిక సుఖాన్ని ఆస్వాదించేవాడు కపిగాక మరెవ్వడని సమాధానమిచ్చే గడుసుదనం. రెండందాల పదునైన కత్తి రామకృష్ణుని శక్తి.

పరమశివుని వర్ణన అయిందా. ఇక పాండురంగని వర్ణన వినండి. అది ఎలాంటిదో. సుశీల అనే మహాపతివ్రత అనన్య భక్తి మెచ్చి ప్రత్యక్ష మవుతాడు పాండురంగడు. పాండురంగడని అప్పుడే చెబుతాడా కవి చెప్పడు.

నీలంబు భక్తానుకూలంబు హరిదంత
చేలంబు నవనీతలోల మాది
మౌలంబు భవనోత్కలంబు తర్పిత
వ్యాలంబు కరుణా విశాలంబు ధృతజగ
జ్జాలంబు శిక్యావచూల మమిత
లీలంబు హృత మరుత్సాలంబు శశిసఖ
ఫాలంబు వరదాన శీల మఖిల
కాలజంఘాల మశనకృత్ క్ష్వేల మరిక
రాల మాపత్పయోద వాతూలము నగు
యదుకుల సరోమరాళా'

మట అది, ఆ మహానుభావుడెవరో గాదు. పాండురంగని రూపంలో శ్రీకృష్ణుడు.

ఈ విధంగా శివకేశవులు తన కిష్ట దైవతాలనే ఒక ఆట పట్టించిన వాడూ వారితోనే చనవుగా సరసమాడగలవాడూ మన సరస కవితా సనాధుడు రామకృష్ణ కవినాధుడు. అలాంటి వాడికిక మిగతా దేవతలేమిటి - మహర్షులేమిటి - మానవులేమిటి - ఎవరూ కూడా ఒక లెక్కలోని వారు గాదు. ఎవరిని వర్ణించినా వారితో పరాచికమే - వెటకారమే. సవ్యంగా ఏదీ మనసుకు రాదు. అయితే మరీ అపసవ్యమా అంటే అదీ గాదు మరలా. మనసులో గొప్ప భక్తి భావమే. దాని నలాగే బయటపెడితే చప్పగా ఉంటుందని కొంచెం ఛలోక్తి అనే పోపు పెట్టి చమత్కారంగా తయారుచేస్తాడొక వంటకం లాగా.

ప్రప్రథమంగా కాశీపట్టణాన్ని వర్ణిస్తున్నాడు కవి. అది ఒక రత్నాల గని అట. అందులో ఎన్నో మంచి మంచి రత్నాలు దొరుకుతాయి గాని వాటిలో చాలా విలువైనదీ విశుద్ధమైనదీ ఒకే ఒక రత్నముంది. అది విశ్వేశ్వరస్వామి అనే జ్యోతిర్లింగమంటాడు. మరి ఒక ఏనుగు కూడా ఉందక్కడ. ఆ ఏనుగు ఇటూ అటూ తప్పించుకుపోతుందేమోనని భయం. అందుకే ఆ పట్టణం దాని కాలానంగా పనిచేస్తుంటుంది. ఇంతకూ ఆ ఏనుగెవ రనుకొన్నారు. వినాయకుడు. అలాన మంటే ఆ గజాననుణ్ణి కట్టి వేసిన గొలుసు. ఆ గుడి వదిలేసి ఎక్కడికీ వెళ్లదుగా ఆ విగ్రహం. అదే ఆ పట్టణం ఒక గొలుసై ఆయనను ఎక్కడికీ పోనీయకుండా కట్టివేయటం. డుంఠి నామకగజాలాన మని కవి ఛలోక్తి.

ఇక ఆ పట్టణంలోని రథాలకు జవాబు చెప్పలేదని సవాలు చేస్తాడు కవి శంకరుని రథం కూడా. ఎంచేత. 'సారథి ఛాందసుండు బడి

సాగదు చక్రయుగంబు. ప్రాత పంచారపు గుట్టము ల్రధియు శౌర్యము నందరమాని – సాత్మవి స్తారము ఖండఖండములు – తానట మాసరి' అని నవ్వుతుంటాయట ఆ రధాలు శంకురుడి రధాన్ని చూచి – ఏమి కారణమంటే త్రిపురాసుర సంహారానికి బయలుదేరే శంకరుడికి తేరు భూమండలమయింది. భూమి అంతా అది ఖండఖండాలే గదా. రథం నడిపే సారథి బ్రహ్మదేవుడు. అతడా ఒక పెద్ద ఛాందసుడు. నిత్యమూ ఛందస్సులు వల్లించేవాడు ఛాందసుడేగా మరి. పోనీ చక్రాలైనా సరిగా ఉన్నాయా అంటే అవి సూర్యచంద్రులు. ఒకటి నడిస్తే ఒకటి నడవదు. అంతేగా మరి. సూర్యుడున్నప్పుడు చంద్రుడు లేడు. చంద్రుడుంటే సూర్యుడు లేడు. పోనీ గుఱ్ఱాలైనా వేగంగా పోగలవా అంటే అవి పాత పంచారం. ప్రాజదువులు వేదాలని అర్థం. అంత ముసలి గుఱ్ఱాలెలా పోతాయి ముందుకు. ఇంతకూ రథకుడైనా పౌరుష మున్నవాడా అని చూస్తే అర్థనారీశ్వరుడాయన. నిండు పౌరుషం లేదు అరమానిసి అంటాడు మన వికటకవి. ఇలా కొంటెగా పైకి అంటున్నా 'క్రియా సిద్ధి స్సత్త్వే భవతి మహతాం నోపకరణే' అన్నట్టు సర్వజ్ఞుడూ సర్వసమర్థుడూ అయిన పరమేశ్వరుడికి పరికరాలతో పని ఏమిటని గడుసుగా ఒక గొప్ప భావాన్ని సూచిస్తాడు.

అగస్త్య మహర్షి లోపాముద్రాసహితుడై దక్షిణ దేశానికి బయలుదేరి వస్తున్నాడు. మాల్యవంతం మతంగా శ్రమం చేరాడు. అక్కడికి వచ్చేసరికి మిట్ట మధ్యాహ్నమయింది ఎండ మండిపోతున్నది. తన సహధర్మచారిణి వైపు చూచాడు. ఎలా ఉందావిడ. 'నఖరాగ్ర లూనానన స్వేద కోరకంబు' కొనగోట చెమట బొట్లు మీటుతున్నది. అర్ధ కషాయ ధృగంచలంబు కండ్లు ఎఱ్ఱబాఱి సగం మూసుకొని చూస్తున్నది. 'సంతప్త శర్కరా

సహపదన్యాసంబు' వేడి ఇసుకలో నడుస్తుంటే అడుగులు మాడి పోతున్నాయి. 'అచలరజో ధూమలాలకంబు' – కొండ దుమ్ము ధూళికి ముంగురులు పొగచూరి పోతున్నాయి. ఇంతకూ ఎవరావిడ. లోపాముద్ర, అంత మంత్రవేత్త భార్య అయి కూడా ఆవిడ కాపాట్లు తప్పలేదు. అంతేకాదు. పరిగ్రహ మంటున్నాడు. పరిగ్రహమంటే భార్య. అయితే ఆ శబ్దం సంస్కృతంలో పుంలింగం తెలుగులో అమహద్వాచకం. అంటే నపుంసకంతో సమానం. అందుకే దాని విశేషణాలు 'కోరకంబు – ధూమలాలకంబు' అని ప్రయోగించటం కవి. ఇంతకూ లోపాముద్ర స్త్రీయా కాదా. పుంన పుంసకులై స్త్రీ ఎలా అవుతుంది. ఇదొక చమక్కు. లోపాముద్ర స్త్రీ ఏమిటి పురుష ఏమిటి. అది హ్రీంకార మహామంత్రం మంత్ర రూపిణికి లింగ వివక్ష ఏమిటి మీ పిచ్చి కాకపోతే. అన్నిటికీ అతీతమా దివ్యశక్తి అని కవి హృదయం.

నెమ్మదిగా స్వామిమల చేరారిద్దరూ. అక్కడ వెలసి ఉన్న కుమార స్వామిని దర్శించాడు. ఆ స్వామిని ఎంత చమత్కారంగా కీర్తిస్తున్నాడో చూడండి మహర్షి.

కావుకావనుట రక్కసుల మూకనె గాని
ననిచె నీయెడ సింహనాద విఖ్యాతి
పొత్తులు తొలువేలుపులు గంటులనె గాని
హత్తె నీ మేన వజ్రాంగి జోడు
వసవల్పు దైత్యుల వ్రయ్యు గుండెనెగాని
నిను గప్పె వీరచందన పుండ్రావి
యంగుళీ చర్వణం బసురు లందునె కాని
గెలుపు చిందము మోవి నిలిచె నీకు

నీవు తలమావి వీడని నిసువు వయసు
నాడె జేజేల దళవాయి నాయకరపు
బట్టమున నిల్చి తారకుఁగిట్టె ప్రౌఢ
తరరణ క్రీడ యెనరించు తతి మహాత్మ–

కుమారుడంటే బ్రహ్మచారి బీలుడని ఒక అర్థం. కుమారస్వామి అని మరి ఒక అర్థం. కుమారస్వామి కుమారుడై కూడా ప్రౌఢుడైన తారకునితో తలపడి ప్రౌఢ తరమైన రణంలో వాడి నోడించట మాశ్చర్యం. కుమారదశలో ఆయన కౌమార లక్షణా లేవవయ్యాయని అడిగితే మన వికట కవి అంటాడూ. అవన్నీ ఆ తారకుడి రాక్షస సైన్యాని కప్పజెప్పాడట. ఈయనలో కనపడ వలసిన గుణాలన్నీ వారిలో కనపడుతున్నాయట. అంతేకాదు. వారాయన దగ్గర బాలురైతే ఈయనగారు వారిని మించిన ప్రౌఢవయస్కుడై వారందరితో రణమనేది ఒక క్రీడగా క్రీడించాడట.

ఏమిటా బాల్యచిహ్నాలు. అవి రాక్షసులలో ఎలా కనపడుతున్నాయి. మరి ఈయనగారిలో ప్రౌఢ లక్షణాలెలా గోచరిస్తున్నాయని అడుగుతారా. రామకృష్ణ కవి చెబుతున్నాడు. వినండి. కావు కావంటున్నారట రాక్షసులు. కాపాడమని అర్థం . కాకులరుస్తుట్టరుస్తున్నారని కూడా. మరి కావు కావుమని ఏడ్చేది పసిబిడ్డ గదా. చిన్నపిల్లవాడైన కుమార స్వామి అరవాలి అలాగా. అలాకాక ఆయన బదులు రాక్షసులరు స్తుంటే ఆయనగారు వారికి మారుగా సింహనాదం చేస్తున్నాడట. మరి పొత్తులు కావలసింది చిన్న కుట్టవాడైన కుమారుడికి. అది వదిలేసి ఆయన వజ్రకఠినమైన కవచం ధరిస్తే రాక్షసులు తమ మేని గాయాలకు పొత్తి గుడ్డలు వాడు కొంటున్నారట. ఇక వస పెడుతుంటారు తల్లులు చిన్నపిల్లలకు. కుమారుడు చిన్నవాడే గదా ఆవస వాసన ఏమయింది. అది రాక్షసుల

గుండెలు ప్రయ్యాలైతే అందులో చేరిపోయింది. మరి ఈయనగారికో. పీరగంధం సువాసన వస్తూ ఉందట శరీరం. మరిపోతే అంగుళీచర్వణం బొటనవ్రేలు నోట్లో వేసుకోటం. కుమారుడికి గదా ఉండవలసింది. ఆయన బదులు రాక్షసులే వేసుకోవలసి వచ్చిందట. మరి ఈయనగారో. పిజయ చిహ్నమైన శంఖం పెదవుల మీద పెట్టుకొని ఆధ్మానం పేస్తున్నాడట. ఇంతకూ తలమావి కూడా వీడని వయసువాడు దేవసేనకు ాయకుడై తారకుడితో అంత ప్రౌఢ వయస్కుడితో అంత రణక్రీడ పేశాడంటే అది చిన్నపిల్ల వాడాడి ఆటేనా. ఆటే మరి. మామూలు బాలుడైతేగదా. యుద్ధమైనా ఆటే మరి ఆ మహానుభావుడి కని కవి హృదయం.

మరి అగస్త్యుడు కుమారస్వామి నడిగిన ప్రశ్నకు సమాధానం ఈస తండ్రి పరమేశ్వరుడితోనే చెప్పించాలని బయలుదేరుతారందరూ ైలాసానికి. కుమారస్వామికి నెమలి వాహనం. నెమలేమిటి వాహన మేమిటి దానిమీద కూచొని ఆయన గారంత దూరమెలా వెళ్లగలిగా డంటారా చెబుతాడు చూడండి. వికటకవి సమాధానం.

అది సజ్జస్యందనమై
మదకరియై తత్తదుచిత మార్గంబుల నే
ర్పొదవ నొక కొంత చని పా
రద నిభ శుభమూర్తి నశ్వరత్నం బగుడున్
శతికంరసుతుడు ఖచర
స్తుతుడై యా యిచ్చరూపుతురికీ నాస్కం
దిత ధౌరిత కష్ణుత రే
చిత పల్గిత గతులc దఱిటు చేసిన నదియన్
కెరలి చతుర్విధ ధావిత
పరిపాటీ పాటవమునc బతి మెప్పించెన్

మామూలు నెమలి అనుకొంటున్నారా ఏమిటి మీరు. నెమలి అంటే నెమలి. రథమనుకొంటే రథం మదపుటేనుగు అనుకొంటే ఏనుగు. లేక ఉచ్చైఃశ్రవంలాంటి గుఱ్ఱమే అనుకొంటే గుఱ్ఱం. దాని ప్రభావం తెలియక మాటాడుతున్నారు మీరు. ఇచ్చరూపుతురికీ అది. అంటే ఏ రూపమంటే ఆ రూపం ధరించే అశ్వం. అందుకే ఆస్కందిత ధౌరిత కాది గతులలో దేనిలోనైనా తన స్వామి ఇచ్ఛానుసారంగా దౌడు తీయగలదు. భూమ్యాకాశ మార్గాలేవైనా దానికొక్కటే. అని కవిగారి వ్యాఖ్యానం. అసలు మాటకు వస్తే విఘ్నేశ్వరుడికి వాహనమేమిటి. మూషికమా. ఈశ్వరుడికి వృషభమా. విష్ణుదేవునికి ఒక శ్యేనమా. నమ్ముతారా ఎవరైనా. అవి వాటి బాహ్యమైన ఉపాధులే. అంతర్యంలో అవి మహిమాన్వితమైన దేవతామూర్తులు. ఇదీ పురాణ ఋషి హృదయం. దాని మర్మం తెలిసిన రామకృష్ణుడిలాంటి మహాకవుల హృదయం. పైకి కొంటెతనమైనా లోపల ఇంత గడుసుతనం దాగి ఉంటుంది మాటలలో.

సరే ఇంతమంది మహర్షులతో బయలుదేరుతుంటే ఆ కుమారు డాయన వెంట ఇంకా ఎవరెవరో తెలుసా. 'బూదు పాఱగ మేనబూది పూసినవారు – త్రిముఖాస్త్రములు కేలఁద్రిప్పువారు' ఇలాటి వారెవరో చెప్పండి. ప్రమథ గణాలట వారు. శివుడిలాగే కనపడతారు శివుడు కారు. ఇదీ చమత్కారం. వారూ వెంటబడి వస్తున్నారట. అంతేనా ఇంకా ఆయన వెంటబడ్డ వారెవరో తెలుసా. సురవేశ్యలు గొల్చిరపుడు సుబ్రహ్మణ్యున్.' శుభ్రమైన బ్రహ్మచారి సుబ్రహ్మణ్యుడు ఆయన వెంట ఈ దేవ వేశ్యలేమిటి. వేశ్యలా బ్రహ్మచారి వెంటబడి వస్తే ఆయనకేమి మర్యాద. ఇది కవి చమక్కు. ఆయన ఆ జన్మ బ్రహ్మచారి. సుబ్రహ్మణ్యుడు తెలుసుకొండి. అబ్రహ్మణ్యుడు గాడని కవి మనకిచ్చే చురుక్కు.

అందరూ కలిసి వెండికొండ సమీపించారు. ఎలా ఉందా కొండ. తన తండ్రి ఈశ్వరుడే దర్శనమిచ్చాడా అనిపిస్తున్నదట ఆ స్వామికి. ఈశ్వరుడు కొండగా కనిపించటమేమిటి. 'పుట్టిన మోములై శిఖరము వ్వేలు గొంద. నితంబమండలిం గట్టిన పుట్టమై నిబిడ కాననరేఖ దలిర్ప' కనిపిస్తుంటే అది ఈశ్వరుడు కాడని ఎలా అనుకోవాలని నిలదీస్తాడు మనలను కవీశ్వరుడు. ఇంతకన్నా విడ్డూరమేమిటంటే

'నీలగళ వాహరింఖా ఖనిత్ర నిహతి
నింగి కెగసిన వెండి ఆ నేల దుమ్ము
ప్రాంత వర్తిష్ణు సప్తర్షి పరివృఢులకు
నొసగు నిర్యత్న విలసిత భూసిత మచట'

పరమేశ్వరుడి వాహనమైన వృషభమా వెండికొండరాళ్లను తన గిట్టలతో కోరాడితే పైకి లేచి వెండినేల దుమ్ము పక్కన తిరుగుతున్న సప్త మహర్షుల నొసటి మీద బడి అప్రయత్నంగా తెల్లటి విభూతి రేఖలు తీర్చినట్లున్నదట. హాస్యంగా చెప్పినా ఎంత గొప్ప భావమిది. సహ్యాదయైక వేద్యం పండితరాయలు చెప్పినట్టు.

సరిగా అదే సమయంలో పరమేశ్వరుడూ పార్వతీ ఉద్యాన వన విహారం చేస్తుంటారు. వారికి వీరి రాక కంచుకులు వెళ్లి విన్నవిస్తారు. అలాగే వెంటనే వారిని ప్రవేశపెట్టమని సెలవిస్తారు ఆదిమ దంపతులు. ఇక వారి అనుమతి తీసుకొని కుమారస్వామి లోపల ప్రవేశించటం వర్ణిస్తాడు కవి. చదివి తీరాలి. చదివితే విని తీరాలి.

వీడియం బెడలించి విధురత్న కనకాలు
కాంచితాంబువు పుక్కిలించి యుమిసి
యుదిరి బంగరు వ్రాత హొంబట్టు వలెవాటు
సడలించి వెసఁగటి స్థలిని జుట్టి

యను యాయి పృథుక హస్తాంతర న్యస్తోప
దోచి తార్థము తానె యుద్వహించి
యంగుళీ సంజ్ఞ సంయములc బ్రత్యేకంబు
మునుమున్న లోనికిcజన నొనర్చి
ద్వార పార్శ్వస్థ వేదికా వళుల జరఠ
రక్షివర్గంబు టంక్రియా రభటి వఠర
వలయ మకుటాదికంబుగ నిలిచి మ్రొక్క
నగవుcజూపులc జూచుచు నగరు సొచ్చి

ఈ పద్యమే పద్యం. ఎంత ముద్దుగా ముచ్చటగా నడిచిందో ఈ వర్ణన చెప్పలేను. చూడబోతే ఇది కవి తన కాలంలో ఏ మహారాజును అంతఃపురంలో దర్శించటాని కనుమతుడై లోపలికి వెళ్లుతున్న అనుభవాన్ని గుర్తు చేసుకొని వ్రాస్తున్నట్టు కనిపిస్తుంది నాకు. తన అనుభవాన్ని కుమారస్వామి కంపగట్టి వర్ణించటమింకా కొంటెతనం. అందులో స్వామి మాతా పితృ భక్తి వినయ విధేయతలు వ్యంగ్యంగా సూచించట మింకా గడుసుతనం.

ఏమిటింతకూ పద్యభావం. నోట్లో ఉన్న తాంబూలపు తమ్మ ఉమిసి నోరు బాగా నీళ్లతో పుక్కిలించి ఉమిసి భుజంమీది వల్లెవాటు తీసి నడుముకు బిగించి తనవెంట వచ్చే కుట్టువాడి చేతిలో ఉన్న కానుకలు తానే తీసుకొని – మరి చేతి సన్నలలో తన్ను అనుసరించి వస్తున్న మనుల నందరినీ ముందుగా లోనికి పంపి ఆ తరువాత తాను కక్ష్యాంతరాలు గడచి ఆయా ద్వార దేశాల ప్రక్కన నిలుచున్న రక్షక భటులందరూ తనకు వంగి వంగి సలాములు చేస్తుంటే చిరునవ్వుతో స్వీకరిస్తూ నగరులో ప్రవేశించాడట. ఏమిటీ వర్ణన. కుమారస్వామి

బ్రహ్మచారి. బ్రహ్మచారి తాంబూల చర్వణం చేయట మేమిటి. అది వెడలించి నోరు కడుగుకోట మేమిటి. రాజుగారి దర్బారులో ప్రవేశించే ముందు రాజోద్యోగులంతా భయభక్తులతో వ్యవహరించే తీరు కవి కుమారస్వామి కంటగట్టి వర్ణించటమెంత హాస్యం. మానవోచితమైన వ్యవహారం దేవతా మూర్తుల కారోపించి చెప్పట మొక సాహసం. ద్వార పాలకులను చూచి కుమారస్వామి చిరునవ్వు నవ్వాడో లేదో గాని వికటకవి ఈ వర్ణన చూచి మనబోటి పాఠకులకు మాత్రం నవ్వు రాక పోదు.

మరి ఇలా లోపలికి వచ్చి తలిదండ్రుల పాదాలకు నమస్కరించాడో లేదో వెంటనే వారు 'కేలుసాచి వే గ్రుచ్చికవుంగిలించి - సమ్మదా శ్రులు కనుగవఁగ్రమ్ము దేఱ - నాఱు మోముల బాలు నిజాంతరమున' నిలిపారట. అతడు బాలుడా ప్రౌఢుడా. ఇంతకు ముందే పని వర్ణించాడు కవి. బాలత్వమంతా రక్కసి మూకల కప్పజెప్పి వారితో రణక్రీడ సలిపిన ప్రౌఢుడని గదా. ఇప్పుడున్నట్లుండి బాలుడెలా అయ్యాడా స్వామి. ఎంత ప్రౌఢుడైనా ఎంత సేనాని అయినా తలిదండ్రుల పాలిటికి బాలుడే ఎవడైనా. అందుకే ఇద్దరూ తమ మధ్యలో ముద్దుగా కూచోబెట్టు కొన్నారతణ్ణి. ఆరుమోముల బాలుడు గాబట్టి ఇంకా అల్లారు ముద్దు అతడంటే వారికి. అని కవిగారి చమత్కార ప్రసంగం. సరే పరమేశ్వరుని తీర్థ క్షేత్ర దైవత త్రయ వర్ణనా ప్రసంగంతో ప్రథమాశ్వాసం ముగిసి ద్వితీయం మొదలవుతుంది.

అందులో వస్తాడొక మహాభక్తుడు పుండరీకుడు. ఆయనగారి హరిభక్తికీ గురుభక్తికీ రెంటికీ మెచ్చి ప్రత్యక్ష మవుతాడు స్వామి. ఎలా ఉందా విగ్రహం. వికటకవి నడగండి చెబుతాడు.

మును మీనగుటఁ బట్టి మునులు వైచిన బత్తి
వలఁబోరెఁ జిక్క మౌదలఁ దలిర్ప
వెలితిగాఁజివి గొన్న వెన్నముద్దయుఁబోలె
శంఖంబు వామహస్తమునఁ దనర
జగదండ వహ కాల చక్ర భ్రమణ హేతు
దండమై నిజధేను దండ మమర
సంచిఁబట్టిన పద్మజాతాండముల లీల
వలకేల గ్రచ్చకాయలు ఘటిల్ల.

ఇలా ప్రత్యక్షమయిందట ఆ విగ్రహం. ఒకప్పుడా స్వామి మీనావతారం ధరించాడు కాబట్టి ఆ మీనాన్ని పట్టటానికి మహామునులు భక్తి అనే వలవేసి పట్టినట్టుందట స్వామి ఔదల మీద ధరించిన చిక్కం. మరి కృష్ణావతారంలో వెన్నముద్దలు బాగా మింగిన బాపతు కాబట్టి ఒక వెన్నముద్ద కొంచెం తిని మిగతాది చేత బట్టుకొన్నట్టున్నదట వామ హస్తంతో ధరించిన పాంచజన్యమనే శంఖం. పోతే కాలచక్రాన్ని నిత్యమూ త్రిప్పుతున్న దండమా ఏమన్నట్టున్నదట ఆస్వామి ఆలమందలను తోలే దండం. మరి కుడిచేత గ్రచ్చకాయలు పట్టుకొని ఉంటే అవి బ్రహ్మాండా లెన్ని ఉన్నాయో వాటిని లెక్కపెట్టి సంచికి వేసినట్టుందట. ఏమిటీ హాస్యం. ఏమిటీ చమత్కారం. అంతా వికటత్వమే. పైకి వికటత్వం. లోతుకు దిగి చూస్తే భగవద్విభూతి ప్రకటత్వం.

ఆఖరుకు స్వామివారి దశావతారాలు స్తుతించినా ఇదే వరస వికటకవిగారిది. అంత భక్తి భావంలో కూడా కొంతకు కొంత హాస్యరసం ఒలక బోయకుండా మానలేదు. సోమకాసురుడి కడుపులోకి పోయిన వేదాలకు వాడి పేగులలోని కల్మషమంటితే దాన్ని తనకీర్తి అనే

గంగాజలంలో బాగా కడిగి శుభ్రం చేసి మరలా ఆ ముసలాయన ముఖసరోజ గంధంతో సువాసితం చేశాడట మత్స్యావతారంలో శ్రీ మహావిష్ణువు. మరి కూర్మావతార మెలాంటిదో తెలుసా. ఇంద్రుడి రాజ్యలక్ష్మి దిక్కులేక పడిపోతే దాన్ని 'ఈతకాయ రూపై కఠినమైన తన వీపు చిప్పమీది కెక్కించి బయటపడేశాడట స్వామి. వామనావతరాంలో త్రివిక్రముడై పెరిగిపోయే సరికే భూమండలమంతా ఆస్వామి అరకాలిలో ఒక పుట్టుమచ్చలాగా కనిపిస్తున్నదట. మరి బుద్ధావతారంలో నైతే ప్రతి దినకేశలుంచనపు రాయిడితో బట్టగట్టి పైఁబుత పుతమనే కుఱుబోడతల ధరింపలేక 'సతమగు సొమ్ముగాన శిఖిపించాన్ని మాత్రం విడవలేక పోయాడట. ఇలా అక్కడక్కడ చెళుకులు విసురుతూనే పోతాడు. ఇక సంగ్రహంగా అన్ని అవతారాలను కలిపి ఒక పడవలో చొప్పించి వర్ణించాడా సంగతి. ఇంతకుముందే తమకు మనవి చేశాను గదా. ఇంతెందుకు.

'నిడువాలు కనుచూపు నిగిడినచో నెల్ల
బీతెండ రేయెండ పెండ్లియాడ
నిఃశ్వాస పవనంబు నెలకొన్న చో నెల్ల
ప్రాపిన్కునెత్తావు లాము కవియ
పొక్కిటి తమ్మిపుప్పొడి యొల్కుచో నెల్ల
బ్రహ్మాంకురంబులు పాదుకొనగ

విహరిస్తుంటాడట పొండరీకంలో నందుని పట్టి ఎక్కడెక్కడ తన నాభి కమలంలో నుంచి పుప్పొడి రాలుతుంటే అక్కడంతా లెక్కలేనన్ని బ్రహ్మ మొలకులు బయలుదేరుతున్నాయనే మాట చూడండి ఎంత నవ్వుపుట్టిస్తున్నదో మనకు.

దీనితో కుమారస్వామి అగస్త్యాది మహర్షుల గొడవ అయి పోయింది. ఇక బయలుదేరాడు మరొక మహానుభావుడు కైలాసానికి మరలా. ఎవరో గాదాయన నారదమహర్షి కుమారాదులు కైలాసం నుంచి తిరిగిరావటం ఎక్కడి నుంచి చూచాడో ఏమో. వెంటనే భూమిమీదికి దిగి వచ్చాడు. ఎలా వచ్చాడో తెలుసా. తెగిన చుక్క ధరణి కేతెంచు కరణి – చుక్కతెగి పడ్డట్టు. వస్తుంటే ఆయన జడలు గాలికి కదులుతుంటే అవి ఎలా ఉన్నాయంటారు. 'నిగిడి సుషుమ్న యీనిన పిల్ల వెలుగుల వడుపున నెఱసంజ జడలు వెఱగ' అని వర్ణిస్తాడు మన వికట కవి ఏది వర్ణించినా ఏదో ఒక బెళుకు విసరవలసిందే తప్పదు. వస్తూ వస్తూ చూచాడా కుమారాదులందరినీ చూచి దారిలో మాటాడ కుండానే వారక్కడి కెందుకు వచ్చారా' ఏ కారణ మేగు దెంచి రొకా కనఁజిత్రంబగు' అని కొంచెమాశ్చర్యపడి వెంటనే 'కంటింగంటి స్వకృత స్కాందోక్తియం దావ హిల్లిన సందేహము తండ్రి చేఁ దెలియు హాళిన్ వీరిఁదో కొంచుఁగ్రొంచ నగో ద్ధేదియువచ్చె' – తన స్కందపురాణంలోనే ఏదో సందేహం వస్తే అది తీర్చుకోటానికి స్వామి తన తండ్రి దగ్గరికి వచ్చి ఉంటాడు. 'ఇట్లగుటకున్ శంకింప నింకేటికిన్' సందేహం లేదు 'శరవణ భవయుతులగు నీపరమ మునులు శ్రోతలట – యపార ప్రజ్ఞా కరుణ నిశాకర శిశుశేఖరుడు హరుడు వక్తయట యగన్యుము గలదే. మరి 'అతిరహస్యంబు శుద్ధంబు నాజవంజ వార్తిహారమను నది యెద్ది యడిగె నొక్కొ కొడుకు తండ్రిగారి' నని అక్కడ జరిగింది జరిగినట్టు ఊహించి తెలుసుకొంటాడు. ఎలా ఇంత విషయ మారా తీయ గలిగాడా మహర్షి ఎవరనుకొన్నారాయన. నారదుడు. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే స్వభావ మా మహానుభావుడిది. ఏదైనా ఆచూకీ తీయగలడు. అలా

కాకుంటే ఆ వచ్చే వారు తనకు పరాయివారా వారినే అడిగి తెలుసు కోవచ్చు గదా. ఎందుకీ చాటుమాటు వ్యవహారం. ఒక సీఐడీ లాంటి వాడు నారదుడు. అతని స్వభావాన్ని బయటపెట్టటానికే వికటకవి ఆ సంఘటన నింతగా సాగదీసి వర్ణించటం.

సరే తనకూ ఉంది కుతూహల మది ఏదో ఆరహస్యం తెలుసుకో వాలని. వెంటనే కైలాసానికే దారి తీశాడు మరలా. కక్ష్యాంతరాలు గడచి లోలోపలికి ప్రవేశిస్తూ పోతున్నాడు. దర్శనమిచ్చింది ఒక దేద్యీమానమైన ప్రకాశం ఏమిటా ఈ కాంతి పుంజమని చూస్తే చూడగా చూడగా స్ఫుటంగా కనిపించిందది 'పంచముఖమని శిఖీక్షణ విభాసి లలాటమని మరుజ్ఝరీ ధరమని సంచిత సత్కృపా రసవశం వదమైన వృషాకపి' అని పైకి చెప్పకుండానే నిరుపాధిక సోపాధికమైన భగవత్తత్వాన్ని ఎలా వర్ణించి చూపుతున్నాడో చూడండి రామకృష్ణుడు. అసలొక ఆశ్చర్యమే మంటే అంతకు ముందు కుమారస్వామి వచ్చినప్పుడు ఇంత గొడవ లేదు. వెంటనే లోనికి రమ్మని దర్శనమిచ్చాడు పరమేశ్వరుడు. ఇప్పుడీ నారదుడి కేమిటి ఇంత మభ్యపెట్టి దర్శన మివ్వటం నారదుడి వ్యవహార మాయనకు బాగా తెలుసు. సర్వజ్ఞుడు గదా. ఎవరి స్వభావ మెలాంటిదో ఆ మాత్రం తెలియదా. చూతా మెందుకు వచ్చాడో ఏమడుగుతాడో ఈ మతకరి వేలుపుం దపసి అని ఈ ఉదాసీనత స్వామి వారిది. వస్తున్నారట ఒక్కొక్కరే దేవతలు. ఆ దేవతలకే దిక్కులేదక్కడ. దండ ప్రణామం చేయటమేమిటి. ఒక్కొక్కరినీ సువర్ణ దండాలతో తండు భృంగిరిటాదులు తలల మీద మోదట మేమిటి. అంత అపురూపమక్కడ స్వామివారి దర్శనం. అందుకే ఎందుకైనా మంచిదని నారదుడు వారి హడావుడి తప్పించుకొని స్వామి వారు కొలుపు దీర్చాడో లేదా వెంటనే

వెళ్లి ఆయన కాళ్లమీద బడి ఒకటే స్తోత్ర పాఠాలు సాగిస్తాడు. ఏ గాలికా చాప గదా నారదుడంటే ఏమని పొగుడుతున్నాడో చూడండి.

వేదవివాద గోష్ఠిఁబడి వృద్ధుల బుద్ధుల గొల్వవచ్చు – శ్రీగాదిలియై మెలంగ – గలకాలము గ్రాలగ వచ్చు – నిచ్చకున్ బ్రోదిడు నన్య భవ్య సుఖము ల్మఖమూల్యము లొంద వచ్చుఁగాకే దొరకేటికిన్ దొరకు నీవు విషాగ్నుల నాజ్ఞ వెట్టుటల్" ఎంత మాట ఇది మీరే చెప్పండి. ఈ నారదుడు వైష్ణవుడా శైవుడా. అసలు రామకృష్ణుడెవరు. మొదట శైవుడైనా మధ్యలో వైష్ణవం పుచ్చుకొన్న బాపతు గదా. భట్టరు చిక్కాచార్యుల శిష్య పరమాణువుగదా. పార్వతీ దేవి చేత కూడా విష్ణు సహస్ర నామాలు చెప్పించిన వాడు. పరమేశ్వరుణ్ణి కూడా వైష్ణవ సార్వభౌముడుగా మార్చి ముద్రాంకితుణ్ణి చేసినవాడు. అలాంటి వాడిప్పుడీ నారదుడి నోట ఏమని పిస్తున్నాడు. వేదాధ్యాయ మెంతైనా చేయవచ్చు. బ్రహ్మదేవుడి లాగా. శ్రీమంతుడయి హాయిగా జీవితం నడపవచ్చు శ్రీ మహావిష్ణువులాగా కలకాలమూ భోగ భాగ్యాలనుభవిస్తూ కూచోవచ్చు దేవేంద్రుడిలాగా.. కాని ఈ దొరలందరూ ఎందుకు పనికి వస్తారు నీతో పోలిస్తే నీలాగా కాకోల విషాన్నీ కారుచిచ్చునూ కనుసన్నలలో నిలపగలరా ఆజ్ఞాపించ గలరా దేవాది దేవుడవు నీకే చెల్లునది అని ప్రశంసిస్తాడు. భక్తిలో కూడా హాస్యమే. ఏ ఒక్కటీ ఎంతగట్టిగా పట్టుకొన్నట్టు కనిపిస్తాడో అంత సళ్లుగా వదిలేయగలడు. ఎవరు నారదుడా రామకృష్ణుడా నారద పాత్రధారి అయిన రామకృష్ణుడనే అనే సూత్రధారి. తన కొంటెతనమే నారదుడికీ అంటగట్టాడు. ఎంత గడుసుతనం.

ఇంతకూ 'కాలీచవడ కంపలఁబడ్డ కాకినై చరించా నింత కాలమూ' దేవరా ఇంతకు ముందు నీవా కుమారునికీ మహర్షులకూ ఏ రహస్యం

చూ చూ అది నాకు సెలవివ్వమని ప్రార్థేయపడ ఎ. 'అమ్మహానందు డెచ్చోట నధివసించు - నెట్టి వాడమ్మహా విష్ణుడ అడుగుతాడు. ఎట్టివాడో ఆ విష్ణుదేవుడు తనకు తెలియదా నారదుడికి. తెలిసినా ఈయనగారేమి చెబుతాడో విందామని ఒక చమక్కు. ముల్లోకాలు తిరిగేవాడికి నీకా మాత్రం తెలియదా అని ఆయనగారెక్కడ మందలిస్తాడోనని ఏదో గొప్ప పని 'ఉన్నట్టు' భువనాళిని హాళిగ జరింతు. భ్రాంతియన్ కావిరి వావిరిం దవిలి కాళుల ధావతి యయ్యె' నని వాపోవట మింకా నటన. ఇదంతా ఏదో గాదు వికటకవి వికటకవి తాతాండవమని గ్రహిస్తే చాలు మనం. పదహారు కళలతో ప్రత్యక్షమవు తుంది ఆ కవి చిత్రం మనకు మన భావనా క్షేత్రంలో.

అయింది ద్వితీయం. ఇక తృతీయంలో ప్రవేశిస్తాం. ప్రవేశిం చామో లేదో ఒక అపురూపమైన చిత్రాన్ని తయారు చేసి మన ఎదుట నిలిపి ఎలా ఉంది నేను గీచిన ఈ చిత్రం బాగా చూచి చెప్పండని ప్రశ్నిస్తాడు మనబోటి పాఠకులను. అదే నిగమశర్మ అనే ఒక బ్రాహ్మణ కుమారుడి చిత్రపటం. నిగమశర్మ అనే పేరు చెడ్డది వాడికి. నేతిబీరకాయ వాడికా పేరు. అందులో ఎంత నేయి ఉంటుందో వీడిలోనూ అంతే ఆ సంస్కారం 'వనితా మానస సూనసాయకుడు' అలాటి వాడికేది మాత్రమెలా అంటుతుంది. 'కలదు లేదను వాదముల కోర్చి మీను మీసము వంటి యెంటిజందెం' మెఱుస్తుంటే - తాళి గోణపు చుంగు నేలగ జీరుతుంటే - సఖులు పరిహాసకులనూ వెంటగ బెట్టుకొని యువతి భుక్త నిర్ముక్త పరిధాన యుక్తుడయి సిగ్గూ శరం లేకుండా నగర ఘంటాపథంలోనే తిరిగే బాపతు వాడు. భార్య ఉంది గదా ఏమిటీ వెలయాండ్ల పొత్తని అడుగుతారా అడగమనండి.

భార్యపాలిండ్లు రిక్తకుంభములు – రోయి
వెలది చనుదోయి నిండుకుండలు – కులంబు
తరుణి ఫాలంబు చవితి చందురుడు – వేశ్య
నుదురు వానికి ప్రతిపదిందుండు నయ్యె'

అని జవాబిస్తున్నాడు మన వికటకవి. కులకాంత పాలిండ్లు వాడికి వట్టి కుండలు చూడగూడదు. వెలకాంత చన్నులో నిండు కుండలు చూడవచ్చు శుభసూచకం. మరి దాని నుదురు చవితి చంద్రుడు పనికి రాదు– దీని నుదురో పాడ్యమి నాటి చంద్రరేఖ. చూచి తీరాలని మన వికటకవి పరిష్కారం. అంతేకాదు. ఎంత చెడ్డా బ్రాహ్మడు గదా మరి నిత్యకర్మలేమి చేశాడని అడుగుతారా. చేస్తూనే వచ్చాడు. కాని మీరనుకొన్నవి గావు. అవేమిటో తెలుసా.

ఉహ్నాన హో మాగ్ని నూద నొల్లడు – గాని
విరహజ్వరార్తుడై వెచ్చనూర్చు
సంధ్యకు ప్రార్థనాంజలి ఘటింపడు – గాని
యెరగు నీర్వ్యాకషాయితల కర్థి
నాగమ వాదంబు లొగా దనడు – గాని
విటవాదములు దీర్చు వేగలేచి
కంబుభృత్పాదోదకంబు గ్రోలడు – గాని
యౌవతాధర శీధు వాని చొక్కు
పుణ్య చిహ్నాంబులపఘనంబున ఘటింప

సిగ్గుపడుగాని – వేశ్యల నఖక్షతాంకములు ఎన్నైనా శరీరం మీద ధరించి తిరుగుతుంటాడు. ఏ హోమ మైతే నేమి ఏ నమస్కారమైతేనేమి – ఏ వాదమైతే నేమి – ఏ పాదోదకమైతే నేమి ఏ ముద్రాంకితమైతే

నేమి - ఏదో ఒకటి సేవిస్తూనే ఉన్నాడుగా సంతోషించండని మనకు కవిగారు ఛలోక్తిగా ఇచ్చే సలహా.

మొత్తం మీద శివ్నోదర పరాయణత్వం తప్ప మరేదీ లేదు వాడికి. ఇదంతా తెలుసుకొని వాడికి మంచి బుద్ధి నేర్పి బాగు చేయాలని వచ్చిందొకనాడు ఆ ఇంటి ఆడుబడుచు. అప్పుడే ఏమీ మాటాడకుండా వాడికి అన్ని ఉపచారాలు కొంత తాను చేసింది. మరికొంత మరదలి చేత చేయించింది. బాగా షడ్రసోపేతంగా భోజనం పెట్టింది. భార్య తమ్ముల మిస్తే అది నములుతూ 'మహాశిష్టుడ పోలె తిన్నెపయి చిర్నగ వొప్పగ కూరుచున్నాడు' వాడు. వచ్చింది అక్కగారు దగ్గరికి. 'ఇంతలు వంతలు నగు తన సంతానము చంట వెంట సందడి చేస్తుండగా'నట. అదీ ఒక చమక్కే కవిగారిది. ఇక తమ్ముడికి చేసే కేశ సంస్కారం ఈళ్లు గ్రుక్కటం - అంట్ల బొడవటం - పేలు పోయేట్టు ఎగాదిగా దువ్వటం మెడ మన్ను నలపటం - ఒకటా అన్నీ శ్రద్ధగా చేస్తూ వస్తుంది. ఎందుకిదంతా వాణ్ణి చీవాట్లు పెట్టటానికే హడావుడి. అదీ ఒక వంక బీడ్డ పాలు త్రాగుతుంటే నంటాడు. అది ఎక్కడ కనిపించిందో ఈ కవిగారికి. ఇక నెమ్మదిగా అందుకొన్నదండీ వాణ్ణి దండించటానికి.

ప్రారంభించిన వేదపాఠమునకుం బ్రత్యూహ మౌనంచునో
యేరా తమ్ముడ నన్నుఁజూడఁజనుదే నెన్నాళ్ళ నోయుండిచ
క్షూరా జీవయుగంబు - వాచె నిను గన్గో కున్కి - మీ బావగ
న్నీరాక ల్మదిఁగోరు - చంద్రు పొడుపు న్నీరాకరంబుం బలెన్ -

ఏరా నాయనా నీవు మొదలుపెట్టిన వేద పాఠానికేమైనా అంతరాయం కలుగుతుందనా నన్ను చూడటానికి కూడా రాలేదు. ఎత్తి పొడుపు. నిన్ను చూచి చాలారోజులయింది గదురా. నేనే గాదు మీ

బావగారు కూడా ఎంతో ఎదురుచూచారు. పరితాపం. ఇలా ప్రారంభించి ఇక అన్నీ నిష్కారాలే. వాడి కర్తవ్యాన్ని వాడికి గుర్తు చేయటాలే. వాడి ఆకతాయి చేష్టలన్నీ ఎత్తి చూపివాణ్ణి మంచి మార్గానికి తిప్పే ప్రయత్నాలే.

అయితే అక్కగారి ఇంత హితబోధా మహా బధిర శంఖధ్మాన మయింది వాడికి. 'అక్క యీరీతి నయము ప్రియంబు గలుగ నాన తిచ్చిన సద్బుద్ధి యాదరించె' ఎందుకో తెలుసా. అవి ఒంటఁబట్టి గాదు. 'చాల దినముల నుండియు మైలవడిన బడుగు గావున వాడన్న పాన కాంక్ష' నని నవ్వుతూ సమాధానమిస్తాడు మన వికటకవి. అంతేనా వాడి నటన కూడా బయటపెడతాడు.

రాజాలయమునకు రాకపోకలు సేయు
మాసిన చదువులు మఱలఁ జదువు
నిన్నాళ్ల నెచ్చెలు లెదురైనఁ దలవంచుఁ
గుల వధూరత్నంబు గుస్తరించు
నాచార్య జనముఁ బ్రత్యహము సంభావించు
నర్చావళికి నుపహారమిచ్చు
నర్చించుఁ గుతపవేళాగతా తిథి కోటిఁ
బసినేదు - దర్శించుఁ బైరు పచ్చ
తండ్రి యుద్ధమనీయంబు తానె యుదుకు
నత్తికా భర్తతో నవ్వు నల్పసరణి -

అని అంతా వర్ణించి ఇదంతా నిజమే ననుకొనేరు. అంతా నటనే సుమా. "తేనె బూసిన కత్తి ధాత్రీసురుం' డని చివర కొక్క మాటతో తేల్చి పారేస్తాడు రామకృష్ణుడు.

తేనె బూసిన కత్తి అన్నందు కేమి చేశాడో తెలుసా వాడు. ఒకనాటి రాత్రికి రాత్రి ఇంట్లో ఇనుపపెట్టెలో దాచి పెట్టిన సొమ్ములన్నీ ఊచ

ముట్టుగా దొంగిలించి ఒంటరిగా ఒక అడవి మార్గం పట్టి ఎక్కడికో ఉడాయిస్తాడు. అది అలా ఉంచి ఇంట్లో వాళ్ళందరూ వాడు కనపడ కుండా పోయాడే ఏమయిపోయాడో నని గాక మా సొమ్ములన్నీ పోయాయే రామచంద్రా అని ఏడుస్తూ కూచున్నారంటాడు కవి.

‘శోకించు వృద్ధభూసురు డాత్మ పితృదత్త
దర్భముద్రికకుఁ జిత్తంబు గలగి
యత్తగారిచ్చిన హరిసుదర్శనపుఁబే
రునకు ముత్తైదువ వనటఁజెందు
క్రొత్తగాఁ జేయించు కొన్న ముక్కఅకునై
యడలు దుర్వార యై యాడు బిడ్డ.
జామాత వెతనొందు వ్యామోహియై నవ
గ్రహకర్ణవేష్టన భ్రంశమునకు.’

చూచాడా. ఇంట్లో పెద్దాయనా పెద్దామే గాదు. రాక రాక చూడటానికి వచ్చిన ఆడబిడ్డ కూడా తన ముక్కర పోయిందేనని ఆఖరుకా ఇంటి అల్లుడు తన నవగ్రహ కర్ణాభరణం పోయిందేననీ బాధపడ్డారట. అంత పెద్ద వాళ్లు బాధపడుతున్నా వాడి ఇల్లాలు చిన్నదయి కూడా తన మగడేమయి పోయాడో ననే బాధ తప్ప సొమ్ములు తీసుకుపోయాడే అని ఏమాత్రమూ వ్యధ చెందలేదని ఎంత వ్యంగ్యంగా సూచిస్తున్నాడో చూడండి కవి. అయితే వాడూ కూడా ఎవరినీ అనుకొన్న వాడు కాడు లెండి. ఆఖరుకు ‘పడుకొనే పడకకు’ కూడా చెప్పకుండా వెళ్లిపోయిన బాపతంటాడు కవి వికటంగా నవ్వుతూ.

కాగా అలా పరారయి పోతుంటే దారిలో ఆ నిశిరాత్రి కొందరు దొంగ లెదురుపడి వాడి దగ్గర ఉన్న సొమ్ముల మూట కాజేసి వాణ్ణి

బాగా చితకబాది వెళ్లిపోయారు. తరువాత ఒక కాపు కొడుకా కా పురుషుణ్ణి చూచి వాడిమీద జాలితో ఇంటికి తెచ్చి పరిచర్యలు చేసి మరలా ఎప్పటి లాగా స్వస్థత కలిగిస్తాడు. క్రమంగా తేరుకొని నిగమశర్మ 'తాన ప్రసంగముల్దిగిచి తత్సరణిందన పెంపు పెద్దగాఁబూని' వక్కాణిస్తుంటే వాడా కాపు ఇతడు నిజంగా మహాపండితుడొక దేవుడేనని నమ్మి తానూ తన ఇల్లాలూ ఇద్దరూ అడుగులకు మడుగులొత్త సాగారు. వీడు వాళ్లాకొక 'దేశికోత్తముడూ పరమాప్తుడూ' అయ్యాడంటాడు కవి మనతో నవ్వుతూ.

అంతేనా. ఆ కాపు కోడలొకతి మంచి యౌవనంలో ఉండి యువకుల నెవరినైనా వలలో వేసుకొనే వికారపు చేష్టలు ప్రదర్శిస్తూ ఉంటుంది. అది ఈ పిసాళి బాపడు తన ఇంట్లో అడ్డమాక లేకుండా బాగా చనువుగా తిరుగుతూ ఉండటం చూచివీణ్ణి ఎలాగైనా పొందాలని దాని కోరిక. దాని కనుగుణంగా ఎన్నో వికారపు చేష్టలది చేస్తూ వీణ్ణి కవ్విస్తూ వస్తుంది. ఆడది కవ్విస్తే మగవాడూరుకోగలడా. రెచ్చిపోడూ. అసలే వీడుకోతి. అది వీడికి కల్లు తాపినట్టయింది. దొరికింది ఇక మన వికట కవిగారికి మంచి అవకాశం వర్ణించటానికి. అది వికారపు కోడలైతే వీడేమి తక్కువా. వీడంత కన్నా లఘువర్తనుడంటాడు కవి. ఇద్దరూ ఇద్దరే. ఈ సందర్భంలో దాని శృంగార చేష్టలు వర్ణిస్తాడు కవి. అనితర సాధ్యం. అలాగే ఆ స్పందనకు నిగమశర్మ ప్రతిస్పందన ఎలాంటిదో ఏకరువు పెడతాడు. అదీ అనన్య సామాన్యమే. శృంగారంలో హాస్యం హాస్యంతో శృంగారం మిళితం చేసి వర్ణించి ఆ రెండు పద్యాలూ సాహిత్య ప్రియంభావుకులకు చిరస్మరణీయాలు. వికటకవి కవితా వైభవానికి మణి దర్పణాలు. అవధరించండి.

పలు వికారంబుల కలగల్పు చూపుల
రాకపోకల బయల్రాకఁజేయుఁ
దమకంబు గమకంబు దత్త అంబును హత్తి
మనసు సాగిన పజ్జఁజొనుపుఁగోర్కి
కుదురు పాలిండ్లపై కొంగు జాఱఁగ గొప్పు
వీడ సూరక నవ్వు వెట్టి నవ్వు.
నేరాలి పట్టి బిట్టెత్తి చెక్కిలి నొవ్వఁ
గఱచి వాడేడ్చినఁ గౌగిలించు
దండ సకి మెడఁబుంజాల దండఁబెట్టు
తిట్టు మట్టెలు బిగువంచు తెగి కళాదు

వనిత –

'వనితా జనితా త్యర్థ రాగాయాం యోషితి' అని అమరకోశం. వనిత అంటే పురుషుడి మీది వాంఛ వెల్లివిరిసిన స్త్రీ అట. ఈ శబ్ద మీ అర్థంలో నేను చూచినంత వరకూ ఒక మను చరిత్రలో కనపడుతుంది. తరువాత రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యంలో అగపడుతుంది. 'వనిత తనంత దావలచి వచ్చిన' అని అల్లసాని వారి ప్రయోగం. అది వరూధిని విషయంలో అక్కడ సార్థకం. ఇక్కడ ఈ కాపుదాని విషయంలోనూ సార్థకమే. మొత్తం మీద ఆనంద వర్ధనుడు చెప్పిన సాత్త్వికసంచారి భావాలన్నిటికీ నిలయ మీ వర్ణన. అది లక్షణమైతే ఇది లక్ష్యం. ఇక్కడ మరొక రహస్యమేమంటే ఆకాపు కోడలికి సంతానం లేదు. అందుకే ఏరాలి పట్టి నెత్తుకొని వాడి బుగ్గ కొరుకుతున్నది. ఏరాలంటే తోడికోడలు. అది కూడా ఒక కారణమది వాడిమీద మరులు గొనటానికి బరిదెగించటానికి. ఆడదే ఇలా బరిదెగించి బయటపడితే

ఇక వాడా ఊరకుండేది. వాడేమి ప్రవరాఖ్యుడా. నిగమశర్మ అయినా నిగమ గంధం లేని నేతిబీఅకాయ లాంటి వాడాయె. ఎలా రెచ్చిపోయాడో తెలుసా. వినండి కవే వెల్లడిస్తాడు మీకు.

బళిరా తేకుఁదేరఁ జిక్కె నిటులీ బంగారు కుండంచు చం
కలు దాటించుచు – కావి మోవి పుడుకంగా – గుబ్బ పాలిండ్లుబి
ట్టలమంగా – ముఖగంధ పారణము సేయంగాఁ గటీసీ మ ను
త్పల పత్త్రాళి ఘటింపగాఁ దివురు మిత్రద్రోహి మోహాంధతన్.

చిన్నారి పొన్నారి వయసు వాని చూచి అది వెకలి అయితే వీడు మిత్ర ద్రోహాన్ని కూడా లెక్క చేయలేదట. దాని కవ్వింపు చర్యకు చూడండి. వీడి రెచ్చిపోయే కోరికలు. ఇద్దరికీ కట్టలు తెంచుకొని ఎలా ప్రవహిస్తున్నాయో. దానికి కట్టవేయకుండా ఎలా వర్ణిస్తున్నాడో వికటకవి. ఏమిటీ అన్యాయమని నోరు జారి మనమడిగామో ఇద్దరి తరఫునా కవి మనకు ముద్దుగా ఇచ్చే జవాబేమిటో తెలుసాండి. 'నరకే సతికోదోషో మరణే సతికిం భయ' మంటాడు. హాస్యంగా.

సరే ఇలా ఉండగా ఒక మారు అమ్మవారి జాతర జరుగుతుందా గ్రామంలో, అందరూ అక్కడికి బయలుదేరి వెళ్లుతారు. ఒంటరిపాటున దొరికారు. వీడికదీ – దానికి వీడూ. ఇంకేమి విచ్చలవిడి. వీడు దాన్ని లేవదీసుకొని పోతే అది 'మగని నటు వెట్టి రెండవ మగని వెంట నటికిందని పేర్కొంటాడు కవి. అలాగా ఆ ఊడగొట్టిన నాగేళ్ళిద్దరూ ఊడని బాడుతూ పోయి గహన ఘంటాపథాలన్నీ గడచి ఒక బోయపల్లె చేరి అక్కడ ఆ బోయవాళ్లలో కలిసిపోయారట. ఇద్దరికీ సరిపోయింది. అవరవర్ణ స్నుష ఒకతి బ్రాహ్మణాధము డొకడు. కల్లు పెల్లా నగలరు. పేటాడగలరు ఆఖరుకు ఎఱచి కఱవగలరు – ఏపాటైనా పడగలరంటాడు

కవి. 'భ్రష్టస్య కావా గతిః' అన్నట్టు ఇద్దరూ భ్రష్టులే. ఇంతలో కొంత కాలానికి 'కాపుంగెంజి గురాకు బోడి పరలోకం బంత ప్రాపించుడున్' దాని తగులం తొలగి మరొక' మడాంధ బంధురశ్రోణి' అయిన మాతంగ కన్యను తగులు కొని దాన్నే మనసా స్మరిస్తూ దానితో కాపురం చేసి 'అపవిత్రమైన పుత్రలాభం గడించాడట ఆ గడి దేరిన బాపడు.

ఒకానొక సమయంలో పచ్చి నంజుడులన్నీ కావడిలో సమ కూర్చుకొని ఇంటికి వచ్చి చూడగానే ఒక దారుణమైన దృశ్యం కంట బడింది. 'మధుపాన క్షీబ జాయా తమాజాత పరిజన యుతంగా వాడి ఇల్లంతా అగ్నికాహుతి అయి బూడిద అయి ఉంది. ఏడుపు ముంచుకు వచ్చింది పట్టలేక ఆక్రందన చేయసాగాడు. అందులోనూ హాస్యమే మన రామకృష్ణుడిది.

'ఎల్లరు నెల్లచో ధనము లిచ్చి మృగాక్షులఁగొంద్రు గానియో
పల్లవ పాణి యేఁబరమ పావన వంశము నిచ్చి కొంటి నీ
నల్లని రూపు నిక్కమని నమ్మి'

అంటూ వాపోతాడు. అంతేకాదు. ఆ చండాలి చాండాలికను మీటుతూ సన్నని యెలుగుతో బ్రహ్మాండంగా పాట పాడేదట. అది నేనిక ఎప్పుడు విసగల నంటాడు. మరి 'ఈకడ జాతి నాతి కిహి హీ మహిదేవుడు చిక్కెనంచునన్ రాకకుఁబోకకున్ జన పరంపర కెంపగు చూడ్కిఁ జూచి యంబూకృత మాచరించుటకు బుద్ధిఁదలంక' నని కూడా దేబిరిస్తాడు. నలుగురూ ఛీ ఛా అని మొహాన ఉమ్మేసినా పరవాలేదట. ఎందుకంటే 'కలంక ముక్త చంద్రాకృతిఁ బొల్చునీ ముఖమునం దమ్మృత స్థితిఁ గాంచి మించుటన్' అని తను వ్యవహారాన్ని తానే సమర్థించు కొంటాడు. ఇంకా ఒక చిత్రమేమంటే 'పుత్రులు లేరె యెవ్వరికి భూమి

– మదన్వయ వర్ధనుల్ భవత్పుత్రుల వంటి వారు మనుపుట్టిరు. గాక–త దాస్యకాంతి తద్గాత్ర వివృద్ధి – తద్భుజయుగ స్ఫురణంబు – తదుక్తి లక్ష్మి – తన్నేత్ర సరోజపత్ర రమణీయత చూపఱంజొక్కఁజేయవే' – అని తన సంతానాన్ని తలుచుకొని పలవిస్తాడు. ఎలా ఉన్నారట వారు. వారి ముఖాలేమిటి వారి శరీర సౌష్ఠవమేమిటి. వారి చేతులేమిటి నేత్రా లేమిటి మాటలేమిటి– అలాటి అందచందాలిప్పటి వరకీ భూమండలం మీద ఎవరి కున్నాయని సవాలు చేయట మింకా హాస్యాస్పదం. అదీ భవత్పుత్రులు– నీ పుత్రుల లాంటి వారనట మింకా విశేషం. దాని పుత్రులు వీడి పుత్రులు కారా. అంటే తల్లిపోలిక ఉన్న వారనా అర్థం. మరి అది నల్లని రూపుదని గదా సంబోధించాడు. ఆ తల్లి నల్లనిదై దాని పోలిక వస్తే వారూ నల్లనయ్యలేగా. అంత సౌందర్యమెలా ఉట్టిపడు తున్నదా మొగాలలో, పాపం కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టా బ్రాహ్మడికా పిల్లలే అల్లారు ముద్దయి ఉంటారు. ఒక పక్క జాలి. ఒక పక్క హాస్యం. ఒక పక్క రసాభాస. అంతా కలగలిపి వర్ణిస్తాడు వర్ణించగలడు వికట కవీశ్వరుడు.

ఇలా తనయాలిని తనయాలిని ఇద్దరినీ గురించి పలవిస్తూ బయలుదేరి మొత్తానికి అనుకోకుండా నృసింహ క్షేత్రం చేరుతాడు. వాడు పడుతూ లేస్తూ పడుతుంటే ఎలా ఉందట. నేల మీద పడటం నీచమగు మేను పాఱవైచటా నికైతే మరలా పైకి లేవటం అధమలోకంబు విడిచి అమరపథం చేరటానికా అన్నట్టుందట. అంత దయనీయమైన స్థితిలో కూడా కవిగారిచ్చే హామీ వాడికి. ఇంతకూ అనాలోచితంగా వెళ్లాడు. వాడు సంగమ తీర్థంలో స్నానం చేశాడు. స్వామిని దర్శించాడలాగే. అదీ ఎలాగంటారు. 'ఒక యింత ఱెప్పవేయక చూచు

పెఱవారి తల గొట్టుకొని దుఃఖ జలధి మునుగు' దానవారా తికాబూని తడవ తార దశకంబు 'ముందుగానే తాల్చాడా అన్నట్టుందట వాడి వ్యవహారం. ఎలాంటివాడైనా పుణ్యాక్షేత్రంలో దుఃఖిస్తే పెరుమాళ్ల సారూప్యం రావలసిందే వైకుంఠ ప్రాప్తి కావలసిందేనని మన వైష్ణవ వికటకవి వ్యాఖ్య. ఇంకా కవిగారి వీరవైష్ణవ మెంత దూరం పోయిందో తెలుసా. మాతృవధ పితృవధ ప్రకటించిన మహానుభావుడు కూడా సురపుర నేతృత వహిస్తాడట. నయం ఈ నిగమశర్మ కనీస మలాంటి ఘాతుకం చేయలేదు పాపం. మరి వీడికి పారిషదులలో చేరే భాగ్యం కలగటంలో ఆశ్చర్యమేముంది.

చిత్రమేమంటే మహా తపస్సంపన్నులయి భగవత్సాక్షాత్కారాన్ని పొందిన వారు రాధా పుండరీకులు. వారిద్దరూ చేసిన తపస్సు అద్భుతంగా వర్ణిస్తాడు కవి. తరువాత తృతీయ చతుర్థాశ్వాసాలు చాలావరకు వారి చరిత్రే. మరి అంత తపస్సు చేత వారి సన్నిధికి వైకుంఠవాసుడు శ్రీకృష్ణ రూపంలో స్వయంగా వచ్చి సాక్షాత్కరిస్తే - ఏ తపస్సూ లేకుండానే ఈ నిగమశర్మ స్వయంగా వైకుంఠానికే వెళ్లగలి గాడు. ఏమిటి చిత్రం. వికటకవి నడిగితే చెబుతాడు సమాధానం. ఏమని. తపస్సంటే తపన చెందటమే. జీవితంలో అన్ని ఒడుదుడుకులూ పడి అందరినీ పోగొట్టుకొని అన్ని విధాలా భ్రష్టుడై ఎంతో పశ్చాత్తాపంతో క్రుంగిపోవటమూ తపస్సే. దానికి తోడు ఎప్పటికైనా ఒక పుణ్యాక్షేత్రం చేరి ఒక దేవతా మూర్తిని తదేక దృష్టితో దర్శించినా చాలు. సకల పాపాలూ సకల కష్టాలూ కడిగి పారేసినట్టయి పోగలవు అప్పుడదే తపస్సు. దానితో భగవల్లోక ప్రాప్తే ఫలసిద్ధి. అవి కవిగారు చమత్కారంగా చేస్తున్న పరిష్కారం.

పోతే కుమారుడి ప్రశ్నలింకా పరమేశ్వరుడు జవాబు చెప్పవలసి ఉంది అదేదోగాదు. తీర్థక్షేత్ర దైవతములు మూడూ వెలసిన మహా మహిమాన్వితమైన క్షేత్రరాజం. అదే పౌండరీక మహాక్షేత్రం. పుండరీకుడనే మహాభక్తుడి పేర ప్రసిద్ధమైనదది. పాండురంగ క్షేత్రమన్నా అదే పండరీక్షేత్రమన్నా అదే. అక్కడ మరణిస్తే చాలు పౌనఃపున్య జన్య వ్యవహారం లేదట. అది ఎంత గారంటీ అంటే చెబుతున్నాడు మన వికటకవి. కననీ గొడ్రాలు బిడ్డ న్గగన కుసుమముం గల్గనీ ఱాయి మాట ల్విననీ ముక్తుంరు వెండిన్ విపుల౮ బొడమనీ' - ఈ చెప్పిన వయినా సంభవమేమోగాని అది మాత్రం సంభవం కాదట.

పోనీ ఇంతగా వర్ణించాడు గదా. ఆ పాండురంగ క్షేత్రమేమిటో అందులో పుండరీకుడు చేసిన ఆ తపశ్చర్య ఏమిటో మనకు వర్ణించి చూపవచ్చు గదా. అలా చేస్తే వికటకవి ఎందుకవుతాడు. మరలా ప్రత్యక్షమయ్యాడు వికటకవి మనముందు. ఈ లోపల ఏమో కొంప మునిగినట్టు భూదేవి బయలుదేరి వైకుంఠానికి వెళ్లుతుంది. అసుర భారం భరించలేనని మొరపెడుతుంది. కృష్ణావతారం ధరించి వస్తానని అభయమిస్తాడావిడకు. బ్రహ్మదేవుడు కూడా సమయానికక్కడే ఉంటాడు. సరే కృష్ణుడిగా అవతరించాడు గదా. అప్పుడైనా ఆయనకు పుండరీకుడు గుర్తు రావచ్చుగదా. మన వికటకవి రానిస్తే గదా ఆ వికుంఠ నాథునికి. మధ్యలో రాధ జ్ఞాపకం వచ్చింది రామకృష్ణుడికి. మధ్యలో ప్రవేశించింది. దాదాపు ఎవరి కెవరూ గుర్తు రాకుండా. ఎవరావిడ ఇంతకూ. నందుడి మరిది శతగోపుడవే వాడికూరిమి. కుమార్తె అట. అయితే ఏమట. ఆవిడ వెన్నునకు మనః ప్రీణనంబు గావింప దలచిందట - అసలా కృష్ణుడి కోసమే కనిపెట్టుకొని కూచుంది. ఇక ఆవిడ నెలా వదలుకోవటం

కృష్ణుడూ వదలుకోలేదు. రామకృష్ణుడూ వదలుకోడు. పుండరీకుడనే పెద్దాయన విషయమెప్పుడైనా చూడవచ్చు ఈవిడ సంగతి ముందు ఆలోచిద్దామను కొన్నాడు. ఇక వర్ణిస్తూ పోయాడండీ ఆవిడ యౌవన మేమిటి తపస్సేమిటి - ఆయా ఋతువులేమిటి తన కవిత్వ ఖజానాలో ఎంత ఉంటే అంత విలువైన మణులూ మాణిక్యాలూ ధారాళంగా ఖర్చు చేశాడు మహాకవి.

అప్పటికీ వికటత్వ మెక్కడికీ పోలేదు కవిగారికి. మధ్యే మధ్యేపానీయ మన్నట్టు అక్కడక్కడా తొంగిచూస్తూనే ఉంటుంది రచనలో, వర్ణనలో చూడండి ఆవిడ కటి మండలం పృథివి అని సార్థకం చేసుకొన్నదట. అలాకాకపోతే పైన కాంచి మధ్యలో మాయ - నాభి ద్వారమని- ఎలా కనపడతాయని మనలను దబాయిస్తాడు కవి. మరి ఆ పద్మినికి దినకర తాపమెందుకు సోకలేదు- అంత తపస్సు చేస్తున్నా అని మనం ప్రశ్నిస్తే ఎలా సోకుతుందండీ శ్రీపతి యడుగుల గొడుగుల ప్రాపొదవిన వారి పని సమాధానమిస్తాడు మన వికటకవి. ఇంతలో ఋతువుల రాకపోకలు మారుతూ పోతుంటాయి. శరత్కాలం వచ్చింది. చెరువులలో నదులలో ఎక్కడి నీరక్కడ చక్కగా తేరుకొని తేటగా కనపడుతుంది. అది అగస్త్య నక్షత్ర ప్రభావం. అగస్త్యుడే ఒక కతకఫల మయ్యాడట. కతక అంటే చిల్లగింజ. అది వేస్తే నీరు తేరుకొంటుంది. అందుకే అగస్త్యుడే చిల్లగింజ అయ్యాడంటాడు కవి హాస్యంగా. మఱి భూదేవికి పాపట తీర్చిందెవరు. శకటౌఘ చక్రధార అట. బురదలో బండ్లు పోతుంటే వాటి చక్రాల గుర్తులేర్పడి ఎండ కాయగానే ఆ రేఖలు భూమాతకు పాపటకాక మరేమవుతుందంటాడు అంత కన్నా చమత్కారంగా.

ఆ తరువాత పుండరీకుడికి ప్రత్యక్షమైతే శ్రీకృష్ణుడు అతని నిర్వ్రీడ జఘన దేహం చూచి ఆక్రోశిస్తూ పరుగెడుతాడా వెట్టి బాపడు అది చూచి ఫక్కున నవ్వుతాడు జగన్నాధుడు – దానికి తిరిగి చూచి ఎక్కడ లేని భక్తి ఉదయించి.అంతకన్నా ఆవేశంతో మాలినే అది గాదు తరళమే గాదు భుజంగ ప్రయాతమే గాదు స్రగ్విణేగాదు లయగ్రాహే గాదుపృధ్వేగాదు అన్నిరకాల ఛందస్సులలో కీర్తిస్తాడా మూర్తిని. అది కూడా ఒక ఛాందసమే నంటాడు కవి. దానికి కారణం చాపలాతిశయ మట. అందుకే చర్విత చర్వణంబుగా పొగడుతూ పోయాడట. ఇదే వికటత్వమంటే. అది భగవంతు నీ వదిలిపెట్టడు. భక్తుణ్ణీ వదిలి పెట్టడు. అలాటిదీ ఆ హాస్య ధోరణి.

మహాపతివ్రత సుశీల కథే దానికి నిదర్శనం. అసలు సుశీల కథే కథ. తరువాత పంచమాశ్వాసంలో చివరి సారిగా వచ్చే అయుత నియుతుల కథే కథ. రెండూ రెండే జాతి రత్నాలు. పాండు రంగడికి వన్నె తెచ్చే రత్నశలాకలు. వికటకవి వికటాట్టహాసాని కనుప్రాసలు కూడా. సుశీల ఎంత సహనశీలో భర్త అంత కోపిష్ఠి దుర్వాసుడు. తాళి విభుండు కట్టిన మొదల్మగడు కొట్టినా తిట్టినా తాళి నిలిచిన దొడ్డ గరిత ఆవిడ. అప్పటికీ ప్రాణేశ్వరునే ఈశ్వరుడుగా భావిస్తుంటుందట. ప్రాణేశ్వరుడే ఈశ్వరుడు కాదు. ఈశ్వరుడే నీకలాస్తున్నా డనే రహస్యమావిడకు బోధించదలచాడా జగదీశ్వరుడు. ఇకవచ్చాడాప సోపాలు పడుతూ – మగడింట్లో లేడు. అయినా పరవాలేదతని కోసం కాదు గదా తన రాక. ఆ ముసలావిడ కోసం. ఆవిడ నుద్ధరించటానికి. వచ్చీ రాగానే స్వస్త్యస్తుతే అని ఆశీర్వదిస్తాడు. ఎందుండి రాక గ్రాసార్థిలాగా కని పిస్తున్నావు. అలా మొగసాలలో కూచోనాయనా.

నిమిషంలో అన్నం వండి పెడితానంటుంది. అంతదాకా నాకోపిక లేదు. ఏదుంటే అదే పెట్టు – మాడిందైనా పాసిందైనా చాలు పొట్ట నింపుకొంటా నంటాడు. ఆవిడ వెనకాడుతుంటే పెడతావా పెట్టవా అని నట్టింట వచ్చి బైఠాయిస్తాడు. చేసేది లేక ఆ మిగిలిన చద్ది అన్నమే వడ్డిస్తుంది. అది తిరిగి చూచే లోపల గుటకాయ స్వాహా చేసి చూడమ్మా మళ్ళీ ఒకసారి తప్పి దాటి ఏదైనా మిగిలి ఉందేమో నంటాడు. సరేనని తనకని వండి పైన అట్టుకలో పెట్టిన వంటకం తెచ్చి వడ్డిస్తుంది. అదీ ఆరగించి ఇంకా తెమ్మంటాడు. ఆవిడకు కొంచెం నవ్వు వచ్చి నాయనా చాలా శ్రమ పడ్డట్టున్నావు. అన్నం మాత్రమిక లేదు. క్రొత్త అట్టికలలో కజ్జాయాలున్నాయి పెట్ట మంటావా అని పెడుతూ ఉంటే అతడు తింటూ ఉంటే – తింటూ ఉంటే పెడుతూ వచ్చిందావిడ.

అవీ చెల్లేసరి కింకా ఆకలంటున్నాడే ఈ కుర్రవాడు 'మానిసి పుట్టువు గాదు మాయపు బిడ్డ దేవతా నాయకుడో చతుర్ముఖుడో నాభవ బంధము బాపనున్న నారాయణమూర్తియో' అని మనసులో తలపోస్తుంది. వెంటనే హుతాశనుణ్ణి ప్రార్థిస్తుంది. ఇక చూచుకోండి. ఒక కొన్ని వడియంబులొక కొన్ని పరుగులు – ఇలా ధారాపాతంగా వచ్చి పడుతుంటాయి వంట కాలేమిటి పిండి వంటలేమిటి. వంటశాల అంతా నిండిపోతుంది భక్ష్యభోజ్య పదార్థాలతో. అవన్నీ తిని ఇక చాలు. పరీక్ష అనుకొన్నాడో ఏమో వెంటనే నీలంబు భక్తాను కూలంబు హరిదంత చేలంబు నవనీత లోలమైన యదుకుల సరోమరాలమైన తన బాలకృష్ణ వేషంతో ప్రత్యక్షమవుతాడు. 'అమ్మా నీ హృదయ మారయఁగోరి' యిలా నీకు గాసి యొనర్చాను. నీవు చేసిన భాగ్యమే సతియు జేయదు. శబరి విందు కూడా నీ చేతి చలిదిని పోలదు. నాకు రుచి నీయదు. నీవు

పూర్వమొక గోవుజన్మ మెత్తిన దానవు. వాయు వశమున నీపాలను రువు వచ్చినా మౌళిపించముపై బడినది. నాకు క్షీరదానం చేసిన దానవు కాబట్టి నీకీ జన్మమున నా దర్శన మనుగ్రహించితిని. మరి నిన్ను పరీక్షించుటకే నీ పతి నెంత పండితుడైనా పాషాణ హృదయుడుగా సృష్టించి నీకు అంటగట్టితిని. అయినా నీవు అదే నీకు భాగ్యమని అతని ఆగడములన్నీ సహించి నాబోటి అతిధి అభ్యాగతుల నాదరిస్తూ వచ్చావు కాబట్టి ఇక మీదట అతణ్ణి సజ్జనుడిగా మార్చి నీ కాపురం మూడు పూలా, రుకాయలుగా అనుగ్రహించాను పొమ్మని అంతర్ధానమవుతాడా జగన్నాటక సూత్రధారి. ఇదీ ముక్తసరిగా ఆ సుశీల వృత్తాంతం.

ఇది నేను చెప్పటం మీరు వినటం కాదు. రామకృష్ణ కవి ఏమి వ్రాశాడో ఏమి వర్ణించాడో అది ప్రత్యక్షరమూ వినాలి మనమంతా. ఆ ముసలావిడ పెనిమిటైనా అంత గొడవ చేశాడో లేదో గాని ఆవిడ నా కుహనా వటువు పెట్టిన అలజడి ఇంతా అంతా కాదు. వామనమూర్తి బలిచక్రవర్తి సంవాద మెటుపోవాలో అనితర సాధ్యమైన హాస్యమూ చమత్కారమూ అడుగడుగునా తొంగి చూస్తుంది రచనలో. ఇక తెలుగు సామెతలూ సంస్కృత లోకోక్తులైతే కుప్పతెప్పలు. అసలిదంతా కాదు. రామకృష్ణుడిలో రాముడలా ఉంచి కృష్ణుడే బయటికి వచ్చి కొనా మొదలూ అల్లరి చేస్తూ వచ్చాడా అనిపిస్తుంది. బహుశా మన వికటకవి కొక నాయనమ్మో అమ్మమ్మో తన చిన్నవయసులో పెద్ద వయసు దొక పెద్దావిడ ఉండి ఉండాలి. చిన్నతనంలో ఆవిడ నదీ ఇదీ పెట్టమనీ పెడతావా లేదా అని బహుశా మారాము చేసి ఆ ముసలావిడ ప్రాణం తీసి ఉంటాడు. ఆవిడ కూడా పాపం కుర్రవాడు గదా పోనీ లెమ్మని ఎంతో గారాబంతో పిట్ట నడిగిపిల్లి నడిగి తెచ్చి ఇచ్చి ఉండా లీ అల్లరి

కవి తల్లజుండి కవీ ఇవీ తినుబండారాలు. తన స్వానుభవమే ఇలా కథావ్యాజంతో ఆవిష్కరిస్తూ వచ్చాడా అని తోస్తుంది నాబోటి వాడి కా రచనా ధోరణి చూస్తూపోతే. మొత్తంమీద అవ్వా మనవళ్ల గారాబాలు భక్తురాలి కీ భగవానుడికీ ముడిపెట్టి ఎంత ముద్దుగా వర్ణించాడో చెప్పనలవిగాదు. సహృదయుల మనసు మీద ఎంత చెరగని ముద్ర వేశాడో వికటంగా వర్ణించటంలో ఎంత భక్తి భావాన్ని ప్రకటం చేశాడో తలచుకొన్నప్పుడల్లా నాకు ఒళ్లు జలదరిస్తుంది. ఆ పొట్టి వడుగు పట్టుదల మనసును పట్టినట్టవుతుంది.

మరి ఇదేమి చూచావు నా కవితలోని తడాఖా మరొకటి చూపుతా చూడమని ఇంకా మహోద్భుతంగా వ్రాసిన కథ ఒకటుంది కవి గారిది అయుత నియుతల కథ. అది పంచమాశ్వాస మంటే ఆఖరి ఆశ్వాసంలో ఆఖరిసారిగా వచ్చే కథ. అంతకుముందెన్నో ఉన్నా యనుకోండి చిన్న చిన్నవి. ఒక కాకీ ఒక హంస, ఒక చిలుక ఒక పాము. ఒక తేనెటీగ ఇలాంటివీ – ఒక గంధర్వుడనీ ఒక కిరాతుడనీ ఒక ధర్మనందనుడనీ ఇలాంటివి కూడా వస్తాయి కథలు. అవన్నీ ఆయా పుణ్యతీర్థాలూ క్షేత్రాల మాహాత్మ్య మెటువంటిదో దాన్ని చాటి చెప్పటానికే మరెందుకూ గాదు చూడండి. చివరకు మానవులే గాదు మహర్షులే గాదు పరమ నికృష్టమైన జన్మ ఎత్తిన ప్రాణులు కూడా ఆయా పుణ్యక్షేత్రాలు దర్శించినా అనుకోకుండా అలాటి చోట్ల మరణించినా వైకుంఠుని కరుణా కటాక్షానికి పాత్రులయి మోక్ష సుఖమనుభవిస్తారని వైష్ణవ భక్తి వైశ్వరూప్యాన్ని ధ్వనింప జేయుటమే కవి హృదయం.

పోతే వీటన్నిటికీ తలమానిక మీ అయుత నియుత చరిత్ర. సుశీల చరిత్ర అవ్వామనవళ్ల వాత్సల్యమెలాంటిదో జూపితే ఇది గురుశిష్య

వాత్సల్య మెలాటిదో మనకు ధ్వనింపచేస్తుంది. అందులో వికటకవి గారి బాల్య చాపల్యం మనకు వ్యంగ్యంగా స్ఫురించినట్టే ఇందులో కవిగారి విద్యార్థి దశా గురుశుశ్రూషా గురుశిష్యుల అనుబంధమూ అప్పుడప్పుడు గురువుగారికి శిష్యుడి మీద కలిగే ఆగ్రహమూ – అయినా చివర కనుగ్రహమూ ఇలాటి భావాలన్నీ కొట్టవచ్చినట్టు కనిపిస్తాయి. చూడబోతే రామకృష్ణ డగస్త్యుడి లాగా ఒక గురువు హోదాలో నైనా పనిచేసి ఉండా లెప్పుడైనా. లేదా అయుత నియతులలాగా అలాంటి గురువుగారి దగ్గర విద్యాభ్యాసమైనా కొనసాగించి ఉండాలనిపిస్తుంది నాకు. అగస్త్యుడంటేనే చండ ప్రచండుడు. అందరొక ఎత్తు అగస్త్యుడొక ఎత్తనేది లోకంలో నానుడి. అతడు చేసిన ఘనకార్యాలెన్నైనా ఉన్నాయి – మరే మహర్షీ ఊహించలేని మహిమలవి ఎవరోగాదు. సాక్షాత్తూ దేవతా జ్యేష్ఠుడైన బ్రహ్మదేవుడే ఇచ్చాడాయన గారికి కితాబు. అగస్త్యుడు తన శిష్యుల కోసం బ్రహ్మ లోకానికి వెళ్లినప్పుడాయన గారీయనగారి నేమని పొగడుతాడో తెలుసా.

హుంకారములు లేవె యుపపురం దర హతో
త్పాటనంబునకు పాల్పడవు గాక
భ్రూభంగములు లేవె యాభీల వింధ్యగ
ర్వస్తంభనమునకు రావుగాక
చులుకా కృతులు వేనె జలరాశి నిశ్శేష
శోషణ క్రీడకుc జూరపు గాక
జాతరాగ్నులు వేలె జటితాపి వాతాపి
తనుదాహమున కెదుర్కొనవు గాక

ఇదీ ఆయన ఇచ్చిన కితాబు. ఒక్క హుంకారం చేసేసరికి నహుషుడి లాంటి వాడింద్రపద వి నుంచి జారిపడ్డాడు. ఒకసారి కనుబొమలు ముడిచావో లేదో అంత ఎత్తులకూ పెరిగిన వింధ్య పర్వతం కూడా దిగి వచ్చి నేల గరచుకొన్నది. మరి పుక్కిలి పట్టీ పట్టగానే అంత పెద్ద మహాసాగరాలూ నీ కడుపులో ఇంకిపోయాయి గదా. ఇక నీ జఠరాగ్ని అంటావా. వాతాపేమిటి ఇల్వలుడేమిటి గొప్ప గొప్ప రాక్షసులే అందులోబడి జీర్ణమైపోయారు. నీతోపాటు తిరిగే విశ్వామిత్ర దుర్వాసుః ప్రభృతులెవరు చేశారింతటి పుణ్యకార్యాలింతటి లోకోపకారాలని ఆ పితామహుడి ప్రశంసలే అందుకొన్న మహా మహిమాన్విత డగస్త్యుడంటే. ఒక మహర్షి చేసిన పనులు చూడండి ఎంత చక్కగా ఎంత చమత్కారంగా వర్ణన చేస్తాడో రామకృష్ణుడు.

అయితే మరి ఈ అగస్త్యుడెందుకు వెళ్లినట్లు ఆ బ్రహ్మ లోకానికి. పని లేకకాదు. కారణముంది దానికి. అదేదోగాదు. తన శిష్యులు అయుతనియుతులకు పెండ్లి సంబంధం మాటాడటానికి. ఏమి పెండ్లి కూతుండ్లు భూలోకంలో దొరక లేదా అంత దూరం పయనమై పోవటానికి. వారలకు తగిన మగువలు ధారుణిలో లేరట. కాని ధాత్ర తనయ లిద్దరున్నారని తెలిసిందాయనకు. వారాపాటికి పెండ్లయిన వారేమో. కారు. సకరగ్రహణలు కారట. అయినా అడిగితే ఇస్తాడా ఆ పితామహుడు ఇవ్వక ఏం చేస్తాడు. కొని వత్తు కమలజు చేతన్ అంటాడు. ఎంత ఆత్మ విశ్వాస మా ఋషిది. చెప్పక చెబుతున్నాడు కవి తన వ్యంగ్యధోరణిలో ప్రతి ఒక్కటీ - మరి అలాంటి గురువుగారికే పని పెట్టారంటే ఆ శిష్యులిద్దరూ ఎలాంటి వారయి ఉంటారో మీరే ఊహించండి. మన మూహించక ముందే బయట పెడుతున్నాడా మహర్షి తన అభిప్రాయం.

ఈనా శిష్యుల లోన వీరిరువురున్ హృద్యానపద్యోదయ
జ్ఞానానూన విచార వాగ్విభప తేజః క్షాంతి కాంతి ప్రధా
సానాధ్యం బున గాని పించెదరు – ఇద్దరూ ఇద్దరే మెరికల లాంటి వారు. శిష్యుల కుండవలసిన మంచి లక్షణాలన్నీ ఉన్నాయి. ఒకటి ఒకకొఱతలేని జ్ఞానం. రెండుదానికి తగిన విచారణ. మూడు విచారణకు తగిన వాక్పాటవం. నాలుగు దీనికి తగిన శమదరూది సంపత్తి. పోతే ఈ గుణాలన్నిటికీ తలమానికమైన గురు భక్తి. ఇంకేమి కావాలింతకంటే. కనుకనే అంత వాడి మనసు నాకర్షించగలిగారు. అది ఎంతవరకు పోయిందంటే ఆకర్షణ వారిద్దరికీ మంచి కన్యలనిచ్చి పెండ్లి చేస్తేగాని తృప్తి లేదా గురువుగారికి. అందుకే ధాతగారి కూతుళ్లను తెచ్చి అంటగడదా మనుకొన్నాడు. ఎవరోగాదా పెండ్లికూతుళ్లు. ఒకతి గాయత్రి, ఒకతి సావిత్రి. ఇద్దరినీ తెచ్చి ఇద్దరు శిష్యులను చేసుకో మంటాడు. కాని నియతుడొప్పుకొన్నా అయుతుడొప్పుకోడు. ఒప్పుకోక పోతే ఇద్దరినీ నియుతుడికే ఇచ్చి పెండ్లి చేస్తాడు. అయుతుణ్ణి కోపం వచ్చి ఎలాగో శపించలేదు గాని ఆశ్రమం విడిచి పొమ్మని వెళ్లగొడతాడు. అంతటితో పోనిచ్చాడదే మహాభాగ్యమని బయటపడి ఆ శిష్యుడిలా తలపోస్తాడు తన మనసులో.

ఉర్వీధరము లెక్కి యుఱుకనే కుచకుంభ
యుగ మొల్లగాక తాను నుఱుంకు మనిన
కొండలెక్కి క్రిందికి పరుగెత్తమన్నా పరిగిడుతా గాని
ఆడుదాని చనుగొండలా – అమ్మో ఎంత భయంకరం
వాడికైదువులపై వ్రాలనే నిడుచూపు
డాలొల్లగాక తావ్రాలు మనిన

వాడికత్తుల పైన నడవమన్నా నడుస్తాగాని దాని వాలుజడ తడవమంటే అబ్బో ఎలా తడవగలను.

మున్నీట సుడివడ మునుగనే నతనాభి
గననొల్లగాక తామునుగు మనిన

ఆఖరుకు సాగరమైనా దిగి పొమ్మంటే ఎంత లోతుకైనా దిగుతా గాని దానికన్నా లోతైన కన్యల నాభిరంధ్రమైనా మునగటం కాదసలు. కనలేనసలు. ఇలాటి పనులంటే చేయలేదు గాని గురువుగారు పురమాయిస్తే వేరే పనులేవి చేయను నా తను మవః ప్రాణాలన్నీ ఆయన సొత్తే గదా. కాని వద్దు మొర్రో అంటే మెడకొక లింగం కడతానంటా డేమిటి. మరి నా మిత్రుడంటారా 'నెయ్యుడిట్టి పనికి నియతుండతగు' నని మరలా గురువుగారి మీద ఎనలేని భక్తి - సహాధ్యాయి మీద అనురాగమూ - రెండింటికీ తక్కువ లేదా పసివాడికి. చూచారా అగస్త్యుడి లాంటి చండకౌశికుడికి కూడా తన మాట వినలేదని ఆగ్రహం రాలేదంటే అగస్త్యుడి శమదమాదు లెలాంటివో మనకు భంగ్యంతరంగా సూచిస్తు న్నాడు మహాకవి.

ఇంకా ఒక చమత్కార మేమంటే రామకృష్ణుడిలో. అయుతుడు పెండ్లి చేసుకోనని భీష్మించుకొని భీష్మమైన తపస్సు కుపక్రమిస్తాడు. అతణ్ణి పరీక్షించటాని కెవరో పంపించినట్టు ఇంద్రుడొక వృద్ధ వేషంలో ప్రత్యక్షమవుతాడు. 'అఖిల ధర్మంబులందు గార్హస్థ్య మెన్న నుత్కటంబని తీర్థయాత్ర చేస్తూ వచ్చానని మధ్యలో 'పచ్చవిల్తుగన్న తండ్రి పాండురంగ విట్ఠలుని కూడా సేవించాలని వెళ్లుతూ నీ ఆశ్రమానికి వచ్చాను దారి మార్గంగా నని ఉపన్యసిస్తు - సరేగాని ఏమిటీ వయసులో ఈ తపస్సుని ప్రశ్నిస్తాడు. అతడు జరిగినదంతా ఏకరువు పెడతాడు. 'శపియింపగ

దలచియు నత్తపసి యుడిగె కఱపఁదలచి తానెయుడుగు పాము పగిది' అని తనమీద గురువుకు కలిగిన ఆగ్రహమూ అనుగ్రహమూ రెండూ బయటపెడతాడు. దీన్నిబట్టి అర్థమవుతుంది. మనకా గురుశిష్యుల అనుబంధ మెంత గాఢమైనదో.

మరి దేవేంద్రుడూరక పోనిచ్చాడా. అంతా విని నీ తలంపేమీ బాగా లేదబ్బాయీ గృహస్థాశ్రమమంటే ఏమనుకొన్నావు. పరాశరాదులైన మహర్షులే బోల్తా పడ్డారు ఆడుదాని వలలోబడి. తత్త్వవేత్తలైన జనకాదులు వివాహం చేసుకోలేదా. కలలో వార్తలు విప్పి చెప్పినట్టు పురాణ గాథలు చెప్పవచ్చునేగాని చెప్పినట్టు చేయగలరా అని వ్యాసభగవానుడి లాంటి వాడికే ఎసరు పెడతాడు మాటల్లో. గృహస్థుడు ఏ తపస్సు చేయక పోయినా ప్రపంచమంతా తనదిగా చూస్తూన్న గొప్ప తపస్వి. ఇంతకూ హరిభుక్త మాత్మ భార్య భక్తినిడ భుక్తిగొను చున్కి ముక్తిగాని. 'నిదుర వంటిది లాయి వంటిదియు గాదు' ముక్తి అంటే.

ఇలాగా ఎంత లొంగ దీద్దామన్నా లొంగడా ముని బాలకుడు. పైగా ఒకటికి పది పదింటి కొకటిగా తన యుక్తులకు ప్రత్యుక్తులిస్తూ గృహస్థ ధర్మంలో ఉండే లోటు పాటులు చూపుతాడు. 'వ్యాస సుతాదులందలచి వాసికి మంగలి కత్తమింగుతున్నావు బొందితో కైలాసం చెందుదామని చూస్తున్నావు దెబ్బ తింటావని కూడా బెదిరిస్తాడా వృద్ధుడు. అయినా వీడి మొండితనాని కాట కట్టించాలని తన కామధేనువు నక్కడ వదలి అయుతుణ్ణి వీడు కొని వెళ్లిపోతాడు. మరి ఎలాంటిదా ధేనువు. కామధేనువుగదా. చెప్పిన మాట వింటుంది. చెప్పినట్టు చేస్తుంది. ఉన్నట్టుండి అది ముసలిదయింది. చేతగాని తనాన్ని కావాలని అభినయిస్తూ ఉంది ఆ యతుడి ఉటజప్రాంగణంలో. ఎలాగో వర్ణిస్తున్నాడు వినండి వికట మహాకవి.

ఉద్యదుత్థాన సముద్యోగ మాత్రావ
శిష్టచేతస్సార – దష్ట దర్భ
క్షతి కృదుగ్ర ధ్వాంక్ష తతి నివారణ విధా
త్వరమాణ వాలాగ్ర – దంశపిహిత
ఆదృతా ధశ్శయనారంభ విస్రంభ
గళకంబళా భోగ – కాతరాక్షి
నేక పార్శ్వ స్థితి స్వీకార నిర్భగ్న
చరమోరుతరశల్య – సాంద్రబాష్ప – ఇలాంటి దాన్ని చాలా దయనీయమైన స్థితిలో చూస్తాడా ధేనువు నా కుర్రవాడు. ఎంత దయనీయమంటే మనమే నమ్మలేమిది కామధేనువు మాయ అనీ నటన మనీ. అంత గొప్పగా కళ్లకు కట్టినట్లు వర్ణించాడు రామకృష్ణ కవి. అతని కవితా పాటవమెంత ఉన్నదో అంతకంతా పట్టి ఇచ్చే గొప్ప అమూల్యమైన కోహినూరు వజ్రంలాంటి పద్యరత్నమిది. మన తెనుగు సాహిత్య గ్రంధాలన్నిటిలో అక్కడక్కడా కనిపించే చాలా గొప్ప పద్యాలలో ఒకటిగా చెప్పుకోవలసిన ఒకానొక గొప్ప పద్యమిది.

పైకి లేద్దామని ఎంతో ప్రయత్నిస్తుందట ఆ గోవు. అక్కడికే దాని సత్తా ఆగిపోయి కూలబడి గడ్డిపోచ కరుస్తుందట. కాకులన్నీ దాని ఒళ్లంతా గుల్ల చేస్తుంటే వాటి నెప్పటికప్పుడు తోలాలని ప్రయత్ని స్తుందట. అయినా కణుదురులు వచ్చి కప్పేస్తుంటాయట ఆ తోకను. క్రింద పడుకొందామని పడుకోబోతే మెడ క్రింది గంగడోలు నేల సోకుతుందట. పడుకోలేక దీనంగా చూస్తూ నిలబడిపోతుందట. మరి ఒక ప్రక్కనే ఒరిగి నిలిచి ఉండబోతే కాలి ఎముక విరిగి పడిపోతుంది. చేసేది లేక కండ్లనీరు కారుస్తుందట. ఒక జంతువు దీనావస్థ చూడండి

ఎంత వర్ణిస్తున్నాడో. ఒక పక్క మన మనస్సు ద్రవించేలాగా ఉంటుందీ వర్ణన వింటుంటే. మరో పక్క వికటకవి వెటకారం కూడా కని పిస్తుంటుంది వ్యంగ్యంగా ఎలాగంటారు. ఆ ధేనువు అసలైన ధేనువైతే గదా ఇంతకూ అది ఒక మాయగవి అని కవిగారే కితాబిచ్చాడు దానికి. అంచేత పైకి లేవబోవటమూ నటనే – కాకులను పిట్టలనూ తోలుతూ పోవటమూ నటనే. లేవలేకపోయినా గర్భపోచ కఱవటం మాన లేదా గోవు. కాకులను తోలినా వనదంశాలు మూగుతూనే ఉన్నాయి తన్ను. అలాగే కళ్లు తేలవేయటమూ కన్నీరు కార్చటమూ ఏదైనా నటనేనా అనిపిస్తుంది తరువాత దాని విజృంభణ చూస్తే.

అసలీ వ్యవహారమంతా ఈ పద్య రచనలోనే చూడండి. కవి ఎలా ధ్వనింప జేస్తున్నాడో. ఉద్యదుత్థాన – చేతస్సార వరకూ ముప్పాతిక సీస పాదం ఒకే ఒక సమాసాడంబరంతో పట్టుగా నడుస్తుంది. అలా నడుస్తూ చివరకు దష్ట దర్భ అని సవసవగా చచ్చుపడి తేలిపోతుంది. ప్రతిపాదమూ ఇంతే క్షతి కృదుగ్రధ్వాంక్ష – దంశపిహిత – ఇలా మీరు చదువుతూ పోయారంటే మీకే తెలుస్తుందా రచనా ధోరణి. ఇది ఒక గొప్ప రచనా శిల్పం. ఎంతో ప్రయత్నం చేస్తున్నట్టు మొదట కనిపిస్తుంటుంది. చివరకది నీరుగారి పోయినట్టు తోస్తుంటుంది. రెంటికీ ఉన్న తేడా కొట్టవచ్చినట్టు చూపుతుంది రచన.

తరువాత ఆ గోవుకు అయుతుడు చికిత్స చేస్తూ దానికిచ్చిన పచ్చిగడ్డి మేత తాగటానికిచ్చిన నీళ్లు ఎలాంటి వనుకొన్నారు. అది ఎంత లేగడ్డి అంటే చేతో జహయచ్ఛాయా చిలుక వాలినా సహించలేదా బరువు. చిలుక గాదు గదా దాని నీడ పడ్డా భరించలేనంత లేత పచ్చికట. వినిర్ధౌత కలధౌత – బాగా నీటిలో కడిగి తళతళ మెరిసే వెండి కడ్డీలాగా

అతి తెల్లని స్వచ్ఛమైన నీరట అది. ఎంత ముద్దుగా ముచ్చటగా ఉందో ఈ అలంకారం గానీ ఈ వర్ణనగానీ. ఇంత నాజూకు తిండీ తీర్థం దానికి సప్లై చేశాడంటే దాని దర్జా చూడండి అని కవి మనకు చెప్పటంలో ఎంత చమత్కారం.

సరే అంతా అయిందా. తరువాత అది ఏకుమేకయి ఆ బ్రహ్మచారి కొంప తీస్తుంది. చివరకతడే దాని ఆగడాలు భరించలేక వెళ్లగొడతాడు. దాని వెంటబడి తరుముతుంటే అది వాధూల ముని తపస్సు చేసే పుట్టమీది నుంచి పరుగెడుతుంది. అప్పుడేమవుతుందో తెలుసా.

మట్టిన బిట్ట మిట్టి మౌని పట సముత్థితుడయ్యె లేచాడామహర్షి. ఎలాగంటారు **'మేనిపై బెట్టిన పుట్టనెట్ట విసిబీటలు వాఱ - శ్రవశ్శకుంత ముల్బట్టుప లెత్తి ముందటి కి సాగఁదలంప - జటాచ్ఛటా చ్ఛవింద్రుట్టిలు గట్టి నిద్రిలు మరుద్భుగ ధీశకుంలంబు మేల్కొనన్** - ఎంత అద్భుతమో పద్య రచన. ఒంటిమీద పేరుకొన్న పుట్ట విరిసిపోయింది. చెంపలమీది నుంచి పక్షులు రెక్కలు లాడిస్తూ ఎగిరిపోయాయి. జడలలో కాపురమున్న పాములు ప్రాకుతూ ఎక్కడికో పోయాయి. ఏమిటీ హడావుడి. అంత దారుణమైన తపశ్చర్యలో ఎంత ఆశ్చర్యకరమైన చమత్కారం - ఎంత వెటకారం. వెటకారం కాకపోతే పక్షులూ పాములూ గూళ్లు కట్టుకొని చుట్ట చుట్టుకొని కాపురాలుండట మేమిటి ఆ మహర్షి శరీరంలో.

ఇదుగో ఇలాగే ఉంటుంది వికటకవి రచనా వికటత్వమంతా. కావ్యారంభం నుంచి కావ్యాంతందాకా ఇదే ధోరణి. కథా వస్తువు చూస్తే క్షేత్ర మాహాత్మ్యమని పేరు పెట్టి బ్రహ్మదేవుని దగ్గరి నుంచీ కప్పలూ పాములూ పక్షులూ కీటకాల వరకూ జీవుల కందరినీ ఒక గాట కట్టి వేస్తాడు. వర్ణనలు చూస్తే వైకుంఠం కైలాసం దగ్గరి నుంచి భూలోకంలో

అడవులూ కొండలూ కొండ బిలాల వరకూ దానికే ముడిపెడతాడు. ఇక ఏ పాత్రనైనా సరే అది దేవతా మహర్షా మానవుడా – అందులోనూ పతితుడా పావనుడా గృహస్థుడా బ్రహ్మచారా జంతువులా, పక్షులా అన్నీ ఒకటే కవిగారికి. అందరినీ ఆయా సూటిపోటీ మాటలతో ఒక ఆట పట్టించాలిసిందే. వదలిపెట్టడు. ఇంతెందుకు.

అసలు మన వికటకవి మాటలే చాలు. మణులు మాణిక్యాలే మాటలు. చాలా చిత్రంగా చమత్కారంగా అక్కడక్కడా వెటకారంగా కూడా కనిపిస్తుంటాయి. కవిగారి వ్యక్తిత్వమలాంటిది. Style is the man. అన్నారు పాశ్చాత్య సాహిత్య విమర్శకులు. అది మన మహానుభావు లందరికీ అన్వయించే సూత్రం. చూడండి. వామనమూర్తి త్రివిక్రముడైతే ఆయన అరికాలికి పుట్టుమచ్చ అయిందట భూమండలం. ప్రతిదినం వెంట్రుకలు కత్తిరించుకొని కురు బోడతల అయినా శిఖిపించ వల్లి వదల లేకపోయిందట బుద్ధావతరం 'ఛత్రిత శేషుడట శేషశయనుడు. విష్ణువు. అన్నమూ పప్పు ఎలా కనపడతాయి కవికి – కలధౌతపు కూడు – పసిండి పప్పు – అహర్పతి కాదు సూర్యుడు ఘస్రపతి కవిగారికి. అంశేందుద్వహ అమ్మవారు అర్ధేందు ధారిగాదు. బాలుడైనా ప్రహ్లాదుడు భక్తి వృద్ధుడు. కార్తార్థ్యమంటే కృతార్థత్వం. కృశోదరి గాడు తలినోదరి. అంభోరుహ భ్రూణుడట బ్రహ్మదేవుడు. సుషుమ్న యీనిన పిల్ల వెలుగులు నారదుని జడలు. తెగిన చుక్కలా బాగా వస్తుంటా డెక్కడికైనా. అంతేకాదు కంపలఁబడ్డ కాకిలాగా తిరుగుతుంటాడట. ఆది కపి వృషా కపి. ఎవడు – బలభిన్ముఖా మరులు కూడా తండు సువర్ణడండ ముఖతాడన భిన్న కిరీటులేసుమా. సిగ్గు వాసిన కటి పాండురంగడు. వేదముల్వోసిన గాదె నిగమశర్మ తండ్రి. వాడి పేరు నిగమశర్మగాడు. అది నేతి బీరకాయ.

పెద్దవారి ఆస్తులు చీమవలె కూడబెట్టినవి. మరి వీడో పాయ బాటిన కూడు – నీర్వట్టు మడుగు. కుశేశయ పౌత్రుడట నారదుడు. ఎంత గొప్ప బిరుదు. డుంఠి. నామ కగజానికి ఆలాన మట కాశీ పట్టణం. అమిత పిశాచ భర్త రాజశేఖరుడా. పెను గొల్లడా శ్రీపతి. ఏమి అన్యాయం. వ్యావహారిక సత్యత్వంబు ప్రకటించు ప్రపంచంబు చేత పంచితు' లంటాడొక చోట. ఎంత విశిష్టమైనా అద్వైత భావమెక్కడ బోతుంది రామకృష్ణుడికి. అంతేగాదు. మాయా శబలితుండగు జీవ పురుషుడని మరి ఒక అద్వైత భావం. సగుణ గుణాత్మ కూడా అద్వైతమే. మరి దేవుడి విగ్రహమేమిటో తెలుసా. విజ్ఞానవంతులైనవారు శిలగాగ దలచరు. దృష్టి గోచర బ్రహ్మమని చూస్తారట. ఎంత గొప్ప సమన్వయం. విట్ఠలయ్య ఎవరోగాదు. కొయ్యవిట్ఠలయ్య. కొయ్యలగోపి అన్నట్టుంది మాట. పుణ్యం పరకాని యంత చేస్తే చాలు. మేరువంత ఫలం. ధూళిః పరగృహాదపి అనే వాడెంత లోభి. కూడు దొరకకుంటే కూటి కలలే వస్తుంటాయి క్షుధాతురుడికి. ఆవలివారి చేతికంది యిచ్చినట్లుంది. అందినట్టు మ్రింగి మీదులు చూస్తున్నారట స్వామి. శ్రీలతావాలమూ తల్పిత వ్యాళమూ కృష్ణస్వామి. ఏమీ వర్ణన. కుప్ప, చిచ్చిడి ప్రేలాలు కొఱుకుతాడు. కడకు నెంగిలి చేతకాకి సేయడు పరమ లోభి ఒకడు. చంద్రముఖి కాదు ధవల కిరణ ముఖి. మాయా విలసితంబు నెసకంబున నిజప్రతి భాసంబున యాధార్థ్య భూమిక నభినయించుచు – మరలా ఎంత అద్వైతాభిమానం కవికి. మిహికా ఘృణి ఎవరు చంద్రుడా. చంద్రుడే. భక్తి గౌరవము నిచ్చెనయై చన నిస్తుంది మీది లోకాలకు. అవతీర్ణ గర్వవిద్యాధరుడట ఒక విద్యాధరుడు. మరి ఈ పుంగ్రామణి ఎవడో. పురుషోత్తముడేనా. హరిభక్తియను గంగ కడ్డమే కపటపు ఇసుక చేగట్టిన యసదు కట్ట. నిజమే.

... ఎవడు నారదుడా కాబోలు.

ఇలా పద్యాలకు పద్యాలే ఉన్నాయెన్నో మచ్చుతునకలు. ఏది చూచినా ఎంతో చిత్రం. ఎంతో విడ్డూరం. ఎంతో చమత్కారం. మళ్లీ ఎంతో భక్తిభావం. ఉట్టిపడుతుంటుంది. వక్రోక్తిః కావ్య జీవితమన్న కుంతకుడికి వాక్యానికి ఒక గొప్ప వ్యాఖ్యానమా అనిపిస్తుంది రామకృష్ణకవి వికటకవితా ప్రస్థానం. అందులో ఎన్ని కళలో ఎన్ని చెలుకులో ఎన్ని శాస్త్రాల గుబాళింపులో చెప్పలేము. సహృదయులైన పాఠకులు శ్రవణం కాదు. ఎంత శ్రవణమో అంత పఠనం చేయాలి. నా మాటలు శ్రవణం చేస్తే ఎలా. కవిశేఖరుని కావ్యాన్ని పఠనం చేయవలసింది. అప్పుడే దాని ఘటన మేమిటో పదహారు కళలతో స్ఫుటనమవుతుంది. సందేహం లేదు.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ధూర్జటి శివతాండవము

ఇంతవరకూ ఒక వికటకవి కవితా మాధుర్యాన్ని చవిచూచాము. ఇప్పుడొక ప్రకట కవి కవితా సుధ నాస్వాదించబోతున్నాము. అతనిది వికటమైతే ఇతనిది ప్రకటం. అతడు వైష్ణవాభిమాని అయితే ఇతడు శైవమతాభిమాని. పాండురంగ విట్ఠలుడాయనకు లక్ష్యమైతే కాళహస్తీశ్వరుడీయన ఏకైక లక్ష్యం. ఆయన దృష్టి ఎంత వైష్ణవం మీద ఉన్నా అప్పుడప్పుడు శైవతత్త్వం మీద కూడా ప్రసరిస్తూ పోతుంది. ఇతని దృష్టి అలాంటిది కూడా కాదు. శివతత్త్వమంటే శివతత్త్వం. వైష్ణవాన్ని కన్నెత్తి చూడనైనా చూడడు. ఈశ్వరాన్య కథా బధిరుడు.

కాని ఇద్దరూ ఒక విధంగా అద్వైతులే. విశిష్టాద్వైతులు. వైష్ణవ విశిష్టాద్వైతులొకరైతే – శైవ విశిష్టాద్వైతులు మరొకరు. ఎక్కడ ఏది వర్ణించినా ఎంత దూరం వర్ణించినా అన్నీ తెచ్చి చివరకు నదీనాం సాగరో గతిః అన్నట్టు ఒకరు విష్ణువుకు మరొకరు శివునికీ ముడిపెట్టనిదే

నిద్రపోరు. సమస్త సృష్టినీ విష్ణుతత్త్వంలో రామకృష్ణుడు చూస్తే శివతత్త్వం లోనే దర్శిస్తాడు ధూర్జటి. సగుణమైన అద్వైత మిది. ఇది శాస్త్ర దృష్టి అయితే దాన్ని కవితామృతరస ప్లావితం చేసి మనోరంజకంగా ప్రదర్శించటం వారివురి కావ్య నిర్మాణ వైభవం. అందులో రామకృష్ణుడి రచన హాస్యరస మిశ్రితమైన భక్తి అయితే ధూర్జటిది అమిశ్రితమైన పరిశుద్ధ భక్తి భావం. అలాగని కేవలం శుష్కమైన రచన కాదది. అక్కడక్కడ తీవ్రతతోపాటు మార్దవం కూడా కలిసే ఉంటుంది.

చిత్రమేమంటే వీరిద్దరూ తమ కావ్యాలు కృష్ణదేవరాయల కంకితమివ్వలేదు. ఒకరు విరూరి వేదాద్రి మంత్రికిస్తే ఇంకొకరు ఏ మంత్రికీ గాక పరమేశ్వరాంకితమే చేశాడు తన ప్రబంధాన్ని. మరి రాయల కాలంలోనే విరాజిల్లిన అంత మహాకవులే అయితే ఆయనగారి కెందు కంకిత మివ్వరు. కనుక రాయల కాలానికి చాలా చిన్న వయసు వారైనా అయి ఉండాలి లేదా తరువాత వచ్చిన వారైనా కావాలి. కాని ఆశ్చర్యమేమంటే రామకృష్ణుడు ధూర్జటిని గురించి చెప్పిన చాటు పద్యమొకటి చాలా ముచ్చట గొలుపుతుంది.

'స్తుతమతియైన యాంధ్ర కవి ధూర్జటి పల్కులకేల గల్గెనో యతులిత మాధురీ మహిమ – అని రాయలొకనాడు తన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చితే **– హా తెలిసెన్ భువనైక మోహనోద్ధత సుకుమార వార వనితా జనతా ఘనతాప హారి సంతత మధురాధ రోదిత సుధారస ధారలు గ్రోలుటంజుమీ'** అని రామకృష్ణుడా పద్యాన్ని పూరిస్తూ ఆశువుగా దానికి సమాధానం చెప్పాడని ఇతిహ్యం. ఇది రాయలనూ రామకృష్ణునీ ధూర్జటినీ ముగ్గురి జీవితాలనూ కలిపి ముడిపెట్టిన సన్నివేశం. ఇది కట్టుకథ అయినా అద్భుతమైన వర్ణన. ఇందులో ఒక సత్యం కూడా

దాగి ఉంది. అది ధూర్జటి చిన్ననాటి శృంగార క్రీడలు. 'కాయల్గాచె వధూ నఖాగ్రములచే కాయం బని' తన శతకంలో ఆయనేగా చెప్పుకొన్నాడు. మరి కామిగాక మోక్షగామిగా డన్నట్లు ప్రతి మహాకవిలో ఇది అంతో ఇంతో తొంగి చూస్తుంటుంది. ఈ సూత్రానికి ధూర్జటే గాదు. రామకృష్ణుడూ గాదు. ఆ మాటకు వస్తే మహాభక్తుడు పోతనామాత్యుడూ కాడపవాదం.

అసలు శృంగార మనగానే మనమెందుకు ఉలిక్కిపడటం. అల్పజ్ఞులమైన మనమేగాని ఋషితుల్యులూ సర్వజ్ఞులైన మహాకవు లెప్పుడూ ఏవగించుకో లేదు. వారి దృష్టిలో ఈ ప్రపంచమంతా ప్రకృతి పురుషలీలామయం. ప్రకృతి పురుషులిద్దరికీ అవినాభావం. అందులో ఏదీ తక్కువా గాదు. ఎక్కువాగాదు. అన్యోన్య సామరస్యమైన ఈ భావమే మదన జీవితం కూడా కనిపించింది వారికి. అందుకే బాల్యంలో స్త్రీ సాంగత్యం లేదు పురుషుడికి. వార్ధక్యంలో ఉండీ ఉపయోగం లేదు. పోతే యౌవనంలోనే దాని అనుభూతి. అందుకే బాల్యానికి నీతి వార్ధక్యానికి వైరాగ్యం యౌవనానికి శృంగారం బోధించారు భంగ్యంతరంగా వారు తమ కావ్యాలలో. ఇది కాళిదాసేమిటి వాల్మీకి ఏమిటి భర్తృహరేమిటి. నిన్న మొన్నటి అన్నమాచార్యులేమిటి. అందరూ చేసిన పనే అది. స్త్రీ సాహచర్యం లేనిదే పురుషుడికి పూర్ణత్వం లేదు. అప్పుడే అది వైరాగ్యానికి దారి తీస్తుంది. ఎక్కడ ఏది వర్ణిస్తున్నా వారి రచనలో అది గాంభీర్యంతో పాటు ఒక విధమైన సరసత్వాన్ని కూడా ఆపాదించి రెండూ ఓతప్రోతంగా ప్రవహిస్తుంటాయి.

ఇలాటి సరస గంభీర భక్తి భావ శోభితమే ధూర్జటి కవితా శిల్పం. రామకృష్ణుడిలోనూ సరసత ఉంది. కాని అది కొంచెం మోతాదు

ఎక్కువయి వికటమైన హాస్యంగా మారింది. భక్తిని వర్ణించేటపుడు కూడా పరిహాసమే కనిపిస్తుందతనిలో. మరి ధూర్జటి అలా కాడు. శృంగారం సరసత్వం మాత్రమే ఆపాదించి అది భక్తికి సమగ్రత నిచ్చింది. కాళహస్తి మాహాత్మ్యంలో ఒక .చిన్న సన్నివేశం చూడండి మీకే తెలిసిపోతుంది. బ్రహ్మదేవుడి కామకేళీ విలాసం వర్ణిస్తున్నాడు కవి. 'స్వస్వరూప వికారైక సౌఖ్య దృష్టి వదలలేదా ముసలాయనకు. ఒక కొన్ని మాటలాడి ప్రొద్దు చాలపోయె' నని చెప్పి దేవతలను వారి వారి నెలవులకు పంపి తానూ వాణీలోని సౌధం మీదికి వెళ్ళి 'వాచా గోచర మప్రతర్క్యము వినిర్ద్వంద్వంబు నీ చెల్వం, నీతో మనోజ క్రీడల నాకు వాంఛా చాపల్యము నాకు తీఱ లేదు ఒక నూఱు ఆకృతులు ధరించి నాకు కనిపించి నాతో క్రీడిస్తే తీరుతుందేమోనంటాడు సరస్వతితో.

బ్రహ్మదేవుడి సంగతే ఇలా ఉంటే మరి మన కవి బ్రహ్మ పరిస్థితి చెప్పేదేముంది. తన కామాంధతా పారవశ్య ఫలితంగా అతి క్రూర స్వభావులైన రక్కసులంగంటినే అని కటకట బడ్డాడట చతుర్ముఖుడు. ఈ కవి చతుర్ముఖుడు అలాగే యౌవనంలో శృంగార లోలుడై కూడా దాని సంస్కార రూపమైన సారస్యం వదలకుండా శివభక్తి భాసురమైన తన ప్రబంధాన్ని సరస గంభీరంగా సృష్టించగలిగాడు. అలాటి మహాకవి దృష్టికీ బ్రహ్మాండమంతా అఖండమైన శివశక్తి విలాసమే. చూడండి ఈ పద్యం. ఎంత గొప్ప భక్తి భావాన్ని ఆవిష్కరిస్తున్నదో అంత సరసమైన కావ్యకళా రసాస్వాదాన్ని కూడా అందిస్తున్నది సహృదయులకు.

ఉదయ గ్రావము పాన పట్టమభిషేకోద ప్రవాహంబు వార్ధి. దరీధ్వాంతము ధూపధూమము. జ్వల ద్దీప ప్రభారాజి కౌముది – తారా నిపహంబు లర్పిత సుమంబుల్‌గా – దమో దూర సౌఖ్యదమై శీతగభస్తి

బింబ శివలింగం బొప్పె ప్రాచీ దిశన్ - తూర్పుకొండ పానవట్టం - అభిషేకం చేసిన జలం సముద్రమే - కొండ గుహల్లో ఉన్న చీకట్లే అగరు సాంబ్రాణి ధూపం - చంద్రుని వెన్నెలే వెలిగించిన దీపరాజి - నక్షత్రాలన్నీ పూజ చేసిన పుష్పాలు - మరి శివలింగమేమిటో తెలుసా. శీతగ భాస్తి బింబమట. అంటే చంద్రబింబం. అదే ఒక స్ఫటిక లింగం లాంటిది. ఆ లింగాభిషేకం దాని పూజా కార్యక్రమాన్ని వర్ణిస్తున్నాడు మహాకవి. ఇది ఏదో గుళ్లో గోపురాల్లో చేసేది గాదు. బ్రహ్మాండమే ఒక దేవాలయమను కొంటే ఉదయ పర్వతమే ఒక పానవట్టం దానిమీద ఉదయించే చంద్రబింబమే గొప్ప శివలింగం. దానిచుట్టూ మెరిసే తారకలు పూజా పుష్పాలైతే పైకి పొంగే సముద్రాలే అభిషేక జలాలట౯ ఏమి అద్భుతమెంత గొప్ప భావమిది. అంతేకాదు. క్రమంగా ఆ దీపకాంతికి విరిగిపోయే తమస్సే దోగాదు. మానవుడి అజ్ఞానాంధకార మంటాడు కవి. ఇది ఇంకా గొప్ప భావం. ఇందులో మరొక ఆధ్యాత్మిక రహస్యం కూడా గర్భితమై ఉంది. అదేమిటంటే ఉదయాచలం స్థావర రాజకన్య పార్వతి అంటే ప్రాణశక్తి. అదే పానపట్టం. ప్రాణమే తదాకా దేనికి. మనస్సుకు. మనస్సేమిటక్కడ చంద్రుడే. చంద్రమా మనసోజాతః - చంద్రుడు మనస్సును సంకేతం. ప్రాణాదా ప్రాణరూపిణీ పానవట్టం ప్రాణానికి ప్రతీక. ప్రాణం మనస్సుకు ప్రేరణ చేస్తే అది శివతత్వాన్ని ఆత్మ స్వరూపంగా భావిస్తే దానికి పట్టిన అవిద్యా తమస్సు పటాపంచలయి కౌముదిలాంటి జ్ఞానం ఉదయించక ఏమవుతుంది. ఇంత గొప్ప అద్వైత శాస్త్ర రహస్య మాయన కవితా శిల్పమెంత వ్యంగ్యంగా బయటపెడుతున్నదో చూడండి.

కనుక శివభక్తి అంతర్లీనంగా ప్రవహిస్తుంటే దాన్ని సరస సుందరంగా ఆవిష్కరించే కవితా శిల్పం ధూర్జటి కావ్యకథా నిర్మాణాని కంతటికీ ప్రాణ స్థానం. అసలు నాలుగాశ్వాసాల ప్రబంధ మీ కాళహస్తి మాహాత్మ్యం. రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యం లాగానే కాళహస్తిక్షేత్ర మాహాత్మ్యాన్ని తెలిపే కథా వస్తువిది. రెండూ స్థల పురాణాల క్రిందికే వస్తాయి. అక్కడ ఆయనగారు మానవులనే గాక జంతు జాలాన్ని కూడా భగవదనుగ్రహ పాత్రములైన పాత్రలుగా చిత్రించినట్టే ఈ మహాకవి కూడా సర్పగజాది జంతు పాత్రలను సృష్టించి కథ నడుపుతూ వచ్చాడు.

అయితే అక్కడి కంటే ఇక్కడ ఒక విశేషమేమంటే ఆది నుంచి అంతం వరకూ చాలా చోట్ల వారకాంతల వ్యవహార మెక్కువగా కని పిస్తుంది. వారందరూ ఎంత శృంగారవతులో అంత శివభక్తి పరాయణులు. అదీ విశేషం. వారి జీవిత విశేషాలను కవి ఎంతో చిలవలు పలువలు పెట్టి వర్ణించటం చూస్తే వృద్ధనారీ పతివ్రతా అన్నట్టు మహాకవి తన యౌవనదశలో అనుభవించిన శృంగార క్రీడలు గుర్తుకు వస్తాయి. యౌవనం గడచి క్రమేణ వయసు మళ్లిన కొద్దీ ఆయనలో గట్టిపడ్డ జ్ఞాన వైరాగ్యాలు అంతకన్నా గొప్పగా మన మనస్సుకు స్ఫురిస్తాయి. ఆ శృంగారము ఈ వైరాగ్యమూ – ఈ రెండు భావాలే ధూర్జటి నొక ద్రష్టగా కావ్యకళా స్రష్టగా మన మనోయవనిక మీద సాక్షాత్కరింజేస్తాయి. నా నృషిః కురుతే కావ్యమన్నారందుకే. కవి తన జీవితంలో ద్రష్ట అయి తరువాత కావ్య జీవితానికి స్రష్ట కావాలి. అప్పుడే పరిపూర్ణత.

అసలు ప్రథమాశ్వాసంలోనే ఒక వేశ్యగాని వేశ్యను వర్ణిస్తాడు మహాకవి. వేశ్యగాని వేశ్య అని ఎందుకంటున్నానంటే వేశ్యాకులంలో జన్మిం : లేదది. యాదవరాజుకు ప్రతిదినమూ పళ్లెం పెట్టవలసిన పడతి.

అదీ దాని ఉద్యోగం. కాని గొప్ప శివభక్తురాలు ఆ మాటకు వస్తే ఆడేమిటి మగేమిటి ఏ పాత్ర లెక్కడ ప్రవేశపెట్టినా కవి వారిలో మొదట చూచేది శివపారమ్యం. జంగమ దేవతల నందరినీ సాక్షాత్తూ శివ స్వరూపులుగా చూచి సేవించే భక్తి పారవశ్యం. వారేమి కోరినా సమర్పించుకొనే శివదీక్షా ధురంధరత్వం. అలాటి నిస్వార్థమైన దీక్ష ఒక్కటే జీవిత లక్ష్యాన్ని సాధించే మార్గమని బోధించటమే అందులో పరిపూర్ణత చెందిన ధూర్జటి మహాకవి కవితా జీవిత రహస్యం. అందుకే అలాటి వారి శృంగార విలాసాలు వర్ణించినా అవి శివభక్తి రస నివాసాలే కవి దృష్టిలో. ఆ దృష్టే అప్రయత్నంగా అలవడుతుంది మనబోటి పాఠకులకు కూడా. అందులో సందేహం లేదు. అది మహాకవి కావ్యరచనేంద్రజాల చాతుర్య మనుకోవచ్చు.

చూడండి. సాక్షాత్తూ కైలాస వాసి పరమేశ్వరుడే వస్తున్నా దొక మిండజంగము రూపం ధరించి యాదవరాజు పట్టణానికి. ఎందుకోసం దక్షిణాపథంలో కాళహస్తి క్షేత్రంలో తనకొక దేవాలయం కట్టించే ప్రేరణ అతనికి కల్పించటానికి. అది సూటిగా గాక చాటుమాటుగా అతనికి చెప్పదలుచుకొని వస్తున్నాడు. రాజవీధిలో నడచి వస్తుంటే ఒక మంచి నవయౌవనంలో ఉన్న జంగము రాలాయాన కెదురు పడుతుంది. అది ఆయన ముగ్ధమనోహర వేషానికి ముచ్చట పడి భక్తిపూర్వకంగా పాదాలకు ప్రణమిల్లి ఆయన ఇచ్చిన విభూతి నుదుట ధరించి అంటుందిలా.

బిజమాడు దేవర నిజకృపా దృష్టిఁజె
న్నారు నాయిల్లు బిడారు మీకు
నాకు మీ పాదార్చనము సేయ నడలింగ
మూర్తి చేకుతె - వచ్చి మూర్త మాడి

యొడయ చిత్తేశ నాయునికిని మజ్జనం
బాడి శివార్చన మాడ బేకు
విచ్చేయుడు విభూతి వీడియంబందుకో
జంగమస్వామి నాసదనమునకు

మంచి మేలోగిరములు నావటించెద పదడు మీరారగింప అని బ్రతిమాలుతుంది. ఎంత భక్తి ఎంత వినయం ఎంత ప్రపత్తి - ఎంత ఆత్మార్పణమో ఎంతగా ఉట్టిపడుతున్నదో చూడండి ఈ మాటలలో, శృంగారమా ఇది భక్తి భావమా. భక్తిస్ఫోరక శృంగార పారవశ్యం. మధుర భక్తి అంటారు దీన్ని. భాగవతంలో గోపికల భక్తి లేదూ. అలాంటిదే ఇది. పైగా ఇందులో చూడండి బిజమాడు బిడారు మూర్తమాడి - మాడ బేకులాంటి కలకండ పలుకులలాంటి కన్నడ పలుకులు చూడండి. ఎంత హాయిగా అందంగా కనిపిస్తాయో. ధూర్జటి కేవల మాంధ్రాభిషా పారంగతుడే కాదు. కర్ణాట తమ్మిళ పండితుడు కూడా. కావ్య మాసాంతం చదివితే చాలు. అది ఎంతగానో తార్కణ అవుతుంది మనకు.

ఇక చూడండి. పరమేశ్వరుడా మాటలకెలా స్పందిస్తాడో మహాత్మురా లిది ఇది శివా చారైక సంశీల - జంగమార్చన కళా సామర్థ్య అని ఆవిడ శివ దీక్షాపారమ్యాన్ని మెచ్చుకొంటూనే కందర్ప శుద్ధాంత శ్రీ పరిహాసకృ న్నిఖిల లోకాకీత సౌందర్య అని దాని లోకోత్తర సౌందర్యానికి ముగ్ధుడవుతాడు. దీని భక్తికి మనఃకంజంబు రంజిల్లెబన్' అని మనసులో ఆయన జీవించటం చూస్తే అది దాని శివభక్తికా శృంగార క్రీడోప భుక్తికా ఏదయింది అర్థం కాదు మనకు. ఆపారవశ్యం ఏ లోపమంటున్నాడో తెలుసా. 'కాంతా నీయింటికి c జనుదెంచెద నీదు గుబ్బ చనుగొండల సందునc దెరు వెఱుగక తిరిగెడి మనసను తెరువరికి

డప్పి మాన్పం గలవే' అని అడుగుతాడు. ఎంత కొంటె ప్రశ్న ఇది. ఎంత వ్యంగ్య భాషణం. కవిగారి శృంగారరస గర్భిత వచో విభూతి కిది పరాకాష్ఠ. మరి ఈ ప్రశ్న కావిడ ఇచ్చిన సమాధానమేమిటో తెలుసునాండి. 'నీదు మనసు వచ్చిన రీతిం బనివిని యెద - మాటల కికఁబని లేదీ తలపునాదు భాగ్యము గాదే' ఎంత గొప్పగా ఉందీ సమాధాన శైలి. నా మనసనే బాటసారి నీ గుబ్బపాలిండ్ల సందులో తిరిగి తిరిగి అలసి పోయాడాయన అలసట ఎలా తీరుస్తావని ఆయన అడగట మెంత వ్యంగ్యంగా ఉందో దానికి సరి దీటుగా ఉందా సమాధానం. మీ మనసుకు గదా అలసట అంటున్నారు. అది తీరే మార్గంలోనే నేను నడచుకొంటాను. ఇక మాటలు దేనికి. ఇలాంటి అభిప్రాయం నామీద మీకు కలగటమే నాభాగ్యమంటుంది. వారిద్దరి వ్యంగ్య భాషణ అలా ఉంచి వారి చేత అలా మాటాడించిన మహాకవి కావ్య ధ్వని పాటవం చూడండి ఎలాంటిదో.

ఇక ఇద్దరూ ఇల్లు చేరారో లేదో అది చేసే పూజలు పురస్కారాలన్నీ అయిన తరువాత భోజనం కూడా అయి తన వదనాంభోజమ్మున చిఱునగవులు రాజిల్లగ దానికి సన్న చేసి రతికెలయిం చాడట మహానుభావుడు. మరి వారి రతిక్రీడ వర్ణిస్తాడు కవి. అది ఎంత సరస శృంగార భక్తి రక్తి భూయిష్ఠమో చెప్పలేము. అవి అర్ధ నిమీలిత నేత్ర పద్మములే గాదు మానని చుంబనములే గాదు. మాటల చురుక్కులే గాదు. వీడి వీడి పోనీయని కవుగిలింతలేగాదు. అంతేగాదు. ఎక్కడ బట్టినం గళల యిక్కువ లెక్కడ నోరు సోకినం జక్కెర లప్ప లేమనిన సారసుధారస - మని వర్ణిస్తూపోతాడు. రస సుధా సాగరం లోతులు చూచిన గజ ఈతగాడు గాని ఇలాంటి తన్మయత్వాన్ని రసజ్ఞులైన

పాఠకుల కందీయలేదు. అసలీ చక్కెరలప్పలూ సారసుధారసం గమనించే అన్నారేమో 'మధురాధరోదిత సుధారస ధారలఁగ్రోలుటంజుమీ' అని చాటు కవులీ ధూర్జటిగారిని గూర్చి.

ఇలాంటి సన్నివేశమే కావ్యాంతంలో కూడా వస్తుందొకటి. ఇది శృంగార కళ అయితే అది శృంగార శాస్త్రం. కొక్కోకం వాత్స్యాయనం. దశకుమార చరిత సన్నివేశాలను తలపిస్తుందది. ఒక వేశ్య మాత తన కుమార్తెలకు బాల్యం నుంచీ గణికా బుద్ధులన్నీ నేర్పాలని ఎంతగానో ప్రయత్నిస్తుంది. 'కులధర్ములమ్ వదలగా భావ్యం బె మా యక్కలార – మణి మంత్రి తంత్రము ల్మందులు మాయలూ తెచ్చికోలేడ్పులు ఇచ్చకంబులు – ఎన్ని నేర్వవలెనను కొన్నారు – ధనము గలిగిన జంగమార్చన మొనర్ప – శివుని కభిలోప చారమున్ చేయవచ్చు – వేశ్యావృత్తి కొప్పుకోకపోతే 'ఈ కేళీ సదనంబు నీతూగు మంచంబు లేమయి పోవాలి. నృప నందను లెందరో అంగదము ల్ముంగర లుంగరంబులు ఇస్తామని చెలులతో చెప్పి పంపినా మీరు ఒప్పుకోక పోతే ఏమనాలి మిమ్ము అవి ఎంత బోధించినా వారు వినకపోతే ఈశ్వర ధ్యానము మార్చి కావు సుఖ సక్తలఁ జేసిరయేని కాసయి నను బుచ్చుకోక కమలాస్యల కన్నెతీకంబు వారికిత్తునని ఆఖరుకు ప్రకటన కూడా చేస్తుందా ముసలిది.

ఇదంతా ఆ ముసలిదాని తాపత్రయమే గాని ఆ కన్నెలకు మాత్రం ఆవిడ బోధ ఏమాత్రమూ మనసుకు పట్టలేదు. కన్నెరికమెవరు చేసినా సరవాలేదు శివభక్తి నుంచి వారిని మరలిస్తే చాలునని ఆవిడ తెగిస్తే – ఈ శివభక్తి తప్ప మరే దారి తొక్కమన్నా తొక్కబోమని వారి పట్టుదల. దానిది శృంగార శిక్ష అయితే వీరిది వైరాగ్య దీక్ష. ఒకదాని కొకటి

లంగరందని ఈ సన్నివేశాన్ని ఎంత గొప్పగా పోషించాడో ధూర్జటి చెప్పలేను. ఒక పక్క ప్రాపంచికమూ మరొక ప్రక్క పారమార్థికమూ, ప్రపంచమెప్పుడు ఒక పెద్ద అయస్కాంతంలాగా తనవైపు లాగుతుందెవరి మనసునైనా. కాని పారమార్థికమైన భక్తిభావం బాగా అలవడితే అంతకన్నా అతి గొప్ప అయస్కాంతంలాగా అది శివభక్తి పారమ్యాన్నే చుంబిస్తుంది. పరస్పరం వీటికి ఉన్న ఈ సంఘర్షణ ఎలాంటిదో అందులో చివరకు విజయం దేనికి చేకూరుతుందో చూపటానికే కవి ఈ ఘట్టాన్ని చివరిసారిగా తన కావ్యంలో చొప్పించాడు. అందులోసూ ఇద్దరి పాత్రలలో తానే ప్రవేశించి ఇద్దరి వాదాలూ మనకు వినిపించి విజయపతాకం ఎవరి కందివ్వాలో మీరే చెప్పండని మనలను ప్రశ్నిస్తున్నాడా అనిపిస్తుంది మహాకవి.

ముందుగా వృద్ధురాలి వాదం విన్నాము గదా మనం. ఇప్పుడా ముద్దరాంద్ర సమాధానమేమిటో విందాము. కవిగారేమి చెబుతారో, రసికులు మీ గానరసమాన వచ్చిరి పాడరే - శివభక్తి పాడుగాను - జాణలు మీ విలాసముఁజూడ వచ్చిరి. చూడరే శివభక్తి చూఅపోను' అని ఆ తల్లి శృంగార శాస్త్రమంతా వల్లెవేస్తుంటే - మాకు రసికుడైనా జాణడైనా శ్రీకాళహస్తీశ్వరుడే - తల్లోకవ్యాపక చిద్విద్యాకార స్మృతియె కాణయాచి మదంబా- అని తెగేసి ఆవిడకు జవాబు చెబుతారు. అంతేకాదు. మణిమంత్రౌషధాలు ప్రయోగించి విటుల దగ్గర మణి భూషాదులు పుచ్చుకొని పాప మొడిగట్టుకోమంటే రుద్రాక్షే మణి - పంచాక్షరే మంత్రం విభూతే ఔషధం దక్షిణ కైలాస నాధుడే తమ కైశ్వర్యమని భావిస్తే ఎంత మహాపుణ్యమో చెప్పమని నిలదీస్తారు.

శివునపేక్షించిన చిత్తంబు చిత్తజా

యత్తమై విటులపై నాస పడునె

పరశిన స్తుతి కథా భాషలు విను వీను

లానునే కుంటెన లాడు పలుకు – లికచాలు వార ధర్మోపదేశంబు వలదు మాకు – ఒకవేళ ఒక భుజం గుణ్ణే మాకు కట్ట బెట్టాలని నీవను కొంటే నీకాశ్రమ అక్కరలేదు మేమే కట్టుకోగల మెవరినో తెలుసా.

దారువనీ మునీంద్ర కులదార భుజంగుడు – **భక్త బల్వాణ**

క్ష్మారమణాంగనా మణి భుజంగుడు – **ముక్తి వధూభుజంగుడి**

చ్ఛారచితాంగ భూషణ భుజంగుడు మాకు భుజంగుడు.

అలాటి భుజంగ భూషణుడు మమ్మను గ్రహించటానికి సిద్ధంగా ఉంటే మనుష్య మాత్రులను భుజంగులని ఎందుకు కీర్తిస్తావని ఆక్షేపిస్తారు. ఇంకా అర్థం కాలేదా. సరే చెబుతాను విను. మగువకు శరీర మొసగిన

మగడు – చిదంగనకు మగడు – మాయాస తికిన్

మగడు మగవేల్పులకు cదగు

మగడు – మగడు గాక – మాకు – మనుజుడు మగడే – అని వ్యాఖ్యానిస్తారు. వారు గాదు – వారి మాటలతో మహాకవి చేసే వ్యాఖ్యానమిది. చాలా అద్భుతమైన భావమిది. మగడ నేవాడొక్కడే ఉన్నాడీ సృష్టిలో. వాడు పరమేశ్వరుడే. పురుషోత్తముడని కూడా పేరాయనకు. అంటే మగవారెవరూ పనికిరారు. ఆయన ఒక్కడే మగవాడని గదా. కారణం. స్త్రీ జాతికి జన్మనిచ్చిన మగవాడు పరమాత్మ. మాయాశక్తికీ మగవాడాయనే. దేవతలందరూ స్త్రీలే అయితే ఆ స్త్రీ లందరికీ పురుషుడాయనే. ఒక్క పరమాత్మే పురుషుడు. అంటే పూర్ణత్వ

మున్న వాడు. అలాటి పూర్ణత్వానికి నోచుకోలేని మిగతా స్త్రీ పురుషులందరూ స్త్రీలేగాని పురుషులెలా అవుతారు స్త్రీ స్రాయమితరం జగత్తనే గొప్ప ఆధ్యాత్మిక రహస్యాన్ని ఎలా ధ్వనింప జేస్తున్నదో చూడండి ఈ పద్యం. ధూర్జటి తన భక్తి పారమ్యాన్ని ఎంత గొప్పగా చాటుతున్నాడో చూడండి.

సరే వీరెంత పెడమొగం పెట్టుకొని వాదించినా వినక ఆ వృద్ధ వేశ్య వారి కన్నెరికం పాడేనెఱజాణ ఎవడైనా సరే కాసు పుచ్చుకోకుండా అతనికి వారినప్పజెప్పగలనని చాటింపు చేస్తే ఆ కన్యలు దానికి ప్రతిగా **'ఏ ధన్యులు మము హిమ గిరిజా ధవునిం గాళహస్తి సర్వేశ్వరునిం గొలువ గొంచుc బోయెద'** రని వాపోతారు. ఆమాట కొంచెం బిగ్గరగా అన్నారో ఏమో వీధి అరుగుల మీద జంగముల వేషంలో ఎప్పుడూ తొంగుండే కన్నగాండ్రు కొందరు విని ఆ ఇల్లా ఈ ఇల్లా కన్నం వేసి కష్టపడటం దేనికీ బాలికలను నమ్మించి తీసుకుపోతే తేలికగా వీరి నగలన్నీ దారి నడుమ దోచుకొని పోవచ్చునని ప్లాను వేసి వారిని దగ్గరగా పిలిచి 'అమ్మాయిలూ ఎందుకా ముసలి దానితో మీకు వాదోపవాదాలు – మాతో రండి సరాసరి మిమ్ము కాళహస్తి చేరుస్తామని హామీ ఇస్తారు. వారు నిజమైన జంగాలేనని నమ్మి ఆ బాలికలు తామూ జంగమ స్త్రీలు వేషాలు ధరించి కాళహస్తీశు దర్శించు కాంక్షతో బయలుదేరుతారు. తమకున్న ధనమంతా వారి చేతిలోపెట్టి వారా ఊరూ ఈ ఊరూ తిప్పుతుంటే కొండలూ అడవులూ నదులూ గడచి చివరకు చిదంబరం శివకాశీ అన్నీ చూచి రత్నాకరం దగ్గరికి వస్తారు. ఎలాంటిదా రత్నాకరం.

'రత్నము విధురత్నము తరు
రత్నమమృత రత్నము – హరి

రత్నము నుంగలిగి మెఱయు రత్నాకర' - మది. రత్నాకరమంటే కేవలం రత్నాలనే గాదు. రత్నాలు కాని గొప్ప రత్నాలు కూడా ఉన్నాయందులో. ఐరావతం రత్నం కాదా కల్పవృక్షం రత్నం కాదా. లక్ష్మీదేవి రత్నం కాదా. కామధేనువు రత్నం కాదా చంద్రుడు కాదా అమృత కలశం కాదా - ఉచ్చైఃశ్రవం కాదా - ఏది గాదు రత్నం. అన్నీ విలువైన వస్తువులే వెలలేని రత్నాలే అని రత్నాకర శబ్దాన్ని మహాకవి వ్యాఖ్యానిస్తుంటే ఎంత ముచ్చటగా ఉందో.

అంతేనా. ఇంకా దాన్ని వర్ణించటం మానలేదా మహా కవి. ఏమని వర్ణిస్తున్నాడో వినండి.

తనయందు, బవ్వళించిన నీల వర్ణుని
నీడ దీరంబెల్ల నిండెననగ
హేళికి నోడి తానెటకుc బాఱగ లేక
తనయందు తిమిరంబు దాగె ననగ
తనయందు బడబాగ్ని ఘనతరజ్వాలలు
మండంగ నుదరంబు మాడెననగ
జంబూ ఫలద్యుతి నంబరం బంతయు
తనయందు బ్రతిఫలించినది యనగ - చూడండి. సముద్రాన్ని ఎంతో గొప్పగా వర్ణించిన సందర్భాలున్నాయి మన తెలుగు కావ్యాల్లో మహాకవులు. కాని ఇలాటి విలక్షణమైన ఉత్ప్రేక్షాలంకార మా వర్ణనలలో ఎక్కడా కనపడదు. ధూర్జటి కన్ను తెరిస్తే ఏమయినా ఉందామరి.

మొత్తం మీద దొంగ జంగాలు వారిని చాలా దూరం తీసుకు వచ్చి 'ఇక్కడఁజేరువ మారుపల్లెలే దిక్కడనె వ్వరుందిరుగ రిక్కడ నేడిదె ప్రొద్దు దోచుకోనిక్కడ వాట' మరి ఎత్తుగడ నేస్తే అంతకన్నా పెద్ద ఎత్తుగడ

వేస్తాడా రాజధరుడైన కాళహస్తీశ్వరుడు. వారు చూస్తూ ఉండగానే వచ్చి వారికి నిద్రపోకుండా శైవ ధర్మాలన్నీ నూరిపోస్తుంటాడు. చివరకా పాపాత్ములా కన్యలను చంపి అయినా ధనమపహరించాలని చూస్తే - అది తెలిసి చెల్లెలు 'అప్పా చూడు మటన్న - కన్నెనగి 'ఓయమ్మా పరాకేటికే చెప్పంజూపగ రాని లోక జనముల్ శ్రీకాళహస్తీశు మాయప్పయ్యన్ భజియింప నేమయిన నయ్యో' అని అక్క జవాబిస్తుంది. ఎంత అచంచలమైన శివభక్తి పారవశ్యమో చూడండి ఆ వెలయాలి బాలికలది. అలా తదేక నిష్ఠా పావన భావ సమాధికి బరవశలయి ఉన్నారో లేదో వెంటనే ప్రత్యక్షమవుతాడు. ఎవరు, ఎవరో చూడండి.

శ్రీకాళహస్తి గౌరీపతి స్తోత్రముల్

పెట్టిన వెలిబూది పెండెకట్లు

గళముల కుఱుబోడి తలల రుద్రాక్షలు

గండ చల త్తామ్ర కుండలములు

ధాతురాగాంగ వస్త్రమ్ములు గోచులు

నెడమ ముంజేతుల నెసగు సజ్జ

లును - తీవ్రధావనంబునc బుట్టు చెమట

చెదరి పువ్వులు గోయు శీఘ్రుగతులు

కలుగు ప్రమథుల తోడ శ్రీకాళహస్తి

శివుడు సనుదెంచె - ఎలాగా -

ద్రవిడ జంగమ వేషంబు లవధరించి

తామా తన పరివారమూ అందరూ ద్రవిడ జంగమ రూపాలలో సాక్షాత్కరించాడు. ఏమి ఇలా వచ్చారని ఆ కన్యలను హెచ్చరిస్తాడు. అయ్యా ఏమని చెప్పమంటారు. దొంగలని తెలియక నమ్మి వచ్చాము.

మా ధనం కాజేయాలని చూచిరి. కాని మిమ్ము చూడగానే పరుగెత్తి పోయామని మొరపెడతారు. ఓహో అలాగా, అయితే మేము మిమ్ము కాళహస్తీశుని గుడి సన్నిధికి చేరుస్తాము రండని వెంటబెట్టుకొని పోతాడాయన. దక్షిణ కైలాసం కట్టెదుట పొడకట్టి నట్టయిందట వారికి. శివ సన్నిధి చేరాడో లేదో అసలా జంగమ శివుడే అంతర్ధాన మయినాడు. ఆయన బదులు స్థావర లింగమే దర్శనమిచ్చే సరి కాశ్చర్యపడి వారు 'శ్రీకాళహస్తి మహా దేవుడు జంగమాకృతి విభూతిన్ భృత్యులం గూడి వచ్చి యాత్మనగరీ సీమోపకంఠంబు జేర్చి మఱుం గొక్కటి పెట్టిపోయెనని అర్థం చేసుకొంటారు. ఇక వారి సంతాపమింతా అంతా కాదు.

చింతింపలే మైతి మంత కాంతకుడని
యెఱుగ మైతిమి పార్వతీశుడనుచు
కట్టుఁగొయ్యను జేరి కామధేనువు దప్పె
కానవచ్చిన పెన్నిధాన మడఁగె - ఏమి సేయుదము
ఫలము గొమ్మని ముందఱ బట్టి యాస
గొలిపి శిశువులఁ జేరంగఁ బిలిచినట్టు -

దగ్గరకు పిలిచి దూరమైపోయాడే మహానుభావుడని వాపోతారు. అయినా భయం లేదు. అభవు డిందాక మనవెంట నరుగు దేరని యిచట సేవింపనిక మోక్షమేమి యరుదని 'కాళహస్తీశు దర్శింపగదియ నపుడు 'జ్ఞాన ప్రసూన కలికయుఁ దానుం గన్యకల జన్మదైన్యంబుడుపన్ పూని యొకదే హమై యెదురై నిల్చె శివుండు. ఎలా ఉందా అర్ధనారీశ్వర విగ్రహం. విద్యా పురుష సామరస్య సుఖాకారమది. శృంగార శాంత రసమయ మది. ప్రత్యక్ష భోగ మోక్షప్రదమది. అది చూచి వెంటనే భక్తిరస పరిప్లుత హృదయలై సాగిలపడి లేచారో లేదో వారికి తన సాయుజ్యం బిచ్చి యదృశ్య మవుతాడా దేవుడు. అది తెలియక వారి జాడ గాన రాక అక్కడి వారందరూ మల్లగుల్లాలు పడుతుంటే ఆకాశవాణి

మా ధనం కాజేయాలని చూచిరి. కాని మిమ్ము చూడగానే పరుగెత్తి పోయామని మొరపెడతారు. ఓహో అలాగా, అయితే మేము మిమ్ము కాళహస్తీశుని గుడి సన్నిధికి చేరుస్తాము రండని వెంటబెట్టుకొని పోతాడాయన. దక్షిణ కైలాసం కట్టెదుట పొడకట్టి నట్టయిందట వారికి. శివ సన్నిధి చేరాడో లేదో అసలా జంగమ శివుడే అంతర్ధాన మయినాడు. ఆయన బదులు స్థావర లింగమే దర్శనమిచ్చే సరి కాశ్చర్యపడి వారు 'శ్రీకాళహస్తి మహా దేవుడు జంగమాకృతి విభూతిన్ భృత్యులం గూడి వచ్చి యాత్మనగరీ సీమోపకంఠంబు జేర్చి మఱుం గొక్కటి పెట్టిపోయెనని అర్థం చేసుకొంటారు. ఇక వారి సంతాపమింతా అంతా కాదు.

చింతింపలే మైతి మంత కాంతకుడని
యెఱుగ మైతిమి పార్వతీశుడనుచు
కట్టుఁగొయ్యను జేరి కామధేనువు దప్పె
కానవచ్చిన పెన్నిధాన మడఁగె - ఏమి సేయుదము
ఫలము గొమ్మని ముందఱ బట్టి యాస
గొలిపి శిశువులఁ జేరంగఁ బిలిచినట్టు -

దగ్గరకు పిలిచి దూరమైపోయాడే మహానుభావుడని వాపోతారు. అయినా భయం లేదు. అభవు డిందాక మనవెంట నరుగు దేరని యిచట సేవింపనిక మోక్షమేమి యరుదని 'కాళహస్తీశు దర్శింపగదియ నపుడు 'జ్ఞాన ప్రసూన కలికయుఁ దానుం గన్యకల జన్మదైన్యంబుడుపన్ పూని యొకదే హమ్మై యెదురై నిల్చె శివుండు. ఎలా ఉందా అర్ధనారీశ్వర విగ్రహం. విద్యా పురుష సామరస్య సుఖాకారమది. శృంగార శాంత రసమయ మది. ప్రత్యక్ష భోగ మోక్షప్రదమది. అది చూచి వెంటనే భక్తిరస పరిప్లుత హృదయలై సాగిలపడి లేచారో లేదో వారికి తన సాయుజ్యం బిచ్చి యదృశ్య మవుతాడా దేవుడు. అది తెలియక వారి జాడ గాన రాక అక్కడి వారందరూ మల్లగుల్లాలు పడుతుంటే ఆకాశవాణి

శక్తి మృత్తిక లాంటిది. అది త్రిగుణాత్మిక. 'త్రిభిర్గుణ మయై ర్భావై రేభిస్సర్వమిదం జగత్! ఈ త్రిగుణాల వలలో చిక్కి జీవులంతా మోహితం నాభి జానాతి. ఏమాత్రమూ దీనిలో నుంచి బయట పడలేక పోతున్నారు. ఇదే జీవుడి సంసార బంధం.

అయితే మరి దీనికేమిటి పరిష్కారం. ఎప్పుడు వీడికిక మోక్షం. చెబుతున్నాడు వినండి భగవానుడు. మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతితే ఆ పరమాత్మనే ఎవరు పట్టుకొంటారో వారే త్రిగుణ వారుర తప్పించుకొని బయటపడతారు. ఎక్కడ ఉన్నాడా పరమాత్మ. మామేభ్యః పరమవ్యయం. ఈ గుణాలు మూడింటికీ అతీతంగా ఉన్నాడు. అలా మరి అతీతంగా ఉన్నవాణ్ణి వీటి కధీనమై బ్రతికే జీవుడెలా పట్టుకోగలడు. ఈ గుణాలను గాక నిరంతర మా గుణాతీతమైన తత్త్వాన్నే స్మరిస్తూ అదే సర్వస్వమని మనసా వాచా కర్మణా భజిస్తూ పోతే అంతకంతకు దీని బంధం తప్పించుకొని దీన్ని దాటి బయటపడగలడని భగవానుడు మనకిచ్చే హామీ. యద్భావస్తద్భవతి అని సూత్రం. మనస్సు ఏది గట్టిగా పట్టుకొంటే అది అయిపోతుంది. సవికల్పంగా పట్టుకొంటే త్రిగుణాత్మకంగా కనిపిస్తుంది మానవుడికీ సృష్టి. అప్పుడది బంధం. అలా కాక నిర్వికల్పంగా దర్శిస్తూ పోయిందో అప్పుడిది త్రిగుణాతీతమైన పరమాత్మ స్వరూపం. అదే మోక్షం.

ఇదుగో ఈ అద్వైత మహా మంత్ర రహస్యమే పరమ మాహేశ్వరుడైన ధూర్జటి మహాకవి మనబోటి పాఠకుల కందిస్తున్న గొప్ప సందేశం. ఋషీశ్వరుడే గాక కవీశ్వరుడు కూడా కాబట్టి కధా వ్యాజంతో కళాత్మకంగా మనకు ధ్వనింప చేస్తున్నాడు. అంతమాత్రమే. అందుకోసమే తన కధా పాత్రలన్నింటినీ సత్త్వరజస్తమో గుణాత్మకంగా

సృష్టిస్తూ వచ్చాడు. సృష్టించి అంతటితో ఆగక వారందరినీ శివధ్యానైక పరాయణులుగా తీర్చిదిద్దుతాడు. మరి ఎలాటిది ఆ శివతత్త్వం. స్వయంగా కవిగారే చాటారు చూడండి కన్యలకు అర్ధనారీశ్వరుడు ప్రత్యక్షమైన సందర్భంలో. ఏమని. విద్యాపురుష సామరస్యమద్ది. శృంగార శాంత రసమయమది. మరి భోగమోక్ష ప్రదం కూడా. అంటే సగుణ నిర్గుణాత్మకం. సదసత్తులు రెండూ అక్కడ చైతన్య స్వరూపంగా ఏకం. అప్పుడిక గుణదోష భేదం లేదు. అదే అర్ధనారీశ్వర సంకేతం.

ఈ అద్వైత రహస్యం ప్రధమాశ్వాసంలో అగస్త్య మహర్షి పరమేశ్వరుణ్ణి గురించి చేసిన స్తోత్రంలోనే వ్యక్తం చేశాడు మహాకవి 'ఖేనంబు మోదంబు - కృత్యం బకృత్యంబు - హేయం బహేయంబునున్ లేక - లోకంబు లెల్లం బర బ్రహ్మరూపంబుగా జూచుచున్ స్వేచ్ఛ గ్రీడించు వారల్తు దింబొందు లాభంబు నీవై' అని వర్ణించాడా లేదా. అప్పటికి మంచి చెడ్డలు గుణక్షేత్రంలోనే. రెంటికీ అతీతమైన తత్త్వాన్ని పట్టుకొన్న మహాజ్ఞానులకూ అనన్యభక్తులకూ మంచి చెడ్డలు రెండూ పరమాత్మ రూపంగానే మారి కనిపిస్తాయి. ఎటు వచ్చీ తిక్రరణ శుద్ధిగా ఆ పరతత్త్వాన్నే పట్టుకోగాలి. అదీ షరతు. అప్పుడది ఒక చెద పురుగా సర్పమా గజమా కిరాతుడా కవీశ్వరుడా ఒక వెలయాలా జంగమురాలా లేక అగస్త్యుడా వసిష్ఠుడి లాంటి మహామునులా ఆఖరుకు సాక్షాత్తూ, దేవతా జ్యేష్ఠుడనిపించుకొన్న బ్రహ్మదేవుడా. ఎవరైనా సరే ఏ పాత్ర అయినా సరే త్రిగుణాత్మకమైన లోకాని కపాత్రులుగా కనిపించినా త్రిగుణాతీతమైన భగవత్తత్త్వానికెప్పుడూ పాత్రులే. ఈ గొప్ప సత్యాన్ని కాంతా సమ్మితమైన కావ్య శిల్పం ద్వారా చాటటమే మహాకవి వివక్షితమని గదా చెప్పాను. అదే మొదటినుంచీ చివరిదాకా కావ్య నిర్మాణంలో అంతర్వాహినిగా ప్రవహిస్తున్న పరమార్ధం.

మొట్టమొదట జంగమ భక్తురాలి కథతో గదా ప్రారంభించాడు కవి. అది రసికురాలా భక్తురాలా. భక్తురాలే. భక్తే రక్తిగా మారింది. దాని పాటికది మారిందా. కాదు మార్చాడు పరమేశ్వరుడు. నన్ను మనసారా నమ్ముకొన్న దానవు నీకే మాలిన్యమూ అంటదు పొమ్మని ఆయన మౌనంగా చేసిన బోధ ఆవిడకు. కాకపోయినా భగవానుడేమన్నాడు గీతలో

ఈశ్వర స్సర్వభూతానాం - హృద్దేశేర్జున తిష్ఠతి.

భ్రామయన్ సర్వ భూతాని యంత్రారూఢాని మాయయా' ఏమిటీ మాటల కర్థం. మీదేమీ లేదు. మీ అందరి హృదయాలలో కూచొని ఉన్నది నేను. నేను తిప్పుతుంటే మీరు తిరుగుతున్నారు. మీ కదలిక లోనన్నే చూడమనిగదా. అలాగే చూచిందా భక్తురాలు పాపం. ఆవిడ తప్పేముంది. తప్పులేకున్నా తప్పుగా భావించాడలాటి దృష్టి లేని ఆయా దవరాజు. ఆలస్యంగా వచ్చిందని ఆగ్రహోదగ్రుడై దాని తల గొఱిగించ మంగలి నాదేశిస్తాడు. శిరోజములు కోలుపోయి నా శివభక్తి కోలు పోవదది.

ఓయను రోదసం బోంకార మనువుగా
కనుగవ నీరు మజ్జనము గాగ
నిడువాలు గన్నులు నీలో త్పలములుగా
నెమ్మోము క్రొత్త నెత్తమ్మిగాగ
కమ్మని నిట్టూర్పు గాడ్పు ధూమంబుగా
దంతకాంతులు దీపతతులు గాగ -

ఇలా పరమేశ్వరుని పాదాల మీద బడి పలవించ సాగింది. అదే తన కారాధనగా భావించి హస్తమస్తక సంయోగం చేశాడాయన. అలా

చేశాడో లేదో వెంటనే తెఱవకు కచభరము వచ్చె దేవుని కరుణన్' అంటాడు కవి. అది మరలా వెళ్లి యాదవరాజును దర్శిస్తుంది. అతడాశ్చర్యంతో ఎలా వచ్చింది మరలా నీకీ కేశపాశమని అడిగితే ఆ కరుణాంబుధి నాశిరంబుపై శ్రీకర పల్లవంబడిన చిత్రముగా జనుదెంచె వెంద్రుక'లని విన్నవిస్తుంది. ఎంత అనన్యపరతంత్రమైన శివభక్తి పారవ్యమో చూడండి ఆమెది.

'అనన్యాశ్చిం తయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహామ్'

అని గదా అన్నాడు భగవానుడు. ఆయన గారిచ్చిన హామీ ఎలా ఊరకపోతుంది. అనన్యభక్తుల విషయంలో ఫలించి తీరాలది. అలాగే ఫలించిందిక్కడ.

పోతే ఇలాటి అద్భుతమైన సంఘటన జరిగితేగాని మేల్కొన దింకొకరి బుద్ధి. దానికి నిదర్శన మా యా దవ భూపతి. వారి కలాటి ప్రబోధం కలిగించాలనే ఈశ్వరుడి సంకల్పం. కలిగించి వాడి ద్వారా కాళహస్తి దేవాలయ నిర్మాణం చేయించాలని ఆయనగారి ప్రణాళిక. దాని కనుగుణంగా ఆ భక్తురాలిని తనకు రక్తురాలిగా మార్చాడు మొదట. అది తన పరీక్షకు నిలబడిన భక్తురాలని సంతోషించాడు. కాగా ఇప్పుడీ యాదవుణ్ణి మరలా తన మహిమ చూపి ఆశ్చర్యచకితుణ్ణి చేశాడు. వాడు చకితుడై సపరివారంగా వచ్చి ఆ జంగమ వేషధారి చరణాల మీద వాలాడు. అంటే పారమేశ్వరమైన శక్తిపాతమై పనిచేసింది వాడి మీద. అనన్యమైన శరణాగతి చాలు అంతా ఈశ్వరానుగ్రహమే. అదే వాడి నోట పలికిస్తున్నది. ఏమని.

అయ్యా! యెక్కడి నుండి ఇక్కడికి లీలార్థంబు విచ్చేసినా
రియ్య బ్జానన మీద నింత దయ మీకెట్లయ్యె నేడెద్దినేఁ
జెయ్యంగాఁగల యూడిగం'బని నివేదిస్తాడు. ఈ ఆత్మ నివేదనతో వాడు రాజసం పోయి సాత్త్వికుడుగా మారాడు. కాదు మార్చాడు వాణ్ణి ఈశ్వరుడే. ఏమని జవాబిస్తాడో తెలుసా ఆ ఈశ్వరుడు. అక్కడక్కడ పెద్దలందరూ నాతో కాళహస్తి క్షేత్రం మహా మహిమాన్వితమని చెబుతుంటే విని ఒక దివ్యమైన శివాలయం కట్టిస్తే బాగుండునని 'నీకెన యైన భక్త వరునిం బొడుగానను గాన నేను నీకీ కథ చెప్పవచ్చితి' నంటాడు. అప్పటికి వాడూ భక్తుడేనన్న మాట. అయితే వాడి భక్తిలో చోటు చేసుకొన్న రాజస గుణం పోగొట్టట మాయన సంకల్పం. అందుకోస మాజంగమ భక్తురాలిని వాడు కోటమంతకన్నా గొప్ప ప్లాను. అంతకన్నా కూడా గొప్ప ప్రణాళిక ఏమిటంటే వాడు స్వామీ మీరాన తిచ్చినట్లే ఆలయ నిర్మాణం చేస్తానని విన్నవిస్తూ ఆ స్థల మంత గొప్పది కావటానికి హేతువైన పురాణ కథలన్నీ తమ వల్ల వినాలని వేడుకగా ఉందని ప్రాధేయపడతాడు. అలా అడిగాడో లేదో ఇక మొదలుపెడతాడా జంగమ లింగ వేషధారి పరమేశ్వరుడు ఆయా కథలన్నీ ఒకదాని తరువాత ఒకటి వరసగా. అది కూడా కాదు. ఆయనగారి ద్వారా కవిగారే ఆ స్థల పురాణ కథలన్నీ పరంపరగా మనకు వర్ణించి చెబుతుంటే తిరిగి చూచే సరికి నాలుగాశ్వాసాల కాళహస్తి మాహాత్మ్యమనే ప్రబంధంగా దర్శన మిచ్చింది.

కానీ ఈ ప్రబంధాన్ని ఆ మూలాగ్రమూ చదివే ఆసక్తి ఉన్న ప్రతి సహృదయుడూ ఒకటి మాత్రం గుర్తుంచుకోవాలి మరచిపోగూడదు. అదేమిటని అడుగుతారేమో. పద్యాల దగ్గరినుంచీ వర్ణనల దగ్గరి నుంచీ

ఆయా కథా సన్నివేశాల దగ్గరి నుంచీ ఆయాపాత్రల మాటలూ చేష్ట దగ్గరి నుంచీ ఏది ఎక్కడ చూచినా అంతా ధూర్జటి కవి కవితా శివతాండవమే. కవిగారి శివదీక్షా పారవ్యమే అడుగడుగునా మనకు దర్శనమిస్తుంటుంది. అసలదే ఈ కావ్యమందిర నిర్మాణాని కంతటికీ పునాది. త్రిగుణాత్మకమైన జీవుల జీవితాలన్నిటినీ శివభక్తి పారవ్యమనే సూత్రానికి గ్రుచ్చి ఒక సుమనోహరమైన సుమనోహారంగా తయారు చేసి మనకు సమర్పించాడు కవి. **'సూత్రేమణి గణా ఇవ'** అని భగవానుడే చెప్పినట్టే శివభక్తి సూత్రంలో వారి వారి జీవితాలన్నీ వెలలేని ఆణిముత్యాలు మణులూ మాణిక్యాలు. గుణాతీతమైన ఆ అపురూపమైన హారంలో గ్రుచ్చబడిన ఈ పాత్రలకు పట్టిన ప్రకృతి గుణమాలిన్యమంతా ప్రక్షాళితమై అచ్చమైన శివచైతన్య జ్యోతిలో ఏకమై సహృదయ పాఠకుల హృదయాలను కాళహస్తీశ్వరుని భక్తిరసై కార్ణవంలో ముంచెత్తుతుంది. సందేహం లేదు. కవి అంత దీక్షాపరుడు. కావ్యమంత రక్షాబంధం.

ఇది మనసులో పెట్టుకొని మనమొకరి కొకరు చెట్టపట్టాలు పట్టుకొని సాగిద్దామిక ప్రయాణమీ ప్రబంధ రాజమార్గంలో. మనకీ మార్గంలో కరావలంబమిచ్చి నడిపించే వాడా జంగమలింగ వేషధారి పరమశివుడే. దారిలో మొదటి ఘట్టమిందులో వశిష్ఠుని వృత్తాంతం. వందమంది పుత్రులను పోగొట్టుకొని పుత్రశోకంతో భృగుపాతం చేయటానికి సిద్ధపడతాడు. భూదేవి చీవాట్లు పెడుతుంది ఇంత శమదమాన్వితుడవయి ఉండి నీకీ తామస మేమిటి. చచ్చినంత మాత్రాన నీవ్యధ తీరదు. మీదు మిక్కిలి బ్రతికుండి నీవు పార్వతీ నాథుణ్ణి కొలిస్తే జీవన్ముక్తినే సాధించగలవని బోధిస్తుంది. చూడండి ఇక తపశ్చర్యకు దిగాడా మహాముని. తపస్సు చేత పరిశుద్ధమయింది మనస్సు

రజస్తమస్సులు దూరమై శుద్ధ సత్త్వ సంపన్నుడయ్యాడు. తత్ఫలితంగా దక్షిణామూర్తి సాక్షాత్కరించాడు 'స్వానుభవంబున తధ్యము కానబడుం గాని నీయఖండా ద్వైత జ్ఞాన మయాకృతి తెలియుట అశక్యంగదా స్వామీ 'కాలంబుఁబట్టి మ్రింగనోపు నీచి న్మయాకృతి జూపు - బ్రహ్మవిద్యా భిక్ష నాహ్యాదయ పాత్రలో ప్రసాదింపు - నాకు ప్రసన్ను డవయినట్టే వారందరినీ అనుగ్రహించమని వేడుకొంటాడా మూర్తిని, ఆ లింగం దక్షిణామూర్తి రూపంగా అవతరించి 'సంహృతాద్యంతం బైనరహస్య' మాయనకు తెలిపితే గుణాతీతమైన దశనందుకొని భవ బంధాలు త్రెంచుకొని వెళ్ళిపోతాడా వసిష్ఠుడు.

చూడండి ఇక కైలాసంలో పరమశివుడు లేక పార్వతి ప్రమధ గణాలతో బయలుదేరి వస్తుంది కాళహస్తి క్షేత్రానికి. తన నాథుణ్ణి కలుసుకొంటుంది. నిజమే. సద్రూపిణి అయిన ఆ దేవి చిద్రూపుణ్ణి వదలి క్షణమాత్ర ముండలేదు. ఒకటి చితి మరొకటి దాని స్థితి. రెంటికీ ఎప్పుడూ అవినాభావమే. ఆ భావం చూపటానికే గిరిజా సహాయుడై విహరిస్తున్నాడాయన. 'తన్ను తెలిసినవారికి నన్ని దెసల తానెయను రీతి బహువేషధారి యగుచు' కనిపిస్తున్నాడట. నిజమే.'అజాయమానో బహుధా విజాయతే - ఏకం స ద్విప్రా బహుధా వదంతి' అన్న ప్రామినుకుల నుడి బాగా ఒంట బట్టినట్టుంది మహాకవికి. అంతేకాదు. ఆ అర్ధనారీశ్వర విహారప్రభావంతో అక్కడి అమర మనుష్య దైత్య భుజగాది జీవకోటి అంతా భ్రమరకీట న్యాయంగా శివసారూప్యం భజిస్తూ కృతార్థులయ్యారట.

ఇంతలో మన ప్రయాణం రెండవ ఘట్టానికి వచ్చింది. ప్రత్యక్ష మవుతాడక్కడ మరి ఒక మహర్షి అగస్త్యుడు. లోపాముద్రా సహాయుడై

తీర్థయాత్ర సాగిస్తూ పరమ మాహేశ్వరుడు శ్రీశైల క్షేత్రం దర్శించి సిద్ధ వటు నాథుణ్ణి సేవించి క్రమంగా దక్షిణ కైలాసం చేరాడు. మోక్ష పురాలు ఏడూ దీని కీడు గావని ఆవిడకు చెబుతూ దక్షిణామూర్తిని దర్శించి

అర్చించె శివుని సహస్ర నామంబుల
వివిధ వాక్ప్రౌఢి గావించె నుతులు
చేసె పెక్కులు ప్రదక్షిణములు - జపియించె
పంచాక్షరంబు సప్రణవముగను

ఇలా దక్షిణామూర్తిని గొలిచి - పంచాశద్వర్ణ మూర్తింబరశివ రమణికి జ్ఞాన ప్రసూనాంబకు సాగిల పడతాడు. అంతటితో ఆగక ఆ క్షేత్రమున కొక్క తీర్థము లేని కొఱత దేనికని సువర్ణముఖీ నది నక్కడికి తేవాలనే సంకల్పంతో పరమశివుని గూర్చి పత్నీ సమేతంగా ఘోరమైన తపస్సు చేస్తాడు. అగస్త్యుడంటే సామాన్యుడా.

దేవతా చక్రవర్తిత్వంబు నొందిన
నహుషు గోపించె పన్నగము గాగ
నూర్ధ్వాండ కర్పరం బొరయు వింధ్యాద్రి కూ
టంబులు నేల మట్టంబు సేసె.

అలాంటి రాజస ముట్టిపడే మహర్షి ఏమిటి - శివుని గూర్చి తపమేమిటి. రజోగుణ మున్నంతవరకూ ఫలించదది. అందుకే ఆరు ఋతువులూ కక్షగట్టి నట్టు తపోభంగం చేయజూచాయి. తట్టుకొని నిలబడ్డాడు. చివరకు బ్రహ్మదేవుడు వెళ్లి శివునితో మొఱబెట్టాడు. సత్త్వగుణుడైన విష్ణుదేవుడే నీమూలం చూడలేక పోయాడు. అలాంటి నిన్ను చూడగలగటం నా మహాభాగ్యమంటాడు. ఎందుకు నీకే పరితాపం అగస్త్యుడెందుకు తపస్సు చేస్తున్నాడో నాకు తెలుసు. నేనక్కడికి నా

గంగానడుని పంపుతాను. ఇంత మాత్రానికి నేను రావటం దేనికి. నీవు పోయి ఈ మాట అతని చెవిలో వేయమంటాడు.

అనంతరం బ్రహ్మ అగస్త్యుడికి దర్శనమిచ్చి పరమేశ్వరుడి ఆ దేశంతో వచ్చానని చెప్పి అతని కోరిక ప్రకార మాకాశంవైపు చూడగానే అభ్రగంగ 'బహు భంగ మహా ముఖరత్వ సంపద'తో దిగి వచ్చి సువర్ణముఖంగా ప్రఖ్యాతి వహిస్తుంది. ఇక చూడండి అగస్త్యుని భక్త్యావేశానికి హద్దులు లేవు.'లోపాముద్రయు తాను సువర్ణముఖరీ లోలోర్మి పంక్తులలో తేలియాడారు -- విభూతి రుద్రాక్షలు పూని అతి శాంతా కారత వహిస్తారట. అతని రజోగుణమేమయిందో. అది సత్త్వంగా మారి ఆ సత్త్వం శుద్ధ సత్త్వంగా మారిందన్న మాట. అప్పుడాయన నోట వెలువడ్డ స్తోత్రమొక దండకంగా మారి 'లోకం బులెల్లం బరబ్రహ్మ స్వరూపమైన పరమశివతత్త్వానికి దండ ప్రణామం చేయసాగింది. దానితో జ్ఞానోదయమై జ్ఞాన ప్రసూనా దర్శనం చేశాడు. ఇక్కడ మహా మునులాయన తపో దీక్షను కీర్తిస్తే అది ఆ ఫాలాక్షుని అనుగ్రహమేనని సవినయంగా మనవి చేస్తాడు. ఈ క్షేత్రమంతా శివానుగ్రహ పాత్రమే. ఇక్కడ దోమ చచ్చినా సామజ పూజ నందుకొంటుంది. సామజ మీల్గినా సామజారి అయి జన్మిస్తుంది. కామకుడు కామిని కోసం కన్ను మూసినా ముక్కంటి అయి కామని చంపి మరలా కామినితోకూడి ఉంటాడు. అంటే ఆకీట మాకైటభమంతా శివాత్మకమే. ధూర్జటి కంటి కంతా ధూర్జటిమయంగా కనిపించటమేమి ఆశ్చర్యం.

వచ్చామిక మూడవ ఘట్టానికి. అది నలువ కొలువు. మునీశ్వరు లేమిటి సురేశ్వరు లేమిటి గరుడ గంధర్వ కిన్న రాదులంతా పరివేష్టించి ఉంటారు. ఇంతలో లావణ్య రసాలవాలం నలువరాణి చెలుల కయి

దండతో వచ్చి మోసాల చేరుతుంది. పలుకుc జెలువ చెలువం చూస్తుంటే నలువకు వలరాజు చిలుకు ములికి సోకింది. వేలుపుల నందరినీ వీడుకొలిపి ఇక సాగిస్తాడావిడతో ఏకాంత శృంగార క్రీడలు. కామాంధుడయి పుణ్యాపాపాలు కూడా తలపని స్థాయికి దిగజారాడు. అజుని రజోగుణం సత్త్వం దేవుడెఱుగు – చివరకు తమోగుణంగా మారి అంధతామిస్రంలో కూరుకుపోయింది. దాని ఫలితంగా కామాంధ కారులైన రాక్షస కుమారులే జన్మించారొక ముప్పదివేల మంది. తండ్రితో అంటారు. **చెఱవట్టి తెత్తుమో శ్రీమహాలక్ష్మిని.**

పిండిగా దంతుమో వెండికొండ. అని ఇలా మాటాడుతుంటే భరించలేక తన అకృత్యానికి పశ్చాత్తప్తుడయి వింధ్యారణ్యానికి పంపితే అక్కడ వారు 'పురుషుండన్న వధించి కాంతయనినన్ భోగించి గందర గోళం చేయసాగారు. ఆ ఆగడాలు చూచి సహించ లేక సర్వం సహా బ్రహ్మతో మొరబెడితే బ్రహ్మ కోపం నుంచి ఉగ్రుడనే కుమారుడు దయించి సోదర రాక్షసులందరి నీ మట్టు పెడతాడు. దానికి మరలా దురపిల్లి బ్రహ్మవాణ్ణి కూడా మండి పడి చూస్తే వాడూ బూడిద అవుతాడు. పుత్రశోకంతో మరలా కటకటబడి ఆ కమలజుడు కాళహస్తీశ్వరుణ్ణి గూర్చి తపస్సు చేస్తాడు. ఆ ప్రదేశమంతా శివమహిమాన్వితమే. తన ఆశ్రమమంతా శాంతరసమే ఆ బ్రహ్మ దృష్టికి. 'భారతీ దేవియును పద్మభవుడు – ఆత్మ విద్యాధురంధరుడైన కొడుకు నెప్పుడు బడయ జూచాడో ఆ నిష్కామమైన సత్సంకల్పమే పరమేశుని దృష్టి నాకర్షిస్తుంది. వెంటనే ప్రత్యక్షమయి 'నీకేమి యొనర్తు చెప్పుమని అడుగుతాడు. తన గత జీవితమంతా చెప్పుకొని బాధపడతాడు. దయామయుడైన శంకరు డతనికి పుత్ర హత్యా దోషం లేకుండా అనుగ్రహించి ఋభుడనే

కుమారుణ్ణి ప్రసాదిస్తాడు. పరమార్థరూపుడు మహాయోగీశ్వరోత్తంసుడూ ఆతడు. బ్రహ్మ విద్యా పారంగతుడు. అక్కడికి బ్రహ్మకు పట్టిన రజో గుణం తమోగుణమై అది మరలా తపశ్చర్యతో పరిశుద్ధమై శుద్ధ సత్త్వంగా మారింది. అప్పుడే గుణాతీతవైన పరమేశ్వరానుగ్రహానికి పాత్రమయిందని ఈకథలోని ఆంతర్యం.

ఇదంతా విని యాదవ రాజు మరలా అడుగుతాడు శ్రీకాళహస్తి అని ఆ క్షేత్రానికి పేరెలా వచ్చిందని. దీనితో నాలుగపమజిలీకి చేరుకొంటాము మనం. ఇంతకూ శ్రీ అంటే చెలది సాలెపురుగు. కాళ మంటే పాము. హస్తి అంటే ఏనుగు. మూడూ మానవ పాత్రలు కావు. జంతుజాలం. అయినా శివభక్తి శిఖరాన్ని అందుకొన్నాయి మూడూ. అలా ఉన్నత శిఖరమందు కోవాలంటే క్రిమికీటకాదులకు సాధ్యమా. కాదు మరి. ఎలా అందుకోగలిగాయి. జన్మాంతర సుకృత ఫలమది. ఏదైనా అంటే 'తత్రతం బుద్ధి సంయోగం లభతే పౌర్వదైహిక' మని భగవత్ప్రోక్తం. అలాగే ఇవి కూడా పూర్వజన్మలో ఒకటి ఊర్ణనాభుడనే విశ్వకర్మ పుత్రుడు. అలాగే మరొకటి శంకరాభరణమైన సర్పమే. అది స్వామి ఆజ్ఞ తిరస్కరించి శాపం పాలవుతుంది. మరి ఆ గజమో, పూర్వం హస్తి అని ఒక ప్రమథాగ్రణి అది. పార్వతీ పరమేశ్వరుల క్రీడోత్సవం చూచే చాపల్యంతో పార్వతి శాపానికి గురి అయి కరి జన్మ ఎత్తింది. మొత్తం మీద ముగ్గురూ దేవజాతి వారే. ఆయా అపరాధాల మూలంగా శాపగ్రస్తులయి అలా జన్మించారు. జన్మించి కూడా శాపమోక్షం పరమేశ్వరుడు ప్రసాదించటం వల్ల మహాభక్తి భావం నెలకొంటుంది వారిలో. అప్పటి కుపాధి గాదు ప్రధానం. జడ భరతుడిలాగా గజేంద్రుడి లాగా ఏ ఉపాధిలో జన్మించినా పూర్వజన్మ కృతాభ్యాసం వృధా పోదు.

'యతతేచ తతోభూయ స్సంసిద్ధౌ' అని భగవంతుడిచ్చిన హామీ. ఆ జన్మలో మరలా అది వెంటబెట్టుకొనే వస్తాడు జీవుడు. ఆ సంస్కార బలంతో అంతకంతకు ప్రయత్నం సాగించి ముందు ముందుకుపోయి జీవిత గమ్యమైన మోక్షఫలం చవిచూడగలడు. ఇదే ఈ శ్రీకాళహస్తి జీవులు ముగ్గురిలో మనం చూడవలసింది. ఇవి మూడూ సేవించి తరించింది కూడా కాళహస్తి క్షేత్రంలోనే. అందుకే ఆ పేరు సార్థక మయిందా క్షేత్రానికి. యాదవ రాజు మొదట ఆ పేరెందుకు వచ్చిందో అడుగుతాడు. చివర ఆ మూడూ నోరులేని జీవాలు గదా అంత గొప్ప భక్తులెలా అయ్యారని అడుగుతాడు. ఈ ఆద్యంతాలు రెండూ కలుపుకొని చూస్తే మనకు తెలుసుకోవలసిన సమాధానమీ ఒకటే.

ఇంతకూ జడమైన ఉపాధి గాదు. అది చేతనకు కేవలమొక బాహ్యమైన కవచమే. దాని ద్వారా అభివ్యక్తమవుతున్నదా చైతన్యమే. అది ఉపాధితో మమేకమైతే సోపాధికం. లేక దాన్ని అంటిముట్టక కేవల మొక కప్పుడు బొంతగా భావించి తాను దానికి సాక్షి అయి చూడగలిగితే అది చైతన్యమైనా సోపాధికం కాదు. నిరుపాధికమైన పూర్ణచైతన్యం. సాక్షాత్తూ శివస్వరూపమే అది. అయితే ఒక్క జన్మలో అలవడేదిగాదా భాగ్యం. బహుజన్మల అభ్యాస వాసనా ఫలం. అది చాలావరకు సాధించి అందులో పై స్థాయి కెదిగిన వారే దేవతలు. వారు కూడా పైకెదిగినవారే గాని పరి పూర్ణులు కాలేరు. కాబట్టి అప్పుడప్పుడు కొన్ని తప్పిదాలు చేస్తూ శాపగ్రస్తులయి క్రిందికి దిగుతుంటారు. జారినా పూర్తిగా కింద జారిపోరు. అంతవరకూ సాధించిన భూమిక ఎక్కడికీ పోదు. అసలే అంతరించిపోదు. ఆ శాపమనేది వారికి మోక్షమార్గంలో భ్రమ ప్రమాదాల పాలు గాకుండా సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు వారికి పెట్టే పరీక్ష వారికిచ్చే శిక్షేగాని శాపం కాదు. శాపవ్యాజంతో చూపే అనుగ్రహం.

అదే ఇప్పుడీ శ్రీకీకాళానికీ హస్తికీ సంప్రాప్తమైన జన్మలు. జన్మ నిక్కృష్టమైనా తద్గతమైన ఆ జీవుల ప్రాక్తన జన్మ సంస్కార మెక్కడికీ పోయింది కాదు. ఆ సంస్కార ఫలం గానే **'గౌరీశుండు చెలంది పాము గజముం గైవల్య సామ్రాజ్య లక్ష్మీరూపంబగు తన్ను గూర్చు కొన్నాడట,** మరి ఎంత పుణ్యపరిపాక పాటవం లేకుంటే ఆ కీటకం 'ప్రాకారములు గోపురమ్ములు కొలువు కూటమ్ములు నర్తన మందిరములు – ఇన్ని నిలయములా దేవదేవునకు నిర్మించి ఇవ్వగలదా – ఆ తంతు సద్మములు చెప్పం జిత్రములంటాడు కవి. అయినా దాని భక్తికి పరీక్ష పెట్టాలని ఫాలాక్షుడు వాటన్నిటినీ భస్మీపటలం చేస్తాడు. దానికి చాలా బాధపడి అది ఆ మంటలన్నింటినీ ప్రింగి చస్తే చస్తాం బ్రతికితే బ్రతుకుదామని భావిస్తుంది. అంతలో దాన్ని చేతికి తీసుకొని పరమేశ్వరుడు నీ భక్తి పారవశ్యం పరీక్షించాను. ఏమి కావాలి నీకని అడుగుతాడు. స్వామీ నా కేశ్రుతులూ శాస్త్రాలూ తెలియవు. తెలిసినవారే నిన్ను గనలేక పోయారు. అలాటి నీవు నాకు కనిపించటమే మహాభాగ్యం. ఈ సంసారమిక నాకక్కర లేదు. జ్ఞానరస విలీనుడనయి నీకైవల్యమే పొందాలని నా కోరిక. అనుగ్రహింపమని ప్రార్థిస్తుంది అలాగేనని అక్కడి మునులూ యోగులూ అందరూ ఆశ్చర్యపడేలా దాన్ని తన ఆత్మ చైతన్య జ్యోతిలో చేర్చుకొంటాడా ముక్కంటి. ఇది ఆ కీటక వృత్తాంతం.

ఇక కాళహస్తి ద్వయ వృత్తాంతమేమిటో వర్ణిస్తున్నాడు ఒక సర్పం త్రేతాయుగాంతంలో ఒక గజం ద్వాపరయుగాదిలో కొల్వ వచ్చాయా గుణాతీతుడైన పరమాత్మను, దేనిపాటికది భక్తిరస మొలకబోస్తూ దానితో అభిషేకం చేస్తున్నాయా దేవుని మీద. ఒకటి ఫణ రత్నాలతో పూజ చేస్తే మరొకటి ఆకు లలములతో చేయసాగింది. పత్రం పుష్పం ఫలం

తోయమన్నట్టు దేని పూజ దానికి గొప్ప. ఒకదానిమీద ఒకదానికి కక్ష. ఇద్దరిదీ దీక్ష ఒకటే అయినా ఈ కక్ష ఏమిటి. అదానేనా అనే అహమహమిక. ఈ అహంకార మున్నంతవరకూ అది భక్తేగాని అనన్య భక్తి గాదు. అనన్య భక్తిలో అన్యమనే చింతకు తావు లేదు. గజానికన్యంగా కనిపిస్తుంది సర్పం. సర్పాని కన్యంగా కనిపిస్తున్నదా గజం. రెండూ స్వామిని తమ కనన్యంగా చూస్తున్నాయే గాని ఒకరినొకరన్యమని భావిస్తున్నాయి. అది కూడా పనికిరాదు. సృష్టికర్తను చూచినట్టే ఆయన సృష్టిని కూడా తన కనన్యమని దర్శించగలగాలి – అదే పరిపూర్ణమైన అద్వైత దర్శనం – దానికి నోచుకోనంత వరకూ అది అహంకరమే గాని పూర్ణాహంకారం కాదు – అంటే ఏకాత్మ భావం కాదని అర్థం.

ప్రస్తుతమీ గజ సర్పాలు రెండింటికీ అలాంటి అనన్య భావన లేక అహంకారంతో అన్యోన్య వైరం పెంచుకొన్నాయి. ఆఖరుకొక దానినొకటి చంపిపారేయాలనేంత వరకూ పోయింది వాటి శత్రుత్వం. పరమాత్మ సేవలో కూడా శత్రుత్వమైతే ఎలా. అదే అహంకారమంటే. రాజసమీ అహంకారం. ఇది సాత్త్వికంగా మారాలి. మారితేగాని జ్ఞానోదయం కాదు. లేకుంటే ఇలాగే ఉంటుంది వ్యవహారం. పైగా 'కంటక మెట్ల నాక సుముఖత్వము నొందితివయ్య పార్వతీ కంటకి తాంగ' తమ్మికాడలు తరు శాఖలు పయిబెట్టివా ఊరకొన్నావేమయ్యా అని సర్పం ఫిర్యాదు చేస్తే – విశ్వపతీ విరసోపలంబు లెట్లచ్చుదలయ్యే నీకు – కాకపోయినా నా పిచ్చిగాని 'ఉనికి శిలోచ్చయంబు నిజయోష శిలోచ్చయ రాజపుత్రి గదా – నీకా పాము సమర్పించిన రాళ్లూ రప్పలన్నీ ఇష్టంగావే ఏమవుతుందని గజ మాయనను లపాంభిస్తుంది. తామ హంకారులు కావటమే గాక తమ అహంకార మా స్వామికి కూడా

ఆరోపించే వరకూ పోతాయవి. రాత్రింబవళ్లిలా జరిగిపోతుంటాయి. ఒకనాటి ఉదయ మా గజరాజేమయినా గానీ అది ఎవరో ఈనాడు కనిపెట్టి చూచి దాన్ని నేను మట్టుపెట్టటమో నన్నది అంతమొందించటమో జరిగిపోవాలని నిశ్చయించుకొని దైవసన్నిధికి వచ్చి తన పూజ అలాగే నిలిచి ఉందని సంతోషించి – అక్కడ పొదలో పొంచి ఉన్న ఆ సర్పమూ అదే నిశ్చయంతో వచ్చి దాని తొండంలో దూరుతుంది. తన శత్రువిదేనని తెలిసి ఆ ఏనుగిక ఏమయినా సరే అది నన్ను చంపినా నేనుచచ్చినా స్వామి సన్నిధిలోనే కాలధర్మం చెందటం మంచిది. స్వామి సాయుజ్యమైనా లభిస్తుందని మనసు నిశ్చలం చేసుకొని 'తొండ మిరియంగా చుట్టి యక్కొండ భగ్గునఁదాకిందట. తాకిందో లేదో పాము చిదిసె నేనుంగును బడియె – వెంటనే ఆ ఉపాధులు విడిచి రుద్రగణాకారములు దాల్చాయట. స్వామి ప్రత్యక్షమై మీ అభీష్టమేమిటని అడిగితే వారిక ఆయనను కీర్తించిన స్తోత్రమున్నది. సంసార లతా లలిత్రమది. ధూర్జటి కవి కవితాస్తుతి పాత్రం కూడా. కొందరు నిన్ను సోహమ్మని అద్వైత భావంతో భజిస్తే మరికొందరు దాసోహమ్మని ద్వైత జ్ఞానంతో కీర్తిస్తారు. జనన మరణములు ధరలో నిన్నును సమ్మతితో సేవింపక పాయవు- అని రెండు మాటలున్నాయందులో. రత్నాల మూటలు. జననం మరణమే మానవులకున్న సమస్య, అవి ఈశ్వరుడికి దాస్యం చేస్తున్నాయంటే ఈశ్వర స్పృహ ఉన్న జీవులకూ అవి దాసులే. అది దాసోహమ్మనే వారికి క్రమముక్తి దాయకమైతే సోహమ్మనే వారికి సద్యోముక్తిదాయకం. అలాటి అనన్య దృష్టి మాకు ప్రసాదింపమని వారు కోరితే సద్యశ్శివ సాయుజ్యం ప్రాపించిందట వారికి.

అయిందిక్కడికి. క్రమంగా అయిదవ మైలురాయి నందు కొన్నాము మన ప్రయాణ మార్గంలో. కనిపిస్తుందక్కడ మనకొక చెంచు పల్లె. పేరు ఉడమూరు. చెంచులూ బోయలూ తప్ప ఎవరూ కనపడరక్కడ. ఇక ఆ బోయలూ బోయతల జీవయాత్ర వర్ణిస్తాడు కవి. ఎంత సహజ సుందరమో చెప్పలేము. దానికధి నాయకుడొకడున్నాడు. ఎఱుకు తేడైన ఈశ్వరుడికి దీటైనవాడు. వాడు నాధ నాధుడైతే వాడి భార్యతందె. వాడికీశ్వర స్మృతి లేకపోయినా అలాటి స్మృతి వాడి సంతతికైనా కల్గించాలని ఒక కుమారుణ్ణి అనుగ్రహించాడా కైలాసనాధుడు గర్భమున నున్న తనయు డీశుడై ప్రకాశిస్తాడా అన్నట్టు ఈశ్వర చిహ్నాలన్నీ కన పడతా యావిడ గర్భధారణలో. ఒక శుభ ముహూర్తంలో ఆ ఇభ రాజగామిని శివభక్తి మునుపైన శిశువును ప్రసవిస్తుంది. ఇక బిడ్డ చేష్టలన్నీ శివభక్తి చిహ్నాలే.

శివభక్తి రహితమై చెడియె జగంబని
నవ్విన ట్లొయ్యన నవ్వసాగె
ధృతి మోహ బంధంబు దెగఁదన్ను గతి ముద్దు
టడుగులెత్తి విదుల్చు కాడఁబొచ్చె
భవపరాఙ్ముఖుడైన పగిది సత్త్వము గూడి
పొత్తుల పాన్పుపై పొరల బడియె
శ్రేయో మహారాజ్య సింహాసనంబున
నుండు చందమున గూర్చుండ దొడగె

ఎంత గొప్ప భావనో చూడండి. ఇది ఆ బాలుడి దాలేక ధూర్జటి కవి శివస్వరూప భావనా. కవీశ్వరుడిదని కొత్తగా చెప్పనక్కర లేదు మనం. అది ఆయనకు సహజమే. మరి ఆ బాలుడికో అదీ సహజమే

కావచ్చు. జన్మాంతర సంస్కారమనేది ఎక్కడికీ పోదు. అది వర్తమాన జన్మలో బాల్యం నుంచీ మనం వెంట దెచ్చుకొనే చలిది మూట. ప్రహ్లాదుల విషయమలాటిదే గదా. అదే బాల్యం గడచి యౌవనం వచ్చేసరికి చిలువలు పలువలుగా తయారవుతుంది.

అలాగే అయిందీ కుర్రవాడికి. దానికి నిమిత్తమేదో ఒకటి తోడు కావాలి. అంతవరకూ జీవితం తన పరివారంతో పాటు కాట్రేని పూజవరకే పరిమితమయింది. అది ఈశ్వర భావనగా మారాలంటే ఈశ్వరుడే కావాలి దానికి నిమిత్తం. వేటలాడి అలసి నిద్రిస్తుంటాడా తిన్నడనే కిరాత బాలుడు. నిద్రలో కల వచ్చింది. 'ఒడలం దెల్లని పూత పులితో లొడ్డాణ' మిలాటి మూర్తితో ప్రత్యక్షమయ్యాడు పరమశివుడు. ప్రత్యక్షమై బాలకా యిచట శిలావట మూలంబున కొండ దండ మొగలేటి దరిన్ శైలసుతాపతి భక్తుల పాలిటి పెన్నిధి వసించు భక్తిఁ గొలువు మీ' అని చెప్పి అంతర్ధాన మవుతాడు. ఇది ఆ కుర్రవాడి పూర్వ సంస్కారానికి నిమిత్త కారణం. ఆ ప్రబోధం విని అదిరిపడి లేచాడా మాటలతో. ఆ ప్రబోధ మక్కడి కాగలేదు. ఒక అడవి పంది నతడు వెంటబడే లాగా చేసి నెమ్మదిగా కలలో అతడు కాంచిన దివ్యలింగ సన్నిధిం జేర్చి మాయ మయింది. కలలో చూచిన దిలలో చూడగానే జ్ఞానోదయమయింది వాడికి. దగ్గరకుపోయి చేతులు జోడించి తనదైన బాణీలో దాన్ని పలకరిస్తాడు.

ఓసా మీ యిటువంటి కొండదరిలో ఒంటింబులు ల్సింగము
ల్గాసింబెట్టెడు కుట్ర నట్టడవిలో కల్జువ్వి క్రీనీడ నే
యాసం గట్టితి వేటి గడ్డనిలు – నీవా కొన్నచో కూడు నీ
ళ్లే సుట్టంబులు దెచ్చి పెట్టెదరు నీకిం దేటికే లింగమా.

నాకొండొ క టాన తీక యుడు మూరికి రాగదవయ్య నివ్వరి ప్రాలేమిటి వెదురు బ్రాలేమిటి – అన్నీ ఉన్నాయక్కడ. రకరకాల పండ్లున్నాయి తినటానికి రమ్మంటాడు. నీవు రాకుంటే నేను ఇక్కడి నుంచి కదిలిపోవనంటాడు. ఇక తోడి బోయలంతా వచ్చారా బాలుణ్ణి వెతుక్కొంటూ. చూచారక్కడ నిశ్చలంగా కూచున్న కుర్రవాణ్ణి. నావెంట నీ లింగధారి వస్తేనే నేను వస్తా రాకుంటే రానని పట్టు పడతాడు. నాకుంజుట్టము తల్లిదండ్రులు – చెలులు – అందరూ ఈ దేవుడే మీరు వెళ్లండంటే వెళ్లిపోతారు వారు.

అయ్యో ఎన్నాళ్ల నుండియో పస్తున్నాడే ఈ స్వామి అని సువర్ణముఖీ జలంతో స్నానం చేయించి కఱకుట్లు తెచ్చి పలహారం పెడతాడు. ఆరగించకుంటే ఆవేదనతో పాదాల మీద వాలిపోతాడు. వాడి ఏడుపు విని అన్నీ తింటాలే తెమ్మంటాడు శివుడు. ఆనందంతో వాడందిస్తుంటే ఆరగిస్తాడు కూడా. ఇలా ప్రతిదినమూ దేవుణ్ణి సేవిస్తూ ఉంటాడు తిన్నడు. రోజూ పూజ చేసే శివబ్రహ్మణుడు వచ్చి చూచి అతడికేమీ దిక్కు తోచలేదు. ఏమిటీ కసుమాల మంతా 'నీ సఖుడో సుతుండొ తరుణీ మణియో నిజ సేవకుండొ' ఎవడు చేశాడీ రోత పని అని దేవుణ్ణే ప్రశ్నిస్తాడు. చెప్పకుంటే ప్రాణాచారం పడతానని కాళ్లమీద పడతాడు. శివుడతణ్ణి పైకి లేపి ఒక మహాభక్తుడైన కిరాతుడు నన్ను సేవిస్తుంటే వాడి సేవలందుకొంటున్నాను. అతని భక్తి ఎలాంటిదో చాటున ఉండి చూడమంటాడు.

మళ్లీ వస్తాడింతలో ఆ తిన్నడు. మాంస ఖండాలందిస్తాడు. అందిస్తే తినడీశ్వరుడు. ఏమా అని వాడా లోచిస్తుంటే ఒక కంట నీరు కారుస్తాడు. మందులూ మాకులూ తెచ్చి పూస్తాడు వాడు. అప్పటికీ ఆగక చివరకు

నెత్తురే కారుతుంది కంటి నుంచి. ఎన్ని చికిత్సలు చేసినా ఆగకుంటే చివరకు తన కంటి గ్రుడ్డే బాణంతో పెఱికి ఆయనకు తగిలిస్తాడు. అది మానినా మరొక కంట కారటం చూచాడు. దానికీ తన మరొక గ్రుడ్డు అడ్డు వేశాడు. పైగా అంతటితో బోక లాలాటలో చలనంబున కీలాలము దొరిగెనేని నా ప్రాణాలే ఇస్తాను సుమా అని బెదిరిస్తాడు. వీడంతవరకూ రాకుండా తన రెండవ కనుగ్రుడ్డు పెరకక ముందే శివుడు ప్రత్యక్షమై వాడి చేయి పట్టుకొంటాడు. వెంటనే శివ బ్రాహ్మణుణ్ణి పిలిచి చూచావా వీడి భక్త్యావేశ మర్ధమయిందా అని - మీ ఇరువురి అభీష్టమేమని అడిగితే వారిలా వేడుకొంటారా దేవుణ్ణి 'మీ పూర్ణంబగు దివ్య తేజము చూచినప్పుడే **చూపుంజిత్తము మిన్న కున్నయవి - దేహంబుపై దీపుం జీకటి పాసె' నింతకంటే వరమేదీ - భవన్మయమైన పూర్ణ చిద్గగనములో మముంగలిపి క్రమ్మఱ పుట్టిడు బాధ మాన్పనే'** అని ప్రార్థిస్తారు. అలాగేనని వారికాత్మ సాయుజ్యం ప్రసాదిస్తాడు దేవుడు.

ఏమిటీ కథ. కన్నివ్వక ముందు తిన్నడైతే కన్నిచ్చి కన్నడయ్యాడొక భక్తుడు. అతడి భక్తి తన భక్తికన్నా గొప్పదని వినమ్రతతో విన్నవించాడొక భక్తుడు. ఇద్దరికీ ఆరాధ్య దైవమొక్కటే. విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే శ్వపాకేచ సమదర్శి ఎవడో వాడే మహాజ్ఞాని అనే సూత్రానికిది భాష్యం లాంటిది వీరి వృత్తాంతం. అహం మమలు రెండూ వెంటా తున్నంత వరకూ మానవుడికి మోక్షం లేదు. అహం గజమైతే మమ సర్పంలాంటిది. ప్రాకుతూ పోతుంది పుత్ర కళత్ర బంధుమిత్రాదుల మీదికి. రెండూ ఏకకాలంలో ప్రవిలయం చేయగలిగితే రజస్తమో గుణాల కతీతమైన శుద్ధసత్త్వం. అదే దివ్యజ్ఞానానికి దారి తీస్తుంది. ఇది ఇంతకు ముందు కాళహస్తి కథలోని ఆంతర్యమైతే ఈ కన్నప్ప హరద్విజుల కథలో

మానవుడు తన సర్వస్వమూ ఈశ్వరుడికి ధారాదత్తం చేయగలిగితే అదే మోక్షానికి త్రోవ అనే రహస్యం బయటపెట్టటమే తాత్పర్యమని మహాకవి మనకు అందజేసే సందేశం.

ఇది దాటి మన మాఱవ మజిలీ చేరేసరికొక అపురూపమైన సన్నివేశ మెదురవుతుంది. అది ఆలవాయి చొక్క నాథుని రాజధాని మధురా నగరం. సాక్షాత్తూ శివశక్తులు మీనాక్షీ సుందరేశులుగా మూర్తీభవించి పరిపాలిస్తున్న పట్టణం. దాన్ని పాలిస్తున్న పాండ్యరాజు దగ్గరికొక నాడగస్త్య మహర్షి వచ్చి పూజలందుకొని ద్రావిడ కవితా లక్షణాలన్నీ వర్ణించి చెప్పే శంఖ ఫలకమొకటి ప్రసాదించి ఇది భారతీదేవి కెనయైన కవులెందరైనా కడకొక్కరైనా వారికి తగిన అవకాశ మివ్వగల ఫలకం పదిలం చేయమని చెప్పి అంతర్ధానమవుతాడు. అలా తరతరాలు కాపాడుకొంటూ వస్తారా ఫలకాన్ని ఆవంశీయులంతా. ఒకానొక కాలాన ఒక గొప్ప కఱవు దాపురిస్తుండగా రాజ్యంలో బ్రతుక లేక ఒక హరద్వాజుడా పట్టణం విడిచి వెళ్లుతుంటే హరుడొక శృంగార రస తరంగితమైన పద్య మరవ భాషలో వ్రాసి అతని చేతికిచ్చి రాజుగారికిది ఇస్తే నీకు వేయి మాడలు బహుమానమిస్తాడు. దానితో నీవు బ్రతుకుతూ ఉండవచ్చు. ఆపాటికి కఱవు కూడా తీరిపోతుందని ఆదేశిస్తాడు. అతడలాగే చేస్తాడు. అది ఆ రోజు చదువుతుంటే ఆ పద్యంలో 'సింధుర రాజగమనాధమ్మిల్ల బంధంబు సహజ గంధంబ'ని అర్థమిచ్చే మాట ఒకటి దొర్లింది. అది విని నత్కీరుడనే కవీశ్వరుడు పకపక నవ్వి **'లోకము నగదే సహజ గంధము వేనలి కింగలదటన్న'** అని ఆక్షేపిస్తాడు మరలా ఆ పద్యం తీసుకుపోయి హరిద్వాజుడు 'నిన్ను నమ్మిపోయి నిండిన సభ సిగ్గు చెడితి నీ సర్వజ్ఞత్వము నిర్వాహక శక్తి ఏమయినదని దేబిరిస్తాడు

దేవుడి దగ్గర. ఆహాఁ – నత్కీరుడా నా కవి తను తప్పుపట్టేవాడు చూతును గాక' అని పరమేశ్వరుడే సాక్షాత్తూ సభలోకి వచ్చి.

ఈ రాజన్యునిమీద నేఁగవిత సాహిత్య స్ఫురన్మాధురీ
చారుప్రౌఢినుఁ జెడ్పి పంప– విని మాత్సర్యంబు వాటించిన
తీరుం దూరక తప్పుపట్టె నట – యేదీ లక్షణంబోయలం
కారం బోపద బంధమో రసమొ – చక్కంజెప్పుడీ తప్పనన్' అని

మందలిస్తా డక్కడివారిని. అప్పటికీ నత్కీరుడిది తప్పేనంటాడు. దాని కీశ్వరుడిది ఎవరను కొన్నావు. **'గిరి తనయా కచభారంబు సహజగంధ'** మని పద్యభావమని హెచ్చరిస్తాడు. **'అగజకు నైనందగు నిలమగువలకుం** దగ దంటాడు నత్కీరుడు. అంతటితో ఆగక తూలనాడు తాడతణ్ణి. అప్పుడు తన నిజరూపం చూపాలని శివుడు నిటల నేత్రం తెరుస్తాడు. తలచుట్టు వాలు కన్నులు గలిగినా పద్యం తప్పే నీ మాయలు నా దగ్గర పనికిరావు. పొమ్మంటాడు నత్కీరుడు. ఆ వితండా వాదానికి కోపం వచ్చి శాపమిస్తాడు కుష్ఠువ్యాధి పీడితుడవవుతానని ఈశ్వరు డతనిణ్ణి. దానికి హడలి పోయి ఆ కవీశ్వరుడు దేవుని కాళ్లమీద పడతాడు శాపమోక్షమును గ్రహింపుమని. దక్షిణ కైలాసం కాళహస్తి క్షేత్రం దర్శించు కుష్ట వ్యధ తీరుతుందని శివుడనుగ్రహిస్తాడు.

ఇక వాడి పశ్చాత్తాపం చూడండి. చర్చింపనలవి గాదు. **ఈ కవితాభి మానము వహించితి నేటికి శంఖ పీఠిపై నీకపులున్న యట్ట వపియింపక దేవుని తోడ నేల చార్వాక మొనర్చానని** బాధపడతాడు. మరి దక్షిణ కైలాస మిక్కడా అక్కడా ఉన్నదా. ఎంత దూరం చేయాలి ప్రయాణం. చేశాడు పాపం. దారిలో చెవ్వం దీశ్వరుణ్ణి దర్శించాడు. జంబుకేశ్వరుణ్ణి సేవించాడు పాపం. కావేరీ నది దాటి ఉత్తరంవైపుగా బయలుదేరి మధ్యలో.

ఉణ్ణామలె జగుదంబిక
నణ్ణామలె విశ్వనాథు నారాధించెన్
మణ్ణాసయు పొణ్ణాసయు
పెణ్ణాసయు లేని వారి పెన్నిధులగుటన్'

అరుణాచలేశ్వరుణ్ణీ అపీతకుచాంబ అమ్మవారినీ భజించాడు. ఆ తరువాత వరుసగా తిరువత్తూరు కంచి ఏకామ్రనాథునీ సేవించి పెన్న గుండ్ల కమ్మ కృష్ణవేణి గోదావరీ నదులు దాటి పీఠికాపురం సింహాచలం శ్రీకూర్మం గోకర్ణం కృత్తివాసం చివరకు గయకు పోయి అక్కడి నుంచి కాశీపట్టణం చేరి విశ్వనాథుని దర్శించి – అయినా కైలాసం గదా నేను చూడవలసిందని తలపోసి అడవులూ కొండలూ తిరిగి ఒక అరణ్య మధ్యంలో దిక్కుతోచక చిక్కుపడతాడు. ఇంతలో ఎదుట ఒక సరోవరం కనిపిస్తుంది. దాని దగ్గరకు వెళ్లేసరికొక పెద్దమఱ్ఱి వృక్షం కనిపిస్తే దానిక్రింద చతికల పడతాడు. ఇంతలో ఒక భూతం వచ్చి గట్టిగా పట్టుకొని అతణ్ణి ఒక గుహలోకి. తీసుకుపోతుంది. అక్కడి వారందరితో తానూ అతని కాహుతి గాక తప్పదని భయపడి సుబ్రహ్మణ్యస్వామిని ప్రార్థిస్తాడు. ఆ స్వామి ప్రత్యక్షమై ఆ భూతాన్ని అంత మొందించి నత్కీరుడితో సహా అందరినీ బయట పడేస్తాడు. నత్కీరు డాయనకు నమస్కరించి స్వామీ నేనొక అపరాధం చేస్తే పరమేశ్వరుడు నన్ను ఇలా శిక్షించాడు. కైలాసం చూస్తే నీ వ్యాధి పోతుందని అనుగ్రహించాడు. అది నేనెప్పుడు చేరాలెప్పుడు చూడాలో అగమ్యగోచరంగా ఉందని మొరబెడతాడు. అప్పుడు స్వామి ఒక కొలనుగా మారి ఇందులో దిగి స్నానం చేయమని ఆనతిస్తాడు. అలా చేశాడో లేదో వెంటనే దర్శన మిస్తుంది. అది కైలాసమా. ఉత్తర కైలాసం గాదు. దక్షిణ కైలాసం

కాళహస్తి క్షేత్రం. అది దర్శించాడో లేదో కుష్ఠవ్యాధి స్పర్శ కూడా లేకుండా మాయ మవుతుంది. ఇక చూడండి సువర్ణముఖిలో స్నానం చేసి వచ్చి కాళహస్తీశ్వరుడికి సాష్టాంగపడి ఒక నూఱు పద్యాలా శుపుగా చెప్పి ఆయనను కీర్తిస్తాడు. శివుడు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకోమంటాడు. 'ఈ సంసారము దుఃఖావాసము' దీన్ని వర్జిస్తే ఏ సుఖం శాశ్వతంగా కలుగుతుందో ఆ సుఖాన్ని నాకు ప్రసాదించు స్వామీ అని ప్రాధేయ పడతాడు. స్వామి అలాగేనని అతనికి తన సాయుజ్యాన్ని ప్రసాదిస్తాడు. ఇదీ నత్కీరుని కథ.

విన్నారుగదా. ఏమిటీ కథలోని ఆంతర్యం. ధూర్జటి మహాకవి దీని ద్వారా మనకంద జేసే సందేశమేమిటి. ఇంతవరకూ జరిగిన కథల తాత్పర్యమేదో అదే అందిస్తున్నాడిప్పుడూ. అదేదోగాదు – శివభక్తి పారమ్యమే. కథలేమిటి, సన్నివేశాలేమిటి వర్ణనలేమిటి ఆఖరుకు పద్యాలేమిటి పదాలేమిటి. అవి నదీనాం సాగరోగతిః అన్నట్టు అన్నీ నడిచేది శివాభిముఖంగానే. అది చెదపురుగా పామాబోయా మరొకడా ఏదీ కాదు. అన్నీ భక్తిరస స్ఫూర్తి కాలం బనాలే. ఏ చదువూ సంధ్యా లేని తిన్నని కెంతటి భక్తి భావముందో ఎంత త్యాగ నిరతి ఉందో ఎంత దృఢమైన దీక్ష ఉందో చూచామింతకు ముందు. పోతే అలా కాక అన్ని విద్యలూ నేర్చి అంత కవితా పాటవమబ్బి కూడా బోల్తాపడిన ఒక మహాపండితుడు నత్కీరుడి ఉదంతమూ గమనించాము. రెండింటికీ ఎంత హస్తి మశకాంతరమో చూపదలచాడు కవి. చూపాడు వారి ప్రవర్తనలో. అంత చదువూ తెలివితేటలూ పనికిరాకుండా పోయాయి చివరకా నత్కీరుడికి చదువుంది గాని సంస్కారం లేదు. భయమంతకన్నా లేదు. విద్యకు వినయ మలంకారం. రెండూ ఉన్నా సరిపోదు

మోక్షమార్గంలో, మరొక పాథేయముండాలి సాధకుడికి. ఇది ఉన్నా లేకపోయినా అది ముఖ్యం. అదే తాను నమ్మిన లక్ష్యానికి తన సర్వస్వమూ అర్పించే వైరాగ్య భావం. అందుకే

'నాయమాత్మా ప్రవచ నేన లభ్యో
నమేధయా నబహునా శ్రుతేన - అందుకే మిగతావన్నీ కొట్టి
వేసి - యమేవైష వృణుతే తేనలభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వా'

మని చాటి చెప్పిం దుపనిషత్తు. అలా తమ స్వామిని వరించి పట్టుకొన్న వాడు సర్పమే కావచ్చు గజమే కావచ్చు. కిరాతుడే కావచ్చు. అందరికీ స్వామి స్వరూపం తన్ను తానే వివరించి చూపుతుంది వరించలేని వాడెంత విద్వాంసుడైనా మహాకవీశ్వరుడైనా భగవత్స్వ రూపానికి దూరమే. వాడి పాండిత్యమే వాడి దారి కడ్డు తగులుతుంది. శాస్త్ర వాసన అంటే ఇదే. ఈ తిరస్కరిణే. అది ఎప్పటికైనా తొలగిపోతే గాని దారి కనపడదు. తొలగించు కోగలవో లేవోవని పరీక్షించి చూస్తాడు నిన్నా పరమాత్మ. నీవు ప్రయత్నమైనా చేయక పరాఖ్ముడవైతే ఆయనే దానికి పరిష్కారం చేస్తాడు. అదే జరిగిందీ నత్కీరుడి విషయంలో. శాపవ్యాజంతో జ్ఞానోదయం కలిగించాడు. దెబ్బ తగిలితే గాని మనసుకు పట్టిన మబ్బు వదల లేదతనికి. అది ఉత్తమాధికారి లక్షణమైతే ఇది మధ్యమాధికారి లక్షణం. ఇలా అధికార భేదమున్న మానవులను కూడా ఏదో ఒక విధంగా ఉద్ధరించి వారికి మోక్షమార్గం చూపటమే భగవత్సంకల్పం.

ఏతావతా అన్ని మజిలీలు గడచి ఇప్పటికి కావ్య కథాంతం సమీపించాము. ఆదిలో చెప్పుకొన్న వారకన్యా వృత్తాంతమే అంతంలోనూ

చెప్పుకొన్నాము. అన్ని కథా వృత్తాంతాలూ యాదవరాజుతో పాటు మనమూ ఆలకించాము. కాదు. ధూర్జటి కవి వారు చెప్పారని విన్నారని చెబుతుంటే శ్రవణం చేస్తూ వచ్చాము కావ్యమా మూలాగ్రమూ చిత్ర మేమంటే ధూర్జటి మహిమ ఆయా సన్నివేశాల పాత్రల నెపంతో ధూర్జటే చెబుతున్నాడా అని తోస్తుంది. ఏ వర్ణన చూచినా ప్రత్యక్షరమూ శివ మహత్త్వమందులో ప్రత్యణువూ ప్రతిధ్వనించేదే. అక్కడక్కడ చేసిన ప్రకృతి వర్ణనలు కూడా శృంగార భక్తి రసభరితాలే. మరి తరుచు మన గుండెను కదిలించే దండకాలో అనన్యాదృశం. భక్తి జ్ఞాన వైరాగ్య గిండి మధ్వనులా దండక ధ్వనులు. అగస్త్య కృత మొకటి – సర్పగజ కృతమొకటి. దేనికదే సాటి. ఇక ప్రబంధ పాత్రలు చూతామా. తిన్నడు వాడితలిదండ్రులు వీరి భాష వేరు – వేశ్యల భాష వేరు – సత్కీరాదుల ద్రవిడ భాష వేరు. అది తెలుగా కన్నడమా తమిళమా – అన్నదే పాత్రకు తగిన బాణీలో దాని వర్ణన. పిల్లల ఆటలు – పెద్దల ఆహారాలు – అన్యోన్య సంభాషణలు – ఎక్కడికక్కడ భాష మారుతుంది. శైలి మారుతుంది. వైవిధ్య మారుతుంది. ఎంతో సహజంగా సుందరంగా శ్రవణ మనోహరంగా అన్నిటినీ మించి ప్రత్యంగుళం మేరా ఈశావాస్య మిదగ్ం సర్వమన్నట్టు ఈశ్వర స్వరూప విభూతి వాసనా వాసితమే. అంతా విష్ణుమయ మన్నట్లు అంతా శివమయమే. సర్వం శివమయంజగత్తనిపించాడు మొత్తం మీద ధూర్జటి కవి. కవితా శివతాండవం చేసి చూపాడు. దానికి కావ్యమే రంగస్థలం. తత్తద్వర్ణనమే తాండవం.

దానికా యా పాత్ర ప్రేక్షకులు. ఎటు వచ్చీ వారిలో పాఠకులమైన మనమూ ఒక ప్రేక్షకులమై చర్మచక్షువులతో గాక మనశ్చక్షువులమయి చూడగలిగితే మహోద్భుతం మహోన్నదరసప్లుతం – జగన్నాధ పండిత రాయలు చెప్పినట్టు

ప్రమోద భరతుందిల ప్రమధ దత్తతాళావళీ

వినోదిని వినాయకే డమరుడిండిమ ధ్వానిని

లలాటతట విస్ఫుటన్న వక్ఫపీట యోనిచ్ఛటా

హతోద్ధత జటోద్ధటో గతపటో నటోన్నృత్యతి – రండి త్వరగా రండి ఆ మహానటుని నాట్యభంగిమ తిలకించి తరించండని ఒకరికొకరం చెప్పుకొంటూ వెళ్ళి చూడాలి మన మాదృశ్యం –

పోతే ఈ కవీశ్వరుడు తన కావ్య జీవితంలో తన ఆరాధ్య దైవమైన కాళహస్తీశ్వరుడి విశ్వవ్యాప్తమైన విభూతి ఎలాంటిదో ఆయా పాత్రల ద్వారా పరోక్షంగా కావ్యమంతా విస్తరించి మన కన్నులకు కట్టినట్టు వర్ణించి చూపాడు. అలా పరోక్షంగా ప్రదర్శిస్తే తృప్తి లేదా మహాకవి. ఇంకా ఈ తెరమఱుగు దేనికనిపించిందో ఏమో. కావ్యం మాట అలా ఉంచి కవి తన నిజ జీవితంలోనే ఆ దక్షిణ కైలాసనాథుడైన దక్షిణా మూర్తిని స్వయంగా ఏకాంతంగా తానొక్కడే కలుసుకొని ఆ దేవునితో ప్రత్యక్షంగా మాటాడి తన మనోవేదన మాతా ఆ దేవుడికి నివేదించే వరకూ నిద్రపట్టలేదు కాబోలు. వెంటనే భావావేశం పట్టలేక తన గోడు ఆయనకు వెళ్లబోసుకొంటూ పోతే అది శతవిధాల శత శాఖలయి ఒక అద్భుతమైన శతకంగానే అవతరించింది. అదే ధూర్జటి కవి కాళహస్తీశ్వర శతకం.

శతకాల నేవి ఎంతోమంది కవులెన్ని విధాలనో వ్రాసిన వున్నాయి మన తెనుగు వాఙ్మయంలో. కాని ఒక ప్రబంధ కవి అదేపనిగా పని గట్టుకొని ఒక గొప్ప ప్రబంధమే గాక దానితోపాటు అంత గొప్ప ఒక శతకం కూడా వ్రాయటమనేది చాలా అరుదు. నన్నయ దగ్గరి నుంచి చిన్నయగారి వరకూ కాగడా వేసి చూస్తే ఎంతోమంది చేయలేదిలాటి

గారడీ. ఒక పాల్కుటికి సోమనాధకవి మాత్రం చేసి చూసాడు అతడూ శివభక్తుడే. ధూర్జటిలాగా వీరమాహేశ్వరుడే. బసవ పురాణమనే కావ్యంతోపాటు బసవేశ్వర శతకం కూడా ఒకటి రచించాడు. అయితే ఆయన కావ్యం 'ఇలాంటి పద్యబంధమైన ప్రబంధం కాదు. ద్విపద కావ్యం. శతకం మాత్రం పద్య బంధమే. అదీ చాలా హృదయం గమంగానే ఉంటుంది. సందేహం లేదు. ఇక మిగతా వారివన్నీ అటుసర్గబంధమైన కావ్యాలో లేక కేవలం శతకాలో. సాధారణంగా ఆ శతకాలు కూడా సుమతి భాస్కరాది శతకాలలాగా నీతి ప్రబోధకాలైనా అయి ఉంటాయి. లేదా కంచెర్ల గోపరాజు దాశరధి శకతం లాగా గొప్ప దైవభక్తి భాసురాలైనా అయి ఉంటాయి. మానవ జీవితానికి కావలసిన వందల కొద్దీ సందేశాలతో నిండి నిబిడీకృతమైన శతకాలనన్నీ సందేహం లేదు.

కానీ ఈ ధూర్జటి మహాకవి రచించిన ఈ కాళహస్తీశ్వర శతకం తీరే వేఱు. ఇది దానికీ దీనికీ సంబంధించిన వ్యవహారం కాదు. అన్ని రంగాలలో అన్ని అనుభవాలనూ చవిచూచి సర్వతోముఖమైన తన జీవిత సర్వస్వాన్నే ఒక రత్నకంబళం లాగాపరిచి చూపుతాడు మనబోటి పాఠకులందరికీ. ఒకవిధంగా కావ్య జీవితమూ తన జీవిత కావ్యమూ రెండింటి మీద మహాకవి చేసిన గొప్ప సింహావలోకనమిది. శతక వ్యాజంతో వెలువడిందా మహాసంభావుడి నోట. అది శృంగారమా వైరాగ్యమా భక్తా జ్ఞానమా పరమార్ధమా ప్రపంచమా తిట్లా దీవనలా హాస్యమా - ఆర్జవమా చమత్కారమా ఆవేదనా - అన్ని భావాల కలగాపులగ మది. అన్నిటికన్నా వ్యాజస్తుతి అనే అలంకార మక్కడక్కడా దర్శనమిస్తుంటుంది. ఆత్మా శ్రయ కవిత్వమని ఈ రోజుల్లో కొందరు

సాహిత్య విమర్శకులు చెప్పే సూత్రానికీ శతకమొక గొప్ప ఉదాహరణ. ఇలాంటి దింకొక్కటున్నది శతకమది కాసుల పురుషోత్తమ కవి రచించిన ఆంధ్ర నాయక శతకం. చాలా గొప్ప వ్యాజస్తుతే ఆత్మాశ్రయమే. కవి అందులో చాలావరకూ చమత్కార ప్రసంగమేగాని ఇంత ఆవేదనా అనుభూతీ కలగదు మనకందులో. కవితా కళతో చక్కగా మేళవించి అలాటి అనుభూతి నందించిన సహృదయ హృదయానంద దాయకమైన శతకమిది ఒక్కటే మనభాషలో.

అయినా ఎందుకింత ఉపోద్ఘాతం. చూతాములోతుకు దిగి. 'తా ఆన్‌కె న చషద్ – నదానద్' అన్నాడొక సూఫీ విద్వాంసుడు. ఏదైనా రుచిచూస్తేగాని దాని పస తెలియదటు. అలాగే ఆ మహాకవి తయారుచేసి మనకందించిన ఆ శతక చషకంలోని స్వానుభవ రసాయనమేమిటో ఎలాంటిదో అక్కడక్కడ ఆస్వాదించి చూద్దాము. అసలు మన ముఖం చూడడు కవి. మనతో మాటాడడు. ఎటు చూచినా ఏది చూచినా అక్కడ కనిపిస్తున్నదా కైలాస నాథుడే ఆయనకు. తనకూ ఆ దేవునికే లావాదేవీ ఏమంటున్నాడో చూడండి.

'నీనా సందొడబాటు మాట వినుమా నీచేత జీతంబునే,
గానింబట్టక సంతతంబు మరివేడ్కన్ గొల్తు – సంసత్సప
త్నానీకంబున కొప్పజెప్పకు మున న్నాపాటియే చాలుతే
జీనొల్లంగరినొల్ల నొల్లసిరులన్ – శ్రీకాళహస్తీశ్వరా'

స్వామీ నీకూ నాకూ ఒకటే ఒప్పందం నాకు జీతమక్కర లేదు నాత మక్కరలేదు. నన్నీ సంసార సాగరంలో పడేయక పోతే చాలు. జీవితాంతం నీ కొలువు చేసి నీ ఋణం తీర్చుకొంటా – నాకేమి మడులూ మాన్యాలివ్వక్కరలేదు నీవు. ఈమాత్ర మను గ్రహిస్తే చాలు అదేనా

జన్మకు కృతార్థత అని వేడుకొంటాడు. ఏమి నిరాడంబరత - ఏమి నిష్కర్ష - ఏమి నిజాయితీ ఉట్టిపడుతున్నదో చూడండి.

ఏమయ్యా అంత నిస్పృహ జీవితమంటే అంటావేమో. అంతా భ్రాంతి తలంచి చూచిన నరుండట్లౌ టెరింగిన్ సదా కాంత ల్పుత్రులు నర్థము ల్తనువు నిక్కంబంచు మోహార్ణవ భ్రాంతిం జెంది చరించుc గాని పరమార్థంబైన నీయందు దాచింతా కంతయు చింత నిల్పడు గదా' అని వాపోతాడు. నిజమే ఆ భాస వాస్తవమెలా అవుతుంది. రజ్జు సర్పంలాగా వాస్తవంలాగా కనపడుతుంది. అక్కడ సర్పం కనపడ్డా ఎలా సుఖం లేదో మీదు మిక్కిలి భయోత్పాదకమో, అలాగే ఈ భార్యా పుత్ర శరీర విత్తాదులన్నీ వ్యావహారికంగా ఇలా భాసిస్తూ మనలను భ్రమ పెడుతున్నాయే గాని పరమార్థం కాదు. అయినా ఇది నిజమెప్పటికీ ఉంటుందని చెప్పి పారమార్థికమైన నీతత్త్వాన్ని మరచి పోతున్నాడీ మానవుడెంత తెలివి తక్కువవాడు.

తెలివి తక్కువ తనమింతకూ ఎవరిదంటావు. మాబోటి మానవులు చేసుకొన్నదా నీవు మాకా పాదించిందా. నాకు జూడ నీవే మా మెడకు జుట్టావేమో అనిపిస్తుంది. సర్వజ్ఞుడూ సర్వసమర్థుడవయినప్పుడు నీది కాక మాదెలా అవుతుందీ పరాధం.

'ఆలున్ బిడ్డలు తల్లిదండ్రులు ధనం బంచున్ మహాబంధనం
బేలా నా మెడc గట్టినాడ'వని తన దైవాన్ని దబాయిస్తాడు కవి. కనుక నీవు వేసిన ముడి నీవే విప్పమంటాడు. అంతలోనే ఒక రహస్యం జ్ఞాపకం వచ్చి నాలుక గఱచుకొని ఏమంటాడో తెలుసా.

'భవకేళీమదిరా మదంబున మహాపాపాత్ముడై వీడున
న్ను వివేకింపడ'ని ఇలా పారేశావా ఈ నరకార్ణో రాశిలోనని అది స్వామిది గాదపరాధం తనదే నని గుర్తిస్తాడు. ఏమిటిది. ఇందులో

గొప్ప అద్వైత రహస్యమిమిడి ఉంది. ఒక రజ్జువు సర్పంగా కనపడు తున్నదంటే దానికి మన దృష్టిలోప మొకటే గాదు కారణం. ఆ రజ్జువు కలా కనిపించే స్వభావం కూడా. కనుకనే రజ్జువే అలా కనిపిస్తుంది సర్పంలాగా. ఒక తలుపో గోడో కనిపించదలా. వాటికా స్వభావం లేదు గనుక. అలాగే జీవుడి అవిద్యా దృష్టికీ సంసారమిలా కనిపిస్తే కనిపించవచ్చు. వీడి అవిద్య మాత్రమే గాక ఆ ఈశ్వరుడి మాయాశక్తి విలాసం కూడా దీనికి కారణమే. రెండూ కుమ్మక్కైతేనే దాని ఫలితమీ సంసార బంధం. అందుకే నేను పాపాత్ముడనై ఇది కొని తెచ్చుకోటమూ తప్పే. నీవు నా మెడకు చుట్టటమూ తప్పేనని తనదీ స్వామిదీ రెండు తప్పులూ బయటపెడతాడు అద్వైత విద్యా పారంగతుడైన ధూర్జటి. ఇక్కడ మెడకు చుట్టుట మాయన మాయాశక్తి ప్రభావమైతే పాపాత్ముడు కావటం మానవుడి అవిద్యాకృతం. పాపమంటే అవిద్యా కామకర్మ త్రయమని శాస్త్ర పరిభాష.

అయితే ఒక్క మాట. మనమ విద్యకు లోనయి ప్రవర్తించకపోతే పరమాత్మ ఎంత మాయాశక్తి సంపన్నుడైనా కావాలని నిరంకుశంగా మనమీద దాన్ని ప్రయోగించడు. అలా ప్రయోగించాడంటే మానవుడి లాగా తానూ రాగద్వేష రూషితుడని చెడ్డ పేరు తెచ్చుకొంటాడు. అది మొదటికే మోసం. నీవు సర్పంగా చూస్తేనే అది నీకు సర్పంగా కనపడుతుంది గాని చూడకపోతే కనపడదు. కనపడే లక్షణం దానిలో ఉన్నా తనపాటికి తాను సర్పంగా మారి నిన్ను హడలుగొట్టదు. అలా చూస్తే మాత్రం కనపడుతుంది. అలాగే ఈశ్వరుడి కి మాయాశక్తి తన అధీనంలో ఉన్నా మానవుడాయన స్వరూపాన్ని గుర్తిస్తే మాత్రం ప్రపంచంగా భాసించడు. మనలను ప్రాణం తీయడు. కాని స్వరూపాన్ని

గుర్తించలేక అన్యధా భావించాడంటే మాత్రం ఆ ఈశ్వరుడే సంసారమనే మరో వేషంలో కనిపించి మనలను భయపెడతాడు. అదే ఈ సంసార బంధం.

అంచేత కష్టసుఖాలన్నీ మానవుడు కొని తెచ్చుకొన్నవే. ఈశ్వరుడు సర్వశక్తుడైనా వాడి తప్పేమీ లేదని అద్వైత సిద్ధాంతం. అయితే మరి ఈ జీవుడెలా తప్పించుకోవాలీ పద్మవ్యూహం నుంచి. సర్పం నుంచి ఎలా తప్పించుకోవాలో చెప్పండి. రజ్జువును పట్టుకొంటే తప్పిపోతుందది. అలాగే ఈశ్వరుణ్ణి పట్టుకొంటే ఆ ఈశ్వర స్మృతి దీనికి జవాబు చెబుతుంది. అది పట్టుకోవాలంటే మరొకటి దాని కన్యమైనది వదలుకోవాలి. అది వదలుకోకుండా దాన్ని పట్టుకోవటం కుదరదు. 'త్యాగేనైకే అమృతత్వ మానశుః అని ఉపనిషత్తు ఇస్తున్న సలహా ఇదే మానవులకు. ఈ భావమే చాటి చెబుతున్నాడు ధూర్జటి ప్రస్తుతం 'స్వామి ద్రోహము చేసి వేరొకని కొల్వంబోతినో - కాక నే నీమాట న్విన నొల్లకుండితినొ - నిన్నే దిక్కుగా చూడనో' అని తన నిరపరాధత్వం స్వామికి నివేదిస్తాడు. మరే చింతా లేదు నాకు - 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేక' మన్నట్టు నిన్నే సర్వాత్మనా శరణు వేడానంటాడు. అయినా రాజశేఖరుడైన నన్ను మభ్యపెట్టి వీడా రాజునూ ఈ రాజునూ సేవిస్తూ ఏవీ లేదని బుకాయిస్తున్నాడేమో నని అనుమానమా. రాజుల్మత్తులు వారి సేవ నరక ప్రాయంబు - వారిచ్చు నంభోజాక్షీచతురంత యాన తురగీ భూషాదు లాత్మవ్యధా బీజంబు- ల్తదపేక్ష చాలు - పరితృప్తిం బొందితిన్ - జ్ఞానలక్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ము 'దయతో' నని కూడా ప్రార్థేయపడతాడు. నీవనుకున్నట్టుగా నేనే రాజులను తరాజులనూ

ఆశ్రయించలేదు మహానుభావా - ఆశ్రయించింది చాలు - విరక్తి చెందాను. ఇంకా నమ్మవా-

ఏమో రాజ ద్వారాల దగ్గర పడిగాపులు గాయనంటే నిజమేనా అని అడుగుతావేమో.

'రాజన్నంతనె పోవునా కృపయు ధర్మం బాభిజాత్యంబు వి
ద్యాజాత క్షమ - సత్యభాషణము విద్వన్మిత్ర సంరక్షయున్
సౌజన్యంబు కృతం బెఱుంగ టయువిశ్వాస' మిలాంటి దైవ గుణ సంపత్తి ఉన్నా చాలు - నా విష్ణుః పృథివీ పతిః' అన్నట్టు నీ అంశతో జన్మించాడని అభినందించవచ్చు. అలా కాక 'అల్పుల్మత్తులై యేలచచ్చెదరో రాజుల మంచు' అలాంటి వారిని నే దరిద్రుడు సేవిస్తాడో చెప్పు.

మంచిదే. కాని రాజసేవ కాకపోయినా కుటుంబ సేవలో తలమునకలయి నన్ను సేవించటం తుంగల్లో తొక్కావేమో నంటావా అదీ చెబుతా వినమంటాడు మహాకవి. 'నిన్ను న్నమ్మిన రీతి నమ్మ నొరులన్ - నీకన్న నాకెన్నలేరన్నల్దమ్ములు తల్లిదండ్రులు గురుండా పత్సహాయుండునా యన్నా యెన్నడు నన్ను సంసృతి విషాదాంభోధి' దాటిస్తావో అని తన వైరాగ్య భావం వెళ్లగక్కుతాడు. అయితే ధనవాంఛ లేక పోవచ్చు. కులస్త్రీ వాంఛ కూడా లేకపోవచ్చు. పరస్త్రీ వాంఛ కూడా లేదని నాకు హామీ ఇవ్వగలవా అంటారేమో. ఒప్పుకుంటా. అటూ ఇటూ నా మనస్సు చలించవచ్చు.

చలించదని నేను నీతో బొంకులాడను.

'రోసీరయదు కామినీ జనుల తారు ణ్యోరు సౌఖ్యంబులన్
పాసీపాయదు పుత్ర మిత్ర ధనసంపద్భ్రాంతి వాంఛాలతల్
కోసీ కోయదు నామనంబకట నీకుం బ్రీతిగా సత్క్రియల్

చేసీ చేయదు–' కనుకనే దీని త్రుళ్లు అణచమని నా వేడుకోలు

'ఎన్నేళ్లుండుదు నేమి గందునిక నేనెవ్వారి రక్షించెదన్
నిన్నే నిష్ఠ భజించెదన్ నిరుపమోన్ని ద్రప్రమోదంబునా
కెన్నండబ్బెడు' నని కాంతా కనకాలు రెంటి మీదా విసుగు పట్టి

నిశ్చలమైన చిత్తంతో నిన్నాశ్రయించాను. అంతేకాదు. నీకీ లోక వాసనా కుటుంబ వాసనా పోయినా శాస్త్రవాసనా అందులోనూ నీ కవిత్వవాసనా నిన్నంటు కొని వదలలేదేమో మనస్సు నిర్వాసన మయిందంటే ఏమిటి తార్కాణమంటావా – 'ఏ లీల న్నుతియింపవచ్చునుపమోత్ప్రేక్షా ధ్వని

వ్యంగ్యశబ్దలంకార విశేష భాషల కలభ్యం చైన నీ రూపముం
జాలుంజాలు – కవిత్వము ల్నిలుచునే సత్యంబు వర్ణించుచో
ఛీ లజ్జింపరు గాక మాదృశ కవు'లని కవితా దర్పాన్ని కూడా

వదలు కొన్నాను. సత్యాన్ని వర్ణించటానికీ కృత్రిమమైన కవిత్వమేమి పనికి వస్తుంది. కవిత్వ మంటే కవికే గాదు. ఆ మాటకు వస్తే శాస్త్ర జ్ఞానం కూడా నిష్ప్రయోజనమే. శ్రుతులభ్యాసము చేసి శాస్త్ర గరిమ ల్మోధించి తత్త్వంబులన్ మతినూహించి శరీర మస్థిరము బ్రహ్మంబన్న సత్యంబు గాంచితి నంచున్ సభలన్ వృధావచనము ల్చెప్పుంగనే కాని నిర్జిత చిత్త స్థిర సౌఖ్యము ల్తెలియరీ' పండితాధములని శాస్త్రజ్ఞులను కూడా చీవాట్లు పెడతాడు మహాకవి. శాస్త్రాలంటే ఏమనుకొంటున్నావో.

'కలలంచున్ శకునంబులంచు గ్రహయోగం బంచు సాముద్రికం
బులటంచుం దెవులంచు దిష్టియనుచున్ భూతంబులంచున్ విషా
దులటంచున్ని మిషార్ధ జీవనములందుంబ్రీతి పుట్టించు'

స్వప్న శకున జ్యోతిస్సాముద్రికాది శాస్త్రాభ్యాసం కూడా కేవలం ప్రయాసే. అదీ మనలను ప్రక్కకు లాగే బాపతే. అంతే కాదు. అనుభవమే

మాత్రమూ లేకుండా కేవలం పరోక్ష జ్ఞానమే బ్రహ్మ జ్ఞానమనుకొనే వేదాంత శాస్త్ర జ్ఞానం కూడా ఆఖరుకు బలాదూరే. అది ఎలాంటిదంటే ప్రతిబింబిత శాఖాగ్రఫలాస్వాదన' మోదం లాంటిదన్నారు అద్వైత వేదాంతులు. ఒక మఱుగుజ్జు చెట్టెక్క లేక పండ్లు చెఱువు నీళ్లలో ప్రతిఫలిస్తుంటే ఆ నీళ్లు తాగి దానితో పండ్లు కూడా నా కడుపులోకి పోతాయని సంతోషించటం లాంటిదట. అలాగే సిద్ధాంత జ్ఞాన మనుభవమెలా కాగలదని కూడా దబాయిస్తాడు ధూర్జటి.

అయితే మరి ఈ పాండిత్యాని కర్థం లేదా. ఉంది ఇది నీ దర్శనానికి తోడు పడితే. లేకుంటే ఇది కూడా ఒక వాసన అయి వ్యసనంగా మారి నీ దారి కడ్డు పడుతుందని నిజాయితీగా ఒప్పు కొంటాడా మహనీయుడు. ఆ మాటకు వస్తే ఈశ్వర స్పృహ నందీయక అక్కడికక్కడే సమసిపోయి మానవుణ్ని సమయించే దేదీ శాస్త్రమేగాదు. అది ఒక శస్త్రం. కనుక ఒక లోకమనే గాదు. కళలనే గాదు శాస్త్రమనే గాదు. కడకు పరోక్షమైన వేదాంత విజ్ఞానమేగాదు. ఏదైనా జీవిత గమ్యమైన మోక్షానికి గాదు. దూరదూరమే గాని దరిదాపులకు కూడా రాదు. నిన్ను రానీయదు. ఇది గట్టిగా నమ్మిన మహానుభావుడు ధూర్జటి. 'నమేధయా న బహునాశ్రు తేన - న వేద యజ్ఞాధ్యయనైః' అనే శాస్త్రోపదేశం బహుశా నూటికి నూరుపాళ్లూ ఒంటబట్టి ఉంటుందా మహాకవికి.

అయితే మరి ఎవరికా అపరోక్షానుభూతి అంటారా. ఏ వేదంబు పఠించె లూత భుజగం బేశాస్త్రము ల్సూచె తానే విద్యాభ్యసనం బొనర్చె కరి - చెంచే మంత్రమూ హించె బోధావిర్భావ నిధానమున్బదువు లయ్యా' - వెంటనే ధూర్జటి మహాకవికి తన ప్రబంధ పాత్రలన్నీ స్మరణకు

వచ్చాయి. అవన్నీ జంతువులూ - జంతువుల లాంటి మానవులు. ఎవరికీ అందులో చదువూ సంధ్యా లేదు. వాల్మీకి మహర్షి చెప్పినట్టు యధా జాతులు . అయినా వారు మహాభక్తులయి తరించారంటే ఏమి కారణం **'నీపాద సంసేవ సక్రియ'** అని సమాధాన మిస్తాడు కవి **'తద్విష్ణోః పరమం పద'**మని ఆ పరమాత్మ పదాన్ని గట్టిగా పట్టుకొన్నారు వారు. **'యమేవైషవృణు తేతేన లభ్యః'** ఎవరు మనసారా దాన్ని భజిస్తారో వారే భక్తులు వారే ముక్తులంటున్న దుపనిషత్తు. భక్తే ముక్తి నిస్తుందా జ్ఞానాదేవ తుకైవల్యం' జ్ఞానం వల్లనేగదా ముక్తి అని సందేహం. భక్తి అంటే జ్ఞానమే ఇక్కడ. భక్తి అనే శబ్దాని కసలర్థం పరమాత్మ తత్వాన్ని గట్టిగా పట్టుకోటం పట్టుకోట మంటే అదే నేను నేనే అది అనే అభేద భావన. దీన్నే శంకర భగవత్పాదు లిలా వివరిస్తున్నారు. వినండి. **'యత్పశ్యతి - యచ్ఛృణోతి - యత్ స్పృశతి వా- తత్సర్వం వాసుదేవ ఏవ ఇత్యేవం గ్రహా విష్టబుద్ధిర్యః న భక్తః'** అని ముక్తకంఠంతో చాటారాయన. మనోవాక్కాయాలతో ఏది చేస్తున్నా అది వాసుదేవ అంటే వసతి దీవ్యతి అస్తిభాతి సచ్చిదాత్మకమైన ఆత్మస్వరూపమేనని ఆత్మాకార దృష్టితో చూస్తూ అనుభవించటమే అసలైన భక్తి - అనన్య భక్తి - మిగతాదంతా అన్య దృష్టితో భజించే ద్వైతభక్తే. అఖండమైన అద్వైత భక్తి కాదు. అద్వైత భక్తే జ్ఞానం. రెంటికీ తేడా లేదు. ఒకదానికొకటి కేవలం పర్యాయ శబ్దాలు.

ఇలాంటి గొప్ప అపరోక్ష జ్ఞానం సర్వగజ కిరాతాదుల కెలా అబ్బాయా అంటారా. అవి బాహ్యంగా కనిపించే వారి వారి ఉపాధులు. వాటిలో దాగి ఉన్నదా భక్త్యావేశం. అది పురాకృత సుకృత పరిపాక ఫలం - **'పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవ శోపిసః'** అన్నట్టు అదే వాటినా పరమేశ్వరాభిముఖంగా నడుపుతూ పోయింది. నావలో కూచొని

నదీ తీరం చేరినట్టు అవి దాని నాధారం చేసుకొని సంసార సాగరతీరం చేరి ఈశ్వర సాయుజ్య సుఖమను భవించాయి. ఇదీ మన మిక్కడ గ్రహించవలసిన పరమ రహస్యం. ఇదే జడ భరతుడి విషయంలో కూడా కనిపిస్తుంది మనకు. అతడు జింక జన్మ ఎత్తినా అది కేవలమొక ఉపాధే ఆయనకు. ఆ ఉపాధిలో ఉన్నది భరతుడి పూర్వజన్మ సంస్కారమే. అలాగే గజేంద్రుడిది గజశరీరమైనా ఆ ఉపాధిలో కూడా ఉన్నది పూర్వ పుణ్య ఫలదివ్య జ్ఞాన సంపత్తే – కాకుంటే మానవుడి కెప్పటికీ ముక్తి లేదు. ఉపాధులు కాదిక్కడ ముఖ్యం. తదంతర్గతమైన చైతన్యాంశ. అది ఉంటే పక్షి జన్మైనా పశు జన్మైనా గొప్పదే. దాని స్పర్శ లేకుంటే మానవ జన్మ అయినా అది పశుతుల్యమే ఇదీ పరిష్కారం.

అప్పటికీ ఒక మూఢ విశ్వాసముంది ఈ మానవులకు. చదువెక్కువయి బాగా తలకెక్కిన దోషమిది. అదేమిటంటే 'అపుత్రస్య గతిర్నాస్తి' పుత్ర సంతానం లేకపోతే పున్నామ నరకం పాలవుతారు. మోక్షానికి నోచుకోరని. అది ధర్మపురుషార్ధం దృష్టిలో పెట్టుకొని చెప్పిన మాటేగాని మోక్షపురుషార్ధాన్ని కాదు. మోక్షానికిది దోహదం కాదుగదా మీదు మిక్కిలి ప్రతి బంధకం. ఇది కూడా ఒక మూఢత్వమే పిచ్చి నమ్మకమే నంటాడు ధూర్జటి అదే చెబుతున్నాడు. 'కొడుకు ల్పుట్టరటంచు నేడ్తు రవి వేకుల్‌జీవన భ్రాంతులై కొడుకు ల్పుట్టరె కౌరవేంద్రున కనేకుల్ – వారిచే నేగతుల్ పడసెన్ – పుత్రులు లేని యా శుకునకున్ బాటిల్లెనే దుర్గతుల్ చెడునే మోక్షపదం బపుత్రకునకున్' అని చీవాట్లు పెడతాడు ఇటు లోకజ్ఞులనూ అటు శాస్త్రజ్ఞులనూ అందరినీ మూకుమ్మడిగా.

సంతానం లేదే అని కొందరూ అందులోనూ పుత్ర సంతానం లేదే అని మరికొందరూ – చదువులేని వారి దగ్గరి నుంచీ చదువుకొన్న

వారి వరకూ అందరూ ఏదో అపరాధం చేసినట్టు అనవసరంగా భావిస్తున్న వారే. భయపడుతున్నవారే. కారణం చచ్చిన తరువాత ఉత్తమగతులు కలగవేమోనని. సరే కాని పుత్త్రులు లేకుంటేనే పుణ్యగతులు లేవా. కొడు కులకూ వారికీ ఏమి సంబంధం. ఏ జీవి చేసుకొన్నది వాడిదే గదా. ఒకరు చేసుకొన్నది ఇంకొకరికి ఫలితమెలా ఇస్తుంది. అలాగైతే ధృతరాష్ట్రుడికి పుత్త్రులు నూరుగురు జన్మించారు. అందరూ దుర్మార్గులే. వారి వల్ల ధృతరాష్ట్రుడు తరించగలిగాడా. లేదే శుకమహర్షి కొడుకులు దేవుడెరుగు అసలు పెండ్లీ పేరంటమే లేక జీవించి వెళ్లిపోయాడు. ఆయన దుర్గతి పాలయ్యాడా. పైగా ధృతరాష్ట్రుడిలాంటి కుటుంబీకులకు లేని మోక్షపదం అవలీలగా పొందగలిగాడా మహాను భావుడు. పైగా పరీక్షిత్తులాంటి విష్ణురాతుణ్ణి కూడా బ్రహ్మరాతుడిగా మార్చి బ్రహ్మానుభవానికి భాజనం చేయగలిగాడు. కాబట్టి పుత్త్రులు జన్మించటానికీ మానవుడు మోక్షం సంపాదించటానికీ ఏమాత్రమూ సంబంధం లేదని తెలిసిపోయిందా. ఎందుకీ భ్రాంతి మానవుల కని దబాయిస్తాడు ధూర్జటి.

ఇదంతా కాదసలు. అన్నీ వదిలేసి సర్వాత్మనా పరమాత్మనే నమ్ముకోట మొకటే సరియైన మార్గం. 'అమ్మా అయ్యా యటంచు నెవ్వరిని నేనన్నన్ శివా నిన్ను నే సుమ్మీ - నా కిమ్మై తల్లియు తండ్రియు న్గురుడు నీవే కాద సంసారపుంజిమ్మం జీకటి కప్పకుండ గనుమా' అని పరిపూర్ణ శరణాగతి ఒక్కటే శరణ్యమని చాటుతాడు కవి. 'త్యాగేనైకే అమృతత్వమానశుః' అన్నారంటే అది దేనిమీదా రక్తి లేక విరక్తి చెందినప్పుడే సంభావం. అది తనంతట తాను ఒక్కసారిగా అందుకోలేక పోవచ్చు. అలాంటప్పుడే సత్పురుష సాంగత్యమనేది తోడు పడుతుంది మానవునికి. దానికి కూడా సంసిద్ధత ఉండాలి మరి. అలాగ -

'అడుగం బోనిక అన్యమార్గములకుం బ్రాణావ నోత్సాహినై
యడుగం బోయినఁబోదు నీదు పదపద్మారాధక శ్రేణియు
న్నెడకు న్నిన్ను భజింపగా గనియు నాకేలా పరాపేక్ష కోరెడి దింకేమి- భత్రృ సాద మె తగున్' అని కూడా తన వైరాగ్య భావం చాటుతాడు. అంతేమరి ఒకదాన్ని వదలుకోంటే గాని మరొకటి అబ్బదు. అదీ నికృష్టమైనది వదులుకోవాలి ప్రకృష్టమైనది పట్టుకోవాలి. నీకా పట్టు చిక్కకపోతే అది చిక్కిన సజ్జనుల సాంగత్యమైనా అలవరుచు కోవాలి. ఇదీ ఇందులో సూక్ష్మం. ఎలాంటి వారంటారా సజ్జనులు. భసితో ద్ధూలన పాండురాంగులు - జటా భారోత్తరాసందుగు - ల్తపో వ్యసను ల్సాదిత పంచవర్గరతులున్ వైరాగ్యవంతు న్నితాంత సుఖస్వాంతులు - సత్యభాషణ సముద్యద్రత్న రుద్రాక్షరాజి సమేతు ల్తుద నెవ్వరైనఁగొలుతున్' అంటాడు. చూస్తే ఇలాటి శివ దీక్షా పరాయణులనే చూడాలి వింటే వారినే వినాలి. వారు కూడా కేవల రుద్రాక్షమాలలు ధరించి పరమ మాహేశ్వరులమని ఆడంబరంగా చెప్పుకొంటే గాదు. తపస్సత్యాది రత్నాలే రుద్రాక్షలని భావించే రుద్రాక్షధారులయి ఉండాలని ఖండితంగా చెబుతాడు.

ఇంకొక్క మాట. అభ్యాస వైరాగ్యాలు రెండింటిలో వైరాగ్యం ప్రతి లోమమైతే అభ్యాసమనులోమం. అనులోమం పట్టుకొంటే ప్రతిలోమం దానిపాటి కదే సిద్ధిస్తుంది. రజ్జువును చూడగలిగితే చాలు. సర్పమెగిరి పోక ఏమవుతుంది. కాని సువర్ణాన్ని చూచినా ఆభరణాలలా మాయామయి పోవు. అవి కూడా కనిపిస్తూనే ఉంటాయి. మరేమిటి గతి. అలా కనిపిస్తున్నా వాటిని కూడా సువర్ణమనే దృష్టితో చూస్తూ పోవటమే. చూచే కొద్దీ వాటిమీద క్రమంగా విముఖత్వమేర్పడుతుంది.

సువర్ణం మీద సుముఖత్వ మేర్పడే కొద్దీ అవి దూరమై పోతాయి. వాటి మీద సుముఖత్వ మేర్పడితే సువర్ణ స్వరూపం మరుగుపడి దూరమవు తుంది. కనుక ఒకదాని తరువాత ఒకటని గాక రెండూ ఒకటి ప్రత్యభిజ్ఞా బలంతో ఒకటి ప్రవిలాపనా బలంతో దర్శిస్తూ ఏకకాలంలో భావిస్తూ పోవటమే జవాబు. ఇందులో వైరాగ్య భావన ఎలా ఉండాలో చెబుతున్నాడు కవి. చావంగాలము చేరువౌటెతిగియు న్ చాలింపగాలేక తన్నే వైద్యుండు చికిత్సఁ బ్రోవగలదో – ఏమందు రక్షించునో ఏ వేల్పుల్ కృపఁజూతురో యనుచు నిన్నింతైన చింతింపడా జీవబ్రాహ్మధ్రము చేసికొన్న యతియున్' అని సర్వసంగ పరిత్యాగం చేశామని గొప్పలు చెప్పుకొనే సన్న్యాసులను కూడా చీవాట్లు పెడతాడు వైరాగ్య బుద్ధి లేదని – వైరాగ్యమంటే వస్తు వాహనాదుల మీదనే గాదు. అది లోకవాసన అయితే దేహ వాసన ఒకటి ఉంది అంతకన్నా ప్రబలమైనవి. దాని పరాకాష్ఠ మరణ భయం. దానికి దారి తీసే ఆధివ్యాధులు. వాటిన ఇకూడా పట్టించుకోకుండా తన లక్ష్యం మీదనే దృష్టి నిలపాలంటే సారూప్యం కాదు. ఎంతో అభ్యాసపాటవ ముండాలి. అది అవసాన కాలానికి పరిపాకానికి వచ్చి ఉండాలి. అలా ఉండాలంటే ఒక్కటే మాట. ఒకరికి చెప్పేది కాదది. నీకే అనిపించాలి. ఏమని. తనువే నిత్యము దానొనర్పు– మది లేదా చచ్చి జన్మింపకుండ నుపాయంబు ఘటింపు – మంటాడు మహాకవి పరమాత్మను చూచి నిష్ఠురంగా. నా ఈ శరీరమైనా ఎప్పటికీ ఉండేలా చేయి చేతనైతే – లేదా చచ్చిన తరువాత మరలా జన్మ అయినా రాకుండా చేయి. రెండూ నేను నీకు చేసేవి కావు. నీవే చూచుకోడ మంటావా. 'చేయగలకార్యంబున్న నీ సేవ చేసి నినుంగాంచెద గాక కాలమున – అని తానే అభ్యాసమంతకంతకు తీవ్రంగా సాగించి ఏకాలానికైనా ఫలితం చవిచూస్తానంటాడు.

అంతేగాదు. ఎలాగూ చావు తప్పదు జీవులకు. మానవులేమిటి. జంతుజాలం కూడా కన్ను మూస్తున్నాయి. బుద్ధి జీవులైన మానవులూ పోవలసిందే. కర్మ జీవులైన పశుపక్ష్యాదులూ పోవలసిందే. తప్పదు. ఇదే అసలు సమస్య మరేదీ గాదు. మార్పే గదా మరణం. జన్మించినప్పటి నుంచీ జీవితమంతా మారటమే గదా. మనసులో ఆలోచనలు మారుతుంటాయి. మాటలు మారుతుంటాయి. చేతలు మారు తుంటాయి. అంతే కాదు. మారుతున్నా పైకి కనపడని చోట కూడా అనుక్షణమూ మార్పున్నది. ఇల్లు వాకిలి గాదు. వాకిలి గోడ గాదు. గోడ నా శరీరం గాదు. శరీరంలో ఏ భాగానికే భాగమే గాని మరొకటి గాదన్నప్పుడే మార్పు. ఎక్కడిదక్కడే గాని మరొకచోట లేదన్నప్పుడది మార్పు గాక మరేమిటి. కనుక ఆది మధ్యాంతాలు జీవితమంతా మార్పే మరణమే.

అది మనబోటి మానవుల విషయంలో స్వానుభవ మవుతూనే ఉంది. నిత్యమూ చూస్తూనే ఉన్నాము కూడా. **'తాతల్తల్లియు తండ్రియు న్మతీయు పెద్ద ల్చావగా చూడరో భీతింబొందగ నేల చావునకు గా పెండ్లామ బిడ్డల్సుత వ్రాతం బుల్తిలకింప జంతువులకున్ వాలాయమై యుండగా** మన పెద్దలేమిటి పిన్న లేమిటి నడి వయసు వారేమిటి – అతి సన్నిహితులే కన్నుమూస్తుంటే చూస్తున్నామా లేదా అని ప్రశ్నిస్తాడు కవి. చూస్తున్నాము సరే అలా చూస్తుంటే మనమూ ఎప్పటికైనా ఇలాగే అయిపోవలసి వస్తుందే అని భీతి ఏర్పడగా 'భీతిం బొందగ నేల అని ప్రశ్నిస్తాడేమిటని మన మడిగితే– మనకు సమాధానమిస్తున్నాడాయన ఏమని 'చేతో వీధి నరుండు నిన్గొలువడో' అని.

అదీ కూడా పరోక్షంగా తెలిసి కబుర్లు చెప్పటం గాదు 'పటవద్రజ్జు భుజంగవ ద్రజిత విభ్రాంతి స్ఫురచ్ఛుక్తిన ద్ఘటవ చ్ఛుంద్ర శిలా జపాకుసువ ద్రుక్మాంగ ద్రువత్తంచు వాక్పటిమ 'లెన్ని చూపినా సుఖం లేదు. చిత్సుఖమ పరోక్షంగా స్వానుభవానికి తెచ్చుకోలేని దుర్మదు డంటాడు. అపరోక్షాను భవమే కలగాలంటే ధర్మపురుషార్థం పాటించినా నీకా ఫలితమీయ బోదు.

తన యుంగాంచి ధనంబు నించి దివిజ స్థానంబు గట్టించి వి
ప్రున కుద్వాహము చేసి సత్కృతికి పాత్రుండై తటాకంబు నే
ర్పున త్రవ్వించి ధనంబు పెట్టి – ఇలా సప్త సంతానములు
కన్నా కనలేడా మోక్ష పదవీ సామ్రాజ్యం. అది ఎలాగంటావా

'నిచ్చ న్నినున్నుభజించి చిన్మయ మహానిర్వాణ పీఠంబుపై రచ్చ స్సేయుట యొక్కటే మార్గం. అది కూడా క్రియా రూపం కాదు. అద్వైతులు చెప్పే జ్ఞానం. ప్రత్యభిజ్ఞ అంటారు దాన్ని. ఎప్పుడో అవసానంలో పాటించేది కూడా కాదది. దానికి పరిపాక మేర్పడదు. ఏర్పడే లోపలే కన్ను మూస్తావు 'డంతం బుల్పడ నప్పుడే తనువునం డారూఢియున్నప్పుడే కాంతా సంఘ మురోయనప్పుడె జరాక్రాంతంబు గానప్పుడే. వింత ల్మేన జనింప నప్పుడె – కురు ల్వెల్వెల్ల గానప్పుడే చింతింపన్వలె' నని కరాఖండితంగా చెబుతాడు. ఇది 'యావత్స్వస్థమిదం కళేబర గృహ'మనే భర్తృహరి శ్లోక భావాన్ని తలపిస్తున్నది. బ్రహ్మాకార వృత్తే చింతనమంటే, అది అద్వైతులు చెప్పిన నిధిధ్యాసన. విజాతీయవృత్తు లేవీ మనసుకు రాని సజాతీయ వృత్తి – దేహలోక శాస్త్రవాసనా త్రయమే విజాతీయం. అవి మూడూ శివాకారమైన ఏకైక వృత్తిగా మార్చుకొంటూ పోవాలి సాధకుడు. అదే చింతనమంటే. జీవిత గమ్యమైన మోక్షానికేకైక మార్గమది. ఆఖరిసారిగా

అదే తన మనోనిశ్చయమని స్వామికి మనవి చేస్తున్నాడు తన ఇష్టదైవమైన ధూర్జటికి మన ధూర్జటి మహాకవి.

ఏతావతా మహాకవి రెండు రచనలూ సమీక్ష చేశాము మనం. రెండింటి తాత్పర్యమూ శివస్వరూప ప్రతిపాదనమే. అదే మహాకవి కావ్యజీవితానికీ జీవిత కావ్యానికీ కూడా తాత్పర్యం. అయితే దాన్ని శుష్కమైన శాస్త్రమార్గంలో కాక సరసమైన కావ్యమార్గంతో జోడించి ప్రతిపాదించట మెంతైనా సహృదయ మనోరంజకం. రచనా ధోరణి యావత్తూ ఆమూలాగ్రమూ శృంగార భక్తిరస మిశ్రితం. రెండూ గంగా యమునలవలె చివరిదాకా ప్రవహిస్తూ వచ్చి చివరకు శివాద్వైత జ్ఞాన మహాసాగరంలో విలీనం చేసి చూపటం ధూర్జటి మహాకవి విశిష్టత. అంతకన్నా విశిష్టత తన పూర్వ జీవిత శృంగార చర్యలు - ఉత్తర జీవిత భక్తి జ్ఞాన భావాలూ - రెండూ ఏ ఒక్కటీ దాచకుండా తన జీవితాన్ని తానే సింహావలోకనం చేసుకొని బాహాటంగా కాంతా సమ్మితంగా రెండందాలా బయటపెట్టి పూర్వాన్ని పూర్వపక్షం చేసి ఉత్తరమే ఎవరి జీవితానికైనా ఉత్తమ ఫల దాయకమవే సేవించి తరించండని శ్రోతృ మహాశయులందరికీ ఒక మహోన్నతమైన సందేశమివ్వటం. మొత్తంమీద కవిత్వమనీ కావ్యమనే నెపంతో ఒక అద్భుతమైన శివతాండవమే ప్రతి మాటలోనూ చేతలోనూ ఆ మహాకవి మన ముందు చేసి చూసాడు. ధూర్జటి నిజంగా ధూర్జటే ననిపించు కొన్నాడు. అదే ఆయనకూ మనబోటి సహృదయులకూ సంతృప్తి దాయకం.

❀ ❀ ❀

సూరన కల్పనా ప్రపంచము

అయింది. పురాణయుగమయింది. ఇతిహాస యుగమయింది. ప్రబంధ యుగమయింది. ఆఖరుకు స్థల పురాణాలనే ప్రబంధాలుగా తీర్చిదిద్దటమయింది. అన్ని విధాలా సాము చేసి సాహిత్య క్షేత్రంలో తమ తమ పాత్రలను నిర్వహించారు. ప్రతిభా పాటవం ప్రదర్శిస్తూ వచ్చారు నన్నయ భట్టు నుంచీ ధూర్జటి వరకూ మహాకవులు. అదంతా ఏముంది వేరొక వినూత్నమైన సాహిత్య ప్రక్రియకు శ్రీకారం చుట్టి చూపుతాను. ఇది చూడండి. ఎలా ఉంటుందో ఎంత మీకు ఆశ్చర్యం కొలుపుతుందో. నా ప్రదర్శన చూచి నాకు చెప్పండి మీ అనుభూతి ఎలాంటిదోనని అందరినీ సవాలు చేస్తూ సాహిత్యరంగంలో ప్రవేశిస్తున్నా డొక మహానుభావుడు. ఇది ఎలా ఉందంటే పాండవ కౌరవులందరూ

ద్రోణాచార్యుల వారి చేత శిక్షితులై తమ తమ అస్త్రవిద్యా కౌశలం ప్రదర్శిస్తుంటే నేనూ చూపగలను నా ప్రదర్శన తిలకిస్తారా అని మహా వీరుడు కర్ణుడు రంగంలో ప్రవేశించిన మహాభారత ఘట్టాన్ని గుర్తు చేస్తున్నది మనకు.

ఇంతకూ ఎవడా కర్ణుడూ ఎవడా మహాకవి అని అడుగుతారేమో. ఎవరో గాదు. పింగళి సూరనామాత్యుడు. నంద్యాల కృష్ణ భూవిభుని ఆస్థాన కవీశ్వరుడు. ఈయనా లేడు కృష్ణరాయల కాలంలో. అష్టదిగ్గజాలలో చేర్చారనవసరంగా ఇతణ్ణీ. ఇతడేమిటి. రామకృష్ణుడు లేడు. ధూర్జటి లేడు. మన మష్టదిగ్గజాలను కొన్న ఎనిమిది కవి దిగ్గజాలలో ఈ మూడు గజాలూ లేవు. మరి ఈ మూడింటి బదులు ఏ మూడు గజాలున్నాయో మనకు తెలియదు. కానీ రాయల అష్టదిగ్గజాలలో చేరకపోయినా ఒక గొప్ప ఐరావతం లాంటి వాడా లేక ఒక ధూర్జటి లాంటి వాడా అని అడుగుతారేమో. కాదు. ఆ గజాలకూ ఈ గజానికీ సంబంధమే లేదు. ఈ గజేంద్రుడి పంథాయే వేరు. ఇతని నడకే వేరు.

అసలా మాటకు వస్తే ఒక ఇతివృత్తాన్ని భావన చేయటం లోనూ ఆయా సన్నివేశాలు కల్పించటంలోనూ దానికి తగిన పాత్రలను ఎన్నుకోటంలోనూ ముందూ వెనుకా ఎక్కడా బెసగకుండా ఏమి చెప్పపోతాడో ఎవరికీ అంతా పట్టకుండా నడపటంలోనూ చివరదాకా అన్నీ నడుపుతూ కుతూహలాన్ని పెంచుతూ వచ్చి చివరకంతా అత్యాశ్చర్యంగా ముగించటంలోనూ ఎందులోనైనా సరే. ఒక విలక్షణమైన పోకడ ఈ సూరకవిది. ఒక విశిష్టమైన సాహితీ ప్రక్రియ. ఇది పురాణమా ఇతిహాసమా కావ్యమా నాటకమా నవలా కథానికా – ఏదైనదీ ఎవరికీ

అంతు పట్టకుండా సాగించాడు మహానుభావుడు. అందుకే వికటకవి పేరిట చెలామణి అయిందొక మాట లోకంలో. ఊహించి తెలియ రాకుండ సూరపరాజు భ్రమ కళాపూర్ణోదయము రచించెనని. ఏదో హాస్యంగా చెప్పాడేగాని భ్రమ మాత్రం కాదది. ప్రమే, వాస్తవానికి సూరపరాజు కళాపూర్ణోదయమే గాదు. ఆయన రచించిన ఏ గ్రంధం చూచినా అది కావ్యకళకు పూర్ణమైన ఉదయమే. నిజమైన అభ్యుదయమే.

కళా పూర్ణోదయమని పేరు పెట్టటంలోనే ఉంది ఎంతో చమత్కారం. కళాపూర్ణుడీ కావ్యానికి కధానాయకుడు. అతడెవడో గాదు. పూర్వజన్మలో మణికంధరుడనే గంధర్వుడు. అతడు మరలా ఎవరో గాదు. బ్రహ్మలోకంలో కాసారసరోవరంలోని మణిస్తంభంలో ప్రతిఫలించిన సరస్వతీ దేవి ముఖచంద్రుడే. కళాపూర్ణుడంటే చంద్రుడనే గదా అర్థం. ఆ చంద్రుడే మూడవ జన్మ ఎత్తిన కళాపూర్ణుడనే చంద్రుడు. సకల కళాపూర్ణుడని అర్థం కూడా. సూరప రాజు కవితా కళకు పూర్ణమైన ఉదయమని కూడా అర్థమే. శ్లేషకవి గదా సూరన. రాఘవ పాండవీయమనే మొదటి ద్వ్యర్థి కావ్యం ఆయన కలం నుండే గదా తొలిసారిగా వెలువడింది. ఆ ద్వర్థి కావ్యరచనా పాటవమే మయి పోతుంది. ఎంత దాచినా దాగదు. శ్లేష నుద్దేశించినా ఉద్దేశించకున్నా సంస్కార బలంతో అక్కడక్కడ తొంగిచూడకపోదు.

కళాపూర్ణోదయమే గాక పింగళి సూరన మరి మూడు కావ్యాలు వ్రాశాడు. ఒకటి గరుడపురాణం రెండు రాఘవ పాండవీయం. మూడు ప్రభావతీ ప్రద్యుమ్నం. ఆ మూడింటి తరువాత అన్నిటికీ మకుటాయ మానంగా రసజ్ఞ లోకానికంద జేసింది ఆయన ఈ కళాపూర్ణోదయమనే మహాకావ్యం. వీటిలో గరుడపురాణ మిప్పుడు మనకు లభ్యం కాదు.

పోతే మిగతా మూడింటిలో రాఘవ పాండవీయమొక ద్వ్యర్థి కావ్యం. అంటే చివరిదాకా రెండర్థాలిచ్చే రచన. ఆ రెండేమిటి. రాఘవ పాండవీయమని కావ్యానికి చేసిననామ కరణమే చెబుతుంది మనకు. రాఘవమంటే రామాయణ కథ. పాండవీయమంటే భారత కథ. అటు రామాయణ మిటు భారతం రెండు కథా వస్తువులకు ముడిపెట్టి రెండింటికీ సరిపడేలాగా ఆయా పదాలూ వాక్యాలూ వాటి విరుపులతో గూడిన పద్యాలు అత్యద్భుతంగా కూరుస్తూ పోయిన ప్రబంధమది. కథా సన్నివేశాలు రెండింటిలో ఎక్కడెక్కడ ఒకే రీతిలో సాగాయో గమనించి అలాంటివాటిని తీసుకొని నభంగా భంగ శ్లేషలతో కావ్యమెంతో రమణీయంగా రచించాడు. ఇంతెందుకు తరువాతి శ్లేషకవులందరికీ ద్వ్యర్థి కావ్యరచనకు దారిచూపిన మూలపురుషుడీ సూరపరాజే. ఎవరోగాదు. శ్లేషచక్రవర్తి అనిపించుకొన్న భట్టుమూర్తి వంటివాడే ఈయనగారి పంధాలో తరువాత ద్వ్యర్థికావ్యం వ్రాయాలని వ్రాశాడు. అదే హరిశ్చంద్రనలోపాఖ్యానం.

అయినా చిత్రమేమంటే భట్టుమూర్తి ద్వ్యర్థి అని పేరు పెట్టకుండా రచించిన వసుచరిత్ర నరస భూపాలీయంలోని శ్లేష కవిత్వమెంతో భేషని పించిందే గాని అదే పనిగా పేరు పెట్టి వ్రాసిన ఈద్వ్యర్థికార్యం మాత్రమేమంత హాయిగా సాగలేదు. ఏదో తెచ్చిపెట్టుకొన్నట్టు సాగుతుంది శ్లేషరచన. సూరన రాఘవ పాండవీయంతో సాటికి నిలవ లేదనిపిస్తుంది. సూరన శ్లేష అంటే శ్లేష గాదు. అత్యంత సుఖాశ్లేషనిస్తుంది సహృదయులకు. శ్రమపడి చెప్పినట్లుండదు ఏ పద్యం చదివినా మచ్చుకు కొన్ని ఉదాహరిస్తాను. చూడండి మీరే మీకే తెలుస్తుంది.

'తెలివి నతి ప్రగల్భుడసదృగ్భలు డాతడు భీష్మచాపకౌశలమె సహాయమై యమర శత్రువులన్ దునుమాడి 'ఇది ధృతరాష్ట్రుని ఒకవైపు దశరధ మహారాజును మరొకవైపు వర్ణిస్తున్న పద్యం. ధృతరాష్ట్రుడు. తెలివిలో చాలా గొప్పవాడే. ప్రజ్ఞాచక్షుడని పేరు గదా. ఆయనకు. కాని ఒక్కటే లోపం. అసదృగ్భలుడు. దృగ్భలం లేనివాడట. అంటే గ్రుడ్డివాడని అర్థం. అందుకే భీష్ముడి పరాక్ర మమే తనకు సహాయమై అమరిందట. ఆ సహాయంతో శత్రువులను జయించగలిగాడని భారతార్థం.

పోతే ఇక రామాయణార్థ మేమంటే తెలివితేటలలో చాలా గొప్పవాడు దశరథుడు. అంతేగాక అసదృగ్భలుడు. అసమానమైన బలపరాక్రమాలు గలిగినవాడు కూడా. దాని కనుగుణంగా భీష్మమైన అంటే భయంకరమైన చాపకౌశల్యం కూడా ఉంది. దానితో అమర శత్రువులను అంటే దేవతల శత్రువులైన రాక్షసుల నెందరినో రూపుమాపాడట. ఇది రామాయణార్థం. ఇందులో అసదృగ్భల – భీష్మ – అమర అనే మాటలు చూడండి కవి ఎంత నేర్పుగా రెండర్థాలు స్ఫురించేలాగా సభంగంగా అభంగంగా వాడూతూ తన అర్థద్వయ ఘటనా సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నాడో.

ఇలాంటిదే మరొక చిన్న సన్నివేశాన్ని వర్ణించే చిన్న కంద పద్యం చూడండి. ఎంత చక్కగా వ్రాశాడో. 'ఏనుంగని కరమరయక' అని మొదలవుతుంది పద్యం. ఏనుంగు అని కర మరయ లేదట దశరథుడు. ముని కుమారుడని గాక ఏనుగు అని భ్రమపడ్డాడాయన. దానికి కారణం కరమరయక బాగా వివేచన చేయకపోవటం. ఇది రామాయణార్థమైతే ఇక ఈ మాటలలోనే భారతార్థం వినండి. ఏనున్– నేను కూడా ఎంత తెలివి తక్కువవాడిని. కనికరం లేకుండా ఆ జింక మిథునం కిందమ

ముని దంపతులని ఆలోచించక బాణం వేసి శాపం నెత్తికి తెచ్చుకొన్నానే అని బాధ పడతాడు పాండురాజు. ఇది భారతార్థం. ఇక్కడ గర మరయక అనే మాటలో రెండర్థాలూ ఎంత ముగ్ధమనోహరంగా ఇమిడ్చి చెప్పాడో చూడండి మహాకవి. ఏనుంగని - కరమయక అని ఒకచోట విరుపైతే ఏనుం - గనికర మరయక అని మరొకచోట విరుపు. ఇలాంటి విరుపులూ మెరుపులతోనే సాగింది చాలావరకూ ఆయన రాఘవ పాండవీయమనే ద్వ్యర్థి కావ్యం.

పోతే ఏదో తన భాషా విశేష పాటవాన్ని చూపటానికి ఒక ప్రయోగం చేసి చూపాడే గాని ఇది కూడా కాదు మహాకవి తాత్పర్యం. ఇది ఒక సాహిత్య క్రీడ మాత్రమేనని తెలుసు ఆయనకు. మరి కవిగా ఆయన దృష్టి ఏమిటి అడుగుతారేమో. అది ఎలాంటిదో ఎంత సర్వతోముఖమైనదో ఎంత సర్వాంగ సుందరమైనదో మరి రెండు మహాకావ్యా లాయనగారు కల్పించి లోకానికందించినవి చాలు. ప్రబలతరమైన సాక్ష్యమిస్తాయి మనకు. అది ఒకటి ప్రభావతీ ప్రద్యుమ్నం వేరొకటి కళాపూర్ణోదయం. రెండూ రెండే విలక్షణమైన రచనలు. మిగతా ప్రబంధాల పాత పంథాలో గాక చాలావరకు సరికొత్త బాణీలో నడచిన ప్రక్రియలు. సూరనగారి కల్పనా ప్రాగల్భ్యానికి రెండూ రెండు ప్రతీకలు. ఇందులో ఒకటి నాటక బాణీలో నడిస్తే ఇంకొకటి నవలా బాణీలో సాగిన రచన. అలాగని కవితా శిల్పానికేలాటి లోపం లేదు. కల్పనలో బడి పోయి కవిత్వమంటే ఏమిటో దాని రూపురేఖలు తెలియనివాడు గాదు కవి. తతిమా ప్రబంధ కవులకంటే చాలా బాగా తెలిసినవాడు.

తన కవితా పాటవమేమిటో ఎలాటిదో తానే చాటుతాడు తన కావ్యంలో. స్వయంగానా కాదు, అంత బాహాటంగా చేస్తే అది వాచ్యమవు

తుందేగాని వ్యంగ్య మర్యాదను కోలుపోదూ. పోతే కావ్యలు కాదది. కథ అవుతుంది. అందుకే మహాకవి తన ప్రతిభను తానుగా గాక తాను సృష్టించిన మణికంధరుడనే పాత్ర ద్వారా బయటపెడతాడు. మణికంధరు డసలు సూరన మహాకవే. కవే అతనిలో పరకాయ ప్రవేశం చేసి అతని నోరుపెట్టుకొని మాటాడుతున్నాడు. మణికంధరుడెవరు. తరువాత కళాపూర్ణుడే గదా కథలో. సూరన తన జీవిత కథలో కూడా మొదట మణిలాటి విలువైన ప్రజ్ఞాపాటవాన్ని కంఠంలో దాచుకొని క్రమంగా దాని నభివృద్ధి చేసుకొని కావ్య కళాపూర్ణత్వాన్ని అందుకొని ఉంటాడు సందేహంలేదు.

చూడండి మణికంధరుడు నారదుని శిష్యుడు. సంగీత సాహిత్యా లలో ఆరితేరినవాడు. గురువుగారి చేతనే భేషనిపించుకొన్న వాడు. గురువుగారితో కలిసి మొదట కృష్ణపరమాత్మను ద్వారకలో దర్శించినపుడొక దండకం ఆశువుగా చదువుతాడు. అది తరువాత కలభాషిణి కంఠస్థం చేసి నారదుని ఎదుట గానం చేస్తుంది. శ్రీ కామినీ కామితా కార సాకార కారుణ్య ధారాన నవాంకూర' అని యిలా సాగుతూ పోతుందా దండకం. మొట్టమొదట ఆ దండకం చదివినప్పుడు సంతసించి ఆ దేవదేవుడు పారితోషికంగా ఇచ్చిందిగదా మీ శిష్యుడి కంఠంలో కనిపించే ఈ మణిహారమని గుర్తు చేస్తుంది కలభాషిణి నారదుడికి. అప్పుడర్థమవుతుంది మనకు మణికంధరుడనే పేరు ఎలా వచ్చిందో ఆ గంధర్వకుమారుడికి. అని మెచ్చుకొని చెబుతూ చెబుతూ అసలు కవిత్వమంటే ఈ మహానుభావుడిదే కవిత్వం అని ఆ నెపంతో కవితా శిల్పమనేది ఎలా ఉండాలో ఒక గొప్ప నిర్వచనం చేస్తుంది. అతడు కళాపూర్ణుడు. ఆవిడ కలభాషిణి. కళాపూర్ణుడి కళా పాటవాన్ని

కలభాషిణే గదా భాషించవలసింది. నలుగురికీ చాటించవలసింది. చూడబోతే నారదుడెవరో గాదు సూరన కవితా గురువు తిక్కన సోమయాజి లాంటి కవి బ్రహ్మ అయి ఉంటాడు. ఆయన ప్రచ్ఛన్న వేషమే నారద మహర్షి. ఆయన శిష్యుడు సూరపరాజు అవతారమే మణికంధరుడు. ఆయన వాగ్వైభవాన్ని వైచిత్ర్యాన్ని నిరంతరం ప్రశంసిస్తూ వెంట దిరిగే ఒకానొక ప్రియశిష్యురాలే కలభాషిణి అయి ఉంటుంది సందేహం లేదనిపిస్తుంది నాకు.

కలభాషిణి ఏమని కీర్తిస్తున్నదో వినండి ఆయనగారి కవితా సౌష్ఠవాన్ని.

పొసగ ముత్తెపు సరు ల్పోహళించిన లీలc
దమలోన దొరయు శబ్దములు గూర్చి
యర్థంబు వాచ్యలక్ష్య వ్యంగ్య భేదంబు
లెఱిగి నిర్దోషత నెసగఁజేసి
రసభావములకు నర్హంబుగ వైదర్భి
మొదలైన రీతు లిమ్ముగనమర్చి
రీతుల కుచితంబు వై తనరారెడు
ప్రాణంబు లింపుగాc బాదుకొల్పి
యమరనుప మాదులును యమకాదులు నగు
నట్టి యర్థ శబ్దాలంక్రియలు ఘటించు
కవిత చెప్పంగ నేర్చు సత్కవి వరునకు
వాంఛితార్థంబు లొపగని వారు గలరె.

అంటూ ఏకరువు పెడుతుంది. మొత్తమలంకార శాస్త్రమంతా హారతి పట్టినట్టయింది. ఈ వర్ణనలో. ఎప్పుడే గాని మొదట శాస్త్రం

తెలిసి ఉండాలి. తరువాత దానికనుగుణంగా ఒక కళను సాధించి చూపాలి లోకానికి. ఒకటి వ్యుత్పత్తి మరొకటి ప్రతిభ అని పేర్కొంటారు కావ్యమీమాంసకులు.

అందులో ఇప్పుడు వర్ణించింది కవి కుండవలసిన కవితా సామగ్రి వ్యుత్పత్తి అయితే ఇక కవి చూపవలసిన ప్రతిభా పాటవమేదో అది కూడా బయటపెడుతున్నాడు కలభాషిణి మాటల్లో సూరపరాజు, అవధరించండి రసజ్ఞులు.

చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
గలిగినను - సౌరభము చలువయుఁ దలిర్పం
బొలుపెసగు - కప్పురపు బలుకులకుఁగోమలతగని గినసు
సౌరభము, జలువ పసయుంగో
నులతయును గలిగి జగముల మిగులఁబెంపెసగు
మలయపవనం పుఁగొదమలకు మధురత్వం
బలవడిన - నీడు మతీ కల దనగ వచ్చుఁగడు
వెలయఁగల యీ సుకవి పలుకులకు నెంచన్ -

చూడండి యీ వర్ణనమేదో ప్రశంసారూపంగా సాగినట్టు కనిపిస్తున్నా తరచి చూస్తే ఎంత గొప్ప భావ శబలత ఉందో చెప్పలేను. మహాకవి కవితా శిల్పానికీ సృష్టిలో ఏదీ సరిపోల్చటానికి పనికి రానంత అపూర్వమైన సృష్టి కావ్యసృష్టి అని తాత్పర్యం మొత్తానికి. ఎలాగని అడిగితే ఎంత చమత్కారంగా సమాధానమిస్తాడో చూడండి కవి. చంద్రుని వెన్నెలా కర్పూరమూ వలయమారుతమూ. ఇలాంటి ప్రకృతి సిద్ధమైన పదార్థాలనే గదా ఉపమానాలుగా చెప్పవలసింది. అందులో ఆ మూడింటికీ ప్రతి ఒక్కదానికీ ఒక గుణముంటే ఒక గుణం లేదు.

వెన్నెలకు చల్లదనముందే గాని పరిమళం లేదు. కర్పూరానికి శైత్య సౌరభాలు రెండూ ఉంటే ఉన్నాయి గాని మార్దవమనే గుణం లేదు. ఆ రెండూ అదీ మూడూ ఉండవచ్చు మలయానిలానికి. అయినా దానికి మాధుర్యమనే గుణం కానరాదు. అంచేత అవి ఏ ఒక్కటీ పనికి రావంటాడు పోల్చటానికి.

దీన్నిబట్టి ఏమర్థమవుతున్నది మనబోటి సహృదయులకు కవిత్వమనేది ఒక గొప్పకళ. అందులో నాలుగు గుణాలు పొందుపడి ఉండాలి. అప్పుడే అది సమగ్రమైన కళ అనిపించుకొంటుంది. ఒకటి శైత్యం. హృదయానికి చల్లగా సోకటం. రెండు పరిమళం. ఆఘ్రాణించే కొద్దీ ఆనందమివ్వటం. మూడు మార్దవం. ఏమాట ఉచ్చరించినా మృదువుగా నోటికి తగలటం. నాలుగు మాధుర్యం. అంతకన్నా భావన చేసే కొద్దీ దాని రుచి కూడా అనుభవానికి రావటం. చూడబోతే 'త్వక్చక్షురాది పంచేంద్రియాలకూ తృప్తినిచ్చి అంతకన్నా సంతృప్తిని మనో భూమికకు కూడా ప్రసాదించ గలిగినప్పుడే అది ఉత్తమ కవితా శిల్పమని అది బ్రహ్మ సృష్టికన్నా విలక్షణమైన కవిబ్రహ్మ వాఙ్మయ సృష్టి అని ఎంతో గొప్ప గంభీరమైన భావమిమిడి ఉన్నదీ పద్యంలో. పద్యం నడక కూడా భావానుగుణంగా సాగుతున్నది. చూడండి ఎంతో ఒయ్యార మొలకబోస్తూ సరిగా ఇది పూర్వం కవితా పితామహుడల్లసాని పెద్దన ఆశువుగా చెప్పిన 'పూతమెఱుం, గులుం బసరుపూప బెడంగు' లనే ఉత్పలమాలికను మనసుకు తెస్తున్నది. అది కూడా కవితా కళను వర్ణించిన పద్యమే. అందులోనూ రుచీ వాసనా మాధుర్యాది గుణాలను కవిత్వమెలా మనకు స్ఫురింప జేయాలో అనుభవానికి తేవాలో ప్రస్తావించినదే.

ఇంతకూ చెప్పవచ్చిందేమంటే కల్పనా ప్రపంచమంటే అది కవిగారి కథా నిర్మాణం వరకే పరిమితమను కొంటారేమో. అలాకాదు. ఎంత అపూర్వమైన కథా నిర్మాణం చేస్తూ పోయాడో సూరపరాజంత చక్కని కవితా రాజ్యాన్ని కూడా పాలిస్తూ పోయాడని అర్థం చేసుకోవాలి మనం. అలా కాకుంటే అది కేవల మొక కాశీమజిలీ కథ లాంటిదో లేదా పూర్వకవుల కథా సరిత్సాగరం లాంటిదో అవుతుందే గాని కావ్యమని పించుకోలేదు. ఒకవిధంగా చెబితే నమూ భంగిమలో సాగిన ఒకానొక అపూర్వమైన తెనుగు కావ్యం. ప్రబంధ కవుల కావ్యాలలో ఎందులో కూడా ఇలాటి కథా కల్పన మనకు దొరకదు. కథా సరిత్సాగరాదులున్నాయి గదా అంటే అవి ఇంత పకడ్బందుగా నడచిన కథలూ కావు. కావ్యాలూ కావు. మరి కావ్యాలున్నాయి గదా అంటే అవి ఇంత ఒకదానితో ఒకటి పెనవేసుకొని పద్మవ్యూహంలాగా సాగిన కథా నిర్మాణమూ కాదు. అందులోనూ కేవల ముత్పాద్యమూ కాదు అలాగని కేవలం ప్రఖ్యాతమూ గాదు ఇతివృత్తం. రెండూ కలగాపులగంగా సాగిన రచన. ప్రఖ్యాతం కూడా నిజానికి ప్రఖ్యాతం కాదు. అదీ ఒకవిధంగా ఉత్పాద్యమే. తన ప్రజ్ఞాపాటవంతో ఉత్పాద్యాన్నే పైకి చూస్తే ప్రఖ్యాత మని భ్రాంతి గొలుపుతూ సాగించాడు రచన. ఇది మరీ ఆశ్చర్యం. గడుసుతనం.

ఒక మాట. ఈ గడుసుతనం పింగళి సూరన రచించిన రెండు కావ్యాలలోనూ మనకు దర్శనమిస్తుంది కన్నుల పండువుగా. నవలా బాణి ప్రధానంగా కళాపూర్ణోదయం సాగితే నాటకబాణి ప్రధానంగా సాగింది అతని ప్రభావతీ ప్రద్యుమ్నం. ఇందులో కళాపూర్ణోదయమే సూరపరాజు ముందు రచించిన కావ్యమైతే ప్రభావతీ ప్రద్యుమ్నమనేది

దాని తరువాత రచించినది. అంటే కవి రచనా యాత్రలో చివరి ఘట్టం ప్రభావతీ ప్రద్యుమ్నమన్న మాట. కళాపూర్ణోదయం కాదు. ఈ మాట ఆయననోటనే వినవచ్చు మనం.

'జనము లెచ్చగము ద్రచించితి నుదంచ ద్వైఖరిన్ గారుడం
బును-శ్రీరాఘవ పాండవీయము-కళాపూర్ణోదయంబునన్ మతీన్
తెనుగుం గబ్బము లెన్నియేనియును - మత్పిత్రాది వంశాభివ
ర్ణన లేమిన్ పరితుష్టి నాకవి యొనర్పంజాల వత్యంతమున్.

ఇదీ ఆయన మాట. జనరంజకంగా ద్రాశాడట. అదీ ఉదంచ ద్వైఖరితో. ఉదంచత్తంటే అన్నిటికన్నా ఎత్తైన అని అర్థం. అలాటి ఉన్నతమైన శిఖరాలనందుకొనే లాగా సాగించిన రచన. అది రాఘవ పాండవీయమే గాదు. గరుడపురాణమే గాదు. ఆఖరుకు కళా పూర్ణోదయమే గాదు. అన్నీ విచిత్రమైన విలక్షణమైన రచనలే. ఇంకా ఒక మాటేమిటంటే ఇలాటి బాణీలోనే ఇంకా ఎన్నో తెనుగు కావ్యాలు రచించానంటాడు. ఏవీ. ఒక్కటీ కనపడదు మనకిప్పుడు. బహుశా ఒక గొప్ప కావ్యం సర్వాంగ సుందరంగా వెలువడే ముందు దాని పరిపాకం కోసం ఏవేవి. అయినా ఎన్నో నమూనాలు ద్రాస్తూ వస్తాడు. అవి ఆ పరిపక్వమైన రచన వెలువడిన తరువాత నిలవవు. నిలవాలని కూడా రచయిత అనుకోడు. పరిపూర్ణమైన తన కావ్యంలో అవి సముద్రంలో ఏఱులలాగా కలిసి వచ్చాయి గదా అని మీదు మిక్కిలి సంతోషిస్తాడు. అలాటి వ్యవహారమే ఇక్కడా జరిగి ఉంటుంది.

పోతే ఇది గాదు విషయం మనమాలోచించవలసింది. అందులో దేనిలోనూ రాలేదట తన పితృపితా మహాది వంశీయుల ప్రస్తావన. అది తనకు చాలా కొఱతగా ఉందంటాడు. కనుకనే

'ఏనుం బితృ పూజననా
చేనైన ట్లైద్ధియైనఁ జేయఁగ వలయుం
గానఁగృతి ఇచ్చిమేదిని
పై నిలుపుదు నతని కీర్తిఁబరమేశు కృపన్, మాతండ్రి తాతల కొక ప్రబంధం బహూకరించి వారి వారి కీర్తినీ భూమిమీద ఆచంద్రతార్కంగా నిలపాలని ఉందంటాడు. ఏమిటా ప్రబంధం - ఎలా నిలుపుతావని అడిగితే చెబుతున్నాడు. 'ప్రభావతీ ప్రద్యుమ్నంబు మద్గురుండైన అమరామాత్యుని పేర నకింతంబుగ రచియింపంగడంగి - తత్కావ్యలక్ష్మీ ముఖంబునకుం దిలకాయ మానంబుగ నా వంశావతారం బిభి వర్ణించెదనని - ప్రభావతీ ప్రద్యుమ్నమనే కావ్యాన్ని ప్రారంభిస్తాడు.

అప్పటికి కళాపూర్ణోదయం కూడా కవి రచించిన కావ్యాలలో కడపటిదిగాదు. ప్రభావతీ ప్రద్యుమ్నమే కడసారిగా రచించిన కావ్యం. దానికన్నా ముందు రచించినదే కళాపూర్ణోదయం. అంటే కవి కవితా కళకు పూర్ణమైన ఉదయం కళాపూర్ణోదయ కావ్యమయి ఉంటుందనే మన అంచనా అంత సమీచీనం కాదు. అది పూర్ణోదయమైతే పరిపూర్ణోదయ మప్పటికి సూరనగారి ప్రభావతీ ప్రద్యుమ్నమని చెప్పవలసి ఉంటుంది. నన్నడిగితే కవి కథాకల్పనా కవితా శిల్పం రెండింటిలో సమానంగానే దర్శనమిస్తున్నా ఒక చిన్న విశేషముంది రెండింటిలో. రెండూ సర్గబంధాలే అయినా కళాపూర్ణోదయం కాళిదాస మహాకవి రఘువంశం లాంటిదైతే ప్రభావతీ ప్రద్యుమ్న మాయన కుమార సంభవం లాంటి కావ్యం. రఘువంశంలో వస్త్వైక్యం లేదు. వంశైక్యముంది. అంటే అనేకమంది రాజుల జీవిత కథల సంపుటీకరణ

మది. మరి కుమారసంభవమలా కాదు. సంపుటీకృతమైన ఒకే ఒక కథా వస్తువు. అయితే రెండూ రెండే మహాకవి కలం నుంచి జాలు వారిన రెండు ఆణిముత్యాలు.

అలాగే పింగళి వారి కళాపూర్ణోదయ మనేక పాత్రల ఉదంతాలన్నీ పోగుచేసి ఒకే ఒక సూత్రంలో గుది గుచ్చటమైతే ప్రభావతీ ప్రద్యుమ్న మలా కాక ఆదినుంచీ అంతందాకా ఒకే ఒక కథా వస్తువులో పాత్రలన్నీ వాటి పాటికవే వచ్చి పాలుపంచుకొంటాయి. అందులో నాయికా నాయకులు ఆనందంగా ఒకరినొకరు కలుసుకోటానికి మూడు జన్మలు పడుతుందిద్దటికీ. చిలుక జన్మ కలభాషిణి జన్మ మధుర లాలస జన్మ మూడు జన్మలెత్తింది నాయిక. మరి నాయకుడు సరస్వతీ కంఠాభరణమై మొదట తరువాత మణికంధరుడై జన్మించి మూడవసారి కళాపూర్ణుడుగా జన్మించవలసి వచ్చింది. ఇలాటి పరస్పర వియోగమూ ప్రతీక్షా ఏ గొడవా లేదు ప్రభావతి ప్రద్యుమ్నంలో. ఇక్కడ మొదటి నుండీ చివరిదాకా ప్రభావతి ప్రభావతే ప్రద్యుమ్యుడు ప్రద్యుమ్నుడే. నాయికా నాయకులు మారిపోరు. వారి జన్మలు మారవు. కనుకనే ఇది కుమార సంభవంలాంటి కావ్యమని చెప్పటం. పార్వతీ పరమేశ్వరులొక్కరే అక్కడ నాయికా నాయకులు. మరి కళాపూర్ణోదయమో రఘువంశం లాంటిది. ఒకరుగారక్కడ నాయికా నాయకులు. సుదక్షిణా దిలీపులు మొదట. వారు మారి రఘుమహారాజు ఆయన భార్య. వారూ తరువాత మారిపోయి ఇందుమతీ అజుడూ తయారవుతారు. ఆ పిమ్మట దశరథ రామ కుశాది రాజన్యులు వారి నాయికలూ, అందరికీ తెలిసిన విషయమే. ఇదే నమూనాలో నడచింది కళాపూర్ణోదయం సూరన రాజుది.

అయితే ఏమాటకామాట చెప్పుకోవాలి మనం. సూరనకవి సాధించిన ఒక గొప్ప కథా శిల్పమేమంటే కథ అంతా తన స్వక పోలకల్పనే అయినా రెండు కావ్యాలలోనూ జగన్నాటక సూత్రధారి కృష్ణపరమాత్మ కనిపిస్తాడు మనకు. కాదు మనబోటి ప్రేక్షకుల కనుల ఎదుట ఆయనను సాక్షాత్కరింపజేస్తాడు కవి. చూడబోతే గొప్ప కృష్ణ భక్తుడయి ఉండాలి కవి. లేదా తన కృతిపతి నంద్యాల కృష్ణ భూవరుడి నామధేయానికి కూడా సరిపడేలాగా గారడీ అయినా చేసి ఉండాలి. దానికా రాజు గారు లోలోపల మురిసిపోయి ఉంటాడు కూడా.

అంత మాత్రమే కాదు. ఇది ఉత్ప్రాద్యమా ఈ కథా వస్తువు లేక ప్రఖ్యాతమా ఏదైనదీ పోల్చుకోలేక తేల్చుకోలేక పాఠకులకుమతి పోయేలాగా ఒక మహేంద్ర జాలం ప్రదర్శించాడు కథా వస్తువు నడపటంలో మహాకవి ఒక ఐంద్రజాలికుడిలాగా. రెండు కావ్యాలలోనూ కథ ఉత్ప్రాద్యమే. అంటే కవి కల్పితమే. ప్రఖ్యాతము కాదు. అంటే రామాయణ భారతాది పురాణేతిహాసాలలో చేయిపెట్టి ఎక్కడి నుంచీ సేకరించి తెచ్చింది కాదు. కానీ చిత్రమేమంటే అలా కల్పించినా పాఠకులం మనం చదువుతుంటే ఇది కవి క్రొత్తగా కల్పించింది కాదు. అంతా ఏదో పురాణంలోదో ఇతిహాసంలోదో అయి ఉంటుంది సందేహం లేదని మనకిది ఒక ప్రఖ్యాతమైన కథేననే భ్రమ కల్పిస్తాడు మహాకవి. లేకపోతే కృష్ణుడేమిటి నారదుడేమిటి రంభ ఏమిటి నలరూబరుడేమిటి. వీరంతా ఎవరు. పౌరాణిక పాత్రలు కారూ. అసలా బ్రహ్మదేవుడెవరు సరస్వతి ఎవరు. భారత భాగవతాది పాత్రలేనా కారా. వారేగదా అనుకొనే లోపుగా మణికంధరుడనీ కలభాషిణి అనీ అలఘువ్రతుడనీ మధురలాలస అనీ సుగాత్రి అనీ శాలీనుడనీ వీరంద రినీ తెచ్చి వారితో వీరిని ముడిపెట్టి

ఏవి పురాణ పాత్రలో ఏవి నవీన పాత్రలో గుర్తుపట్టకుండా మసిబూసి మారేడు బుట్ట చేస్తూ వచ్చాడు.

ఇక ప్రభావతీ ప్రద్యుమ్నంలో అయితే ప్రద్యుమ్నుడు పాతవాడైనా ప్రభావతి ఎవరో కొత్తది. అదీ ఒక రాక్షసుడి కూతురు. దాన్ని వీడు ప్రేమించటం. మరి కృష్ణుడంటాడు దేవేంద్రుడంటాడు. అలా అంటూనే మరలా భద్రుడని ఒక ఐంద్రజాలికుణ్ణి పట్టుకు వస్తాడు మధ్యలో. అందులో మరొక అద్భుతమైన కొత్త పాత్ర. మానవ పాత్ర కూడా కాదది. హంస పాత్ర. శుచిముఖి అని దాని పేరు. ఇది ఎక్కడిదో. ఎక్కడ సృష్టించాడీ కొత్త పాత్ర. ఊరక సృష్టించే వరకే గాదు. దాని ద్వారా ఎంత కథ నడుపుతాడో కవి చెప్పనలవి గాదు. అంతా కల్పనే. అంతా వాస్తవమే. కల్పన అయినా వాస్తవంగా జరిగిందా ఏమి అనేంత గొప్ప కల్పన. ఆ భద్రుడనే ఐంద్రజాలికుడున్నాడో లేడోగాని ఉన్నాడొక ఐంద్రజాలికుడు. సూరన నామధేయుడు. వాడు ప్రదర్శించాడో లేదోగాని కథలో ఆ గారడీ ప్రదర్శిస్తూ వచ్చాడొక మహోద్భుతమైన గారడీ సూరకవి అనే గారడీవాడు.

ఈ గారడీ కవి రెండు కావ్యాలూ ఇలాటి గారడీ విద్య అడుగడుగునా చూపిన రెండు సాముగరిడీలే. సందేహం లేదు. అందులో కళాపూర్ణోదయమనే మొదటి గరిడీలో ప్రవేశించి ఆ గారడీ ఏమిటో ఎలా ప్రదర్శించాడో చూద్దాము. కావ్యశిల్పంలో కవిగారి కథా శిల్పం చూచి తరువాత కథలో చోటుచేసుకొన్న కవితా శిల్పం కూడా ఓపిక ఉంటే తిలకించవచ్చు మనం. ప్రభావతీ ప్రద్యుమ్నం నాటకీయ ఫక్కిలో సాగితే కళాపూర్ణోదయం నవలా బాణీలో సాగిందని గదా పేర్కొన్నాము. నిజంగా ఏ నవలా పనికిరాదు దీనిముందు. Novel అనే ఇంగ్లీషు మాట

కసలు సరికొత్త రచన అని అర్థం. ఎక్కడికక్కడ కొత్తే ఇందులో కథా సన్నివేశాలు. కథకు మొదలేదో తుద ఏదో పోల్చుకోలేము. అందులోనూ అసలు కథ సత్యలోకంలో జరిగితే దాని నకలు భూలోకంలో జరిగింది. అసలుతో గాక దాని ఛాయ అయిన నకలుతో ప్రారంభమవుతుంది కావ్యం. సరిగా ఒక గొప్ప నవలలాగే సాగుతుంది.

ఇందులో అసలు కథ ఏమిటో ఎలాంటిదో తెలియక ఈ నకలును మాత్రమే చదువుతూ పోతే అంతు పట్టదు కథా మూలం మనకు. అంతా అయోమయం. ప్రశ్నలమీద ప్రశ్నలుదయించి ఎంత వెతికినా వాటికి జవాబు కనిపించదు. అంచేత అసలు కథ ఎక్కడ ఉందో ఆరా తీయాలి. ఆరా తీస్తూ పోతే అది ఎక్కడో అయిదవ అశ్వాసంలో గాని మనకంట బడదు. నవల గదా ఈ ప్రబంధం. ఓం ప్రథమంలోనే ఎలా దర్శనమిస్తుంది. ఎనిమిదాశ్వాసాల కావ్యంలో చూడండి అయిదవ ఆశ్వాసమంటే సరిగా ఉత్తరార్ధ మారంభమయ్యే సంధి. అక్కడ పెట్టాడు మర్మం. మహాకవి రచనా ప్రణాళిక చూడండి. ఎంత చమత్కారంగా ఉందో. సరిగా కావ్యం నట్టనడుమ వెలిగించి పెట్టిన ఈ దీపకాంతే దేహళీ దత్తదీపం లాగా కావ్యమటూ ఇటూ ప్రసరించి కోణకోణాలూ వెలిగించి చూపాలని కవి ప్లానను బహుశా. మరి ఏమిటా మూలకథా సన్నివేశం ఎలాంటిదని అడుగుతారా. అత్యద్భుతమది.

సత్యలోకమది. సరస్వతీ చతుర్ముఖులు ఏకాంతంగా విహరిస్తున్నారు అక్కడ ఒక సరోవరం. దాని తూరుపు గట్టున దానివైపు తిరిగి పవళిస్తాడు చతుర్ముఖుడు. తొడపై నిడుకొని ఆయన పాదాలొత్తుతుంటుంది సరస్వతి. అంతలో కామవాంఛ ఎక్కువయి ఆనలువ ఆవిడను పానుపునకు తార్చి తన నాలుగు ముఖాలతో ఆ విడను చుంబిస్తాడు.

ఆవిడ ఇదేమిటీ మోటు సరసమని మొగం ప్రక్కకు తిప్పుకొని పడుకొంటుంది. అయినా అతడావిడ చేతులు ప్రక్కకు త్రోసి ముఖం బలవంతంగా వంచి దంతక్షతం చేస్తాడు. దానికి పరవశమై ఆవిడ ఒక మధురమైన మణిత ధ్వని చేస్తుంది. చేస్తూ తలిగినట్టు పరాఙ్ముఖంతో పడుకొంటుంది. అది చూచి బ్రహ్మకేదీ తోచక పంజరంలో ఉన్న చిలుకను చూచి ఉబుసు పోకున్నది. ఏదైనా కథ చెబుతావా అని అడుగుతాడు. నేను మీకేమి చెప్పగలనయ్యా మీరే చెప్పండంటుందది. సరేనని చెప్పటం ప్రారంభిస్తాడతడు.

అనగా అనగా ఒక కాసారమనే పట్టణం. అది కళాపూర్ణుడనే రాజు పాలిస్తుంటాడు. అతడు తోడిరాజు లందరినీ జయించి నవయౌవనుడయి ఉండగా స్వభావుడనే సిద్ధుడొకడు వచ్చి ఒక మణినీ ధనుర్బాణాలూ ప్రసాదిస్తాడు. అంతలో మదాశయుడనే రాజొకడు తన రాణి రూపానుభూతి. తన మంత్రి ధీర భావుడనే వాడితో యాదృచ్ఛికంగా కనిపిస్తాడు. వెంటనే కళాపూర్ణుడా ధీరభావుణ్ణి దూరంగా తటిమి పాదాక్రాంతుడైతే కరుణతో ఏలుకొంటాడు. తరువాత అభినవ కౌముది అని ఒక అప్సరస వచ్చి అతణ్ణి వరిస్తుంది. మరి అతని తల్లిదండ్రులెవరో తెలుసా. సుముఖాపత్తి అనునది తండ్రి మణిస్తంభుడనువాడు తల్లి. అని చెప్పగా విని సరస్వతి పకపక నవ్వుతూ అటువైపు తిరుగుతుంది. ఇదే సందని చతుర్ముఖుడామె కంఠము వంచి తన నాలుగు ముఖములతో ఆవిడ అధరపానం చేస్తాడు. వాటిలో ఒకటి తన్ను గట్టిగా పీడించే సరికి పట్టలేక చేతులు ప్రక్కకు నెట్టి అసలా కథా నాయకుడి విషయమేమిటో అది చెప్పమంటుంది.

ఏమవుతుంది సత్త్వదాత్ముడనే సచివుడొకడు వచ్చి అంగదేశంలో క్రముక కంతోత్తర మనే పట్టణానికి రాజుగా అతనికి పట్టం కడతాడు. దానికి మదాశయుడొక బంగారుకోట నిర్మించి అతనికి ప్రీతిపాత్రుడయి అతని వద్ద ఉన్న మణిని తానూ తన భార్యా నిత్యమూ చూస్తూ దాని ప్రభావం వల్ల మధురలాలస అనే కుమార్తెను గంటారు వారు. ఇంతలో ఆ మణి ప్రభావ వార్త విని ముగ్ధులైన అతని పురోహితులు నలుగురు ప్రధమ ద్వితీయ తృతీయ చతుర్ధాగములనే పేర్లు గలవారు బయలుదేరి వచ్చి ఆ మణిని స్పృశిస్తూ తన్మయు లవుతుంటారు. అందులో ఒకడు దాన్ని గట్టిగా పట్టి నొక్కేసరికా రాజుకు కోపం వచ్చి వారందరినీ పారదోలి వారికి యజమాని అని చెప్పి మదాశయుడు నిర్మించిన కనకప్రాకారాన్ని కూడా కూల్చివేసి ముదాశయుణ్ణి కుటుంబసమేతంగా బయటికి పంపుతాడు. మదాశయుడేమీ బాధపడక క్రముక కంతోత్తర పురం విడిచి వెళ్లుతూ పూర్ణకలశద్వయం చూచి సంతోషిస్తూ మధ్య దేశంలో నిలిచిపోతాడు. ప్రయాణ శ్రమతో మధురలాలస అనే తన బిడ్డ కృశిస్తుంది.

అది చూచి భరించలేక మరల కుటుంబ సమేతంగా వచ్చి కళాపూర్ణుని దర్శించి జరిగిన ఉదంతం చెప్పి క్షమించమంటాడు. అతడూ ఏమీ అనుకోడు. మధురలాలస అక్కడికి రాగానే గిటగిటన పోయి మరలా పుటపుటనగా మారుతుంది. తమ స్వామి కళాపూర్ణుడి కొలువు సంపాదించాడిక పరవాలేదని అతని పురోహితులు ప్రధమాగ మాదులూ మరలా అక్కడికి చేరబాఱుతారు. మధురలాలస క్రమంగా యౌవనవతియై కళాపూర్ణుని పెండ్లియాడి ఆయనకు పట్టపురాణి అవుతుంది. అత డభినవ కౌముదీ మధురలాలస లనే ఇద్దరు దేవేరులను ముద్దు చేస్తూ యౌవన

సుఖమను భవిస్తుంటాడు. కధ అంతా ఆలకించి సరస్వతి ప్రణయ కోపమభినయిస్తూ' మీరెంత గడుసువారండీ కడకు నామీదనే ప్రయోగిస్తారా మీ కధా కౌశలమంతా. నేనా మాత్రం గ్రహించ లేననుకొంటున్నారా. ఇదంతా నేనిచ్చిన విద్యేగామీకు. ఇప్పుడు మీరు చెప్పిన కధ అంతా మన ఇద్దరి కధే గదూ. కావాలంటే వివరిస్తా వినండి.

కాసారపురమేదో గాదు. ఈ సరోవరమే. అందులో ప్రతిఫలించిన నాముఖ చంద్రుడే కళాపూర్ణుడనే రాజు. అతడందరు రాజులనూ జయించటం నాముఖ చంద్రుడన్య ముఖాల నన్నింటినీ సౌందర్యంలో త్రోసి రాజనటమే. మరి మీరు చెప్పిన స్వభావ సిద్ధుడూ అతడా ధనుర్బాణాలూ అరుణమైన మణిని సమర్పించటమేదో గాదు. నా కనుబొమలూ కనుచూపులూ అరుణమైననా అధరమూ. అవి నాకు స్వభావ సిద్ధమేనని గదా మీ భావం. మరి కాసారమున కయి మీ హృదయమూ దృష్టి అనురాగంతో మసలటమే మదాశయ రూపాను భూతులు. వారి పొలకువ. కాని వారి ధీర స్వభావం నా ముఖ కళాపూర్ణుడు పాఱదోలి మరలా వారిద్దరినీ ఆకర్షించటమే. అంతలో మీ మాటలకు నాకు నవ్వు రాగా చూచి దాని నభినవ కౌముదిగా భావించి అది కళాపూర్ణుని వరించినదని వర్ణించితిరి. మరి సుముఖా పత్తి తండ్రి మణిస్తంభుడు తల్లి అని మీరన్న మాట కూడ ఏదో గాదు. నా ముఖ సామీప్యం వల్ల సరోవర మధ్యంలో ఉన్న మణిస్తంభ గర్భంలో నా ముఖ ప్రతిబింబం ఉదయించటమే గాని మరొకటి గాదు. అదీ కళాపూర్ణుడు.

అయితే మీరు సుముఖాసత్తి అనీ మణిస్తంభుడనీ ఇద్దరినీ తల్లిదండ్రులుగా విజ్ఞోడు పడి వర్ణించేసరికి నాకు నవ్వు వచ్చి నాముఖం

మీ ఎదుట కనిపించేసరికి అది నాదేహంలో కంఠాని కుపరి భాగంలో కనిపించటం చూచి అంగదేశమని అందు క్రముక కంఠోత్తరపురమని కల్పించారు. అక్కడ నా కంఠం నాకధీనం. కాపున సత్త్వదాత్ముడనీ నాముఖమనే కళాపూర్ణుడికి పట్టం కట్టటమని భావించారు. మీరు మీ బాహువులతో నా కంఠం కౌగిలించటమే అతడు కనక ప్రాకారం కట్టించటం. మరి ఎంతో మమకారంతో నాముఖమూ అపురమూ ఎడబాయని మీ దృష్టి ఆ రూపాన్ని అనుభవించాలని కాంక్షించటమే మధురలాలస అనే తనయ జన్మించటం. ఇక ఆ ప్రధమాగమాదు లంటారా. ఆ నలుగురూ మీ నాలుగు ముఖాలే. నా వచన చుంబనేచ్ఛ మణి శలాకను వారు స్పృశించటం. మీముఖ మొకటి గట్టిగా నా పెదవి నొక్కటమూ మీ చేతులు నేను ప్రక్కకు నెట్టటమే - కోపంతో కళాపూర్ణుడు వారినీ మదాశయాదులనూ కొలువు నుంచి వెళ్లగొట్టటం. ప్రధమాగమాదులు ఋగాది వేదాలు నాలుగింటికీ సంకేతమే. మదాశయుడి కోట కూల గొట్టటం. మీ చేతులు నేను నెట్టి వేయటమే. అతడు కళాపూర్ణుడి కొలువు వీడి అంగదేశ మధ్య చేరటం మీ ఆశయం నాముఖాన్ని విడిచి నా శరీర మధ్యం మీద నిలపటమే. మధురలాస కృశించటమంటే మీ అధర పానేచ్ఛ కృశించటం. భరించలేక మరలా వారు తిరిగి రావటమూ మధురలాలస పుటపుటన కావటమూ నా ముఖాన్ని మరలా మీ ఆశయం దర్శించి నా అధరాన్ని పానం చేసి దానితో నవయౌవనం వచ్చి నా ముఖంతో ఏకం కావటమే మధురలాలస యౌవనవతియై ఆరాజుకు పెండ్లాడటం అని పూస గుచ్చినట్టావిడ అంతా ఒప్పచెప్పినట్టు చెప్పి చివరకొక మాట అంటుంది. 'ఇది అంతయు నిట్లయవునో కాదో ఆనతీయవలయునని. అతడు కూడా 'అట్లతప్ప

దంటాడు. ఇద్దరూ ఇద్దరే. ఆవిడ నోరు జారి మీరు చెప్పిందిలాగే అవుతుంది గదా అంటే ఆయన అంతకన్నా గడుసుగా నీవన్నట్టు అలాగే అవుతుంది సందేహం లేదంటాడు. మీరూహించింది ఇలాగే అయి ఉంటుంది గదా అని ఆవిడ ఉద్దేశం. అలా కాక ఎలా అవుతుందని ఆయనగారి జవాబు. ఏమిటి ఎవరు వారు. సరస్వతీ చతురాననులు. సృష్టి అంతా వారి చేతిలోనిది. జగత్సృష్టి మాత్రమే గాదు. కవిబ్రహ్మ కావ్య సృష్టి కూడా. బ్రహ్మ అన్నదన్నట్టు జరగాలంటే సరస్వతి దానికి తోడుపడాలి. సరస్వతి అంటే వాక్కే గదా. వాక్కంటే శబ్దం. అవ్యక్తమైతే అది సంకల్ప రూపం. వ్యక్తమైతే అదే వైఖరీ రూపంగా సృష్టి. అందుకోసం సంకల్పం చేసే వరకూ బ్రహ్మాది ప్రమేయం. అది వ్యక్తమై ప్రపంచంగా మారాలంటే దాన్ని వ్యక్తంగా మార్చేది శబ్దం. అది అర్థమిది శబ్దం. వాగర్థాలు రెండూ కలిసి సృష్టి. ఆ కలయికే సరస్వతీ చతుర్ముఖుల కలయిక.

కాగా ఆసురత క్రీడ ఎంత రహస్యంగా జరిగినా అది ఎప్పటికైనా బయటపడవలసిందే. అంటే అవ్యక్తమైన శబ్దార్థాలు వ్యక్తమై వైఖరీ రూపంగా అవతరించక తప్పదు. 'పరాస్య శక్తి ర్వివిధైవ' అంటే అర్థమిదే. ఒకటి గ్రాహ్యమైతే మరొకటి గ్రాహకమై జీవ జగత్తులుగా ప్రకటమై వారి సృష్టి మనకిలా గోచరమవుతున్నది. ఈ బ్రహ్మ సృష్టి ఎలాగో కవిబ్రహ్మ సృష్టి అలాంటిదే. అందుకే ఆలంకారిక మూర్ధన్యుడూ శివాద్వయ దర్శన శిఖామణి ఆనంద వర్ధనాచార్యులు **అపారే కావ్య సంసారే - కవిరేవ ప్రజాపతిః** । మ్రింది పాదాని పైది సరిగా జరపండి. **యథాస్మై రోచతే విశ్వం - తథేదం పరివర్తతే'** అని వాక్రుచ్చారు. బ్రహ్మ సంకల్పం ప్రపంచ సృష్టి అయినట్టే కవి బ్రహ్మ సంకల్పించింది

కూడా కావ్య ప్రపంచ సృష్టిగా మారవలసిందే. ప్రకటమై కనపడవలసిందే. తప్పదు. ఈ సృష్టి రహస్యమే సరస్వతీ చతుర్ముఖుల సంభాషణలో వ్యక్తమవుతున్న దిప్పుడు. పోతే ఆ మూల సూత్రాన్నే తానూ తన కావ్య సృష్టి కన్వయించి మనబోటి రసజ్ఞులైన పాఠకులకు స్ఫురింప చేయటం కవిబ్రహ్మ సూరనామాత్యుడి మనసులో ఉన్నట్టు మనం భావించవచ్చు. కవీశ్వరుడి మనసులో ఉన్నది కథా వస్తువు తాలూకు అవ్యక్తమైన సంకల్పమైతే అది క్రమంగా కథారూపమైన కావ్యసృష్టిగా మారి మనకు గోచరించటం అదే వ్యక్తమై మనకు కళాపూర్ణోదయ కావ్యంగా దర్శనమివ్వటం. ఇందులో సంకల్ప రూపం బ్రహ్మ అయితే అది బయటపడి కథా సృష్టి జరగటం అతని వాగ్విలాసం. ఇదీ అతిగూఢంగా మనకిక్కడ ధ్వనిస్తున్న రహస్యం.

పోతే ఆ పంజరంలోని చిలుక ఇదంతా రహస్యంగా గ్రహించింది. తెలిసీ తెలియక రంభ వచ్చి బలవంతం చేస్తే బయటపెడుతుంది. అది సరస్వతి వచ్చి చూచి దాన్ని శపిస్తుంది. రంభనెక్కడ చెప్పినా చంపుతానని బెదిరిస్తుంది. బ్రహ్మ వచ్చి ఆ చిలుకను ఓదారుస్తూ నీవు వేశ్యవై జన్మించినా ఆ జన్మలో గాక ఆ మఱు జన్మలో కళాపూర్ణుడికి భార్యవై సకల భోగాలు అనుభవిస్తావంటాడు. ఇదేమిటయ్యా మళ్లీ కళాపూర్ణుడంటున్నారు. అది కేవలం మీరు చెప్పిన ఒక కట్టు కథ గదా అని సరస్వతి అంటే కథ అయినా నీ ప్రభావం చేత అది లోకంలో జరిగి తీరుతుంది. అయితే ఈ రహస్యమెవరు ఎక్కడ బట్టబయలు చేసినా వారు లోకంలో జన్మించి కళత్ర పుత్ర భోగ భాగ్యాలలో తులతూగుతారు. తప్పదంటాడు. నిజంలో అలాంటిదే గదా ఈ ప్రపంచ సృష్టి. వాగర్థ రూపమైనా ఆ రహస్యం భావించి భావించి తద్వాసనా బలంతోనే గదా

మనబోటి జీవుల మందరమూ ఇలా జన్మ ఎత్తాము. పెండ్లాం బిడ్డలు ధనధాన్యాలని చెప్పి ఈ సంసార కష్టసుఖాలిలా అనుభవిస్తున్నాం. సరిగా ఈ బ్రహ్మ వాక్కే సూరకవి బ్రహ్మ వాక్కూ కూడా. వాగర్థాల అవినాభావ భావన ఎంతో కాలం మనస్సులో భావించి ఈ కావ్య ప్రపంచాన్ని ఆయన బహిర్గతం చేసి మనకు ప్రదర్శించాడు. ఇది కవి సంకల్ప రహస్యం బయటపడటమైతే – తద్భావనా బలం బయటపడి మనమూ తద్రస సానుభూతి నొకరికొకరం చెప్పుకొని బయటపడటం. రెండు చోట్లా అవ్యక్తమైన సంకల్పం వ్యక్తమై కనపడటమే. అది భావించే కొద్దీ మన కవిరళమైన ఆహ్లాదాన్ని ప్రసాదించటమే ఉన్నమాట.

అయితే ఇక్కడ కవిగారి గడుసుతనమేమంటే తానే కవిబ్రహ్మ అయి కావ్యసృష్టి చేస్తూ ఇది బ్రహ్మసృష్టికి ముడిపెట్టి చెప్పటం. బ్రహ్మ సంకల్పం ప్రపంచితమై అది చరాచర రూపంగా అటూ ఇటూ వ్యాపిస్తే తన కావ్య ప్రపంచం కూడా అటూ ఇటూ వ్యాపించినట్టు చూపటమొక గడుసుతనం. దేహళీదత్త దీపమని ఇంతకు ముందేనేను సూచన చేశాను. సూర్యమండలమెలా ఆకాశ మధ్యంలో ఉండి దాని కిరణాలు జగత్తంతా నలువైపులా వ్యాపించి వెలుగునిస్తున్నాయో అలాగే- సరస్వతీ చతుర్ముఖుల రహస్యకేళి మీద నెపం పెట్టి ఈ కవిబ్రహ్మ వేసిన కథా ప్రణాళిక కూడా కావ్యం యొక్క కేంద్రస్థానమైన పంచమాశ్వాసంలోనే చోటు చేసుకొన్నది. కాగా అది సత్యలోకంలాంటి తన ఉన్నతమైన భావనా జగత్తులో సంకల్ప రూపంగా ఉన్నదే. దానికనుగుణంగా మొదటి నాలుగాశ్వాసాలూ చివరి మూడాశ్వాసాలూ సౌర తేజస్సు లాగా ప్రసరించి మనకు కథా రూపంగా ప్రకటమై భాసిస్తున్నది.

సరిగా నూటికి నూరు పాళ్లూ సరస్వతీ చతుర్ముఖుల శృంగార క్రీడలో ఏదేది జరిగిందో అదే తూచా తప్పకుండా సత్యలోకంలో కథ ఈ భూలోకంలో యథాతథంగా జరిగినట్లు కవి వర్ణించటం కూడా సాభిప్రాయమే. 'అజాయమానో బహుధా విజాయతే' అని శాస్త్ర వచనం. బ్రహ్మవాక్కు కూడా అదే. అవ్యక్తమైన సంకల్పమొకటే. అదే వ్యక్తమై వైఖరీ రూపంగా వెలువడితే బహుముఖంగా వ్యాపిస్తుంది. వెంటే అర్థం కవిబ్రహ్మ మనసులో ఏది ఎలా జరగాలని ప్రణాళిక వేసుకొన్నాడో అదే సర్వతోముఖంగా వ్యాపించి కళాపూర్ణోదయ కథా ప్రపంచంగా భాసిస్తున్నది. అటూ ఇటూ దీపకాంతిలాగా ప్రసరించింది. ఇందులో అటు అనేది గతం. ఇటు అనాగతం. గతంలో ప్రారంభమయింది మన జీవిత కథ. అదేమిటో తెలుసుకోవాలంటే అనాగతమైన భవిష్యత్తులో ఉంది దాని మర్మం. ఈ రెండూ ఏమిటీ వీటి రెండింటి కేమిటీ సంబంధమని ప్రశ్నించావంటే రెంటినీ రెండువైపులా పట్టుకొన్న వీటి మూలం వీటి మధ్యలోనే ఉంది. అదే ఈ కథా చక్రానికి కేంద్ర బిందువు. సంసార చక్రానికీ అదే మూలం. కథా సంసారానికీ అదే నన్నట్టు వ్యంగ్యంగా సూచిస్తున్నాడు సూరనామాత్యుడు మనకు.

సరిగ్గా కవి తన ఈ ప్రణాళిక కనుగుణంగానే కావ్యకథా ప్రపంచాన్ని నిర్మిస్తూ పోయాడు. కొంచెంలోతుకు దిగి గమనిస్తే మనకు తెలిసిపోతుంది. అది ఎలాగంటే మనవి చేస్తా. ఈ కథా నిర్మాణ మీసాటి భాషలో చెబితే ఒక కొత్త పిక్చరు తీయటం లాంటిది. కొత్తగా ఒక పిక్చరు తీస్తున్నారంటే దానికొక నిర్మాత ఉండాలి. దర్శకుడూ ఉండాలి. లేకుంటే సినిమారంగంలోకి రాదు. అలా ఇద్దరూ ఉన్నా లాభం లేదు. అది అన్నిచోట్లా ప్రదర్శించి నలుగురి దృష్టినీ ఆకర్షించి రక్తి కడితే గాని

నాలుగు డబ్బులు రావు. నిర్మాతకూ దర్శకుడికీ పెట్టుబడి పెట్టిన సొమ్ము వృధా కాదు. పైగా దానికి నాలుగైదురెట్లు పోగు చేసుకోలేరు. ఇంకొక విషయమేమంటే ఆ ఊరా ఈ ఊరా అది ప్రదర్శించాలన్నా ప్రచారం కావాలన్నా కొన్ని కేంద్రాలలో అది వెలువడాలి. అవి పంపిణీ కేంద్రాలా చిత్రానికి. ముఖ్యమైన కేంద్రమొక టుంటుంది. అక్కడి నుంచి పెద్ద పెద్ద కేంద్రాలకూ ఆ తరువాత చిన్నచిన్న వాటికీ ప్రాకుతూ పోతుంది. ఇది మనసులో పెట్టుకొని చూడండి ప్రేక్షకుల లాంటి సహృదయులందరూ.

ఇదీ ఒక సినిమాయే ఈ కథా వస్తువు. దీన్ని మొదట అపూర్వంగా సర్వాంగ సుందరంగా నిర్మించిన నిర్మాత ఈ విశ్వ ప్రపంచ నిర్మాత ఆ బ్రహ్మదేవుడే. ఎక్కడో దేవలోకంలో నిర్మించాడది. అది కూడా ఏదో గాదు. తన కథే కథా వస్తువుగా ఊహించి తయారుచేశాడు. ఊహిస్తే ఊహించారు నిర్మిస్తే నిర్మించారు. ఎవరికీ దీన్ని బయటపెట్టకండి అని **Censor Board** వారిలాగా సరస్వతి అభ్యంతరం చెప్పింది. నీవెంత కాదన్నా బయట పడక మానదంటాడాయన. కారణమేమిటో తెలుసా. ప్రపంచ సృష్టి సృష్టికర్త గోప్యంగా చేసిన సంకల్పమే కావచ్చు. కాని ఆయన మాయాశక్తి ఆయన జ్ఞానంలాగా అవ్యక్తంగా ఉండిపోక క్రియా రూపంగా ప్రసరించి ఈ భౌతిక ప్రపంచాన్ని సృష్టించి మనకు ప్రదర్శిస్తున్నదా లేదా. అలాగే కవి బ్రహ్మ నిర్మించిన కథా వస్తువు మాత్రం గుప్తంగా ఎలా ఉంటుంది. ఆయన జ్ఞానమిచ్ఛగా మారి అది క్రియా రూపం ధరించి కావ్య ప్రపంచంగా మనకు ప్రకటమై ఎలా కనపడకుండా పోతుంది. దానికి కారణమక్కడా ఇక్కడా ఒకటే. సరస్వతి, సర్ అనే ధాతువుకు కదలటం ప్రసరించటమని అర్థం. కవి సంకల్పం

కదలి బయటికి ప్రసరించాలన్నా అది రూపుదిద్దుకొని మనకు దర్శనమివ్వాలన్నా పరాపశ్యంతి అయి పశ్యంతి మధ్యమ అయి మధ్యమ వైఖరీ రూపంగా బయటపడక తప్పదు గదా. అటు విశ్వసృష్టికి గాని ఇటు కావ్యసృష్టికిగాని ఇదే సూత్రం. అందుకే నీవెంత కాదంటున్నా ఇష్టం లేదంటున్నా ఊరక పైకి అలా అంటున్నావనే గాని నీకిది ప్రచారం కావాలని మనసులో ఉంది. నీ ఇష్టానుసారమే ఇది లోకంలో ప్రచారమవు తుందని సరస్వతిని మాటి మాటికీ హెచ్చరిస్తాడు చతుర్ముఖుడు.

అంచేత వాగర్థాల రెండింటి సహకారంతో ఈ ప్రపంచ సృష్టి ఎలా జరిగిందో అలాగే కవి సంకల్పించిన అర్థమూ దాన్ని ఆవిష్కరించే ఆయన వాక్ప్రసారమూ రెండూ ఏకమై కావ్య ప్రపంచ నిర్మాణం కూడా జరుగుతుందనే కళా రహస్యం మనం మరచిపోరాదు. ఈ సూత్రం దృష్టిలో పెట్టుకొని చూస్తే ప్రస్తుత మీ కళాపూర్ణోదయ కావ్య సృష్టి ఎంతో చక్కగా అర్థమవుతుంది మనకు. సినీ పరిశ్రమతో గదా పోల్చి చెప్పాను కథా వస్తు నిర్మాణం. చూడండి. సూరకవి బ్రహ్మ నిర్మాత అయితే ఈ కావ్య చిత్రానికి - దీని ఆవిష్కరణ ఆయనగారి వాగ్విభూతి అయితే - దాని ప్రచారానికి ప్రధాన కేంద్రాలు మూడు. ఒకటి ద్వారకా నగరం. రెండు మృగేంద్రవాహనాలయం - మూడు కాసారపురం. నాకు జూడ ద్వారక విష్ణు - మృగేంద్ర వాహన శక్తి సంయుక్తుడైన శివ కాసారపురమనేది బ్రహ్మ తత్త్వం - మూడింటికీ సంకేతమా అని తోస్తుంది. సరే ఏదైనా కావచ్చు. మొత్తానికివి మూడూ Distribution Centres పంపిణీ కేంద్రాలు కథాచిత్ర ప్రచారానికి.

వీటిలో కూడా కాపారపురమనే మూడవదే అసలు మొదట లోకంలో ప్రదర్శించింది ఈ కథా చిత్రాన్ని. కాసారపురం బ్రహ్మకు

సంకేత మన్నందుకు సరిపోయింది. సృష్టికర్తగదా బ్రహ్మ అంటే కనుక మొదట కాసారపురంలోనే చిత్రాన్ని ఆవిష్కరించి చూపుతాడు కవిబ్రహ్మ. కాసారపురానికి రాజు కళాపూర్ణుడూ. అతని కొలువు కూటం. అందులో సత్త్వాదాత్ముడూ రూపానుభూతీ మదాశయుడూ అందరూ హాజరయి ఉన్నారు. ఎదురుగా ఒక చిన్నతొట్టి. అందులో ఒక చిన్న బాలిక. పేరు మధురలాలస. ఉన్నట్టుండి అలఘువ్రతుడనే బ్రాహ్మణుడక్కడ వచ్చి వాలుతాడు. ఒక రత్నహారం రాజుగారికి కానుకగా సమర్పిస్తాడు. ఇప్పుడే కానుకలు వచ్చినా అవి ఈ బాలికకేనని అతడా శిశువు మెడలో వేస్తాడది. వెంటనే దాని ప్రభావం పనిచేసి ఆ చిన్నబిడ్డ జరిగిన విషయాలన్నీ గుర్తుకు వచ్చి కావ్య కథా ప్రదర్శనకు శ్రీకారం చుడుతుంది. కథా ప్రపంచానికంతటికీ మూలమేమిటా - అది ఎక్కడ ఉందా అని పాఠకులం మనమంతా మొదటి నుంచీ వెతుక్కొంటూ వస్తే అది ప్రథమాశ్వాసంలో కనపడడు. ద్వితీయంలో కనపడదు. తృతీయ చతుర్థాలలో కూడా దొరకదు. కాగా 8 ఆశ్వాసాల గ్రంథంలో అయిదవ ఆశ్వాసంలో కావ్య మధ్యంలో తెచ్చిపెట్టాడు కవి దేహళీదత్త దీప న్యాయంగా. ఇదీ నవలా బాణి అంటే.

ఆ శిశువు చెబుతుం దలఘు వ్రతుడికి జరిగిన కథ అంతా. అది మొదట బ్రహ్మలోకంలో జరిగిన సన్నివేశం. అది బయట పెట్టి వారి పెంపుడు చిలుక అయిన తాను శాపం నెత్తికి తెచ్చుకొని ఒక వేశ్యగా జన్మించానని తన జన్మవృత్తాంతంతో ప్రారంభిస్తుంది కథ చెప్పటం దానిమీద నెపం పెట్టి పింగళి సూరనా మాత్యుడే ప్రారంభిస్తాడు తన కావ్యకథ. ఆ చిలుకే కలభాషిణి. ద్వారకలో ఒక వెలయాలి కులంలో దాని జననం. పుట్టుకకు వెలయాలే గాని ప్రవర్తనలో వెలయాలు గాదది.

నారద మహర్షితో పరిచయం చేసుకొని ఆయనకు సన్నిహితురాలవు తుంది. ఆయన వెంట వచ్చే మణికంధకుడనే గంధర్వ కుమారుణ్ణి మనసులో కామిస్తుంది. కాని చివరిదాకా బయటపడదు. మహర్షి సహాయంతో కృష్ణ దర్శన భాగ్యం స్వామి సేవాభాగ్యం లభిస్తుంది దానికి. మణికంధరుడు కృష్ణుడిపై చెప్పిన దండకం వల్లె వేస్తుంది. మెచ్చుకొంటుంది దాని సౌష్ఠవాన్ని. రంభాకుబేరులతో నారదుడు మాటాడుతుంటే అదేమిటని అడిగి తెలుసుకొంటుంది. రంభకు గర్వభంగం కావలసిందే దానికి నీవు మాత్రం సమర్థురాలవు కాదా అని ఆయన దీవన కూడా పొందుతుంది. తుంబురుని మీద కక్ష సాధించాలని ఆయన కృష్ణుని కాంతలవల్ల శిక్షణ పొంది వెళ్ళి పోతూ మణికంధరుణ్ణి తీర్థయాత్రా వ్యాజంతో సాగనంపి కలభాషిణికి కూడా సెలవిస్తాడు వెళ్ళి వీణాభ్యాసం చేసుకొంటూ ఉండమని.

ఇలా ప్రారంభమైన ఈ కథాంకురం తరువాత తరువాత మొక్కై మానై చెట్టై శాఖోపశాఖలై విస్తరిల్లిందంటే దానికి బీజన్యాస మిక్కడే మొదట్లోనే జరిగింది మనం బాగా గమనిస్తే. ఏమన్నాడు చతుర్ముఖుడు సరస్వతితో చివరిసారిగా. మనకథ ఇది ఎలా జరిగిందో ఇక్కడ ఇలాగే తేడా లేకుండా ఆయా సన్నివేశాలూ పాత్రలూ వారి వ్యవహారం భూలోకంలో జరుగుతుందని చెప్పాడా లేదా. అయితే అది ప్రచారమయ్యే టప్పుడది ప్రధానమైన ఆఖ్యానమైతే దానికి చిలువలు పలువలు కొన్ని ఉపాఖ్యానాలక్కడా ఇక్కడా పోగయి అది వృద్ధి పొందుతుందన్నాడు కూడా. అదిగో ఇందుకే ఈ ద్వారకా పట్టణ వృత్తాంతం. ఇందులో కలభాషిణి మణీకంధరుల గూఢానురాగం – కృష్ణుడు మణికంధరుని భక్తి తాత్పర్యాలకూ సాహిత్య పాఠానికీ మెచ్చి ఇచ్చిన రత్నహారం –

కలభాషిణికి నారదుడనుగ్రహించిన కామారూపధారణా – మణికంధరుడి కభీష్టావాప్తి కలుగుతుందని ఆ శీర్వచనం. దానికి తోడు అతని గంధర్వ జన్మాత పశ్చర్యా ప్రభావం – ఇలాంటి భావికథా సూచకమైన రహస్యాలు మనకు సూచిస్తున్నాడు మహాకవి.

దీని మూలంగానే ఇద్దరు రంభలు ఇద్దరు నలకూబరులు రంగంలోని రాగలిగారు తరువాత కథలో. మణికంధరుడు తపోదీక్షలో ఉన్నా అది చెడగొట్టటానికి దేవేంద్ర నియోగంతో రంభ వస్తుంది. అది అసలైన రంభ కాదు. అది వచ్చే లోపుగా ఒక నకిలీ రంభ తయారయి వచ్చి అతని బాహు పంజరంలో నలిగిపోతుంది. ఎవరో గాదు. రంభ వేషంలో తయారైన కలభాషిణి. అలా వేషాంతరం ధరించే అవకాశం దానికి నారద వరప్రభావం. ఆ ప్రభావమే అభీష్టార్థ సిద్ధి కలుగుతుంది పొమ్మని మణికంధరుడికిచ్చిన ఆశీర్వాదం. నిజంలో ఇద్దరికీ మనసులో ఉన్న కోరిక దానికి నలకూబరుడి మీదా గాదు. వీడికి రంభ మీదా గాదు. ఇరువురికీ ఒకరిమీద ఒకరికే. దీనివల్ల ఇద్దరికీ వ్యభిచార దోషం లేకుండాపోయింది. అలాగే రంభా నలకూబరుల పరస్పర ప్రణయానికీ భంగం వాటిల్ల లేదు. కాకపోతే నారద మహర్షితో నిర్లక్ష్యంగా మాటాడిన నేరానికీ చిత్రమైన సన్నివేశం మూలంగా రంభకు తాత్కాలికంగా గర్వభంగమయింది. పోతే మణిస్తంభుడి సంగతేమిటో ఇంకా తేల లేదొకటి. మాయారంభా నలకూబరులుగా నాటక మాడిన కలభాషిణీ మణికంధరుల కసలు రంభా నలకూబరులిచ్చిన శాపమొకటి. అందులో పతి ఖడ్గంతోనే నీకు శిరశ్ఛేదమవుతుందని కలభాషిణికి రంభ ఇచ్చిన శాపం. మరి అల్పాయుష్కుడవవుతావు పొమ్మని నలకూబరుడు మణికంధరుని కిచ్చిన శాపం. అదీ ఇదీ అన్నీ ఫలించాలంటే దీనికేదో పంపిణీ కేంద్రం చూడాలి కవిబ్రహ్మ.

ఏమిటా కేంద్రం. మూడు కేంద్రాలకూ గొప్ప కేంద్రం మృగేంద్ర వాహనాలయం. ఇందులో తేలిపోతాయి చాలా వరకూ కథా రహస్యాలన్నీ, ఒక పెద్ద శాసనస్తంభ ముంటుందా ఆలయంలో. అందులో ఎన్నో షరతులుంటాయి. అవి ఎవరెవరు ఏ షరతు పాటిస్తే వారి వారికా కోరికలు తప్పకుండా నెరవేరుతాయి జీవితంలో. ఇది ఆ మహాశక్తి మహిమ. దానికి తిరుగులేదు. అవి అంతకు ముందు జరిగిన అటు తరువాత జరగబోయే సందర్భాల కెన్నింటికో దారితీసే నియమాలు. అవి ఆలోచించి ఎలా తయారు చేశాడో చూడండి మహాకవి. మణిస్తంభుడేమి – సుముఖాసత్తి ఏమి – కలభాషిణీ మణికంధరులేమి – అలఘు వ్రతుడేమి – స్వభావ సిద్ధుడేమి – సుగ్రహుడేమి – మణికంధరుడి ఖడ్గం వీణ – రత్నమాలిక – ఆఖరుకు శల్యాసురుడు వీరి వీరి వ్యవహారమంతా కొంతకు కొంత మనకు తెలిసిపోయేది ఈ శక్త్యాలయంలోనే. దానికంతటికీ మూలమక్కడ శిలాస్తంభం మీద లిఖించబడిన ఆయా షరతులు – వాటిని పాటిస్తే కలిగే ఆయా మహిమలూ చూడండి. మణిస్తంభుడక్కడి గోరుగల్లుతో కనుగుడ్లు పొడుచుకొని దూరదృష్టి – ఒక ఘోరమైన నార సంచెవులలో దూర్చుకొని దూర శ్రవణమూ సాధించాడు. అప్పటికీ కోరికలు చావక ఒక చక్కని రూపమూ సంగీత విద్యా నేర్చిన వారకాంతనక్కడ బలి ఇస్తే సామ్రాజ్యలక్ష్మి చేకూరుతుందనే శాసన పంక్తి కనుగుణంగా కలభాషిణిని దూరదృష్టితో చూచి ద్వారక చేరి ఆ మాట ఈ మాట చెప్పి ఆవిడ కిష్టమైన మణికంధరుని తపశ్చర్య కూడా దూరదృష్టితో చూచి ఆవిడకు నచ్చజెప్పి ఆ ఆలయానికి పట్టుకు వస్తాడు.

అలాగే సుముఖాసత్తి విషయమూ. ఆవిడ ఎవరోగాదు. సుగాత్రి. కాశ్మీర శారదాలయ పూజారి కూతురు. శాలీనుడి భార్య. ఆయా ఢక్కామొక్కలు తిని చివరకు అష్టాంగయోగం కూడా అభ్యసించి ఆ ఆలయానికే వచ్చి అక్కడే ముసలిదయి పడికాపులు కాస్తుంది. కారణం అక్కడి శిలాస్తంభం మీద ఒక మాట ఉంది ఆవిడ కాసగొలిపేది. అదేదో గాదు. ఏ కారణంగానైనా ఈదేవి సన్నిధిలో తనువు విడిస్తే చాలు. వెంటనే వార్ధక్యం పోయి నవయౌవనం వస్తుంది. అంతేగాక ఏది కోరితే అది జరుగుతుందని. అందుకోసమే ఉందావిడ అక్కడ. అది కలభాషిణి సిద్ధుడి చేతిలో చావకుండా కాపాడింది. ఎలాగంటే తాను అతని ఖడ్గానికి ఆహుతి అవుతూ ఓరి సిద్ధా నీ అభిమతం నెఱవేరదు. అమ్మా దేవీ నామాట నిజం చేయమని మరణిస్తుంది. ఆ మాట నిజం కావాలి గనుక అలా జరిగింది. మరి శల్యాసురుడనేవాడు తన తల అక్కడి గండ గత్తెరతో ఉత్తరించుకొని మరలా అది ఎప్పటిలాగా అతుకుకొన్నవే గాక తన్ను చంప వచ్చిన వానిని తానే చంపగలడని శిలాఫలకం మీద వ్రాసిన ప్రకారం చేసి అలాగే మణికంధరుణ్ణి చంపి తానూ అతని చేతిలో మరణిస్తాడు. చంపవచ్చిన వాణ్ణి చంపుతాడనే ఉంది గాని ఎవరి చేతా తాను చావడనే నియమం లేదు గదా. అందుకే మణికంధరుడి యొద్దకు బోయి పని జరుపుకోమని అభినవకౌముది కాదేలే సలహా ఇస్తుంది కూడా. మరి అక్కడ రెండు సంవత్సరాలు కూచొని భువనేశ్వరీ మంత్రం దీక్షగా జపించిన వారి కాదేవి అన్ని కోరికలూ నెఱవేరేలాగా అనుగ్రహిస్తుందట. అది అలఘువ్రతుడి విషయంలో దాఖలా అవుతుంది.

అంతేకాదు. ముందు పేర్కొన్నట్టు కథలో ముఖ్యపాత్రలందరూ చాలావరకక్కడే కలుసుకొంటారు. వారి వారి సంభాషణల ద్వారా

అంతవరకూ గడచిన వారి గతచరిత్రా ఆ తరువాత వారికి జగరబోయే పరిస్థితి కూడా ఆ ఆలయంలోనే తెలిసిపోతుంది మనకు. మణికంధరుని చేతిలో కలభాషిణి అక్కడే మరణించి ఉత్తరజన్మలో మధురలాలసగా జన్మిస్తుంది మరి మణికంధరుడి ఖడ్గం వీణ అక్కడ నిక్షిప్తమయి ఉంటాయి. తరువాత వాటికి పని ఏర్పడుతుంది కథలో. అసలింకొక విషయం. కలభాషిణీ మణికంధరులిద్దరూ అక్కడ సమావేశమయ్యారంటే ఊరక కాలేదు. రంభ వల్ల ఒకరూ నలకూబరుడి వల్ల, ఒకరూ శాపాలు నెత్తికి తెచ్చుకొని అక్కడికి వచ్చి చేరారు. వారంతకు ముందు అక్కడక్కడ ఆడిన నాటకమంతా అక్కడికి వచ్చి బయటపెడతారు. ఈ మృగేంద్ర కేంద్రం లేకుంటే ఆ రహస్యాలన్నీ మనకు తెలిసేవి కావు. అలాగే వారి భవిష్యద్వ్యంత్తాంతం కూడా మన కవగత మయ్యేది కాదు. ఇంత గొప్ప పంపిణీ కేంద్రమిది కథా చిత్రానికి.

పోతే ఆఖరి పంపిణీ జరిగిందీ చిత్రావిష్కరణకు కాసారపురం. అది మొదట మదాశయుడి రాజధాని. అతణ్ణి జయించి కళాపూర్ణు డాక్రమించాడు దాన్ని. పుట్టగానే నవయౌవనుడు. అది ఎలాగంటే దానికీ మృగేంద్ర వాహనే జవాబు చెబుతుంది. పోతే అక్కడే మరణించిన కలభాషిణి ఇక్కడ మనకొక శిశువుగా ప్రత్యక్షమవుతుంది. సత్త్వదాత్మ రూపానుభూతులిక్కడ తయారవుతారు మరలా. ప్రధమాగ మాదులైన బ్రాహ్మణ కుమార పండితుల పాండిత్య విన్యాసానికీ ఇది కేంద్రం. మరి ఎక్కడో సత్యలోకంలో సూత్రప్రాయంగా చాలా గోప్యంగా జరిగిన కథ బాహాటంగా పదిమందికీ తెలిసేలాగా వ్యాఖ్యానించి చెప్పాలంటే సత్యలోకంలో చిలుకే భూలోకానికి రావలసి వచ్చింది. అది మొదట కలభాషిణిగా ద్వారకలో పుట్టి మృగేంద్రాలయంలో మరణించి ఇక్కడ

మరలా మధురలాలసగా అవతరిస్తుంది. ఆవిడ అంత చిన్న వయసులోనే గతవృత్తాంతమంతా ఏకరువు పెట్టాలంటే అసంభవం కదా. సృష్టికర్త మాట అసంభవమెలా అవుతుంది. అందుకే అలఘువ్రతుని రాక. దానికి కారణం మరలా మృగేంద్రాలయ ప్రభావమే. వచ్చాడొక రత్నహారం తీసుకొని – ఇచ్చాడు రాజుకు కానుకగా. పెట్టాడ తడా ఆ పిల్ల మెడలో. దాని నాయకమణి హృదయానికి సోకాలిగదా. సోకింది చిన్నపిల్ల కాబట్టి. ఇక చూడండి దాని ప్రభావంతో గతమంతా గుర్తుకు వచ్చి అది పూసగుచ్చినట్టు మొత్తం సృష్టికర్త గుట్టంతా రట్టు చేసింది.

అంతేగాక అభినవ కౌముదీ – మధురలాలసా – ఇద్దరినీ వివాహమాడి వారితో విహారయాత్ర సలపటం కూడా ఇక్కడే. కళా పూర్ణుడు. అతని దిగ్విజయ వృత్తాంతమూ ఇక్కడే. అంతే కాదు. ఒక్కటే ఒకటున్నదింక కథలో ముడి విప్పవలసింది సూరనామాత్యుడు. అది ఆ రత్నమాలికా వృత్తాంతం. అదేదో మామూలు హారంగదా అని దాచి ఉంచిందా మధురలాలస. ఎవరికీ తెలియదు ఏమిటో దాని మహిమ ఏమిటో. యాదృచ్ఛికంగా అది ధరిస్తుంది. కొంచెం పొడవు చేసి హృదయానికి తగిలేలాగా ధరించింది. వెంటనే సత్త్వాదాత్మ వృత్తాంతం గుర్తు వచ్చింది. అతడు తన తల్లి రూపానుభూతి సోదరుడే. అతడు కాసారపురాని కాధిపత్యం వహించిన సుగ్రహుడే. పరాజయ భయంతో పారిపోయి బాలకృష్ణుని నిరంతర ధ్యానంతో ప్రత్యక్షం చేసుకొని ఆయన అనుగ్రహంతో సర్వజ్ఞత్వం వాక్పటుత్వం తనకు సిద్ధించే ఒక రత్నహారం సంపాదిస్తాడు. అది ఒక ఆలయంలో ఒకానొక యతీశ్వరుడు చేసిన శృంగార చేష్ట చూచి నవ్వితే అతనికి కోపం వచ్చి నీ గతమంతా మరచిపోతావని శపిస్తే అక్కడే పెట్టి మరచి వెళ్ళిపోతాడు. అది ఒక

మహారాష్ట్ర బ్రాహ్మణుడు దైవికంగా అక్కడికి వచ్చి పుచ్చుకొని ద్వారకలో శ్రీకృష్ణుల వారికి అందజేస్తాడు. అది ఆయనగారు మణికంధరుడి కవితా కౌశలానికి మెచ్చి అతనికి ప్రసాదిస్తాడు. అది ఆ మణికంధరుడు కాలందీరి మరణించే సమయంలో అలఘువ్రతుడనే బ్రాహ్మడికి దానమిచ్చి పోతాడు. దీనికి కూడా కేంద్రమా మృగేంద్రాలయమే సుమా. అలఘువ్రతుడు మరలా కళాపూర్ణుడికి కానుకగా ఇవ్వటం. ఆయన మధురలాలసకు ఇవ్వటం. ఇంత దూరం ప్రయాణం చేసిందా హారం. ఎక్కడి నుంచి ఎక్కడికి. బాలకృష్ణుడి దగ్గరి నుంచి ప్రౌఢ కృష్ణుడి వరకా. లేక మణికంధరుడి దగ్గర నుంచి మరలా కళాపూర్ణుడి వేషంలో మరుగుపడి ఉన్న మణికంధరుడి వరకా. ఏదైనా కావచ్చు. కాని ఇందులో చిత్రమేమంటే కావ్య కథా నిర్మాణం కూడా బ్రహ్మ దగ్గర ఆరంభమై మరలా కవి బ్రహ్మ దాకా అవతరించి విస్తరించిందంటే అనవచ్చు.

అయితే ఏమాట అన్నా అందులో ఒక గొప్ప అంతరార్థముంది. ఒక బిందువే విస్తరించి చక్రమై మరలా ఆ చక్రంలో ఎక్కడ అరసి చూచినా బిందువే దర్శనమిస్తుంది. ఇదే సంసార చక్ర రహస్యం కూడా అతిసూక్ష్మమయి మనోవాగతీతమైన అది అవిభక్త శివశక్తి స్వరూపమనే పూర్ణబిందువులో నుంచి అదే ఈ దృశ్యమాన నామరూపాత్మక ప్రపంచంగా పరిణమించింది. పరిణమించే సరికా సచ్చిదాత్మకమైన తత్త్వాంశం ఇందులో చిక్కుబడి దిక్కుతోచక మరలా ఏ జన్మకో ఒక జన్మకు ఏ గురువో నిమిత్తంగా ప్రత్యభిజ్ఞ ఉదయించి తన స్వరూపాన్ని తాను గుర్తు చేసుకొని సద్యః పరనిర్వ్యతి పొందటమే సృష్టికళా రహస్యం. కవి కావ్యకళా సృష్టి రహస్యం కూడా. వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః అన్నట్టు సూరన మహాకవి గొప్ప ద్రష్ట అయి బ్రహ్మసృష్టికి కథావ్యాజంతో

ప్రతిసృష్టి చేసి అందులోని పరమ రహస్యాన్ని మనకు ఒక ఇంద్ర జాలంలాగా ప్రదర్శించి చూపాడు.

అయితే ఆ చూడటం కేవలం శుష్కంగా ప్రభు సమ్మితంగా కాక సరసమైన కాంతా సమ్మితంగా చూపటం చాలా గొప్ప. అందుకే కథ ఊరక చెప్పుకొంటూ పోక దానికక్కడక్కడా తన భావనా బలంతో వన్నెచిన్నెలు పెట్టి మెఱుగులు దిద్దుతూ వచ్చాడు. కథాశిల్ప మెంత రమణీయమో అతని కవితాశిల్పం కూడా అంత మనోహరమే. అదీ తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాద మన్నట్టు గాక కథా వస్తుగమనంలో ఓ తప్రోతంగా నడపటం ఇంకా గొప్ప నైపుణ్యం. సూరకవి కల్పనా ప్రపంచమనే ఒకానొక లక్షణం చూపటమే మన వివక్షితమైనా అది మడి గట్టుకొన్నట్టు అంతవరకే చెప్పి ముగిస్తే అసలి తనొక నవలా కారుడే గాని కవీశ్వరుడు కాడని మీరెక్కడ అపోహపడతారోనని నా అనుమానం. అలా కాదు. మిగతా ప్రబంధ కవుల కామహాత్ముడే మాత్రమూ తీసిపోడని చూపటం నా ధర్మమని రేఖామాత్రంగా కొంచెం చూపుతున్నాను.

దర్శనా ద్వర్ణనా త్కవిః అన్నారు. ఎంత భావుకుడో అంత ప్రతి పాదకుడీ కవి. మానవ ప్రకృతి నెంతగా వర్ణించాడో బాహ్య ప్రకృతి నంత సొగసుగా వర్ణిస్తాడు. అష్టాదశ వర్ణనలూ చేశాడీ కావ్యంలో. పట్టణాలేమిటి. పర్వతాలేమిటి. ఉద్యానాలేమిటి, యుద్ధాలేమిటి – యాత్ర లేమిటి – ఋతువులేమిటి – సముద్రాలేమిటి అన్ని వర్ణనలూ ఉన్నాయి అవి కూడా ఆయా సందర్భాలను బట్టి. శాస్త్రచర్చలున్నాయి. ఆధ్యాత్మిక విద్యారహస్యాలున్నాయి. భక్తి జ్ఞానవైరాగ్య భావాలెన్నెన్నో వెల్లివిరిసి

ఉన్నాయి. చిత్రవిచిత్ర కవితా రీతులున్నాయి. సుముఖాసుత్తి యోగవిద్య కళాపూర్ణుడు సృష్టించిన రమానారాయణ సంవాదమూ ఎంతో రమణీయం. అసలు మణికంధరుడు చేసిన కృష్ణస్తవ మతి మనోజ్ఞం. ఆ దండకం గాని ఆ రగడ గాని చిరస్మరణీయం. 'దశరథావనీశ విమలతర తపః ఫలావతార - నిశిత శర లఘుప్రయోగ నిహత తాట కావిహార' అని అంత్యాను ప్రాసతో నడుస్తుంది రగడ. రామాయణ కథా వస్తువంతా సంగ్రహంగా వర్ణిస్తాడు కవి. ఒక్కొక్క పంక్తి ఒక్కొక్క దీర్ఘ సమానం. ఒక్కొక్క సమాసం కథలో ఒక్కొక్క సన్నివేశాన్ని పట్టి ఇస్తుంది మనకు. ఆ సమాస ఘటనే అతి సుందరం. అంతా అయిన తరువాత 'మహిత నిఖిల గుణ సముద్ర మమ్ముఁబ్రోవు రామభద్ర' అని ముగిస్తుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది భక్తి భావంతో. ఇంకా కొంత వర్ణిస్తే విందామని పిస్తుంది. అసలు సుగాత్రీ శాలీనుల కథ. అది ఒక ఖండ కావ్యమా అనిపించింది నాకు.

ఎంతని వర్ణించమంటారు. అవి వర్ణనలంటే వర్ణనలు రావు. సభఁగా భంగశ్లేషలు పిలిస్తే పలుకుతాయి కవికి. రాఘవ పాండవీయం చూడనక్కర లేదీ వర్ణనలు చూస్తే. 'పురముల్ సారపు రీతుల - నీ కాసార పురీ తులకురావు - ఆలి కుచంబులు నా గయ్యాలి కుచంబులును. మాటాడితే శ్లేష. మరి ద్వ్యక్షర కందాలు సంస్కృతాంధ్ర భాషా ద్వయార్థాలు ఎడాపెడా చదివితే స్ఫురించే పద్యాలు. ఇలాంటి చిత్ర కవిత్వం. ఎవరూ ఎక్కడా చెప్పలేదే కవులూ. పట్టణ సముద్ర వర్ణనలలో దొరలిన ఉపమోత్ప్రేక్షా రూపకాద్యలంకారాలు చాలా అపూర్వం అద్భుతం. అసలు వాక్యనిర్మాణం - పదబంధాలూ -

చతురోక్తులూ ఏదైనా అందాలు చిందులు దొక్కుతాయి. ఇద్దరు రంభల వాదులాట విని తీరాలి. ఎక్కడ చూచినా తెలుగుదనం గడుసుదనం జాణతనం తొణికిసలాడుతుంది సూరన రచనలో. తిక్కన కవిలాగా మామూలుగా కథ చెబుతున్నట్టే ఉంటాడు. పొడి పొడి మాటలన్నీ – తిక్కరేగిందంటే తిక్కనలాగే విజృంభించి వ్రాస్తూ పోతే అతడేనా ఇతడని విస్తుపోయేలాగా – ఒక విభిన్న శైలిలో వ్రాయగలడు. ఇంతకన్నా ఎక్కువ చెప్పటం కవి కల్పనా ప్రపంచం మాని నేను ప్రక్క దారి తొక్కట మవుతుందని విరమిస్తాను.

అయిందిక్కడికి పింగళి వారి ఒక కథాకల్పన. పోతే అదేమిటిది చూడండన్నట్టు మరొక కథా ప్రపంచం మన దృష్టికి తారసిల్లుతున్నది. అదేదోగాదు. కవి చివరిసారిగా తన జీవితంలో సృష్టించిన ప్రభావతీ ప్రద్యుమ్నమనే ప్రబంధరాజం. ఇది కళాపూర్ణమైతే అది ప్రద్యుమ్నం. ఇది ఉదయమైతే అది ప్రభ. దీని అర్థమేమిటో సహృదయులు మీరే తెలుసుకోండి. కాళిదాసు కుమారసంభవం లాంటిదని చెప్పా నీ ప్రభావతీ ప్రద్యుమ్నం. ఏవిషయంలో. వస్తైక్య విషయంలో. అయిదాశ్వాసాల కావ్యామైతే ఇది – ఇందులో మొదటినుంచీ చివరిదాకా ప్రభావతీ ప్రద్యుమ్నుల చరిత్రే. వారే నాయికా నాయకులు. పోతే వారి వెనకాల ఉండి పని జరుపుతున్న సూత్రాధారుడెవరోగాదు శ్రీకృష్ణుడు. సాక్షాత్తూ ప్రద్యుమ్నునికి తండ్రి. కృష్ణపాత్రతో ప్రారంభించాడు కవి ఈ కావ్యం. కృష్ణపాత్రతో సమాప్తం చేశాడు. సరిగా కళాపూర్ణోదయం కూడా కృష్ణ పాత్రతోనే ప్రారంభమవుతుంది. చూడబోతే కవి కృష్ణభక్తుడయి ఉంటాడనటంలో సందేహంలేదు. కృష్ణభక్తి విష్ణుభక్తి రెండూ కనిపిస్తాయి రెండింటిలో. వైష్ణవ సిద్ధాంతాన్ని వాచా ప్రతిపాదిస్తాడు కూడా చివర

చివర కళాపూర్ణ కావ్యంలో. మరి ఇక్కడ అంత వీర వైష్ణవం లేదు కవికి. త్రిమూర్తులనూ కీర్తించాడు సమానంగా. అందులోనూ అగ్రతాంబూలం పార్వతీ పరమశ్వరులకే ఇచ్చాడు. కావ్యారంభమే వారి స్తోత్రంతో ప్రారంభమవుతుంది.

శ్రీమదు మామహేశులతి చిత్ర విలాసులు తారు మున్వియో గామిత చింత నొండొరులకై సగమౌటలు నిచ్చఁదెల్పు కాంక్షా మహిమంబుచేఁ జెటీ సగంబుగ నొక్కయొడ ల్థరించు సత్ప్రేమపు దంపతుల్ కృతిపతిందనరింతురు గాక పేరులన్ అద్భుతమైన వ్యాఖ్యాన మర్ధనారీశ్వర తత్త్వానికిది. అర్థనారీశ్వర స్వరూపాన్ని ఇలా ఇంత చమత్కారంగా వర్ణించిన సమర్ధించిన వర్ణన కావ్య ప్రపంచంలో ఎక్కడా లేదు. త్రిమూర్తులు ముగ్గురినీ విడివిడిగా గాక దంపతులుగానే వర్ణించాడు. ఇదీ ఒక విశేషమే. సాభిప్రాయం కూడా.

ఎందుకంటే నేను ముందే ఒక మాట చెప్పాను గుర్తుందో లేదో మీకు. వస్త్వైక్యమే గాక ఇది నాటకీయంగానూ రచించిన కావ్యమని. అది నవలాబాణిలో సాగితే ఇది నాటకబాణిలో సృష్టించాడీకావ్యాన్ని. నాటకంలో సాధారణంగా అయిదంకా లుంటాయి. దానికి తగ్గట్టిందులో అయిదాశ్వాసాలున్నాయి. అయిదనే దెందుకంటే ముఖప్రతిముఖ గర్భ అవమర్శ నిర్వహణాలని అయిదు సంధులు నాటకంలో. అయిదింటికీ అయిదింటి పరిగణన అని మనసులో ఉంచుకొనే కళాపూర్ణోదయం ఎనిమిదాశ్వాసాలైతే ఇది అయిదాశ్వాసాలలో సాగింది కథ. పైగా నాటకంలో నాందీ పద్య మొకటి గాని రెండుగాని కథా వస్తువును సూచించే లాగా వ్రాస్తాడు మహాకవి. అలాగే ఈ త్రిమూర్తుల వర్ణన అనే నెపంతో సాగిన మొదటి మూడు పద్యాలలో కథా వస్తువును -

ప్రధాన పాత్రలనూ వారికి సంధాత అయిన ఒకానొక అతి ముఖ్య పాత్రను ఎంతో వ్యంగ్యంగా అద్భుతంగా ధ్వనింపజేస్తున్నాడు కవి. మొదటి పద్యమర్ధనారీశ్వర వర్ణన - పరస్పర సాంగత్య సుఖం కోసం దీర్ఘమైన తపస్సు చేశారు. విరహ వేదనతో సగమయి పోయారు. ఎవరోగారు వారు. కవి మనసులో ఉన్నది ప్రభావతీ ప్రద్యుమ్నులే. వారి వియోగ వర్ణన ఇది. తపన తపించిపోవటం. అలా తపించి తపించి చివరకు కలుసు కొన్నారు. ఇక ఎప్పటికీ విడిపోని ఆ పరస్పరా శ్లేష సుఖమను భవించారు. ఎంత బాగా సూచించాడీ నాయికానాయక వ్యవహారమీ కవి. అలాగే రమానారాయణుల వర్ణన రెండవ పద్యంలో.

అంగజ హేతుకంబులరయన్ మిధునంబుల ప్రేమ లిట్టిచో
నంగజు తల్లిదండ్రులగునట్టి యనన్య సమాన హార్ద సం
సంగుల'ని వర్ణిస్తాడు వారిని - లోకంలో దంపతులందరి ప్రేమా మన్మధుని వల్లనైతే వీరిద్దరి ప్రేమకూ ఫలం మన్మధుడే. వాడే ప్రద్యుమ్నుడు. వాడికి తల్లిదండ్రులు రుక్మిణీ కృష్ణులు రమా నారాయణులే. హార్దసంసంగులు వారు. హృదయ సంబంధం వారిది. లక్ష్మీ విష్ణు వక్షః స్థలంలోనే గదా ఉన్నది ఎంత చక్కని వర్ణన. ఇది కథలో రుక్మిణీ కృష్ణుల వ్యవహారాన్ని సూచిస్తున్నది.

పోతే ఇక సరస్వతీ బ్రహ్మలు.

అమల నవీన హైమ నిజయాన గురుద్యుతిఁ బ్రోచు సద్వపు
ర్విమల రుచిన్ స్వభక్తులకు వెండియు పైడియు' ఇలాటి సమస్త పదార్ధాలూ సిద్ధించేలాగా అనుగ్రహించే సర్వ విధాతలట వారు. ఇక్కడ నిజయాన అనటంలో బ్రహ్మవాహనమైన శుచిముఖి అనే హంస పాత్రను సూచిస్తున్నాడు సూరన. దాన్ని ప్రోచిన వారెవరు ముఖ్యంగా సరస్వతే

గదా. అది ఎంత చమత్కారంగా ధ్వనింప చేస్తున్నాడో చూడండి.

ఇంతకూ నాటకమన్నందుకిది నాటకం లాగానే సాగిందీ రచన. అది మనకు గుర్తుందో లేదోనని అడపాదడపా సందర్భం వచ్చినప్పుడల్లా గుర్తు చేస్తుంటాడు కూడా. చూడండి ద్వారకా నగర వర్ణనతో మొదలవు తుంది కథ. దేవలోకం నుంచి దేవేంద్రుడు దిగి వస్తుంటాడు కృష్ణ దర్శనార్థం. మాతలి రథం నడుపుతున్నాడు. నగర సౌందర్యాన్ని వర్ణిస్తూ అంటాడొక మాట. జడ నిధి యను తెర మఱుగటు వెడలి నిలిచినట్టి యాట వెలదిలా ఉందట నగరలక్ష్మి. నాటకానికి నాట్యమే ప్రధానం. నాటకమంటే అభినయమే గదా. అభినయం నాలుగు విధాలు. ఒకటి సాత్త్వికం. రకరకాల మనోభావాలను వ్యక్తం చేసి చూపటం. రెండు వాచికం. ఒకరితో ఒకరు మాటాడేటపుడు వారితో పొందికగా నేర్పుగా భావ్యర్థ సూచకంగా సాగాలి సంభాషణ. మూడు అంగికం. శరీర చేష్టలు మనోభావాల కనుగుణంగా కనపడాలి. ఆ కదలికలతోనే వారి ఆశయం పోల్చుకోగలగాలి మనం. నాలుగు ఆహార్యకం. వారి వేషభూషణాది సామగ్రి వాటన్నిటికీ అనుగుణంగా కనపడాలి. ఇంత ఉన్నది నాటక శిల్పం. ఎంతో సిద్ధహస్తుడైతేగాని నాటకీయంగా తన కావ్యాన్ని తీర్చిదిద్దలేడు. శ్రావ్యంగా వ్రాస్తున్నా అది దృశ్యంగా కనపడదు మనకు – చెవులతో వింటున్నప్పుడే ఆ వర్ణనలన్నీ వినటమే గాక కంటికి కనపడుతుండాలి ఎప్పటికప్పుడు. సరిగా సూరనగారి ఈ రచన చూస్తే మన కలాటి దృశ్యానుభవమే నూటికి నూరుపాళ్లు ఇస్తుంది. సందేహం లేదు. ఒకవిధంగా ఇది కాళిదాసు విక్రమోర్వశీయ నాటక ధోరణిని తలపిస్తుంది నాకు. అది ఒక దృశ్యనాటకం. శ్రవ్యనాటకం. ఇదీ అలాంటిదే. అది విక్రమోర్వశీయమైతే ఇది ప్రభావతీ ప్రద్యుమ్నం.

నాయికానాయకుల నామస్మరణ ఇద్దరు కవులూ తమ రచనకు నామకరణం చేయటంలో స్ఫురింప చేస్తున్నారు. ఇంకా చిత్రమేమంటే చిత్రఫలక వృత్తాంతమక్కడా వస్తుందిక్కడా వస్తుంది.

అసలొకమాట. ఈ ప్రభావతీ ప్రద్యుమ్న కథా సంవిధానం లోనే నాటకీయత కనిపిస్తుంది. అయిదాశ్వాసాలూ అయిదం కాలేనని గదా పేర్కొన్నాము. కథాగమనం అయిదు భూమికలలో సాగుతుంది. ముఖసంధితో మొదలవుతుంది కథ. ప్రతిముఖంలో కొంత పెరుగుతుంది. అది గర్భంలో బాగా బలం పుంజుకొంటుంది. అవమర్శలో ఎదురు దెబ్బలకు తట్టుకొని నిలబడుతుంది. నిర్వహణలో విజయం సాధించి సుఖాంతంగా ముగుస్తుంది. ఇది అక్షరాలా ఇలాగే పాటించాడు సూరపరాజు. నాటకీయంగా ప్రారంభించాడు. ఇంద్రుడు దివినుంచి భువికి దిగి రావటం. దిగి నగర ద్వారం చేరాడో లేదో వార్తాహరులు వాసుదేవుడి కెటిగిస్తారు. ఆయన ఉగ్రసేన వసు సంకర్షణ గదా క్రూరాదులతో కక్ష్యాంతరములు గడచివచ్చి రిసీవు చేసుకొంటాడు. ఎంత చెడ్డా ఆయన ఇంద్రుడూ ఈయన ఉపేంద్రుడూ గదా. తమ్ముడన్న గారికి స్వాగతం చెప్పకపోతే ఎలాగా. ఇంద్రుడుపేంద్రునితో వజ్రనాభుడనే దానవుడి మూలంగా తాను పడుతున్న బాధలన్నీ చెప్పుకొంటాడు. తాత్కాలికంగా వాడు కశ్యపుని మాట విని తిరిగి తన రాజ్యానికి వెళ్లాడని అయినా బ్రహ్మవర ప్రభావం చేత వాడెప్పుడైనా దండెత్తి రావచ్చునని మరి ఆవర ప్రభావం వల్లనే వాడి పట్టణమెవ్వరూ ప్రవేశించలేరనీ ఏకరువు పెట్టి వాడి ఆగడానికేదైనా ఉపాయం చూడవలసిందని కోరుతాడు. కృష్ణుడంతా విని తన తండ్రి వసుదేవుడొక యాగం తల పెట్టాడని అది అయిన తరువాత తప్పకుండా చూస్తానని

ఈలోపుగా నీవూ తగిన ఉపాయ మాలోచిస్తూ ఉండమని ఊరడించి వీడు కొల్చుతాడతణ్ణి. తరువాత యజ్ఞం సమాప్తమవుతుంది. అప్పుడు భద్రుడనే ఐంద్రజాలికుడు తన బృందంతో వచ్చి అనేక మహిమలు ప్రదర్శిస్తాడు అచ్చటి మునులందరూ అతణ్ణి ప్రశంసించి వరాలిస్తారు. వటువులు కొందరు అతణ్ణి అల్లరి చేస్తూ పగలంతా ఇలాంటి మహిమలు చూపుతూ ఆ నెపంతో నగరి ఆనుపానులన్నీ తెలుసుకొని రాత్రులు దొంగచాటుగా ప్రవేశించి సొమ్ములన్నీ అపహరించుకొని పోవటమేగా మీ పని అని అపహసిస్తారు.

ఆ మాట లుపశ్రుతిగా తీసుకొని దానికెవడా సమర్థుడని కృష్ణుడాలో చిస్తుంటాడు. అక్కడ దేవేంద్రుడూ తన ఆకాశగంగలో విహరించే హంసలను పిలిపించి వాటితో సంప్రతిస్తాడు. శుచిముఖి అనే హంసి వజ్రనాభుడి కేళాకూళులలో తాము తిరుగుతూ ఉంటామని అక్కడ ఒకమారు అతని కూతురు తన చెలికత్తెతో తన స్వప్న వృత్తాంతం వినిపించటం విన్నానని ఒక రహస్యం బయటపెడుతుంది. అది ఆ కన్యకు స్వప్నంలో పార్వతి సాక్షాత్కరించి ఒక పురుషుడి రూపం చిత్రించి అమ్మరో వీడే నీకు వల్లభుడుగా నిర్ణయించాను – నీకూ వీడికీ జన్మించిన కుమారుడే ఈ వజ్రపురానికి రాజవుతాడని ఒక చిత్రఫలకం ప్రభావతి చేతికిస్తుంది. ఎవడో కాదతడు కృష్ణుని కుమారుడు ప్రద్యుమ్నుడేనని కూడా బయటపెడుతుంది. కలలో జరిగినదంతా తెల్లవారి కనిపించక పోయినా ఆచిత్ర ఫలకం మాత్రమలాగే నిలిచిపోతుందా కన్నియ చేతిలో. ఈ విషయం ఆవిడ తన చెలికత్తెతో చెబుతూ ఉండగా తాను విన్నట్టు దేవేంద్రునికి చెప్పి ఆవిడ చెలికత్తె ప్రద్యుమ్నుని ఎలాగైనా అక్కడికి తోడ్కొని రావచ్చునని సూచన చేస్తుంది.

ఇక్కడికి ప్రధమాంకం ముగుస్తుంది. ఇందులో ద్వితీయానికి బీజావాపం జరిగింది. భద్రనటుని వృత్తాంతమొక ప్రవేశకం లాంటిది తన్మూలంగా వజ్రపురం ప్రవేశించగల మాయలమారి ఎవడా అని కృష్ణుడాలోచిస్తుంటాడు. వాడెవడో ఇంకా తేలలేదు. అలాగే ఇంద్రశుచి ముఖీ సంవాదంలో ప్రద్యుమ్న వృత్తాంతానికి నాందీ జరిగింది. కాని శుచిముఖి ప్రభావతిని కలుసుకొని మాటాడటం గాని కృష్ణుడు తన కుమారుడే దానికి సమర్థుడనే విషయం గాని ఇంకా బయటపడలేదీ అంకంలో. భద్రుడిదొక ప్రవేశకమూ. చిత్రపట వృత్తాంతమొక విష్కంభమూ మాత్రమే. కాగా ఈ రెండింటికీ సమాధానం ద్వితీయాంకంలో కనపడుతుంది మనకు. అది ముఖమైతే ఇది ప్రతి ముఖం. అక్కడ బీజమిక్కడ బిందు వవుతుంది. బిందువు సింధువులాగా విస్తరిస్తుందని అర్థం. అలాగే జరుగుతుందిక్కడ ప్రభావతికి ప్రద్యుమ్నుని యెడల గాఢమైన అనురాగ మేర్పడేలా చూడమంటాడు దేవేంద్రుడు. నేను పంపానని చెప్పినా యీ అభిప్రాయం శ్రీకృష్ణునికి విన్నవించి ఆయన ప్లానేమిటో కూడా తెలుసుకోమని పంపతాడు దాన్ని. అది కృష్ణుణ్ణి దర్శించి ఆ విషయమంతా పూసగుచ్చినట్టు వినిపిస్తుంది. వెంటనే ఆయన 'వడుగుల పల్కుపశ్రుతిగ మున్ను సునిశ్చితత్వము. బడసిన కార్య పద్ధతికి పక్షి వధూ వచనక్రమంబుచే కడమ సమర్పితం' బయిందని సంతోషిస్తాడు. ఏమిటా కడమ. వజ్రపురంలో ప్రవేశించగల మాయల మారి ఎవరా అని గదా ఆలోచిస్తూ వచ్చాడు. అది ఇప్పుడెవడో గాదు. తన కుమారుడు ప్రద్యుమ్నుడేనని గ్రహించాడు. వాడే ఎందుకు కావాలి. ప్రభావతికి వాడే మగడని సాక్షాత్తూ పార్వతీదేవే నిర్ణయించింది కాబట్టి.

అంతేగాక చిత్రఫలకంలో వ్రాసిన దతని మూర్తేనని తెలిసింది కాబట్టి. అయితే కావచ్చు ప్రద్యుమ్నుడికా సామార్థ్యముందా. కావలసినంత. అదే చెబుతాడా శుచిముఖితో ఇప్పుడు. ఏమని. **బలవిభ వాభి శోభితుడ భంగుర శౌర్య ధురంధరుందకావలసిన మాయలున్ దివిజ వైరులకంటె కరంబు నేర్చు** – ఉండు – గాక. ఏమిటా మాయలంటావా. భద్రుడనే నటుడికెన్ని ఉన్నాయో వాటికిను మిక్కిలి. వాడికేమున్నాయి మాయలు. అవధ్యత్వం – సప్తద్వీప గమనం. ఆకాశగతి – అంతేగాక ఎవరి రూపం కోరితే వారి రూపం ధరించి ఏమాత్రం తేడా రాకుండా మెలగడం. అలాగే మా ప్రద్యుమ్నుడు కూడా అన్ని మాయలూ మహిమలూ చూపగలడు. ఇంతకూ నీవా వీడు చొరగనాదైత్యుని ముదలగొనుము – అది సాధించావంటే ఆ తరువాత మావాడు ఆ భద్రుడి వేషంలోనే తయారయి వస్తాడు. అంచేత ముందుగా అభ్రదుడి నక్కడికి పిలిపించే వేడుక వాడికి పుట్టించి నీ నేర్పుతో ఆ ఏర్పాటు జరిగేలాగా చూడ మంటాడు. భద్రుడికి మునులిచ్చిన వరాలేమిటో – ప్రద్యుమ్నుడి కవి సహజమైన మహిమలే కనుక వాడి వేషంలో వీడక్కడికి వెళ్లగలడు. కారణమా రాక్షస కన్యక మగడి తడేనని పార్వతే నిర్ణయించింది. వీటికన్నిటికీ సంధానం చేయటం శుభముఖి చేతిలో ఉండటం – ఈ అంశాలన్నీ మొదటి అంకంలో ఒక సస్పెన్స్. అదంతా ఇక్కడ ఈ రెండవ దానిలో మనకు తెల్లం చేస్తాడు సూరపరాజు.

అంతా చెప్పి కృష్ణుడాఖరున ఒకమాట అంటాడు శుభిముఖితో. 'దీన నుపయోగింపఁదగిన యవాంతర కృత్యంబులుఁ దత్తదుపా యంబులు నీపయెఱుంగుదు పొమ్ము సురకార్యంబు నిర్వహింపు' మని

వీడుకొలుపుతాడు దాన్ని. తరువాత ఆ హంసి ఏమి చేయబోతుందో ముందుగా తెలియనీయడు కవి. క్రమక్రమంగా అది ఒక్కొక్కటికీ బయటపడేలాగా చేస్తూ పోతాడు. ఇదే గొప్ప నాటకీయత. దానికి తగినట్టే అది ఎంతో చాకచక్యంగా ఒక్కొక్క పనీ సాగిస్తూ పోతుంది. ప్రద్యుమ్నుడు నగర బాహ్య ప్రదేశంలో అశ్వం మీద వివిధ గతుల క్రీడిస్తూ ఉంటే చూస్తుంది. వెంటనే 'అల్లయత డితండ కావలయునవశ్యమీ వర పురుషుతో మాటలాడి చనుట మనకు మేలు' అని ఆ ప్రద్యుమ్నునకు వినబడునట్లుగ తన తోడి హంసలతో పలికి అతడా పలుకులకు ఆశ్చర్యపడి చూస్తుండగా నేలమీద వాలుతుంది. ఇది ఎంత చక్కగా భావ్యర్థాన్ని సూచిస్తున్నదో చూడండి. వరపురుషులకు అంటే వధువుకు వరుడు కాబోయే పురుషుడు. అతడితడే అవటమా ప్రద్యుమ్నుడికి కుతూహలం కలిగించే మాట అదీ అతడు వినేలాగా మాటాడటం అతని దృష్టి తనవైపు తిప్పుకోనే వ్యవహారం.

అలాగే జరిగింది కూడా. అవి దగ్గరికి రాగానే అడుగుతాడు కూడా అతడు. ఇక్కడ అతడే ఇతడు అతనితో మాటాడాలని ఇంతకు ముందుగా మీరన్నారు గదా. ఎవరితో ఏమి మాటాడాలనుకొన్నారు. అసలే పనిమీద ఎక్కడికి వెళ్లుతున్నారు అని. ఇంకెవరితో స్వామీ. ఇంద్రుని మాట మీద మీ తండ్రి శ్రీకృష్ణుని దర్శించి వారిద్దరి ఆజ్ఞలు శిరసావహించి వెళ్లుతున్నాము. ఇంతలో నీవు కనిపిస్తే నీ అనుగ్రహం పొంది పోవటం కూడా ప్రయోజనకారే గదా అని నీ దగ్గరికి వచ్చా మంటుంది. ఇది ఇంకా గడుసుమాట. అసలు విషయం ఇతడే నన్నారే ఎవరతడు చెప్పదగినదైతే చెప్పమంటాడు. అది రహస్యమైనా కృష్ణుల

వారికీ నీకూ తేడా లేదు కాబట్టి చెబుతానని వజ్రనాభుడి విషయమంతా బయటపడుతుంది.' అది యట్లుండె నింకనీ ప్రసంగమును వచ్చిన తెఱంగును విన్నవిస్తానంటా ఆ నెపంతో ప్రభావతి సౌందర్యమతి లోకంగా వర్ణిస్తుంది. ఆ సందర్భంగా పార్వతి ఆ కన్యను కొక పురుషుని రూపం చిత్రఫలకంలో వ్రాసి ఇచ్చి ఇతడే నీకు మగడవుతాడని నిర్ణయించింది. ఆఫలకం నేను చూడటం కూడా తటస్థించింది. అతని రూపమే నీలో కూడా అచ్చు గుద్దినట్టుంటే చూచి 'అతడితడే'నని అప్రయత్నంగా నా నోట వచ్చి ఉండవచ్చునని ఒక మాట విసురుతుంది. అని అతని అభిప్రాయమేమిటో వినకుండానే 'అయ్యా చేయవలసిన పని చాలా ఉన్నది. ఎక్కువసేపిక్కడ మసలరాదు అనుజ్ఞయిస్తే బయలుదేరుతానంటూ తోడి హంసలతో ఆకాశాని కెగిరిపోతుంది.

ఇక్కడికి ద్వితీయాంకం పూర్తి అయింది. బీజం బిందువు కూడా అయి విస్తరించసాగింది. అంటే ప్రభావతీ సౌందర్యం ప్రద్యుమ్నుడి మనసులో నాటుకొని అది అతని విరహతాపం పెంచుతూ పోతుంది. ముఖ సంధికిది ప్రతిముఖం. పార్వతీదేవి మనసులో ఉన్నదీ శ్రీకృష్ణుని మనసులో ఉన్నదీ ప్రద్యుమ్నుడే అయినా అతడు ప్రభావతీ గత మనస్కుడు కావటం ప్రధానం. అక్కడే భావికార్యా చరణ కది తోడుపడుతుంది. ఈ రెండింటీ సంధాన కర్త ఆ శుభీముఖి. అది ప్రభావతీ సౌందర్యమంత గొప్పగా వర్ణించకపోతే అతని మనసు ఆకర్షితం కాదు.

ఇక అది ఎంతగా ఆకర్షిత మయిందో చూపుతాడు కవి తృతీయంలో. బీజ బిందువులు దాటి పతాకా స్థాయినందు కొన్నదతని విరహ వేదన. అందులోనూ ఆ చిత్రఫలకంలో ఉన్న పురుషుడు

తనలాంటి వాడే గాని తానేనని నిష్కర్షగా తెలియలేదు గదా. మరి ఎవడైనా తనలాటివాడుండవచ్చు గదా. ఇది అప్పుడే నేనెందుకా హంస నడికి తెలుసుకోలేదని పశ్చాత్తాపపడతాడతను. ఈ పశ్చాత్తా పడతాడను. ఈ పశ్చాత్తాపం విరహతాపాన్ని ఇనుమడింప చేయటమింకా గారంటీ దేవకార్య స్థితికి. అతని పరితాప మెంతవరకు పోతుందంటే ఆఖరుకది తట్టుకోలేక శుచిముఖి పేర ఒక ప్రణయ లేఖ కూడా వ్రాసి పంపుతాడు. ఒక చిలుకకాలికి కట్టి. పోతే ఇక అక్కడ శుచిముఖి ప్రభావతి చేతి చిత్ర ఫలకాన్ని పదేపదే వీక్షించటమూ అది కనిపెట్టి ప్రభావతి ఏమలా చూస్తావు నీకే మర్ధమయిందని అడగటమూ – ఇలాంటి వాణ్ణి ఇంతకు ముందొకణ్ణి చూచాను నేను అతని పోలికే ఇతనిలో కూడా కనపడితే ఇతడతడేనా లేక అతని లాంటివాడు మరి ఒకడా అని పాలుపోక చూస్తున్నానంటుంది. అలాగా ఏదీ ఇలా దగ్గరకు వచ్చి చూచి మా సందేహం పోగొట్టమని బ్రతిమాలుతుందా కన్య. అలాగేనని వచ్చి చూచి సందేహం లేదు. అతడే ఇతడు మరొకడెవడూ కాదని నిష్కర్ష చేసి చెబుతుంది. చూచారా. ఇక్కడ చమత్కారం. అక్కడ నాయకుడి నీ ఆ ఫలకంలో ఉన్న పురుషుడు నీవేనని చెప్పకుండా మభ్యపెట్టిందా హంసి. ఇక్కడ ప్రభావతి అతడెవరో తెలియక మధనపడుతుంటే ఫలకం చూచి అప్పుడే చెప్పక ఎంతో దూరం వారిచేత బ్రతిమాలించుకొని బయటపెడు తుందతడు ప్రద్యుమ్నుడేనని. అతని కులగోత్ర నామాదులు కూడా బయటపెడుతుంది. కాని అతడికి నీయందను రాగముందో లేదో అనవసరం. నీ విషయం చెప్పినా మారు మాటాడలేదతడు. ఎందుకులే నీకతడు. మరొకడెవడూ లేడా సుంద రాంగుడని ఉడికిస్తుందా కన్యను.

అతణ్ణి తప్ప మరెవరినీ వరించను. అతడొప్పుకోకపోతే మరణమే శరణ మంటుందావిడ. అప్పుడు శ్రుతిమించిందని అలాగైతే తప్పక తెస్తానతణ్ణి. కాకున్నా ఒక మాట బ్రహ్మనతడు వియోగం పాలుచేస్తే ఓరి నీవు కూడా ఇలాగే ప్రభావతి విరహానలంతో కుందుతావని. ఉపా లంభించాడతణ్ణి – అని నాటకీయంగా ఒక సన్నివేశం కల్పించి చెప్పి ప్రస్తుతాంశానికి ముడిపెడుతుంది. కాని రాగవల్లరి అనే చెలికత్తె కాముడికీ ఈ ప్రద్యుమ్నుడికీ ఏమిటి సంబంధమని ఆశ్చర్యపోతూ అడిగితే ఆ కాముడే ఈ జన్మలో ప్రద్యుమ్నుడుగా జన్మించడమ్మా అని సమాధాన మిస్తుంది. ఒక శంక రేకిత్తించటం దానికి సమాధానమిస్తూ పోవటమే నాటకీయత అంటే. ఆ మాటకవే అంటాడు కూడా అని దావి శంకల కన్నిటికిని పరిహారంబులు తెలిపి' అని.

మరొక నాటక సంవిధానమేమంటే చిలుకవృత్తాంతం దానికతడు ప్రణయలేఖ ఇచ్చి పంపటం – అది ఉరులలో తగులుకోటం శుచిముఖి విడిపించగానే ప్రణయలేఖ జారిపడటం. రాగవల్లరి అందుకొని చదవటం. అందులో ప్రభావతీ పేరు స్మరిస్తూ అతడు తన మదనతాపం వెలువరించటం. గమనించదగిన అంశం. దీనిమూలంగా నాయికా నాయకులిరువురికీ ఇరువురి విషయమూ తేట తెల్లంగా తెలిసిపోతుంది. చిలుకను నిర్బంధించినట్టు నటించి శుచిముఖి దానిచేతనే విషయమంతా చెప్పించట మెంతో నాటకీయంగా సాగింది. శృంగారం పరాకాష్ఠ నందుకొన్నది దీనితో. దీనికే గర్భ సంధి అని పేరు నాటకంలో. అసలీ ప్రభావతి విషయమే గాక చిలుకవృత్తాంతానికి మరొక ప్రయోజనం కూడా ఉన్నది. అది గుణవతీ చంద్రవతి అనే నాయికలకూ వారి

నాయకులు గద సాంబులకు ప్రణయరాయబారం నడుపుతున్నది. నాయిక లెవరోగారు. వజ్రనాభుని తమ్ముడు సునాభుడనేనా వాడి తనయలు. ప్రభావతికి పినతండ్రి బిడ్డలు కనుక చెల్లెండ్లు. మరిగద సాంబులు కూడా ప్రద్యుమ్నుడి సోదరులే. ఈ వృత్తాంతంతో చతుర్థాంక మారంభ మవుతుంది.

చతుర్థాంకమంటే అది అవమర్శ సంధి. పూర్వాపర వృత్తాంతాలు రెండూ ఇక్కడ సంధానమవుతాయి. ఇంతవరకూ మధ్యలో ఎక్కడా కనపడని వజ్రనాభుడు హఠాత్తుగా మరలా దర్శనమిస్తాడు. శుచిముఖి విద్యా వైదుష్యము ప్రభావతి తన తండ్రికి తెలియజేసి అతని ఎదుట ప్రదర్శించమని దాన్ని పురికొల్పుతుంది. ఇది ఒక ఎత్తుగడ. అలాగే అది అన్నివిద్యలూ ప్రదర్శించి అతనికి భద్రనటుని మహిమలు చెప్పి అతణ్ణి పిలిపించే ఏర్పాటు చేయిస్తుంది. ఈలోపుగా హంస ద్వారకకు పోయి ప్రద్యుమ్ననికి ప్రభావతీ సౌందర్యము వర్ణించి చెప్పి ఆవిడ విరహవేదన కూడా వినకారు చేస్తుంది. అంతేగాక కృష్ణులవారతణ్ణే వజ్రనాభ వధార్థమతని పురానికి పంపే లాగా అన్నీ చక్కబెట్టానని చెప్పి తాను వజ్రపురానికి వెళ్లి అతని నాట్యమేర్పాటు చేసే విషయం కూడా చూస్తానని చెప్పిపోతుంది.

దీనికి తగినట్టుగానే ప్రద్యుమ్నాదులను పిలిపిస్తాడు కృష్ణుడు. వారికి వజ్రనాభుని వృత్తాంత మెఱిగించి అతణ్ణి వధించటానికి నీవే తగిన వాడనని చెప్పి అతనికి బాసటగా గదసాంబులను నియోగించి 'భద్రనటుని రూపం ప్రద్యుమ్నుడూ పారిపార్శ్వ కుడిరూపం గదుడూ మరి సాంబుడు విదూషకుని ఆకారమూ ధరించి నాటకమాడమని కూడా

బోధించి పంపుతాడు. అచ్చంగా వారు వెళ్లి ఒక నాటకమే ప్రదర్శిస్తారు. దానికి సూత్రధారి శుచిముఖి. 'తను నాట్యవిద్య చూపగ తదర్హమైన సన్నాహ విశేషముతోడ నృత్యరంగస్థలికి వారేగుదెంచారని వర్ణిస్తాడు సూరన. ఇది ఆ కుమారుల నాట్య ప్రదర్శనా లేక ఆ నెపంగా సూరన కవిగారి నాటక ప్రదర్శనా. ఏదైతే నేమి. జరుగుతున్నదంతా ఒక నాటకమే. వజ్రనాభుడు సపరివారంగా వచ్చి కూచుంటాడు. అంతఃపుర కాంతలంతా వచ్చి ఆసీనలయ్యారు. ప్రభావతీ ప్రభృతులకూ ప్రద్యుమ్న సోదరులకూ రహస్యంగా సంకేతాలు అందజేస్తూ వారు తమ తమ ప్రియులూ ప్రియరాంద్రనూ ఎలా గుర్తించాలో అలాగా కథంతా నడుపుతూ పోతుంది శుచిముఖి.

సరే. ఇది నాటకమన్నందుకు కథలోనే ఒక మలుపు తిప్పి కేవలం నాటకమే ప్రదర్శిస్తున్నాడు. ఎవడు ప్రద్యుమ్నుడా కాదు. ప్రద్యుమ్నుడక్కడ వజ్రనాభాది సభాసదులకు గాడు. అది ఒక వ్యపదేశం. సూరపరాజు అనే సూత్రధారుడు మనబోటి ప్రేక్షక మహాశయులకు. అచ్చంగా నాటక పరిభాషలోనే మాటాడుతున్నాడు మనతో సూరనగారు. ఈ నాటకం శ్రవ్య కావ్యమనే పేరుతో సాగిన దృశ్య నాటకం. ఇందులో సూత్రధార కృత్తి గైకొన్నవారు శంబర ద్వేషి ప్రద్యుమ్నుడు అందులోనూ మాయా నాట్యసూత్రధారి అట అతను. రంగ మంగళాచార మంతా యథావిధిగా ఆచరించాడు. మరి.

గాంధార ప్రముఖస్వర శ్రుతికళా గంభీర వారాంగనా
గాంధర్వంబు ఘనస్వనంబు తతనిక్వాణంబు వంశాది సం
బంధి స్వావ పరం పరేమిటి - మద్దెల్ల ధింధిమి ధ్వానా లేమిటి -
సమ విషమ తాళ ప్రవృత్తు లేమిటి - ఒకటేమిటి అన్ని కళలూ

అమరుతూ వస్తాయి.

ఆ వనజాక్షనందనుడు నంతట నాంది తగంబఠించి యిం పానహిలం బ్రరోచనయు నాముఖముందన రార నొప్పు ప్రస్తావనతో ముఖాదులగు సంధులు సాంగతc బెంపు మీఱ గం గావ తరాది నాటకము లాడె ననేకము లద్భుతంబుగన్' - ఈ పద్యమొకటి చాలు ఈ సూరన మహాకవి రచించిన ఈ ప్రభావతి ప్రద్యుమ్నమనేది కావ్యంగాదు. పైకి కావ్యంగా కనిపిస్తున్నా ఆంతర్యంలో కేవలమిది ఒక నాటకమేనని చాటటానికి. అంతే కాదు. ఆ నాటక ప్రయోగావ సరముల భగీరథా ద్యాకార ధారణమును గంగాది నిమ్నగా గతియు' ఇలాంటి దృశ్యాలన్నీ కండ్లకు కట్టినట్టు చూపుతూ వచ్చాడట ప్రద్యుమ్నుడు. పన్నిదము చేసియును అవి కృతకములని నిశ్చయింపగ లేక అబ్రపడుతున్నారట అక్కడి సామాజికులు. అక్కడి సామాజికుల మాటేమోగాని ఇక్కడ మనబోటి సహృదయ సామాజికుల నబ్బురపడేలాగా ప్రదర్శిస్తున్నాడు సూరకవి అనే ప్రద్యుమ్న సూత్రధారుడు. ఆ ప్రద్యుమ్నుని మాయలాంటిదే ఈ కవిగారి మాయకూడా.

ఇంతలో అక్కడ ప్రద్యుమ్నుడు నాటక మధ్యంలోనే ప్రౌఢమైన వాక్చమత్కారంతో వజ్రనాభుని కొక అర్థమూ ప్రభావతి కొక అర్థమూ స్ఫురించేలాగా ప్రసంగిస్తాడు. అది మరీ నాటకీయ మా శైలి.

సకల విశేష శోధనకుc జాలిన యోనెఱజాణ వజ్రినా
భకుల వతంస రత్నమ ప్రభావతిరోహిత కంటకంబు తా
వక మగు చూపు నాపయి ప్రవర్ధిత రాగత పర్వె న
త్యకలుష వృత్తి నా సుకృత మంతయు నేడు సుమీ ఫలించుటల్
నను నేలి కొను మవశ్యంబును నీయాడిగము చిత్తమున కెక్కగానే

నొనరింతు నేటి తమి నీ – మనమున నెంతయు నిడుకొని మన్నింపఁ దగున్' ఏమిటీ మాటలలోని ఆంతర్యం. ఏమిటో చెబుతున్నది వినండి శుచిముఖి. ప్రభావతిని చూచి. 'మదిం గనుగొంటివె యాత్మ నాథు వాక్యపదవిఁ దోచునట్టి యితరార్థము సర్వము' అనగానే ప్రభావతీ సమాధానమిస్తుంది. విచ్చల విడి నను బేర్కొని యిచ్చనుగల దెల్లఁ బలికి యిదె నేటి నిశన్ వచ్చెద ననుచున్నాడిక నిచ్చోనిక నర్ధమెర్ది యితరము దీనన్' ఇద్దరూ ఇద్దరే విదుషీమణులు. అర్థం కాకపోవటమేమిటి. వారి కర్థమయిన వ్యంగ్యార్థాలు మరి పాఠకులకు మీకర్థం కాకపోతే మీరేమి సహృదయులని ఎత్తి పొడుస్తున్నాడు కూడా సూరనగారు మనలను. కనుక మనమూ అర్థమయిందని తల ఊపి ఆయనగారి దగ్గర సర్టిఫికేటు తెచ్చుకోటం మంచిది.

సరే ఆ మాటలతో విరహవేదన బాగా తలకెక్కి తన ప్రియు డెపుడెపుడు వచ్చి తన పడక మీద వాలుతాడా అని తహతహ లాడుతుంది ప్రభావతి. అంతలో చంద్రుడూ మలయపవనుడూ కనిపిస్తే వారిని దుయ్యబడుతుంది. దీనితో చతుర్థాంకం పూర్తి అవుతుంది. ఇక పంచ మాంకం. ఇది నిర్వహణ సంధి. దీనితో కథా సంవిధానాని కంతటికీ ఫలసిద్ధి. మొదట ఇంద్రోపేంద్రులిద్దరూ శుచిముఖి ద్వారా ఏ ప్రణాళికకు నాందీ పలికారో అది ఇక్కడ బాగా ఊపందుకొని చివరకు వజ్రనాభ సంహారంతో నాయికా నాయకుల గాంధర్వ వివాహంతో వారి వివిధ శృంగార వినోద విహారాలతో మంగళాంతంగా ముగుస్తుంది. అదే ఈ కావ్యనాటకానికి భరత వాక్యమని భావించవచ్చు మనం.

వినండి ఆభరతవాక్యమేమిటో.

అఘహరణ హరివంశ కథాశ్రయంబు
నాత్మపుత్ర గుణస్తవ నాంకితంబు
నైన యీ కావ్యమునకు మహాప్రసిద్ధి
నిచ్చుగా వుతఁగరుణ లక్ష్మీ శ్వరుండు.

తండ్రీ కొడుకుల వృత్తాంతమిది. తండ్రి సాక్షాత్తూ శ్రీకృష్ణ పరమాత్మ. కొడుకు సరే మన్మథుడి అప రావతారం ప్రద్యుమ్నుడు. మన కథా నాయకుడే. వంశం చూస్తే హరి వంశం. ఆ తండ్రి కొడుకుల గుణగణాలను కీర్తించటమే కథా వస్తువు. కనుక తన విషయమే కాబట్టి శ్రీకృష్ణుండనే లక్ష్మీశ్వరుడు అంటే మహావిష్ణువు – ఈ కావ్యానికి బహుళ ప్రచారమివ్వాలని కోరుతాడు కవీశ్వరుడు. ఇందులో కవి తన తండ్రీ కొడుకుల అనుబంధం కూడా ధ్వనింపచేస్తున్నాడు. తండ్రికే గదా అంకితమిచ్చాడీ కావ్యాన్ని. ప్రద్యుమ్నుడు తన తండ్రిఁదగ భజించుచు వర్తిలెన్ అనటంలో కూడా అది ధ్వనిస్తూ ఉంది మనకు. అంతేగాదు. మేమే గాదు. వారే గాదు. లోకులందరూ కూడా తమ పెద్దలను సేవిస్తూ వారి ఆజ్ఞ శిరసావహిస్తూ బ్రతకటమే శ్రేయోదాయకం జీవితానికని కూడా ఒక సందేశం పాఠక కాదు కాడు ప్రేక్షకలోకానికి. అంతేకాదు. అలా సౌజన్యంతో ప్రేమాభిమానాలతో ప్రవర్తిస్తే స్వామివారి నిరంతర కరుణావలోకానికి పాత్రులు కాగలరని కూడా అంటున్నాడు కవి సూత్రధారుడు. 'నిరంతర కరుణావలో కనంబుల భక్తజనంబుల నవలోకించుచు' అని కంఠోక్తిగా.

ఈ విధంగా నాందీ ప్రస్తావనలు మొదలుకొని భరత వాక్యంతో సహా రచించిన ఈ కావ్యం నాటకం కాకపోవటమేమిటి. అక్షరాల

నాటకమే. పైకి శ్రవ్యం లోపల దృశ్యం. దృశ్య శ్రవ్య సంగమ క్షేత్రం. పోతే నాటక మన్నందుకు మరొక ముఖ్య విషయమేమంటే- శ్రవ్యంలోకంటే దృశ్యమైన నాటకానికి పాత్ర చిత్రణ చాలా ఆవశ్యకం. సజీవంగా కనపడాలి ప్రతి పాత్రా. అనివార్యమనిపించాలి కథా నిర్మాణానికి. దాని ప్రతి ఆలోచనా మాటా కదలికా నాటకీయంగా భాసించాలి. అభినయ ప్రధానం కూడా నాటకమంటే. అభినయమంటే అది సాత్త్వికమూ వాచికమూ ఆంగికమూ ఆహార్యకమూ నాలుగూ కూడా. ఈ నాలుగూ కూడా యథోచితంగా ఎక్కడికక్కడ చూపుతూనే వచ్చాడు పింగళ సూరన తన ఈ ప్రభావతీ ప్రద్యుమ్నంలో.

ముఖ్యంగా శుచిముఖి అనే హంసాంగన పాత్ర. అతి లోకమైనదా సృష్టి. నలచరిత్రలో హంస ఎటుపోవాలో దీనితో పోలిస్తే. ఉష చెలికత్తె చిత్రలేఖ ఏమయిపోవాలో. అసలు కళాపూర్ణోదయంలోని చిలుక కూడా పనికిరాదు. అంతగా చిత్రించాడీ హంస పాత్రను కవి. మొదటినుంచీ చివరిదాకా కథంతా దానిమీదనే నడుస్తుంది. మరి దేవేంద్రుడు గాని ఉపేంద్రుడుగాని ఉన్నారంటే ఊరక మనలాగా వారూ ప్రేక్షకులయి చూస్తున్నారు. అప్పుడప్పుడు దానితో మాటాడుతూ దాన్ని ఆయా సందర్భాలలో పనులకు పురమాయిస్తూ ఉండేవరకే. ఆ పని ఎలా సాధించాలో దానికే తెలుసు. అది కూడా వారే అంటారు. ఇక దాని హావభావాలు చూడండి. అద్భుతం. అక్కడ ఇంద్రుడు ప్రభావతీ ప్రద్యుమ్నుల కొకరి యెడ ఒకరికి అనురాగం కలిగించటం నీ బాధ్యత అందుకు వాసుదేవుని కూడా దర్శించి ఆయన అభిప్రాయం కూడా తెలుసుకొని పొమ్మంటాడు. ఇక వచ్చింది ద్వారకకు. అతడు సరస్తీరంలో

కాంతా సమేతుడై తీరికగా ఉండటం చూచింది. 'ఇదే యితని నెఱిగించుకొన సమయమని' చెంతకు చేరుతుంది.' నన్న మర విభుడు పంచె నీకొక్క మాట చెప్పంగ'నంటూ తన కుమారుడు రాక్షస పట్టణానికి వెళ్లటం రుక్మిణి కిష్టం లేదేమోనని శంకించి ఏకాంతపు మాట గల' దంటుంది. దాని మాట నేర్పు బుద్ధికౌశలాన్ని మెచ్చుకొన్నాడట కృష్ణుడు. వెంటనే వారంతా దూరంగా వెళ్లితే వజ్రి తన్ను పిలిపించుట మొదలు అచటి కనుచుట శుదగా' అంత వినకారు చేస్తుంది. ఎక్కడా అన వసరమైన దీర్ఘ ప్రసంగముండదు. కాలహరణం పనికిరాదు. ఇదీ దాని ఇంగిత జ్ఞానం. మితభాషిత్వం. మరి కృష్ణుడంతా విని భద్రుడి వృత్తాంతం వాడి మహిమలుఅవన్నీ ప్రద్యుమ్నుడికి సహజంగానే ఉన్నాయి కనుక వాడి వేషంలో ఆ రాక్షసుడి పురంలో ప్రవేశించగలడని చెప్పి దీనికి తగిన 'అవాంతరకృత్యంబు తత్తదుపాయంబులు నీవయెఱుంగుదు పొమ్ము సురకార్యంబు నిర్వహింపుమని వీడ్కొలుపుతాడు. శ్రీకృష్ణుని వంటివాడు ప్రశంసా పత్ర మిచ్చాడు దానికి.

అక్కడి నుంచి వెళ్లుతూ **'అల్లయతడితండె కావలయు'**నని ప్రద్యుమ్నుడికి వినబడేలాగా ఒక మాట అంటూ' ఈ వరపురుషుడితో మాటాడి చనవలయునని కూడా అంటుంది. ఆ రెండు మాటలూ పట్టుకొని కుతూహలంగా అడుగుతాడు ప్రద్యుమ్నుడు. ఇక ఎవరితో మాటాడుతాము నీతో గాక - దేవతల కార్యం సాధించటానికి దేవేంద్రుడికి మీ తండ్రిగారి సలహా తీసుకొని వెళ్లుతూ తండ్రికి కుడిభుజం లాంటి నిన్ను కూడా చూచి పోవటం ధర్మమని వచ్చానంటుంది. ఏకాంతం కోరినట్టు నలువంకలు పారచూస్తుంది. అది గ్రహించి

పరిజనులంతా ప్రక్కకు. పోతే రెండు విషయాలు చెబుతుంది. ఒకటి వజ్రనాభుడి విషయం. రెండు ప్రభావతి వృత్తాంతం. ఇందులో మొదటిది సాధించాలంటే రెండవ దానితో ముడిపడి ఉన్నది.

ఆ ప్రభావతి సౌందర్యమంతా చిలువలు పలువలు పెట్టి వర్ణిస్తుంది. ఆప్రసంగంలో తాను సరస్వతి పెంపుడు హంసనని ఆవిడ అనుగ్రహంతో అన్ని విద్యలూ కళలలో ఆరితేరి 'ఉపమాతిశయోక్తి కామధేను' బిరుదు సంపాదించానని చెబుతూ తన కాలినూపురం చూపి ఇంత వైదుష్యమున్న నాకే అతీత మావిడ సౌందర్య మంటూ మాటలో మాటగా తన పాండిత్యం బయటపెడుతుంది. పైగా అసలు విషయం మరచిపోకుండా ప్రభావతికి పార్వతీదేవి ఒక పురుషుని ఆకృతి వ్రాసి ఇచ్చిన చిత్రఫలకం చూచి అలాటి ఆకృతి నీలో ఉండటం చూచి ఆశ్చర్యం కలిగి ఆ మాట అన్నానని నేర్పుగా అదుకు వేసి ఇక ఎంతోసేపుండరాదు. అర్జెంటుగా వెళ్లాలని ఎగిరిపోతుంది. ఎక్కడ ఎంతో అంతే మాట. దీనితో ప్రద్యుమ్నుడి మనసులో ప్రభావతి ముద్ర గాఢంగా పడిపోయింది. చిత్రపటంలో ఉన్నవాడితడేనని సూటిగా చెప్పలేదు కాబట్టి అది అతణ్ణి మధనపడేలాగా చేస్తుంది. ఇదీ దాని నేర్పు. అది అతడు తట్టుకోలేక ఒక ప్రణయలేఖ దాని పేర వ్రాసి పంపే వరకూ పోయింది.

అక్కడ ప్రభావతినీ ఇలాగే బేలు పుచ్చుతుందది. ఆవిడ చెలికత్తెతో కలిసి చూచే చిత్రపటం సవిమర్శ దృష్టిని పలుమఱు మఱలి మఱలి వీక్షిస్తుంది. ఇది ఒక అభినయం. అది ఎందుకలా చూస్తున్నదని అడిగితే నేనిలాటి పురుషునింతకు ముందొకచోట ఎక్కడో చూచానతడేనా ఇతడని చూస్తున్నానంటుంది. వారు ముచ్చట పడి దగ్గరికి పిలిచి పటం చూపితే

ఆఁ సరిగా అతడే ఇతడు సందేహం లేదు. అదిగో ఆ ఆనవాళ్లని వర్ణిస్తూ పోతుంది. అయితే అతణ్ణి ఎలాగైనా తీసుకురాగలవా అని అడిగితే ఏమో అతనికి నీమీద మనసున్నదో లేదో అలా కనపడటం లేదు అని మరీ తెగినదాకా బిగిస్తే బెడిసిపోతుందని సరస్వతీ బ్రహ్మ దేవుల ప్రణయకలహ మొకటి సృష్టించి అందులో బ్రహ్మ మన్మధుణ్ణి ఉపాలంభిస్తూ మిడిసిపడకు నీకూ ప్రభావతి అనే దానిమీద విరాళి చే ఇలాటి పాట్లేరా బోతాయని శపిస్తాడంటుంది. అది విని నేను రతిదేవి కంటే సుందరాంగినా అని ప్రభావతి అడిగితే అదేమి మాట – రతి ఎక్కడ పనికి వస్తుంది. నాకు చేతగాక కదా సాక్షాత్తూ పార్వతీదేవి ఆ కన్యను సృష్టించిందని సూచిస్తాడాయన' అనగానే రాగవల్లరి 'ఏమిటి హితవుగఁ జెప్పి యెందు నదికితివని" అచ్చెరువు ప్రకటిస్తే నవ్వి ఆ మదనుడే గదటమ్మా ఈ జన్మలో ప్రద్యుమ్నుడయ్యాడని అదుకైనా దాన్ని అసలు కథతో ముడిపెడుతుంది.

ఎంత మాట నేర్పు. ఎంత బుద్ధికుశలత. రతికన్నా గొప్ప సౌందర్యవతి ప్రభావతి అని బ్రహ్మదేవుడే చెప్పాడు గనుక ప్రభావతికి రతివల్ల అంతరాయం లేదు. మరి అలాంటి ప్రద్యుమ్నుడి కావిడ ప్రాణమవటం వల్ల అతనితో సాంగత్యానికిక తిరుగులేదు. మరి ప్రణయలేఖ వ్యవహారం ఎంత నవీనమైనదో నాటకీయమైనదో చూడండి. కాళిదాసు విక్రమోర్వశీయంలోనూ వస్తూందీ ప్రేమలేఖ. అంతే కాక అక్కడ చతుర్థాంకమంతా విక్రముడి విరహవేదనా వర్ణనమే. ఇక్కడా అంతే చతుర్థంలో విప్రలంభం పంచమమంతా సంభోగంతో నిండి పోయింది. దీనికంతటికీ సంధానకర్త శుచిముఖే. ప్రభావతి సిఫారసుతో

వజ్రినాభుణ్ణీ చివరకు వలలో వేసుకొంటుంది. **'శుచిముఖీ నీదు విద్యా విలసనంబు విన్నవించిన నయ్యవినవలయువని వేడుక పడుచున్నాడని'** ఆ కన్య చేతనే చెప్పించి ఆ వ్యాజంతో **కాణాదంబును గౌతమీయమును సాంఖ్యంబున్ భుజంగా గ్రణీ వాణీ మార్గము జైమినీయ** మంటూ తన పాండిత్య ప్రకర్ష భంగ్యంతరంగా బయట పెడుతుంది. 'ప్రకృతి ప్రౌఢి దృఢాను మానమును సంస్థాపించు ననే పద్యంలో తన వాదప్రౌఢివంత చాటి చెబుతుంది. అంతేనా. **'కావ్యనాటకాలంకార గాన మదన శాస్త్రపరాయణ జ్ఞాన'** మంతా వెళ్లగక్కుతుంది. దానికా యసుర భర్త మెచ్చి పురే అన్నాడట. అంతేగాక నీకనిన యద్భుతము లేమైన గలవా అని అడిగితే వెంటనే చెప్పక ఇంచుక విచారించుట అనినయించి భద్రుడి విషయం చెబుతుంది. ఇలాంటి ఆంగిక వాచికాభినయాలన్నిటికీ పుట్టినిల్లా శుచిముఖి.

ఒక శుచిముఖేమిటి. మరొకటేమిటి. ఏ పాత్ర చూచినా తనివి తీరదా అనుభావ విభావాదుల అభినయం. అవి. స్వగతాలే కావు భావసంధి భావశబలతలే గావు. చెప్పటం గాదు. ఆయా పద్యాలు చదివి ఎవరికి వారు ఆస్వాదించి ఆనందించి తీరాలి. మరి పాత్రల సంవాదాలా నాటక రచనకు ప్రాణం. ఒకటి చూపుతా చవి చూడండి.

ఒక చిల్కచేత పత్రికయంచితే నాకు
ననిచితి - నదినీకు నందెనొక్కా
యనుచు టెవ్వరి గూర్చి యది వారికిని జేరె
నా యింతికి శుభంబె హంసరమణి. ఇలా సాగుతుంది 'అనుచున్ మాటకు మాటగా'నని కూడా మనకు చమత్కారంగా సూచిస్తాడు కూడా

కవి. ఇలాంటి సందర్భాలెన్నో ఉన్నాయీ కావ్యం నాటకీయతను గూర్చి ఇంతకు పూర్వం నవల అయితే ఇప్పుడిది నాటకం.

ఇలా కేవల మితర ప్రబంధ కవుల రోకటిపాటగా సాగిన రచనకు చాలా దూరంగా నవీన ధోరణిలో సాగిన రచన ఏది చూచినా సూరపరాజు కావ్యరచన. అది ఒక నూతన ప్రపంచం. కల్పనా ప్రపంచం. ఆ రోజులలో వచ్చిన కవుల కావ్యాలలో ఇంత వినూత్నమైన కల్పన ఎక్కడా లేదు. ఈ కాలంలో మనం చూచే నవలలు నాటకాల ధోరణికా రోజే ఆయన శ్రీకారం చుట్టాడంటే చుట్టటమేగాక అందులో సిద్ధహస్తుడని పించుకొన్నాడంటే ఎంత గొప్ప.

ఈ కల్పనా ధోరణి ఇంతటితో ఆగక ఇంకా ఒక కొత్త పుంత తొక్కింది. ఆయనగారి రచనలో. అదేదోగాదు. ద్వ్యర్థికావ్య నిర్మాణం. రెండర్థాలిచ్చే పద్యాలతో ఒక కావ్యమే వ్రాయాలంటే సామాన్యం కాదు. రాఘవ పాండవీయ మాయ నద్వ్యర్థికావ్యం. తరువాత వచ్చిన భట్టుమూర్తి హరిశ్చంద్ర నలోపాఖ్యానం కూడా దీనికి సాటిరాదనిపించే మేటి రచన. అసలు సూరన మొదట నుంచీ రెండర్థాలు స్ఫురించేలాగా తన కావ్యాలన్నటిలో తరుచూ విసుర్లు విసురుతూనే ఉంటాడు. అభంగం కన్నా సభంగ శ్లేష బహు చమత్కారంగా చేయగలడు. ఆలికుచంబులు ఆ గయ్యాలి కుచంబులు అన్నా – మరి కళాపూర్ణ కావ్యంలో ప్రధమాగ మాదుల మీద నెపం పెట్టి సంస్కృతాంధ్ర భాషలు రెండూ మిలావు చేసినా – ఆ పద్యాలెంత బ్రహ్మాండంగా వ్రాశాడో చూచారు గదా– అతిలోకమది.

మరి ఇవన్నీ ఎందుకీ అల్పాహారాలని చివరకు విందు భోజనమే వడ్డించాడు మనబోటి రసజ్ఞులకదే రాఘవ పాండవీయం. అదీ ఒక నూతనమైన కల్పనే. చివరకంటున్నానుకాదు. ముందే రుచి చూపాడు

మనబోటి రసజ్ఞులకు. కళాపూర్ణ ప్రభావతీ ప్రద్యుమ్నాది రచనలకు ముందుగా రచించినదే ఈ ద్వ్యర్థి కావ్యం. ఎందుకీ చాపల్యమని తరువాత మానేసి ఉంటాడీ సర్కసు ఫీటు. అయినా దాని సంస్కారం పనిచేస్తూనే వచ్చిందా తరువాతి కావ్యాలలో కూడా అడపాదడపా. ఆంధ్ర సంస్కృత శ్లేషేమిటి. శబ్దార్థ శ్లేష లేమిటి. గౌణవృత్తి శ్లేషేమిటి. అన్వయయ తిచ్ఛేద శ్లేషలేమిటి. అన్ని రకాలు సాధించాడు ఈ రాఘవ పాండవీయంలో. అసద్భగ్నలు డంటే అసమానబలుడు దశరథుడు. భృగ్నలం లేనివాడు ధృతరాష్ట్రుడు అమరశత్రువులు దేవతలొకచోట అయితే అమరగా శత్రువులు మరొకచోట. తానన్నమాట తాను అనిన మాట అయినా కావచ్చు. తాను తన అన్నగారి మాట జవదాటకపోవటమైనా కావచ్చు. మరి శాంతనవోక్తి అంటే భీష్ముని మాట అయినా శాంతమైన నవ్యమైన మాట అని ఏదైనా సరిపోతుంది. ఇలాటి విరుపులూ మెరుపులూ కుప్ప తెప్పలు. అక్కడక్కడ కొంత తికమక పెడుతున్నా మొత్తంమీద రమ్యంగానే సాగింది రచన.

ఇంతకూ సూరన్న సూరన్నే. సూర్యుని కన్నగారు. రవి గానని చోటు కూడా ఈ కవి గాంచ గలిగినవాడే. గిజిగాడి గూడులాగా ఆ అల్లిక ఆయనకే తెలియాలి. ఒక కథా సన్నివేశాలేమిటి పాత్రల భావాలేమిటి. మాటలూ మర్యాదలేమిటి. స్వభావాలేమిటి వర్ణనలేమిటి. ముందు వెనుక ఒక దానితో ఒకటి అతుకుతూ పోయే ఆ చాతుర్యం సౌందర్యం రెండూ ఆయనగారి సొమ్మే అనటంలో సందేహం లేదు. ముఖ్యంగా కొన్ని పాత్రలూ వారి స్వభావాలూ వారి మాటలూ మన మనసుల మీద చెరగని ముద్రవేసి ఎప్పటికీ మన జీవితంలో మరపురావు. ఇది కల్పనా లేక వాస్తవమా అని ఏదీ తేల్చుకోలేని దాయన రచనా పాటవం.

చిన్నయసూరి వచనామృతము

మనమింతవరకూ పదకొండుమంది ఆదిత్యుల ప్రకాశ వైభవాన్ని చూస్తూ వచ్చాము. వచ్చి వచ్చి ఇప్పుడు చివరిసారిగా పన్నెండవ ఆదిత్యుడి ప్రకాశ మెలాంటిదో దాన్ని కూడా తడవబోతున్నాము. అయితే ఒక మాట. ఆ పదమూడుమంది పంధా వేరు. ఈ కడపటి ఆయనగారిది వేరు. దానికీ దీనికీ సంబంధం లేదు. కారణం అది పద్యకవిత్వమైతే ఇది గద్య కవిత్వం. అది పురాణేతిహాస ప్రబంధ కధా భేద భిన్నమైతే ఇది అలాంటి సంప్రదాయానికి చెందినది కాదు. కేవల మొక మనోహరమైన కధా కధనాత్మకమైన రచన. అవన్నీ చాలావరకూ శృంగారరసాది మయమైతే ఇది ఒక నీతి ప్రధానమైన రసవత్కావ్యం.

ఎవరిదీ రచన ఎవరా మహాపురుషుడని అడగవచ్చు మీరు. ఎవరోగాదాయన శ్రీమాన్ పరవస్తు చిన్నయసూరి. 19వ శతాబ్ది పూర్వార్ధంలో జన్మించి ఉత్తరార్ధం వచ్చీ రాకముందే కన్నుమూసినవాడు. ఎన్నో గ్రంధాలు వ్రాయతేదనేగాని ఎన్నో వందలు వేల గ్రంధాలు చదివి ఆపోశనం పట్టినవాడు. తమిళదేశంలో జన్మించిన తెలుగువాడు.

చెంగల్పట్టు జిల్లా శ్రీ పెరంబుదూరు వాసి. అప్పుడప్పుడే ఆంగ్లేయులు వ్యాపారరీత్యా వచ్చి మనదేశంలో స్థిరపడుతున్నారు. వారితోపాటు వారి భాషా సంస్కృతీ మతం ప్రచారంలోకి వస్తున్నాయి. అవి మన పండితుల మనసుల మీద ప్రభావం చూపుతూ వచ్చాయి. ఇదీ అదీ మన రచయితలు కొందరిలో క్షీరనీర న్యాయంగా కలిసిపోయి తమ అస్తిత్వాన్నే కోలుపోతే - ఒకరిద్దరిలో తిలతండుల న్యాయంగా కలిసి వారు తమ ప్రత్యేకతను చాటుకొంటూ వచ్చారు. అలా చాటుకొన్న మొదటి మహా విద్వాంసుడూ కవితల్లజుడూ చిన్నయసూరి. మల్లినాథ సూరి అన్నారు చిన్నయసూరి అన్నారు. సూరి అనే శబ్దం తమ పేరుతో పెనవేసుకొన్న మహా మహోపాధ్యాయలు నిజానికి వీరిద్దరే మన ఆంధ్రదేశంలో.

సూటికి నూరుపాళ్లూ సంస్కృతాంధ్ర భాషా స్వరూపం తలస్పర్శిగా పట్టిచూచినవాడు. లక్ష్యగ్రంథాలెంత మథించాడో లక్షణ గ్రంథాలనూ అంతగా ఆకళించినవాడు. వ్యావహారమైన నుడికారమెంత పరిశీలించాడో శబ్ద పరిశుద్ధినంతగా పాటించినవాడూ కావ్యరస స్ఫూర్తికేగాక తదీయౌచిత్యానికి కూడా అంత పెద్ద పీటవేసినవాడూ. ఇంతెందుకు. భాషా వాఙ్మయాలను రెండింటినీ తనివితీర ఆస్వాదించి దాని మాధుర్యాన్ని మరల సహృదయ లోకానికందించిన విద్వత్కవి చంద్రుడూ చిన్నయసూరి. భాషా సాహిత్యాలలో పరీక్షపెట్టి ఆరోజులలో ఇంతకంటే గొప్ప విద్వాంసుడు లేడని ఆర్భతునాటు లాంటి బ్రిటీషు దొర లొసంగిన గొప్ప బిరుదు సూరి అనే దాయనకు. వారే **The Pandit of the 19th Century** అని కూడా ప్రశంసించారు ఆయనను. సంస్కృతాంధ్ర తమిళ భాషలనేగాక ఆంగ్లభాష కూడా వారి

సాహచర్యంతో చక్కగా అభ్యసించినవాడు. వారి భాషా వాఙ్మయాలలోని పోకడ బాగా గమనించి అందులోని మంచిని సేకరించి అలాగని మన సంప్రదాయాన్ని ఏమాత్రమూ విస్మరించ కుండా రెంటినీ ఆరోగ్యకరంగా మిళితం చేసి ఒక రసాయనాన్ని తయారుచేశాడు చిన్నయసూరి. అదే ఆయన నయగారితనం. అది ఎలాగో కొంచెం మనవి చేస్తామ మొదట. వినండి.

ఆంగ్లేయులలో గొప్పతన మేమంటే వారు పద్య కావ్యాలెంతగా రచించారో గద్య రచనలో కూడా అంత శ్రద్ధ చూపారు. **Poetry and Prose** రెండూ జోడుగుఱ్ఱాల లాగా సాగిన వాఙ్మయమది. అది గమనించాడు చిన్నయసూరి. మనవాళ్లు మొదటినుంచీ పద్యకావ్యాలేగాని వచన గ్రంథాల మీద శ్రద్ధ చూపలేదు. ఒకవేళ మహాభారతం దగ్గరి నుంచీ కేవలం పద్యమేగాక గద్యం కూడా విడవకుండా పట్టుకు వచ్చినప్పటికీ అది గద్యమే గాని వచనం కాదు. అంటే అర్థం పద్యంలాగా సాగిన గద్యం. అందుకే గద్యమన్నాను దాన్ని. వచన మనటం లేదు. వారు అక్కడక్కడా రచించిన గద్యాన్నే వచనమను కోవాలి మనం. అదైనా నన్నయ దగ్గరినుంచీ మొదటి మొదటి కవులంతా కేవల పద్య ప్రబంధాల ధోరణిని గాక చంపూకావ్య ధోరణి ననుసరించాలని సంకల్పించి ఆ మార్గంలో తమ రచనా ప్రక్రియ సాగించటం వల్ల సుమా. 'గద్య పద్యోభయమయం చంపూరీత్య భిధీయతే' అని ఆలంకారికుల మాట. గద్యపద్యాత్మకంగా సాగిన కావ్యానికి చంపూ కావ్యమని పేరట. కన్నడం తమిళం మొదలైన తోడి దాక్షిణాత్య భాషలలో అలాగే సాగుతూ వచ్చిన రచనలు చూచాడు నన్నయభట్టు. అది కూడా ఆయన చంపూ రచనా

ధోరణికి దోహదం చేసి ఉండవచ్చు. ఆదికవి చుట్టిన ఈ శ్రీకారాన్ని వదిలితే ఏమి ప్రమాదమోనని అలాగే సాగిస్తూ వచ్చారు సూరిగారిదాకా కవి అనిపించుకొన్న ప్రతి ఒక్క రచయిత.

కవులేమిటి. ఆ మాటకు వస్తే శాస్త్రగ్రంథాలు వ్రాసిన వారేమి తక్కువా. తెలుగులో వైద్య జ్యోతిషాది శాస్త్ర గ్రంథాలను రచించిన వారందరూ చంపువులు కూడా కాదు. అంతకన్నా నాలుగాకు లెక్కువ చదివి సరాసరి పద్యాలలోనే వ్రాస్తూ వచ్చారు పుస్తకాలు. శాస్త్రాలేమి వచ్చె – ఆఖరుకు వ్యాకరణాలూ నిఘంటువులు కూడా పద్యాలలోనే. వచనంలో కాదు. ఆంధ్ర నామ సంగ్రహంలాంటి నిఘంటువులు పద్యాలలోనేగా కనిపిస్తాయి. సీతారామాంజనేయ మనే వేదాంత గ్రంథం మాటేమిటి. పద్యంలోగాక వచనంలో ఉందా అది. అందులో అక్కడ కూడా వచనం వ్రాసినా అది వచనం కాదు. ముందు చెప్పుకొన్న గద్యం.

ఇలా అన్నీ పద్యాలూ పద్యాలలాగా సాగిన గద్యాలే తప్ప చక్కగా తీర్చిదిద్దిన వచన గ్రంథమే తెలుగులో లేకపోవటం ఒక పెద్ద కొఱతగా భావించాడు చిన్నయసూరి. కనీసం నిఘంటువులూ వ్యాకరణ గ్రంథాలకైనా పద్యమనే చెఱ విడిపించి స్వేచ్ఛను కల్పించాలని చూచాడు. దాని కాంగ్లేయుల నిఘంటు వ్యాకరణాల ధోరణి ఎంతగానో తోడ్పడిం దాయనకు. అయితే అలా తన ఉద్యమం సాగించాలంటే మాటలు గాదు. భాషా రంగంలో ముందు తాను నూటికి నూఱుపాళ్లూ ప్రామాణికు డనిపించుకోవాలి. అనిపించుకోవాలంటే ఇటు లోకాన్ని అటు వాఙ్మయాన్ని రెండింటినీ తలస్పర్శిగా మథించగలిగి ఉండాలి. అప్పుడే తానొక వ్యాకరణం రచించినా నిఘంటువు రచించినా దానికి ప్రామాణ్య

మేర్పడుతుంది. ఇది ఎంతగా ఆయన మనసులో మధన పడుతూ వచ్చాడో ఆయన తన బాలవ్యాకరణ పీఠికలో వ్రాసిన కొన్ని పంక్తులు చూస్తే మన కర్థమవుతుంది. 'కాబట్టి యిట్టి కొఱత వారింపఁబూని పెక్కు లక్ష్యములు పలుమాఱు సావధానముగాఁబరిశీలించాడట. ఇది సమగ్రమైన నిఘంటువు కోసం ఆయన చేసిన కృషి అయితే – 'భాషా సమష్టికి లక్షణ గ్రంథము కుదిరిన పక్షమందంత శ్రమపడబని లేదు. తుదకు లక్ష్యపరిజ్ఞానము చాలని లక్షణ పరిజ్ఞాన మంత శ్లాఘ్యము గాదు గాని తుదముట్ట సర్వలక్షణ పరిజ్ఞానము లక్ష్య పరిజ్ఞానము చేతనే సాధించుట మిక్కిలి దుష్కరము. ఇది ఆయన సమగ్ర వ్యాకరణ నిర్మాణం కోసం పడ్డ తాపత్రయాన్ని సూచిస్తుంది.

మొత్తంమీద ఏ భాషలోనైనా ఒక ప్రామాణికమైన రచన చేయాలంటే – ఆ మాటకు వస్తే అది పద్యమే కావచ్చు. గద్యమే కావచ్చు. ఆ భాషను కూలంకషంగా పరిశీలించి ఉండాలి రచయిత. ఒకప్పుడు తిక్కన మహాకవి ఆ పని చేశాడు. మరలా పరవస్తువారు అలాటి భారమే పూనవలసి వచ్చింది. మరి ఇలాటి కార్యభారాన్ని ఎలా తన భుజస్కంధాల మీద మోపి అందులో అనితర సాధ్యమైన విజయాన్ని సాధించగలిగాడో ఆలోచిస్తే మనకందరికీ చాలా ఆశ్చర్యం గొలుపుతుంది. ఇంతెందుకు. ఆనాటి ఆంధ్రనామ సంగ్రహాదులే గావు. నిన్న మొన్నటి బ్రౌణ్య శబ్దరత్నాకరాదులే గావు. ఏన్నైనా ఉన్నాయి చెప్పుకోటానికి తెలుగులో నిఘంటువులు. కాని చిన్నయసూరి నిఘంటువు ముందవి అన్నీ బలాదూరు. వీరందరూ సంస్కృత శబ్దాలనూ అచ్చ తెలుగు శబ్దాలనూ రెంటినీ కలగలిపి నిఘంటువులు వ్రాస్తే సూరిగారలా కాక కేవల మాచ్చిక

పదాలనే తీసుకొని వ్రాస్తూ వచ్చాడు. ఎందుకంటే సంస్కృత శబ్దాలకు మనం దేనికి వ్రాయటం. ఆనాటి అమరం విశ్వం దగ్గరి నుంచీ మోనియరు విలియమ్సు. వాచస్పత్యం లాంటి నిఘంటువు లెన్నో కుప్ప తెప్పలుగా ఉన్నాయి. మళ్లీ మనవాళ్లు వాటిని పునరుక్తం చేయటం దేనికి. పనిలేని పని. చేతనైతే మన భాషలో సహజంగా ఏర్పడ్డ తెలుగు మాటలేవో ఆంధ్రదేశం నలుమూలలా ఎవరెవరి నోట మెదుల్తున్నాయో ఆరా తీయగలగాలి. అలాగే ఆంధ్రవాఙ్మయంలో వెలువడిన ప్రతి కవి కావ్యాన్నీ ఆమూలాగ్రమూ పరిశీలించి చూడాలి. ఇవీ అవీ అన్నీ ఏమాత్రమూ బీరు పోకుండా పోగు చేసుకొని వాటి నొక అకారాది క్రమంలో పెట్టి ఆంగ్లేయులు సాధించిన రీతిలో మనమూ సాధించి చూపగలిగినప్పుడే నిఘంటు రచనకు సమగ్రత అని సూరిగారి పట్టుదల.

ఇది ఆయన ఎంత గొప్పగా సాధించాడంటే ఈనాడు క్రొత్తగా ఎంతో సమగ్రంగా వ్రాసి పడేశామని భావించే సూర్యరాయాంధ్ర నిఘంటువు వారికి కూడా అంతు పట్టని మాటలూ వాటి అర్థాలూ – ఇంతమంది మేధావంతులైన నిఘంటు కారులూ తరచుగా సూరిగారి నిఘంటువును చూచి అక్కడి నుంచి సంగ్రహించి ఆయనగారు చెప్పిన అర్థమే అసలైన అర్థమని ఉదాహరించవలసి వచ్చింది. వచ్చిందంటే ఇంతమంది పండితులిన్ని వసతులుండి కూడా సాధించలేని బృహత్కార్యమాయన ఒక్కడూ అంతగా ముద్రణాది సౌకర్యాలు లేని కాలంలో సాధించగలిగాడంటే ఎంత గొప్ప. సరిగా **Samuel Johnson** అనే ఆంగ్ల పండితుడు గుర్తు వస్తాడు ఈ సందర్భంలో. 40మంది ఫ్రెంచి విద్వాంసులు కూర్చొని 40 ఏండ్ల కొక ఫ్రెంచి నిఘంటువు

వ్రాస్తే నాలుగేండ్లలోనే అంతకన్నా గొప్పగా వ్రాయగలిగాడు ఇంగ్లీషు భాషకొకే ఒక ఆంగ్లేయుడు తాను. సరిగా సూరిగారి లాంటి వాడాయన. ఈయనకు **Pandit of the 19th Century** – లాగా ఆయనకు కూడా **The dictator of the 18th Century** - అని బిరుదు.

ఏదైనా సరే తలస్పర్శిగా ఉండాలి. సర్వం కషంగా ఉండాలి. ఏ ఉద్యమం చేపట్టినా పట్టువదలని విక్రమార్కుడిలాగా దాని అంతు చూడాలనే దీక్ష చిన్నయసూరిది. సదా పశ్యంతి సూరయః – అని శాస్త్రం చెబుతున్నది. సూరి అంటే ఏ విషయమైనా ఆమూలాగ్రమూ కొఱత లేకుండా దృష్టిపెట్టి పరిశీలించే వాడెవడో వాడే చిన్నయసూరి. సూరి అయ్యాడంటే ఇలాంటి నిర్వచనానికి నిలబడినవాడు గనుకనే. అందుకే అన్నాడేమో ఇట్టి కొఱత వారింపబూలని పెక్కు లక్ష్యములు పలుమాఱు సావధానముగాc బరిశీలించి' అని ఆ ధైర్యంతోనే ఆ బలంతోనే వ్రాయబూనాడొక నిఘంటువూ ఒక వ్యాకరణమూ తెలుగుభాషకు. నిఘంటువనేది భాషలో ఉండే అన్ని శబ్దాలకూ అర్థాలు ఫలానా అని నిర్ణయిస్తే – వ్యాకరణం ఆ శబ్దరూపాల సాధుత్వా సాధుత్వాలు నిరూపిస్తుంది. భాష అంటే శబ్దార్థాల సముచ్చయమే గదా. అవి రెండూ ఎప్పుడా మూలగ్రమూ ఆకళించు కొన్నాడో రచయిత – అప్పుడిక ఆ భాషా స్వరూప జిజ్ఞాసువులందరినీ చక్కని రాజమార్గంలో నడపగలుగుతాడు. ఆ భాషాభిజ్ఞులందరికీ పరమ ప్రామాణికుడని పించు కొంటాడు. శ్రద్ధేయ వచనుడు కూడా అవుతాడు భగవత్పాదులు చెప్పినట్టు.

ఇలాంటి శబ్దార్థ పరిజ్ఞాన మక్షరాలా ఎంతమోతాదులో ఉండాలో అంత మోతాదులోనూ లేశ మాత్రమైనా వెలితిపడకుండా ఆర్జించిన

మహా విద్వాంసుడు సూరి. ఒక సమగ్రమైన నిఘంటువు నిర్మించాలనే దీక్ష పూనటంలోనే తెలుస్తుందసలాయన భాషాజ్ఞాన మెంత తల స్పర్శి అయినడో. అది కూడా సంస్కృత తత్సమ పదాలకు గాక వాటిని సంస్కృత నిఘంటుకారులకే వదిలేసి కేవల మచ్చ తెనుగు శబ్ధాలనే సేకరించి వాటినకారాది క్రమంలో పెట్టుకొని వ్రాయటంలోనే తెలుస్తుంది మనకాయన చూపెలాటిదో. అచ్చతెనుగులంటే అవి నామాలే కాదు. సర్వనామాలే గాదు. విశేషణాలేగాదు. ధాతువు లేగాదు. అవ్యయాలే గాదు. అన్నీ జారిపోకుండా పోగు చేసుకోవాలి. అందులో ధాతువులను మాత్రం వేఱుచేసి పాణిని మహర్షిలాగా ఒక ధాతుమాలను సృష్టించాడు. వాటికి ప్రామాణికంగా ఉండాలని సంస్కృత భాషలో అర్థాలు వ్రాశాడు. అందులో కూడా ఎన్ని అర్థచ్ఛాయలుంటాయో ధాతువులకన్నీ వివరిస్తూ పోయాడు. ఇక మిగిలిన శబ్దరాశి కంటారా చెప్పనలవి గాదాయన కృషి. తుదకు బాలవ్యాకరణంలోనే కొన్ని పదాల కక్కడక్కడా ఆయన ఇస్తూపోయిన అర్థాలు చూస్తేనే మతిపోతుంది మనకు. ఎంత ప్రమాణ బుద్ధి ఉన్న పండితోత్తముడా అని ఆశ్చర్యం గొలుపుతుంది. తానెంత భాషా సాగరాన్ని మథించాడో దాని ఆచూకీ పాఠకుల కివ్వాలని కుతూహల మాయనకు. అందుకే కొన్ని మనకందరికీ తెలిసిన పదాలు దాహరించి మామూలుగా ఎవరూ అంతగా గమనించి ఉండని ఎన్నో క్రొత్త మాటలు కూడా ఉదహరిస్తూ పోతాడు.

మచ్చుకు ఆయన వ్యాకరణంలోనే పేర్కొన్న కొన్ని శబ్ద రూపాలే ఉదాహరిస్తాను చూడండి. జొన్న జోలి అని జొకు అని ఒక క్రొత్త శబ్దమిస్తాడు. చుక్రిక అని ఒక సంస్కృత శబ్దమిస్తాడు. అంటే

చింతపండని అర్థం. దంట దాటుదంట క్రొత్త మాట. దాటు ధాతువు గాదు నామం. పంక్తి అని అర్థం. అలాగే మిరా నిభః తమంగః విలక్షణమైన సంస్కృత పదాలు. హద్దు – నెపము పీఠమని అర్థాలు. అరణమనే తెలుగు మాట హరణంలో నుంచి – పనస అనేది పంచాశత్ నుంచి తోరమనేది స్థూలం నుంచి వచ్చిందని చెబుతుంటే మామూలు వాడికి క్రొత్తగా కనిపిస్తుంది. ఆళిః అనేది ఓలి అయిందంటూ పంక్తో అంటాడు. పంక్తి అనే అర్థంలోనే సుమా. మరే అర్థం. చెలికత్తె అనే అర్థంలో కాదని హెచ్చరిక. అలాగే మీదు కడ మీగడ అయిందట. వంక చెఱగు వంజెఱగు – సగము కోరు సంగోరు అయిందంటాడు. మరి దాత నేత అనేగాక దాతృడు నేతృడు అనే రూపాలు కూడా ఉన్నాయని తెలియదు మనకు. మీన సత్రా అనవలసిందే గాని మీన నేత్రి పద్మనేత్రి అనరాదట. కయిర కత్తళ జన్ననీల. ఇవి జంతు విశేషాల పేర్లు. గొంటు తుంటు గిండు ఇవి ఏమిటో తెలియదు. కొఱను నెఱను వరను – క్రొత్త మాటలు. అసలు 'అక్కటాదులజడ్డకు లోపంబగు' ననే సూత్రం క్రింద ఆయన ఇచ్చినవి దాదాపు 80, 90 తెలుగు పదాలు. ఎందుకన్ని. వాగ్న్యాయం కదా వైయాకరణుడికి. అంటే అందులో సగం తెలిసిన పదాలైతే సగం ఎవరికో గాని తెలియనివి. అందు కువ్వాడము మత్తాబు బొమ్మికము మొక్కరము మొగ్గరము – ఇలా ఎన్ని ఉన్నాయో. అందులోనూ జడ్డ ఉన్న రూపాలూ రెండూ లేని రూపాలూ చూచి ఉండాలాయన. వాఙ్మయంలో ఉన్న అన్ని కావ్యాలూ కంట్లో వత్తి పెట్టుకొని చూస్తేగాని వాటన్నిటినీ ఉదాహరించలేడు. అందులో కూడా అట్టికకూ అట్టుకకూ – ఇట్టికకూ ఇట్టుకకూ – నెట్టికకూ మెట్టికకూ –

రూపభేదమే గాక అర్థభేదం కూడా తెలిసి ఉండాలి. ఇలా ఎన్నని ఉదాహరించమంటారు. అసలు సర్వనామాలలో ఒకడు ఒకతి అనే సంఖ్యావాచకాలకు ఎన్ని రూపాంత రాలిచ్చాడో ఆశ్చర్యం.

ఇదంతా ఒక యెత్తు. ఆయా శబ్దాల కాయన అర్థాలు చెప్పటం ఒక ఎత్తు. ఎంతో నిష్కర్షచేసి ప్రామాణికంగా చెబుతాడు అర్థం. మరొకరెవరైనా చెబితే గురికి మూరెడు బారెడు ఎడంగా చెప్పి తప్పించు కొంటారు. ప్రామాణికంగా ఉండదు. చూడండి. ఏలిక అనే మాటకు పాలకుడని అర్థమిస్తాడు. ఏలేవాడు ఏలిక – పాలించేవాడు పాలక. ఎంత బాగుంది. ఇది ప్రభువని అర్థమిస్తే అంత బాగుండదు. ఓడిక అంటే ప్రోతస్సని అర్థమిస్తాడు. ఓడటమంటే స్రవించటం. అలాటి అర్థమిచ్చే మాటే స్రోతస్సు. మరి మొలక అంటే నవోద్భిదమట. క్రొత్తగా మొలచినదని అర్థం. 'అంకురస్తు నవోద్భిది' అని అమరం. ఎంత ప్రామాణ్య బుద్ధి ఉండాలో చూడండి శాస్త్రజ్ఞుడికి. పెండ్లమంటే ఊఢ అని వ్రాస్తాడు. భార్య అని వ్రాయవచ్చు. కాని వ్రాయడు చిన్నయసూరి క్రొత్తగా పెండ్లి అయినది ఊఢే భార్య కాదు – శబ్దవ్యుత్పత్తికి తగి నట్టుండాలి అర్థం.

ఇంతెందుకు తెలుగు భాషమీదనే గాదు – సంస్కృత భాష మీద కూడా సమానమైన అధికార సంపత్తి ఉన్నవాడు చిన్నయసూరి. నీతిచంద్రికలో ఒకచోట. 'మరణ మాపాత యాతనా వహాము – దారిద్ర్యము యావజ్జీవము తీవ్రలేదనాకర'మని వ్రాస్తాడు. ఇందులో ఒకచోట యాతన మరొక చోట తీవ్ర వేదనా' అని ప్రయోగించి వాటి అర్థాన్ని ఎంత వ్యంగ్యంగా సూచిస్తున్నాడోచూడండి. యాతనా అంటే

తీవ్రమైన వేదనే. 'యాతనా తీవ్ర వేదనా' అమరసింహుడు స్పష్టంగా వ్రాశాడు తన అమరకోశంలో. అది ఎంత సంస్కారంలో ఉందో సూరిగారికి. మరి కటాక్షోఽపాంగదర్శనే అని అమరం. కటాక్షమంటే కడకంటి చూపు. ఆ అర్థంలో కటాక్షమంటేనే సరిపోతుంది కటాక్ష వీక్షణమని మరలా ప్రయోగించరాదు. అది పునరుక్తి అవుతుంది. ఇది ఎంతగా పాటిస్తాడో చూడండి పరవస్తుగారు. 'కటాక్షంబుల నంగీకరించుచు అని ఒకచోట 'దేవాతాపకంబగు నపాంగావలోకంబున కుంబాత్రంబయిన' అని ఒకచోట పునరుక్తి లేకుండా ప్రయోగిస్తే ఎంతో ముచ్చట గొలుపుతుంది నిజమైన భాషావేత్తలకు. ఇది మరి ఎవ్వరిలో గానరాదీ విచక్షణత.

ఇంతెందుకు. విషయమనే శబ్దమే తీసుకొని చూడండి. నీకేఈ విషయం తెలుసా - ఇది చాలా గొప్ప విషయమని ఇలా మనం మామూలుగా వాడే మాట. లోకులే గాదు. పండితులు కూడా. ఇది ఇలాగే వాడుతుంటారు. **Matter** అనే అర్థంలోనే ప్రయోగిస్తుంటా రందరూ ఈ సంస్కృత శబ్దాన్ని. కాని నిష్కర్ష చేసి చూస్తే దీని అసలైన అర్థం వేరు. మన ఇంద్రియాలకూ మనస్సుకూ గోచరించే దేదో అదీ విషయమనే మాట కర్థం. పోతే విషయమంటే దేశమని కూడా ఒక అర్థముంది. సరిగా సూరి ఈ రెండర్థాలలోనే ప్రయోగిస్తాడీ శబ్దాన్ని. **Matter** సంగతి అనే అర్థంలో ఎప్పుడూ ప్రయోగించడు. మరి ఏమని ప్రయోగిస్తాడా అర్థం చెప్పవలసి వస్తే, విషయానికి బదులు అర్థమనే శబ్దం వాడుతాడు. 'మూఢులీ యర్థమెఱుగక' - అంటే ఈ విషయం తెలియక అని ఆయన ఉద్దేశం. 'ఈ యర్థంబు సర్వ సమ్మతంబు'

అంటే ఈ విషయం అందరికీ ఇష్టమే. ఎక్కడైనా చూడండి. ఇలాగే ఉంటుందాయన ప్రయోగం. విషయమంటే దేశమని కూడా ఉంది గదా అర్థం. ఆ అర్థంలో నైతే బాహాటంగా వాడుతాడు మరలా. 'రాజన్వంతం బగు విషయంబున వసియించు చున్నారము.' అసలు సంగతి అనే మాట కూడా కబుర్లనే అర్థంలో వాడడు. సంగతి అనేది సంస్కృత శబ్దం. దాని అర్థం స్నేహమూ లేదా మైత్రి. అదే అర్థ:లో మడికట్టుకొని ప్రయోగిస్తాడా శబ్దాన్ని. 'ఈతని సంగతి నాకు సరిపడదు' సహవాసమని అర్థం. కబురని గాదు.

అసలు సంస్కృతమేమిటి తెలుగేమిటి. ఏ శబ్దానికేది అసలైన అర్థమో అది ఎలా ప్రయోగిస్తే ప్రామాణికమో ఆయనకు తెలిసినట్టివరికీ తెలియదు. 'సంజీవకుని భూత భవంతి వర్తనము' లంటాడొక చోట నీతిచంద్రికలో. ఈ వాక్యం చదివినప్పుడల్లా ఇదివరలో నేను చాలాకాలమొక అపోహ పడుతూ వచ్చాను. భూత భవంతి వర్తనము లంటే భూత భవిష్యద్వర్తమానాలను కొనేవాణ్ణి. తరువాత తరువాత అర్థమవుతూ వచ్చింది. వర్తనమంటే వర్తమాన కాలమెలా అవుతుంది. ప్రవర్తన మని గదా అర్థం. అలాంటప్పుడిక భూత భవంతి అనే రెండు మాటలకేమిటి అర్థం. భూతమంటే భూతకాలం సరిపోయింది. మరి భవంతో, భవంతి అంటే తప్పకుండా వర్తమాన కాలమయి ఉండాలి. ఎందుకంటే దమనకుడు సంజీవకుని మీద సాడీలు చెబుతున్నాడు పింగళకుడికి. అది అతని గత జీవితమూ వర్తమాన జీవిత విషయమే గాని భవిష్యత్తు కావటానికి వీలు లేదు. ఎందుకంటే అతని ప్రవర్తన జరిగిన జరుగుతున్నదే గదా చెప్పాలి ఆ జంబుకం. రాబోయేది ఇంకా

రానేలేదుగా ఎలా చెప్పటం. అందుకే వర్తనమన్నాడు. అది భూతానికి చెందినది కొంత అయితే వర్తమానానికి చెందింది మరి కొంత కావలసి ఉంది. కాబట్టి భవంతి అంటే తప్పక వర్తమానమే కావలసి ఉంది. వర్తమానకాలమనే అర్థమెక్కడ ఉంది ఆమాటకు. ఉంది. మామూలుగా ఎవరికీ తెలియదు. కాని చిన్నయసూరికి తెలుసు. ఏమిటది. ఎక్కడ ఉంది. సిద్ధాంత కౌముది చివర చివర ఉత్తర కృదంతాలలో 'భవంతి ర్వర్తమానకాలః' అని అర్థం కూడా వ్రాయబడి ఉంది. అక్కడే జయంతిః అవంతిః ఇలాంటి రూపాలన్నీ కనిపిస్తాయి మనకు. ఎంత చూపో చూడండి సూరిది. పైగా ఇంత అర్థం లోపల దాచుకొని పైకి భూత భవంతి వర్తనములని అనటంలో అవి మూడూ భూత భవిష్యద్వర్త మానాలే అయి ఉంటాయనే భ్రమ కల్పిస్తాడు మనకు. ఇదీ ఆయన ప్రౌఢి.

ఇలాంటి ప్రౌఢే దక్షిణ తారం ఉత్తర తారమనే ప్రయోగాలలో కూడా మనకు ప్రదర్శిస్తాడు. తారమంటే తీరమని అర్థం. మరి రాజ వంత మనకుండా రాజన్వంతమైన విషయమన్నాడంటే ఎంత ప్రౌఢి అది. 'రాజన్వాన్ సౌరాజ్యే' అని సంస్కృత వ్యాకరణ సూత్రం. మంచి ప్రజాను రంజకుడైన రాజుగారి రాజ్యానికి రాజన్వంత మని పేరు. ఇది ఎలా గమనిస్తాడో ఎక్కడ దాన్ని ప్రయోగిస్తాడో చూడండి. ఇద్దరు వర్తకులు విదేశాలలో సాలిబేరం సాగించి బాగా డబ్బు గడించి స్వదేశానికి వస్తారు. ఈ డబ్బు మన దగ్గర ఉన్నదని ఎవరికీ తెలియదు. ఒకవేళ తెలిసినా భయం లేదు. మనదేశమేలే రాజు ధార్మికుడు. అలాటి వాడి రాజ్యంలో ఎవడూ దొంగతనం చేయ సాహసించడని అంటారు. ఎలాటి

సందర్భమో చూడండి అలాటి శబ్ద ప్రయోగానికి. మరి విభక్తి అనే మాట ఎక్కడైనా ప్రయోగించాడంటే ఎంత జాగ్రత్త పడతాడో చెప్పలేను. మనం మామూలుగా ప్రధమావిభక్తి ద్వితీయా విభక్తి అని ఇలా లూజుగా వాడుతూ పోతాము. మనమేమిటి. ఆ మాటకు వస్తే నన్నయాదులైన గొప్ప భాషా వేత్తలు కూడా అలాగే ప్రయోగిస్తారని చెప్పినా ఆశ్చర్యం లేదు. కాని అది తప్పు ఆ ప్రయోగం. విభక్తి అనేది సంస్కృతంలో స్త్రీ లింగ శబ్దం. దానికి ముందు ప్రధమ ద్వితీయ అని పూర్వపదం వ్యస్తంగా ప్రయోగిస్తే ప్రధమా విభక్తిః అని ప్రయోగించాలి. అయితే అది సంస్కృతంలోనే తెలుగులో కాదు. మరి తెలుగులో అయితే వ్యస్తంగా కాదు సమస్తంగా ప్రయోగించాలి. ఎలాగా. ప్రధమ విభక్తి ద్వితీయవి భక్తి ఇలాగా. కాని అటూ ఇటూ కాకుండా ప్రధమా విభక్తి అని తెలుగు లోనే సమస్తంగా ప్రయోగిస్తారు పండిత పామరులందరూ. అయితే మరి ఆయనగారెలా ప్రయోగిస్తాడని అడగండి. వ్యస్తం చేసి ప్రయోగిద్దామా అది తెలుగు కాదు. సంస్కృతం. పోనీ ప్రధమ విభక్తి ద్వితీయ విభక్తి అని సమస్తం చేసి ప్రయోగిద్దామా అది సలక్షణమే గాని తెలుగు నుడికారానికీ లోకంలో ప్రసిద్ధికీ అది ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. తెచ్చిపెట్టుకొన్నట్టుంటుంది. మరి ఏమిటి పరిష్కారమని ఆలోచించి ఎక్కడైనా అలా ప్రయోగించాలనిపిస్తే విభక్తి అనే మాట రానీయకుండా కేవలం ప్రధమ - ద్వితీయ తృతీయ అంటూ వస్తాడు. ఒకవేళ విభక్తి చేర్చి పలకాలంటే ప్రధమాది విభక్తులు ద్వితీయాది విభక్తులని మధ్యలో ఆది అనే మాట ఒకటి దూరుస్తాడు. దానితో తద్దోష పరిహారమయి పోతుంది. చూచారా ఎంత గడుసుదనమో.

పోతే అకార మికార ముకారమని అచ్చుల మీద దేనిమీదనైనా రావచ్చు కార అనే ప్రత్యయం. అదే హల్లు మీద అయితే అకారాంతమైన హల్లు మీదనే రావాలి గాని మరే అజంతం మీదా రాగూడదు. అంటే కికారం కుకారమని గాని మికారం ముకారమని గాని అనగూడదు. ఒకవేళ అలా అనవలసి వస్తే కివర్ణం కువర్ణమని వర్ణ శబ్దం కడపట చేర్చి పలకాలి. ఇదీ సంస్కృత వ్యాకరణ నియమం. ఇది ప్రౌఢ వ్యాకరణ కర్తే పాటించిన వాడు కాదు. ఇక ఇతరుల మాట చెప్పేదేముంది. ఈ నియమ మక్షరాలా పాటించిన మహానుభావుడు చిన్నయసూరి.

సంస్కృతాభిజ్ఞమ్మన్యుల సంగతే ఇలా ఉంటే ఇక మన తెలుగు భాషావేత్తలను కొన్నే వారి సంగతి చెప్పకండి. నెఱకూ నెఱికీ తేడా తెలియదు. మెట్టికకూ నెట్టికకూ తెలియదు వీరికి. శకట రేఫము తత్సమాలలోనే గాదు తద్భవాలలో గూడా లేదని సూరిగారు తీర్మానం చేశాడంటే ఎంత లోతైన భాషా పరిశ్రమో ఆయనది చెప్పనలవిగాదు. తేపు మాపు అనే తెలుగు శబ్దాలే చూడండి. ఎంత చిత్రమో. రెండూ కలిపి ప్రయోగిస్తే ఉదయాస్తమయాలని అర్థం. ముసలమ్మలకు తెలుసు ఈ విషయం. ఊరక తేపు అంటే అది ఉదయమైనా కావచ్చు లేక మరుసటి రోజైనా కావచ్చు. తరుచుగా మరునాడు అనే అర్థం లోనే వాడుతాము మనం. సూరిగారి గడుసుతనమెలా ఉందంటే 'నిన్న మాపో నేడు తేపో' అని చిత్రంగా ప్రయోగిస్తాడాయన. నిన్న మాపంటే నిన్నటి రాత్రి. మరి నేడు తేపో అంటే. ఇవాళ ఉదయమని చెప్పక తప్పదు. లేకుంటే నేడు తేపు రెండూ **Overlap** అవుతాయి. అలాగని తేపంటే రెండోరోజని అర్థం తెలియదా ఆయనకు. ఆయనకు తెలియక పోవట

మేమిటి. నవ్విపోతారు. 'నేడు నీకయినది తేపు మాకయ్యేడునని ఆ అర్థంలోనూ ప్రయోగించి చూపగలడు. ఇంతకూ తేపు అనే తెలుగు శబ్దానికున్న రెండర్థాలూ పాఠకులకు తెలపాలని ఆయన తాపత్రయం.

ఇంకా ఒక ప్రయోగ చాతుర్యముందాయనలో. అవుడు - అవుదు - అయిరేని - ఇలాంటి పదాలలో అవు అయి అనే రూపాలకు ఔ-ఐ అనే రూపాలు వైకల్పికంగా చెప్పుకోవచ్చు. కాని అవి మనం మామూలుగా అనుకొనే మాటలుగావు. అర్థాలు కావు. అవుడు అంటే మీరలా కాండి అని గాదు. పెదవి అని అర్థం. అవుడు అంటే నేనలా అవుతానని కాదు. కాలువ అని అర్థం. అలాగే అయిరేని అంటే వారలా అయినట్లయితే ననిగాదు. పెండ్లిలో నాగవల్లినాడు వాడుకొనే రంగు పూసిన కుండలను ఐరేని కుండలంటారు. అదీ అర్థం. పైకి చూస్తే మనకు మొదటి అర్థాలే స్ఫురిస్తాయి. కాని లోతుకు దిగి చూస్తేగాని అసలైన అర్థం బోధపడదు. ఇలాంటి చమక్కులెన్నో చెప్పలేను. అసలు కృదంత ప్రకీర్ణక పరిచ్ఛేదాలలో ఆయన ఉదాహరించిన తెలుగు మాటలూ వాటి రూపాంతరాలూ చాలామంది తెలుగు వాళ్లకే - ఆ మాటకు వస్తే ఆంధ్ర భాషా భిజ్ఞులమని విర్రవీగే పండితమ్మన్యుల పాండిత్యానికే ఒక పెద్ద పరీక్ష. నాడెమనే మాట ఒకటి చాలు. నాడెం అంతే కాసు అని అర్థం చెప్పుకొంటాము మనం. అది కాదు అర్థం. 'లోకులు మెత్తురా - నా నాడెము దక్కునా' అంటాడొక బేహారి మరొక బేహారితో మిత్రభేదంలో. ఏమిటి నాడెమంటే. వ్యాపారం వర్తకమని అర్థం. ఎక్కడో తమిళనాడులో తెలుగు వైశ్యులు తరుచుగా వాడుతుంటా రిప్పటికీ ఈ మాట. వైశ్యులెక్కడ ఏ రాష్ట్రంలో ఉన్నా చాలావరకు

తెలుగులోనే మాటాడుకొంటారని ప్రతీతి. అక్కడ దొరుకుతాయి కొన్ని మంచి తెనుగు మాటలు మనకు.

ఇంతకూ చెప్పవచ్చేదేమంటే చిన్నయసూరి తమిళనాడులో నివసించే తెలుగువాడైనా తెలుగు భాష మీద ఆయనకెంత చూపున్నదో ఎంత గొప్పపట్టున్నడో చూడండి. తెలుగునాటి నడిబొడ్డున బ్రతికే మనబోటి తెలుగువారికే లేదంత భాషా జ్ఞానం. కూలంకషమైన భాషా జ్ఞానమది. తెలుగులో ఎంత లోతుచూచాడో ఆయన అంత లోతుకే వెళ్లి చూశాడాయన సంస్కృత భాష కూడా. ఆయన తండ్రిగారు సంస్కృత ద్రావిడ భాషలలో నిష్ణాతులైన పండితులు. ద్రావిడ ప్రబంధాలు శిష్యులకు పాఠం చెప్పేవారు. కాబట్టి సంస్కృతాంధ్రాలే గాక తమిళంలోనూ ప్రాకృతంలో కూడా ఇంకా గొప్ప ప్రావీణ్యం గడించి తండ్రిని మించిన తనయుడని పించుకొన్నాడు చిన్నయసూరి. ప్రాకృత శబ్దాలనాయన అక్కడక్కడా ఉదాహరించటంలోనే తెలిసిపోతుందాయన ప్రాకృత భాషా పరిజ్ఞానం. మా గురువుగారు దువ్వూరి వేంకటరమణ శాస్త్రులుగారు చెప్పినట్టాయన హేమ చంద్రుడిలాంటి వారు రచించిన ప్రాకృత వ్యాకరణాలు కూడా బాగా తడవి చూచినవాడు. అప్పటికి సంస్కృతాంధ్ర ద్రావిడ – ప్రాకృత భాషలలో సిద్ధహస్తుడన్న మాట చిన్నయసూరి. అంతేగాక వీటన్నిటికీ మెఱుగుపెట్టినట్టు ఆంగ్లేయుల పరిచయంతో ఆంగ్ల భాషాలో కూడా తగినంత ప్రవేశ ముందాయనకు. అందులోని నిఘంటు వ్యాకరణాలు కూడా చక్కగా చూచి ఉంటాడటంతో సందేహం లేదు. అసలు నిఘంటు వ్యాకరణ శాస్త్రాలే ఏ భాషకైనా కావలసిన ప్రధాన సామగ్రి. ఒక బిల్డింగు పైకి లేవాలంటే ఇటుకా

సిమెంటూ చెక్కా ఇనుమూ ఇలాంటి సామగ్రి ఎలా అవసరమో ఒక భాషలో ఎవరైనా గొప్ప రచన చేసి పాఠకులను మెప్పించాలంటే అవి రెండూ ఎంతైనా మధించి ఉండాలి రచయిత.

ఇందులో ఆయనగారి నిఘంటు నిర్మాణ జ్ఞానమెలాంటిదో బాల వ్యాకరణంలో ఆయన ఉదాహరించిన ఆయా శబ్ద రూపాలు చూస్తేనే మనమూహించుకోవచ్చు ఎంత లోతైనదో. అంతేగాదు. ఆరోజులలో శబ్దరత్నాకరమనే నిఘంటువు రచించిన బహుజన పల్లివారే తన ఉపోద్ఘాతంలో అన్న మాటలు వింటే అర్థమవుతుంది ఆయనకు సూరిగారి పాండిత్యం మీద ఎంత గొప్ప అభిప్రాయముందో – ఆయన నిఘంటు బృహత్ప్రణాళికను ప్రస్తావించటంలో ఎంత భయభక్తులున్నాయో. మరి ఇటీవలి కాలంలో తెలుగు భాషకు కూలంకషంగా వ్రాయబడినదని ప్రశంసలందుకొన్న సూర్య రాయాంధ్ర నిఘంటువును చూచినా మనకర్థ మవుతుంది. అక్కడక్కడా ఒక తెలుగు శబ్దానికి నిక్కచ్చి అయిన అర్థమేదో తేల్చాలంటే అలా నిష్కర్ష చేసిన పరవస్తువారి వ్రాతప్రతిలోని అర్థాలు చూచి 'చి.ని' అనే పొడి అక్షరాలతో ఆయనగారి నిఘంటు స్వరూపం కండ్లకు కట్టినట్టు చూపక తప్పలేదీ ఆధునిక భాషావేత్తలందరికీ. ఇంకా శోచనీయమేమంటే ఆయనగారు శబ్దాలూ శబ్దాల కర్థాలూ – అనేకార్థ చ్ఛాయలూ – ప్రయోగాలూ – చక్కగా వ్రాసిపెట్టుకొన్న ఆరు వ్రాత ప్రతి పుస్తకాలు మదరాసు ప్రాచ్య పుస్తక భాండాగారంలో ఉండేవి చాలా కాలం. అవి కాకివాడకు తరలించటంలో ఎక్కడ జారవిడిచారో మన ప్రబుద్ధులేమయి పోయాయో కూడా తెలియదు. మా గురువుగారు చెప్పేవారు నేను చూచావయ్యా నా కళ్లతో ఎంత అద్భుతమైన దస్తూరో

అది ఎంత విశదంగా చక్కగా వ్రాశాడో ఆ మహానుభావుడు మనవాళ్ల అశ్రద్ధతో గంగపాలయి పోయాయనే వారు.

ఇంత సర్వతోముఖమైనదా మహాత్ముడి భాషా పరిశ్రమ. సరిగా తెలుగులో పూర్వం తిక్కన నాచన సోమనాధుల పరిశ్రమ ఎలాంటిదో అలాంటిది. పారసీలో ఫిరదౌసీ మహాకవి తన షానామాలో ఇలా అంటాడు. 'బసీరంజ్ బుర్దమ్ దరీన్‌సాల్‌సీ. అజమ్ జిందెకర్దమ్ దరీన్ పారసీ' నేను 30 సంవత్సరాలు అచ్చమైన పారసీ శబ్దజాలం పోగు చేసుకోటానికి కృషి చేసి ఈ షానామ కావ్యం రచించానంటాడు. అలాగే కేవలం అచ్చ తెలుగు పదాలెన్ని రూపాలలో ఎన్ని అర్థాలలో ఉన్నాయో సమస్త వాఙ్మయాన్ని మధించి దానికి తోడు లోక వ్యవహారాన్ని కూడా దుర్భిణీ వేసుకొని చూచి వేలకొలది పోగు చేసి ఉంటాడు చిన్నయసూరి. తెలుగు ధాతువులను కూడా ధాతుమాల అనే పేరుతో రచించాడు. రెండూ పూర్తి చేయకుండానే 56 సం॥రాలకే కన్నుమూశాడు. లేకుంటే సమగ్రంగా లభించేది ఒక గొప్ప తెలుగు నిఘంటువు మనకు.

ఆఖరుకు నిఘంటువు దేవుడెఱుగు. సమగ్రమైన వ్యాకరణ గ్రంధమైనా ఆయన కలం నుంచి వెలువడింది చూద్దామా అంటే ఆ భాగ్యానికి కూడా నోచుకోలేదు మనం. 'పెక్కులక్ష్యములు పలుమాఱు సావధానముగా పరిశీలించి రచనా ప్రణాళిక నిర్ణయించుకొని నా నేర్చుకొలదిని సంస్కృత భాషతో సూత్రగ్రంధమొకటి కావించానని - తెనుగునకు శబ్ద లక్షణమన యంబరయంగ వేడ్కనందిన వారల్తనరగ నీ వ్యాకరణంబున మూలంబయిన కృతిని బోలఁగనదగున్' అని బాలుర కోసం రచించిన ఈ బాలవ్యాకరణం కేవలమొక నమూనా మాత్రమే.

అసలు నేను రచించినది చాలా పెద్ద గ్రంధం. సంపూర్ణమైనది. అది కూడా సంస్కృత భాషలో రచించిన సూత్రగ్రంధం. అది చూడండి. మీకు సమగ్రమైన తెలుగు భాషా స్వరూపం సాక్షాత్కరిస్తుందని హామీ ఇస్తాడు. అది ఏమయిందో ఆ వ్యాకరణ గ్రంధం. ఏవో కొన్ని కాగితాలు మాత్రమిప్పుడు అచ్చయి మన చేతిలోకి వచ్చాయి. అదే చూపుతుంది మనకిప్పటికీ ఆయన భాషా జ్ఞాన పాటవ మెలాంటిదో. అందులోనూ సంస్కృత భాషా పాటవం సుమా. వింటారా మచ్చుకొకటి ఉదాహరిస్తాను. వాక్యం. దిక్ప్రదర్శనమంటే ఏమిటో వివరిస్తున్నాడాయన. 'అజ్ఞాత దిశం దేశం జిగమిషోः పాంధస్య మార్గం పృచ్ఛతः పురుషేణ కేనచి దేవం యాహీతి హస్తనిర్దేశేన దిశో దర్శనవ దిదం శాసన (శాస్త్రం) మధిజి గమిషూణాం ప్రధమ ప్రవృత్తా వుపకారకం భవతీత్యర్థః ' – అక్కడ పాంధుడు మార్గజ్ఞానం లేనివాడు గనుక మార్గ మడుగు తున్నాడు. పురుషుడు కనుక పూర్ణమైన జ్ఞానముండటం వల్ల తెలుపుతున్నాడు. ఎంత చక్కని వాక్యరచనో చూడండి సంస్కృత భాషలో. సంస్కృత వచనమిలాగే వ్రాస్తాడు. పద్యరచనా ఇలాగే చేస్తాడు. 'అస్తికల్ప ద్రుమః కోపి జాతరూప లతావృతః – వేంకటాద్రి శిఖారూఢః స్మరతాం పరమార్ధదః" – ఎంత చక్కని భావన. భావానికి తగిన ఎంత మనోజ్ఞమైన పద్యశైలి.

వాక్యాలూ పద్యాలేగాదు. సంస్కృతంలో ఆయన అల్లిన సూత్రాల నిర్మాణముంటుంది. అద్భుతం. పాణిని అష్టాధ్యాయి సూత్రాలనే నీవా నేనా అని హెచ్చరించి నట్టుంటుంది. అసలు గుండా చెరువా. నన్నయాదులు కూడా ఊహించలేరీ సంస్కృత సూత్ర రచన. అలాంటి

సూత్రాలు. తెలుగు వ్యాకరణానికి సంస్కృతంలోనే రచించాడంటే అసాధారణ మాయన గారి ప్రతిభ చూడండి కొన్ని ఉదాహరిస్తాను. 'పాదాద్యవక్షరం వళిః - ద్వితీయం ప్రాసః - ప్రత్యయో వర్ణకః - అచోయ డచః పరాదచి - ఉతోచి - విభక్తే రప్రథమాయాః బహుళమ్ - ఇతః కిమాదేః - రుక్పోద బొమ్మయో రిల్లోనిత్యం - వాలోరమ్మో - చిన్న పిన్నయోష్టగ్నాడౌ - నున్నస్యనునుర్వాలి - పెద్దస్యపెనుః - పెన్నురచి - ఇలా సూత్రీకరణమేగాక అడపాదడపా చిన్న చిన్న వార్తికాల లాంటి వాక్యాలలో వివరణ కూడా ఇస్తుంటాడు. నచ విభక్తి లోపాన్నే తివాచ్యం - నాలుగిటి మర్మ మిత్య త్రాపి తదనా పత్తేః - ఏక ఇత్యనుక్తే లటా సహితా దపి స్యాత్ - స్వాంగస్య స్వప్యవధాయ కత్వా భావాత్ - కొమ్ముకొనే త్యాది దర్శనా ద్విధిరయం ప్రాయికశ్చ వక్తవ్యః - కువర్ణకో ఆయినా సహ కయీ త్యుదీరితో బుధైః అయంతాప న్న సమ్మతః తధానహీష్యతే సతా - అయినా సహ, కయి దితి నిర్దేశః - అతఏవ తత్ర సర్వాంగమాత్ర స్య వళిత్వ మూరీక్రియతే -సంఘాత గ్రహణ ఫలంతు నకో నివృత్తి రితి ధ్యేయమ్ - ఇలా ఎన్నైనా ఉన్నాయి రచనా విశేషాలు మన కాశ్చర్యం గొలిపేవి.

ఇప్పుడింత దూరమాయన సంస్కృతాంధ్ర భాషా పాటవాన్ని గురించి నేనేకరువు పెట్టటమెందుకంటే ఒక గొప్ప పద్య కావ్యమో గద్యకావ్యమో ఒక మహానుభావుడి కలం నుంచి వెలువడాలంటే అది ఉన్నట్టుండి హఠాత్తుగా ఆకాశం నుంచి ఊడిపడదు. కావ్య నిర్మాణానికి తగినంత సామగ్రి ఆ రచయిత దగ్గర సమృద్ధిగా ఉండాలి. అలా ఉండగానే సరిపోదు. దాన్ని యధావకాశంగా యధోచితంగా పింగళి

వారు చెప్పినట్టు పొసగ ముత్యపు సరుల్పోహళించినట్లు పోహళించి చూపగలగాలి అలాంటి సరకూ సరంజామూ ఉందా మన సూరిగారి కంటే కావలసిన దానికంటే ఎక్కువగానే ఉందని బాహాటంగా చాటవచ్చు. తెలుగు భాష కొక గొప్ప నిఘంటువు వ్రాశాడంటే భాషా సమృద్ధి ఎంత ఆర్జించి ఉండాలి. అలాగే ఒక గొప్ప వ్యాకరణమే వ్రాశాడంటే సమృద్ధితోపాటు భాషాశుద్ధి ఎంతగా సాధించి ఉండాలి. అది కూడా సంస్కృతాంధ్రాలు రెండు రంగాలలో సరిదీటుగా. కనుకనే **The Pandit of the 19th Century.** అనే బిరుదాయన పట్ల సార్థకమయింది. అంతేకాదు. అసలాయన పేరు చిన్నయ సూరిగాదు. చిన్నయ మాత్రమే. సూరి అనేది ఆయన సర్వతోముఖ భాషా సాహిత్య పరిశ్రమ పాటవాలను తలస్పర్శిగా పరీక్షించి మిగతా సంస్కృతాంధ్ర పండితులనంతా కాదని ఆయనకు ప్రభుత్వం వారొసంగిన గొప్ప టైటిల్. ఒక మల్లినాథ సూరి ఉన్నాడు. మరలా ఒక చిన్నయసూరి ఉన్నాడు యావదాంధ్ర ప్రపంచంలో. మల్లినాథ సూరికి ముందు మహామహోపాధ్యాయ బిరుదు ప్రకటంగా కనిపిస్తే చిన్నయసూరి కది గుప్తంగా వినిపిస్తుంది మన అంత శ్రోత్రాలకు.

అస్తుతావదేవమ్ - అధునా ప్రకృతాంశ మనుసరామః - సూరిగారి వచనామృతమని గదా మనం నామకరణం చేశా మీ అధ్యాయానికి - దానికి పూర్వరంగ ప్రాయమైన ఆయనగారి వైదుష్యమేమిటో ఎలాటిదో ఇంతవరకూ చాలా చెప్పుకొంటూ వచ్చాము. ఇక ఆయనగారు తన ప్రజ్ఞాపాటవంతో నిర్మించిన ఆ వచన మహాసౌధ మేమిటో ఎలాంటిదో అందులో ప్రవేశించి చూతాము మనమందరమూ.

అసలు సూరిగారు మొదటినుంచీ అంత నిఘంటు నిర్మాణ పరిశ్రమా అంత వ్యాకరణ రచనా పరిశ్రమా చేసి తెలుగుభాష మీద అంత గొప్ప పట్టు అలవరుచుకోటంలో ఆయన ఆసించిన ఏకైక ప్రయోజనమేమిటో తెలుసా. అది వచన రచనా కౌశలమే. ఇది ఆయనగారి మాటలలోనే మన కవగత మవుతుంది. 'కాబట్టి అవి చదువువారికి నిస్సందేహముగా వచన రచన సేయు కౌశలము చిరకాలము బహు లక్ష్యములందు బరిశ్రమము చేయక రానేర' దంటాడు బాలవ్యాకరణ పీఠికలో. కేవలం లక్షణ జ్ఞానముంటే రచన చేయగలరా అంటే అదీ ఒప్పుకోడు. 'తుదకు లక్ష్యపరిజ్ఞానము చాలని లక్షణ పరిజ్ఞాన మంత శ్లాఘ్యముగాదని 'తానే చాటుతాడు. అంటే ఏమన్న మాట – ఒక భాషలో చక్కని వచనం వ్రాసి నలుగురినీ మెప్పించాలంటే అటు వ్యాకరణ కోశాది లక్షణ జ్ఞానమూ ఇటు ఆ వాఙ్మయంలోని కావ్యనాటకాది లక్ష్య పరిజ్ఞానమూ – రెండూ సమగ్రంగా ఉన్న విద్వత్కవి తల్లజుడికే అది సాధ్యమని ఆయన అభిప్రాయం. అందుకే ఒకచోట మిత్రలాభంలో 'మిత్రలాభ మను లాభ సంపద యను వచనము నాకు నేడు లక్ష్య సమన్విత మయ్యెనని ఈ అభిప్రాయాన్నే భంగ్యంతరంగా బయటపెడతాడాయన.

అంతేనా! 'మంథరా! నీ వచనామృతము చేత నాదురంత తాపము నివారించితివని ఒకచోట – 'నిస్సంగులమయి మౌన ముద్రాధారుల మగు మాదృశులకు సహితము నీ వచన చారిమంబు సల్లాపంబు నందు ల్లాసంబు పుట్టించుచున్నది' అని మరి ఒకచోట – వచన మాధుర్యాన్ని గూర్చి వ్యంగ్యంగా సూచన చేశాడు కూడా. వచనామృతమంటే అమృత రసంలాగా మధురమైన ఆస్వాద యోగ్యమైన

ఎప్పటికీ మఱపురాని వచన రచన అది ఎంతో గంభీరమైన అర్థ మిమిడి ఉన్నదీ వాక్యంలో. అలాటి అజరామరమై సహృదయ హృదయా వర్జకమైనది సూరిగారి వచన రచన. అందుకే నేనీ అధ్యాయానికి 'చిన్నయసూరి వచనామృతమని పేరు పెట్టి ఆయనగారి మాటే ఆయన కప్పజెప్ప దలచాను వాస్తవంలో.

ఏమిటీ వచనం వచనమని పట్టుకొన్నాడు చిన్నయసూరి. వచనంలో కవిత్వమేమిటి చక్కగా పద్యకావ్యమే రచించవచ్చు గదా. పొరబాటు. వచనమంటే తక్కువగా భావిస్తున్నారు పాఠకులు. గద్యరచనకన్నా పద్యరచనే గొప్పదని అభిప్రాయముంటే నన్నయాది మహా కవులందరూ సంస్కృత కవులలాగా కేవలం పద్యాలతోనే తమ రచన సాగించి ఉండేవారు – అలా కాక పద్య గద్య సమ్మిశ్రితంగా తమ గ్రంధరచన చేస్తూ వచ్చారంటే ఏమిటర్థం. రెండూ సమానమే రెండింటిలోనూ తమ కవితాశిల్పం చూపవచ్చు. అలాంటి అభ్యంతర మేమీ లేదనే గదా. తిక్కనగారు స్వయంగానే చెప్పారుగదా. 'పద్యములు గద్యములున్ రచియించెదం గృతు' లని. రెంటికీ సమప్రాధాన్యముందని తెలిసి పోలేదా మనకు. అసలా మాటకు వస్తే పద్యమెవరైనా రచించవచ్చు. రైలుపట్టాల లాంటిది ఛందస్సు. గణయతి ప్రాసలనే పట్టాలే నడుపుతుంటాయి పద్యాన్ని. మరి గద్యమలా కాదు. దానికొక దారి డొంకా లేదు. ఆకాశంలో విమాన ప్రయాణం లాంటిదది. **Air-lines** నీవే నిర్ణయించుకోవాలి. ఏ దిశలో ఎలా వెళ్లాలో ఎక్కడెక్కడ దిశ మార్చుకొంటూ పోవాలనే ప్రజ్ఞా పాటవాన్ని బట్టి ఉంటుంది. అందుకే గద్యం కవీనాం నికషం వదంతి' గద్యరచనే కవుల కవితా

పాటవ మెలాంటిదో పరీక్షించటానికి ఒరపిడి రాయంటారు సంస్కృతా లంకారకులు. 'గద్యాను బంధరస మిశ్రిత పద్య సూక్తిః హ్యాద్యాహి వాద్యకలయా కలితేవగీతిః అంటాడు భోజరాజు. పద్యం గాత్రమయితే గద్యం దానికి మెఱుగు పెట్టే మృదంగ వాద్యమట. మఱి బాణభట్టులాంటి వాడు పద్యంలో ఎంత ప్రజ్ఞావంతుడో గద్యంలో దాన్నిమించిన ప్రజ్ఞా పాటవమున్న వాడు. 'బాణోచ్ఛిష్టం జగత్సర్వం – కాదంబరీ రసజ్ఞానా మాహారోపిన రోచతే' అని అనన్య సాధారణమైన పేరు ప్రతిష్ఠ తెచ్చుకొన్నాడంటే బాణుడు తన గద్యకావ్యమైన హర్ష చరిత కాదంబరీ రచనల వల్లనే. అంతేకాదు 'కవీనా మగళద్దర్పో నూనం వాసవ దత్తయా' పద్యకవుల అహంకారమంతా మా సుబంధుని గద్యకావ్యమైన వాసవ దత్తతో జారిపోయిందని పద్యమే గొప్పదని భావించే వారి మొహాల మీద కొట్టినట్టు చీవాట్లు పెట్టాడు. పైగా 'భట్టార హరిషేణస్య గద్య బంధోన్నపాయతే' మీ పద్య కావ్యాలెందుకు పనికి వస్తాయి మీవన్నీ రాజభటులైతే మరి గద్య కావ్యమే మనుకొన్నారో అది ఒక మహారాజు పొమ్మంటాడు. మరి గద్యరచనలో మాత్రం తక్కువ వారా భట్టుబాణాదులు. పద్యం వ్రాస్తే ఎంతో చేయి తిరిగిన పద్య కవి అనిపిస్తాడు.

అలాగే పరవస్తువారు కూడా గద్యంలో పద్యంలో రెండింటిలో సమాన ప్రతిభా సంపత్తి ఉన్నవాడే. ఆయన పద్యరచన చూడండి ఎలా ఉంటుందో.

'శ్రీయను మించు మించొలయ సేవక చాతక లోకమోదసం ధాయకుడై యుదార కరుణా రసవృష్టి దురాపతాపము ల్వాయగc

జేయుచున్ సకల వాంఛిత సస్యము లుల్లసిల్లగాc జేయుచు వేంకటాద్రి నివసించు ఘనుండిడుc. గాత భద్రముల్. వేంకటేశ్వర స్తుతి ఇది. ఎలాటివాడా దేవుడు – ఘనుడట. ఘనమంటే మేఘమని కూడా అర్థమే. రెండర్థాలూ ఎలా సరిపోతాయో పద్యమంతా చదివి చూడండి. మీకే అర్థమవుతుంది 'వనజభవాండ భాండము లవా రిగనెవ్వని తుందకందరం బున నొకవెంట నింటరము పొందక పొందుగ బొట్చసమ్మహాత్ముని నిజభోగ శయ్యనిడి పొత్తులకందువు నట్లు లాలనం బొనరుచు నయ్యనంతు మహిమోన్నతుc సన్నుతియింతు నిచ్చలున్. నన్నయగారి శైలిలో నడిచిన పద్య ధార ఇది. అలాగే

కరుణ తెఱుంగున హరియెద
నిరపుకొని యఘాళి పారయనీక యతనిచే
నిరతము సంశ్రిత జనులం
బరిరక్షింపించు తల్లి భజయింతుమదిన్
పరువంబు కలిమి దొరతన
మరయమి యను నట్టి వీని యందొక డొకడే
పొరయించు ననర్థమునాc
బరగినచో నాల్గుcజెప్ప వలయునె చెపుమా.
పలుసందియములc దొలcచును
వెలయించు నగోచరార్థ విజ్ఞానము లో
కుల కక్షి శాస్త్ర – మయ్యది
యలవడ దెవ్వనికి వాడె యంధుడు జగతిన్.

ఈ పద్యరచన చూచారా. ఇది తిక్కన గారి శైలిలో నడచిన రచన. ఇలా ఎంతైనా వ్రాయగలడు చిన్నయసూరి. చేతగాని వాడు గాదు.

అయినా పద్యరచన మానేసి గద్యరచనకు దిగాడంటే పద్యాలందరూ వ్రాశారు మరలా చర్వితచర్వణం దేనికి. తెలుగు గద్యమెలా ఉంటుందో – ఉండాలో రుచి చూపుతాను చూడండి అని సవాలు చేసి వ్రాసినట్టుంది ఆయన వచనా రచనా పాటవం చూస్తే. కాకపోయినా పద్యమేమిటి గద్యమేమిటి. కవితా కళకేదైనా ఒకటే. రెండూ రెండు ప్రణాళికలు ఉత్తమ కవితా శిల్ప ప్రదర్శనకు. అంతేగాని పద్యమే కవిత్వం గాదు. వచనమయినంత మాత్రాన కవిత్వం కాకుండా పోదు.

ఈ దృష్టి పెట్టుకొని చూడాలే రచన అయినా మనం. అలా చూచామంటే చిన్నయసూరి రచనా ప్రౌఢిమ్య మాయన నీతిచంద్రికలో కావలసినంత సాక్షాత్కరిస్తుంది మనకు. అసలు నీతిచంద్రిక నాయన కావ్యమనే పేర్కొన్నాడు. 'తుదముట్టగ నీ కబ్బము పదిలముగా జదివినట్టి బాలుర కోలిన్' అని ఆయన మాట. కబ్బమంటే కావ్యమనే శబ్దానికి తద్భవం. అలాగే కృతి యొనర్చెద నీతిచంద్రికయనంగ' అంటాడు. కృతి అంటే కావ్యమనే అర్థం. 'కృతి రచింపుము మాకు శిరీష కుసుమ పేశల సుధామయోక్తులc బెద్దనార్య' అని గదా రాయలవారు పెద్దనామాత్యునితో అన్నది. అయితే పెద్దనాదుల లాగే – ఏదో ఒక పురాణేతిహాసాది మూలగ్రంధాలలో నుంచి కథావస్తువు వారు తీసుకొన్నట్టే – ఈయనగారు కూడా పంచతంత్ర హితోపదేశాలనే సంస్కృత కథాకావ్యాలలో నుంచే ముడి సరుకులాంటి వస్తువు తీసుకొన్నాడు. మరి వారలా సేకరించి దానికి మెఱుగులు దిద్ది సర్వాంగసుందరంగా తీర్చినట్టే – సూరి కూడా ఆ తీసుకొన్న దానికి కొంత అభినవంబుగను జేర్చి నవనవోన్మేషంగా తన కావ్యాన్ని తీర్చి

దిద్దాడు. అందులోనూ గడుసుదనమేమంటే 'ఒనరగా పంచతంత్ర హితో పదేశములను బరికించి' అన్నాడేగాని అవి ఏవి సంస్కృత గ్రంథాలా వాటి ననువదించిన దూబగుంట నారాయణకవి బైతరాజు వేంకటకవి నాధునివా – రెండూ ఉద్దేశించే ఆ మాట అన్నాడనిపిస్తుంది. ఎందుకంటే అక్కడక్కడ వాటిలో కావలసిన అంశాలను కూడా తీసుకొని వ్రాశాడు. మొత్తానికి సర్వాంగ సుందరమైన వచన కావ్య మీ నీతి చంద్రిక. అది కూడా 'కథాచ్ఛలంబున మాణవులకు చవియుట్టగ' రచించాడట. ఒక్క మాణవులకే గాదు మానవులందరికీ ననిపిస్తుంది నాకు జూడ.

మరి ఇంత గొప్ప ప్లాను వేసి వ్రాసిన ఆ గ్రంథం సంపూర్ణంగా దొరకక పోవటం శోచనీయం. మిత్రలాభ మిత్రభేదాలు రెండే మనకిప్పు డు పలబ్ధం. మిగతా విగ్రహమూ సంధీ రెండు భాగాలూ ఏమయినాయో తెలియదు. అసలు వ్రాయవే లేదా ఆయన – వ్రాస్తే అవి కాలగర్భంలో కలిసి కనపడకుండా పోయాయా. మీకొక కథ చెప్పెదనది మిత్రలాభము మిత్ర భేదము విగ్రహము సంధియునని నాలుగంశముల చేత నొప్పుచుండు'నని ఆయన గారే ఆదిలో చేసిన ప్రతిజ్ఞ. అలాంటప్పుడు వ్రాయలేదని ఎలా అనుకోవాలి. అయితే ఇవి రెండూ ఉండి అవి రెండూ ఎలా లేకపోయాయి. ఏమో నన్నయభట్టు రచించినాడని తిక్కనగారు చెప్పిన ఆయన మూడు కృతు లేమయినాయో ఈయనగారివి కూడా అలాగే అయి ఉండవచ్చు. అసలా మాటకు వస్తే ఈర్ష్యాళువు లూ నయవంచకులైన పండితమ్మన్యులెవరు వాటిని మాఫీ చేశారో ఏమో. ఎవరి కెఱుక. సరే దానికేమి. ఉన్న రెండే చాలు రెండు కోహినూరు వజ్రాలు. 'చవి యుట్టగ' అని ప్రతిజ్ఞ చేసినందుకు రసవంతంగానే

తీర్చిదిద్దాడు కావ్యమంతా. అందులో కూడా మాణవులూ మానవులూ – ఇద్దరినీ ఉద్దేశించి వ్రాశాడు కాబట్టి మిత్రలాభం సరళమైన శైలిలో నడిస్తే మిత్రభేదమంత కంతకు త్రివిక్రముడిలాగా విజృంభించి ప్రౌఢ రమణీయమైన సరళిలో నడుస్తూ పోతుంది. కథ అంటే కథ కావ్యమంటే కావ్యం. కథా కావ్యమనవచ్చు ఒక విధంగా.

అసలు కథ చెప్పటంలో ఉన్న అందచందాలూ – ఆయా పాత్రల హావభావాలూ – వాటికి తగిన వర్ణనలూ చూస్తూ పోయామంటే ఏ ప్రబంధానికి తీసిపోదు. కథా కథనంలో ఏమాత్రమూ ఒడుదుడుకు లుండవు. అనవసరమైన అదుకు పెట్టిన రసభావాల కడ్డు తగిలే ప్రసంగ మొక్కటైనా కనపడదు. ప్రసన్న గంభీరమైన ఒక గంగానదిలాగా ప్రవహిస్తూ ఎక్కడా విసుగనిపించకుండా తనతో పాటు రసజ్ఞుల హృదయాలను కూడా తోడు చేసుకొని ముందు ముందుకు సాగి పోతుంటుంది. 'గంగా తీరమందు సకల సంపదలు గలిగి పాటలీ పుత్రమను పట్టణము గలదు – ఆ పట్టణము సుదర్శనుడను రాజు పాలించుచుండెను. అతడొకనాడు వినోదార్ధము విద్వాంసులతో సల్లాపములు సలుపుచుండగా నొక బ్రాహ్మణుడు... అని ప్రస్తావ వశముగాఁజది వెను. ఆ పద్యములు రాజు విని చదువు లేక సదా క్రీడా పరాయణులయి తిరుగుచున్న తన కొడుకులను దలచుకొని యిట్లు చింతించెను. తల్లిదండ్రులు చెప్పినట్టు విని చదువుకొని లోకుల చేత మంచి వాడనిపించుకొన్నవాడు బిడ్డడు గాని తక్కినవాడు బిడ్డడా. మూర్ఖుడు కలకాలము తల్లిదండ్రులకు దుఃఖము పుట్టించుచున్నాడు. నా పుత్త్రులు చదువమనిరా పరామరిక మాలి తగిన విద్యాభ్యాసము

చేయింపనయితిని – పురుష కారము చేత గార్యములు సిద్ధించును. రిత్తకోరికల చేత సిద్ధింపవు. కాబట్టి యిప్పుడు నా పుత్త్రులకు విద్యాభ్యాసము కయివలయు ప్రయత్నము చేసెదనని చింతించి యచ్చటి విద్వాంసులతో నిట్లనియె' ఇలా నడుస్తుందాయన కథాకథనం.

అది పొడి పొడి మాటలతోనైనా సరే. కొంత దళసరిగానైనా సరే. మరీ గాఢంగానైనా సరే. కొంత దళసరి రచన చూస్తారా. 'ఒక్క జలాశయంబునం దనాగత విధాతయుc ప్రత్యుత్పన్న మతియు యద్భవిష్యుండు నని మూడు మత్స్యంబులు వసియించుచుండు. ఒక్కనాడనా గత విధాత ప్రత్యుత్పన్న యద్భవిష్యంబులంగాంచి ' యీయేడింత వఱకు వాన లేరంబయ్యె మీద నయినను గురియు నను నాసలేదు. నిమిత్తంబులు ప్రతికూలంబులయి కావంబడియెడు ఈ కొలని జలంబులు తుదముట్ట నడుగు బట్టక మున్న మెలంకువ పడవలయు – మసలిన మోసవాటిల్లు – ఇటకుంగొంత దూరంబున ధ్రువోదంబను ధ్రహదం నర్ధాభిధానంబు గలదు. ఇచ్చటికి వరవ యచ్చటి నుండి వచ్చుచున్నయది. అది యునువెను మూయం దోయంబు లేకయుండు నడికి రేయిట నల్లల్ల నావరవంబడి యామడువుం జేరియీ బారి దలంగుదము' ఇలా అక్కడక్కడ బిందు పూర్వక డు వర్ణబు వర్ణాలతో చక్కగా నడపగలడు కథ.

ఇంకా అశిథిలమూ గాఢమైన బంధంతో నడవమన్నా నడపగలడు చిన్నయసూరి. అది ప్రబంధ గద్య రచన నుతలపిస్తుంటుంది 'తొల్లియొక జంబుకంబు వనంబునం గ్రుమ్మరుచు నెక్కడ నాహారంబు దొరకమిం గరంబుదరం బాకట నకనకం పడ డిల్లపడి వికలాంగంబులయి నేలం

గూలిన శతాంగం బులును ఖండిత శుండా దంత కాండంబులయి కొండల పిండు విడంబించు వేదండ తండంబులును... ఘోరంబయి వివిక్తంబయిన యొక్క పొలికలనింగని తటీయంజని యొక్క దారు ణారావంబు విని' – ఇలా ఎంత దూరమైనా నడపగలడు. ఇంకా సంగ్రహంగా అశిథిల బంధంగా కథ చెప్పమన్నా తడబడకుండా చెప్పగలడు. 'హిమవంతంబు ప్రాంతంబునంగు సుమఫల సంతాన కాంతం బగు కాంతారంబు గలదు. అందలి కపి సందోహం బొక్కనాడు శీతంబు చేత బాధితంబయి జ్యోతిరింగణ సంఘుంబుఁగాంచి యనలంబను బుద్ధిం జేసి డాసి చలిగాచి కొనుచుండ సూచీముఖంబను పక్షి వీక్షించి యోయి వెఱ్ఱులారా ఇవి నిప్పకలు గావు మిడుంగుఱుం బురువులు చూడండాచాయ నల్ల మహీరుహంబు చేరువ నింగలంబు గానంబడి యెడి – నటకుంజని చలి వాచి కొండన నొక్క మర్కటం బామాటలకు గాటంగు కోపంబు దీపింప నీవా మాకుం గర్తవ్యోపదేష్టవని దానింబట్టి నేలం గొట్టి కాలంబు తుద ముట్టించె. అలా అటూ ఇటూ కాకుండా కూడా కథ నడపగలడు. "రథకారుం డొక్కడుండు మదీయ భక్తుండు గలడు. వాడు ప్రతిదివసంబునా కాహారంబు తెచ్చియిచ్చు చున్నవాడు. మంద విసర్పిణీయని యొక్క చీర పోతుగలదు. అది తడవులంబట్టి యొక్క నృపాలుని పర్యంకంబు జేరి మెలంకువ మీఱ వసియించి జీవించుచుండు. అంత నొక్కనాడు డిండిమంబను మత్కుణంబు తత్పర్యంకంబున కరుదెంచిన మంద విసర్పిణి యెదురుపని కొని వచ్చి యాతిథ్యంబాచరించి కుశలం బడిగి వచ్చిన ప్రయోజనంబే మని మందలింప మత్కుణం బిట్లనియె–

ఈవిధంగా అది శిథిల బంధమైనా అశిథిల బంధమైనా శిథిలా శిథిల బంధమైనా ఏ శైలిలోనైనా నడపనీయండి - కథాగమనానికి కావలసిన అంశాలేమిటో వాటినన్నిటనీ ప్రోగు చేసుకొని ఒక వరుసలో పెట్టుకొని అనవసరమైన మాటగాని విషయము గాని ఒక్కటీ రానీయకుండా పాఠకుడికి. విసుగుపుట్టకుండా ఇంకా ఏమి చెబుతాడో విందామనే కుతూహలం పెంచుతూ కథ నడపటంలో సిద్ధహస్తుడు చిన్నయసూరి. అసలొక జింక తన ఆత్మకథ చెప్పుకొంటుంది తన మిత్రులతో. అనన్యాశ్యశం అతి సహజం అతి మనోహర మా కథా కథనం. 'ఆఱునెలల ప్రాయమప్పుడు నేను మా జాతి మృగములతో సంచరించుచుండగా నొకనాడు వేటకాడు వచ్చి మంచి పచ్చిక దెచ్చి మచ్చు పెట్టి కొంత దూరాన పాదమాటునఁ గూరుచుండి చూచు చుండెను. అంతట నేను బాల్య చాపలము చేతఁబదువు విడిచి ముందు పేరెము వాఱుచుఁ జివుకు చివుక్కునఁ జపుకళించి దాటుచుఁజని మచ్చుఁజూచి మేయఁ బోయి యరులలోఁదగులుకొని భయపడి కూఁత బెట్టితిని. అంతట మాపదువు మృగములన్ని తలలెత్తి చెవులు తిక్కించి నిక్కిచూచి బెదరి చట్రాతి మీదఁగొట్టిన కుండ పెంచికల వలెఁ జెదరి నలువలకులకుఁ జాటి పోయెను. అనంతరము వేటకాడు పొదమాటు విడిచి నాదా పునకు వచ్చెను. నేను మృగమను - శిశువను - మాపదుపుఁ బాసితిని. బంధములోఁ జిక్కుకొంటిని దాపున యముని వలె వేటుకాని జూచితిని. ఇకనేమి చెప్పవలె. నా ప్రాణము ముక్కాలు ముప్వీపము పోయినదను. ఇలా నడుస్తూపోతుంది చివఱదాకా. ఇది ఆయన అభినవంబు గను గూర్చిన కథాసన్నివేశము. మూలంలో లేదు.

ఇంతకూ చెప్పవచ్చిందేమంటే కథా కథన కౌశలమంటే ఇలాంటిది సూరిగారిది. పోతే ఇక పాత్ర చిత్రణ మంటారా. అతిలోకం. ఏ తిక్క నాదులకూ పింగళి సూరనాదులకూ తీసిపోదది. ఆయన తీసుకొన్న పాత్రలు మిత్రలాభంలో చాలావరకు పక్షులూ పశువుల పాత్రలే. పోతే మిత్ర భేదంలో పశుపక్ష్యాదుల కన్నా మానవ పాత్రలెక్కువ. మొత్తం మీద పశువు లేమిటి మానవులేమిటి. అన్నీ సంకేతాలే. మహాభారతం శాంతి ఆనుశాసనిక పర్వాలలో చాలావరకు పశుపక్ష్యాదుల కథలే గదా వస్తాయి. అవన్నీ ఎందుకు చెప్పినట్టు. వ్యాస భగవానుడి హృదయ మేమిటి. మానవులలో మంచిచెడ్డ ఎలాటిదో అందులో చెడు లక్షణాలు వదిలేసి మంచి గుణాల నలవరుచుకోమని చెప్పటానికే గదా. కథలన్నీ అర్థవాదాలే. ఒక సత్యం చెప్పటానికి సంకేతాలే. ఈ దృష్టితోనే చూడాలసలే కథనైనా. అందులోని పాత్రలనైనా. అయితే మానవపాత్రలనే తీసుకోవచ్చుగదా అంటారా. కొంతమంది మానవులకన్నా పశువులూ పక్షులేనయం. వాటిని చూచి అయినా మానవులు బుద్ధి తెచ్చుకొంటారని. ఎందుకంటే పశుప్రాయంగా పామరంగా బ్రతికే మానవులున్నారు. మానవోచితమైన ఉదాత్త లక్షణాలున్న పశుపక్ష్యాదులూ ఉన్నాయి. త్రిగుణాత్మకమైన సృష్టిలో ఏ జీవిలో ఏ గుణమెంత మోతాదులో ఉంటుందో ఎవరు నిర్ణయించగలరు. అది పశువులూ మృగాలూ ఎలాగూ తెలుసుకోలేవు. అంతో ఇంతో తెలివి తేటలున్న మీకేమి రోగం. మీరే తెలుసుకొని బాగుపడండని భంగ్యంతరంగా చాటటానికే పశు పక్ష్యాదులను పాత్రలుగా చేసి పెద్దలు కథలు వ్రాయటం.

అందుకే చిన్నయసూరి కూడా 'కథావిలంబున చచ్చయుట్టగ నీతి వచన సరణి తెలిపెదన్' అంటాడు. కథ పాత్రలనేది ఒక ఛలం. అంటే ఒక నెపం. అది సత్యం కాదు. సత్యానికది సంకేతం. మరి సత్యమేది-

చెప్పాడుగా నీతి అని. అది మనలో ఎలాగూ లేదు. జంతువులనైనా చూచి తెలుసుకుకొందాం. మనం వాకల్లమంతులమైనట్టు వాటినెందుకు తక్కువగా చూడటం. అది కూడా మధ్యలో ఒకచోట సూచన చేశాడు సుమా. 'భారవాహియయి తృణమాత్రాశనమయి కృష్యాది కర్మముల కత్యంతో పకారకమయి పవిత్ర జన్మమయిన వృషభము నర పశువు కంటె మేలుగాదె. మానవులమని విఱ్ఱవీగే మనకిది ఎంత పాదరక్షా ప్రయోగం. ఇలా చూస్తే లఘుపతన కుడనే వాయసమేమిటి – మంధరుడనే కూర్మమేమిటి – హిరణ్యకుడేమిటి – చిత్రాంగుడేమిటి. ఇలాటి జంతువులు – పక్షులూ మనకు తిర్యక్కులు గాకనపడవు. పరవస్తు వారి రచన అనే పరసు వేది సోకి అవన్నీ ఉదాత్తమైన మానవ పాత్రలుగా కనిపిస్తాయి. లఘుపతనకునే చూడండి. ఎంత నిజాయితీపరుడు. స్నేహపాత్రుడు. హిరణ్యకుడు వద్దు పొమ్మంటే నీతో మిత్రభావము కోరి వచ్చి నాడను. వేఱుగా నన్ను గాఁదలంపకు. నీ సౌజన్యమే యింతగా నాచేత నిన్ను వేడు కొలుపుచున్నది. నా స్వభావము తెలియక యేల యింత దూరము వెగటు మాటలాడెదవు. కడపటిది విను చిత్రగ్రీవుడు లోకోత్తరుడవైన నీతో సౌహార్ద సౌఖ్యమనుభవించుట చూచితిని – నీతో సంగాతము చేయవలెనని మనసుడితిని. నా ప్రార్థన విని నాకోరిక నెఱ వేర్చితివా సరి. లేదా యింతేనా భాగ్యమనుకొని యిక్కడనే ప్రాయోపవేశము చేసి ప్రాణములు విడిచెదను' అని హిరణ్యకుని హృదయాన్నే కరగించిన వాడు. తన మిత్రుడు మంధరుడనే కూర్మరాజుతో అతనికి పరిచయము చేసినవాడు. హిరణ్యకుని వీపు మీద నెక్కించు కొనిపోయి చిత్రాంగుని బంధమును నుండి విడిపించినవాడు.

ఇక మంధరుడో చాలా అమాయికుడు. నిష్కల్మషుడు. అందరి మేలుగోరువాడు. హిరణ్యకాదులు రావటం ఆలస్యమైతే భరించలేడు. వారు కంటబడగానే 'అయ్యలార వచ్చితిరా – నా కడుపునఁ బాలు వోసితిరి – శీఘ్రముగాఁబోయి స్థానము చేరుడి' అంటే హిరణ్యకుడెందు కింత సాహసము చేశావని మందలిస్తాడు. దానికతడు స్పందిస్తూ 'మీరింతా లస్యము చేసితిరి. మీలోపల నొక్కరయిన వచ్చి జరిగిన వృత్తాంతము చెప్ప వచ్చును గదా. అదియును లేకపోయెను. మీదు మిక్కిలిగాఁబోయిన వారేమి కీడునకుఁ బాలయిరో యేమయిరోగదా యని మనసు మఱి మఱి తత్తరింపఁదొడగెను. నీవు చెపుమా. ఎట్లు నిలువ మనసు వచ్చును. మిమ్ము జూచిన వెనుకగా నాగుండె కు దిరినది' ఇదీ అతని స్వభావం. మఱి హిరణ్యకుడో కార్యశూరుడు. అన్నిటినీ బంధములో నుంచి తప్పించటమే అతని డ్యూటీ. కాగా లఘుపతనకు డందరి నీరాబోయే ఆపద ముందుగా పసిగట్టి హెచ్చరించటమే అతని డ్యూటీ. మొత్తంమీద అందఱూ కలిసి అన్ని కష్టాలూ గడచి సుఖంగా బ్రతకటమే వారి జీవిత లక్ష్యం. ఇది మానవులు గ్రహించి బ్రతికితే ఇన్ని కలహాలూ ఇన్ని మారణహోమాలూ లోకంలో ఉండేవి కావుగదా.

పోతే ఇక మిత్రభేదంలో కొందరు మానవుల స్వభావాలు చూతాము సూరిగారెలా చిత్రించి చూపారో. ఒక పరివ్రాజకుడున్నాడు. పరివ్రాజకబ్రువుడు. 'వాడు లోభాకృష్టచేత స్కుండయ్య వీత స్పృహడుఁ బోలె జనంబులకు మనంబులు తనియ నశ్రాంతంబు వేదాంతార్థంబు లుపన్యసించుచుఁ దదా కర్ణన కుతూహలంబున లోకులు భక్తిఁదెచ్చి యెదురనిడిన విత్తంబు లనాదర సూచక మందహాస రోచిరుదంచిత సుందర వదనుండగుచు నిట్లు నానాట సముసార్జించిన విత్తంబులొక

బొంతం బదిలం బుగనునిచి కూర్పు వోసి యది కొప్పుకొని క్రుమ్మరుచుండు' ఈ నాలుగు మాటలలో చూడండి ఆనాటి నుంచి ఈనాటి వరకు దేశంలో దొంగ సన్న్యాసుల కపట నాటకాలూ వేషాలూ ఎలా బయటపెట్టాడో రచయిత. పోతే అతని డబ్బు కూడా కొట్టివేసి పొట్ట పోసికొనే ఆషాఢభూతులెలా ఉంటారో తెలుసా. వినమంటున్నాడు. ఉపన్యాసమంతా ఎంతో శ్రద్ధాభక్తులున్న వాడిలాగా ఆలకించి తరువాత అక్కడి వారినందరినీ "స్వాములు కడు బడలి యున్నారు. భిక్షానంతరంబు రండు పొండని యవ్వారి కనిపి యొక తాళవృతంతంబు పుచ్చుకొని అతనికి వీస్తూ - యేయీ నీవెవ్వడవు మాకుంగడు భక్తిసేయుచున్న వాడవని అతడు పలకరిస్తే 'స్వామీ' నేనాషాఢభూతి యనువాడ తమకు శుశ్రూష యొనరించి పడయంగోరినవాడ. నన్ను శిష్యుంగాఁగొని నాయీప్సితార్థం బొసంగి యనుగ్రహింపుడు మతియొక్కడే నొల్ల' అని నమ్మించి దగ్గర జేరి' ఒకనాటి రాత్రి యింట నిద్రించి వస్తూ, 'స్వామీ నిన్న రాత్రి మనము నిద్రించి యింటివారిది గడ్డిపరిక యొకటి నా గుడ్డ నంటి వచ్చినది. తృణమైనం బరుల సొమ్ము గొనంజనదని దూరంగా పోయి దాన్ని విడిచి వచ్చి 'యీతండు వీ తస్పృహుండు విశ్వాస పాత్రుడని అతనిచేత కితాబు పొంది చివరకతడు నమ్మి బొంత తనచేతి కిచ్చి కాలు మడుచుకోటాని వెళ్ళితే దాన్ని చంకన పెట్టుకొని పారిపోతాడు. ఈ కథ వర్ణించాడు చిన్నయసూరి. అంతా వ్యంగ్యమే. అంతా చోద్యమే. అంతా మానవ స్వభావ ఆవిష్కరణమే. పాత్ర చిత్రణమెంత సహజ రమణీయంగా సాగిందంటే ఈనాడు కూడా లోకంలో ఎవరి నోట విన్నావీడా షాడభూతిగాడు వాడు దొంగ సన్న్యాసిరా అనే మాటలు ఘాటుగా వినిపిస్తాయి.

ఇక ఇద్దరు వర్తకుల సంభాషణ వింటారా. వారి స్వభావమెంత లోతుగా చూచి బయటపెడతాడో కవి. ఇంద్రపాలితుడనే వణిజుడు. అతనికి ధనగుప్తుడనే మిత్రుడు. అఱువది బారువుల లోహమింద్ర పాలితుడతని దగ్గరికి పట్టుకు వచ్చి 'ఓయన్న యున్నట్టుండి దేశాంతరము పోవలసిన పని వచ్చినది. మాననయితి గాడు. తేపు పయనము. ఈ లోహము నీ యొద్ద నుంచుకొనుము. నిరుడీ సరకు నీతోడూ గూడి కొన్నది – వెల యెఱుగుదువు గదా. వరహాకు లాభము దుగులము వచ్చినం జాలు. కొను మొదలున కప్పటి కయిన వడ్డితోనే౮ జెప్పిన లాభము వచ్చెనా విక్రయింపుము. పరుల వలన నీవు పుచ్చుకొను వాడుక చొప్పున నడితి పుచ్చుకొనుము. వెలరాని పక్షామునకు సరకు కదలింప౮ బోకు. లోహము చెడిపోవునది గాదు నేడు దప్పిన తేపు నిలుకడ మీద మంచి వెలకు విక్రయించుకోవచ్చు పోయివత్తునా 'అని అతడంటే ఇతడే మంటాడో తెలుసా నేను నీకన్యుడనా. నాకింత చెప్పవలెనా, నీవిచ్చు నట్టయడితికా పని చూడవలె. గురువు సాక్షిగా౮జెప్పెద వినుము నీ సొమ్ము నా సొమ్ముగా౮ జూతుంగాని వేఱుగా౮జూడను.'

అని అంటూనే చివరకు తన సొమ్ముగానే చూస్తాడువాడు. వాడి పేరేమిటి ధనగుప్తుడు గదా – ఎవరి ధనమైనా గుప్తం చేసే బాపతే. అలాగే చేసి మరలా అతడు వచ్చి అడిగితే ఏమంటాడో తెలుసా. 'మునుప్ర నీతో౮గొన్న లోహము నిలువ కొంచెముండగా దానితో నీ లోహము గదిలో౮బెట్టి తలుపు మూసి తాళము౮ బెట్టి పదిలము చేసితిని. నిన్న కొందఱు వర్తకులు వచ్చి లోహము కావలెనని యడిగిరి. ఆ మీదట గది తలుపు దీసి చూతు౮గా లోపల లోహమను పేరు లేదు. నా సొమ్ము పోయిన దానికి నాకంత పెనుబాటు లేదు. మిత్రుడు విశ్వసించి

యిల్లడవెట్టిన సరకాతడు రాగానే నాయనా ఇదుగో నీ సొమ్మునక పోయినదని చెప్పవలసి వచ్చెగాయని రాపడి నిలిచాడట. అంతేనా. నాయందు విశ్వాసము చేత నీవు నష్ట మొప్పుకొంటివిపో. లోకులు మెత్తురా అంటాడు ఎంత మాట నేర్చో చూడండి. సొమ్ము మాయమయి పోకకు నిమిత్తమేమిటా అని ఆలోచించాడట. ఎలుకలు తిని పోయాయని అర్థమయిందట.

ఇక ఆ పెట్టి ఏమీ తక్కువ వాడు గాదు. నా తండ్రిగా నా బంగారుగా ఏడువ కేడువకు పండ్లుకొని యిచ్చెద రమ్మని వాడి కొడుకును బయటికి తీసుకొని పోయి ఎక్కడో దాచిపెట్టి బిడ్డడేడీ అని వీడడిగితే చంకబిడ్డని నేలదించి పండ్లు బేరమాడుతుంటే ఎక్కడ నుండో ఒక పాడు గ్రద్ద వచ్చి బిడ్డని తన్నుకొని పోయెనంటాడు. దానికి వీడు గుండెలు బాదుకొంటూ ఓరి పాపీ – బిడ్డని గ్రద్ద తన్నుకొని పోవునా వాడి మెడ విరిచి ఉంటావంటాడు. ఏమి స్వార్థమో అది కప్పిపుచ్చుకోటానికెవరెన్ని మాటలు మాటాడుతారో – లోకంలో మానవ స్వభావాన్ని ఎంత లోతుగా గమనించి వ్రాస్తాడో చూడండి చిన్నయసూరి. కపట మానవులలో దాగి ఉండే జంతవుల లక్షణాలు చూచారు గదా. ఇక జంతువులలో చోటు చేసుకొన్న మానవుల కపట లక్షణాలెలాంటివో మీరు చూడాలంటే దానికి తార్క్ష్యణం దమనకుడనే నక్క వ్యవహారం. అబ్బ! ఏమి వర్ణించాడో ఆ పాత్రనెంత బయటపెట్టాడో తద్ద్వారా మానవుల నీచాతి నీచ వ్యవహారమంతా. 'దేవాతావకంబగు నపాంగావ లోకంబున' కని ఇలా పొగుడుతున్నా బ్రహ్మాండంగా పొగడి మృగరాజునే వశం చేసుకోగలడు. అతడి భయాన్ని తీర్చినట్టు నటించి సంజీవకుడనే వృషభానికా సింహం గొప్పతనాన్ని వర్ణించి ఇద్దరికీ చెలికారమూ చేయగలడు. మరలా ఇద్దరూ

ఒకరికొక రాంతరంగికులై తమ్ము బహిష్కరిస్తారని అనుమానంతో ఒకరిమీద ఒకరికి సాడీలు చెప్పి మిత్రభేదమూ చేయగలడు. 'చక్కె రదనిచేఁదన వచ్చునే తొంటి తెఱంగు విచారింప సంజీవకుండు లోకంబు లోనివాడే. ఏమికాల దోషంబో యిప్పుడీ తండాతండుగాడనితో చెడు' అని ఒక దీర్ఘో పన్యాస మిచ్చి కరటకుని పిలిపించి అతణ్ణి కూడా అడిగి తెలుసుకోమంటాడు. వాడూ వీడికి వంత పలికితే చివరకు సంజీవకుడి దగ్గరకు వెళ్లి ఇదేదీ చెప్పకుండా 'ఈ యనర్థంబూరక పుట్టదు. చేరువం జేరి యెవ్వరో చెవిగఱచెదరు. నేడు నీకయినది తేపు మాకయ్యెడునని బీదపలుకులు పలికి దానికి పురి ఎక్కిస్తాడు. అయ్యో- ఇది ఏ సంజయ రాయబారం కాదు. కృష్ణ రాయబారం కాదు. అద్భుతమైన **Diplomacy** గొప్ప **Political Strategy.** ఒక ఆషాఢభూతినీ ఒక దమనకునీ మానవ కాపట్యానికి నయవంచనకూ చిహ్నాలుగా రెండు పాత్రలను సృష్టించి అభిజ్ఞ లోకాని కందించి నందు కొక్క దానికి చాలు పరవస్తు వారి మానవ స్వభావవిజ్ఞానానికి మనమందరమూ బ్రహ్మరథం పట్టటానికి. ఇంతకూ కథా సన్నివేశాల నంత ప్రశాంత నదీ ప్రవాహంలాగా నడుపుతూ పోయాడంటే – పాత్రలూ వారి హావభావాలనూ సహృదయుల మనస్సులలో అంత లోతుగా హత్తుకొనేలా చిత్రించాడంటే – సూరిగారి కళా కౌశల మనన్య సామాన్యం. ఇప్పటికీ నా మనసులో లఘుపతనకుని నిజాయితీ – చిత్రాంగుని సాధుత్వమూ మంథరుని ఆప్యాయితా సంజీవకుని సౌజన్యమూ ఆర్జవమూ పింగళకుని అమాయికత్వమూ పశ్చాత్తాపమూ ఏకవీతన కావ్యం ద్వారా వేయలేని చెఱగని ముద్ర వేశాయి.

ఇక సూరిగారి ప్రకృతి వర్ణనలు చూస్తామా. ఈ సన్నివేశాలకు

దోహదం చేసే ఆ వర్ణనలు కూడా అతి లోకమే. 'నాటి రాత్రి కన్నులు మిఱుమిట్లు గొలుపు మెఱుములతో శ్రవణ కుహరములు విదారించు నుఱుములతో, గడవలతో ముంచి వంచినట్లు నిరంతర ధారమై మిన్ను మన్నేకమయినట్లు కాఱు గ్రమ్మి యొక వర్షము గురిసెను' ఇది వర్ష వర్ణన. 'అక్కడక్కడ మేతకుఁబోయిన శకుంత సంతానములు కొఱకులు మాని యిరవులకు రాఁదొడఁగె. వ్రేలు తమ తమ పనుల కదుపులను దోలుకొని పల్లియలకుఁబోవు చున్నారు. సూర్యుడు ప్రతీ ముఖమునందు సిందూర తిలకమునందము వహించుచున్నాడు. తరణి కిరణ వారము చల్లారఁ జల్లార నా కారాటము పెల్లు మీఱుచున్నది' ఇది సూర్యాస్తమయ వర్ణన. 'అప్పుడా పరిసర తరువులందు; దిరుగుచున్న కోతులు దేవాలయము దాపునకు వచ్చి ప్రాకారములు ప్రాకుచుఁభ్రాంత మహీరుహముల మీదికిఁ గుప్పించి దాటుచు వ్రేలుఁగొమ్మలు కాళ్లతోఁ బట్టి తలక్రిందుగా వ్రేలుచు పెనుగొమ్మలు కరములతోఁ బట్టియూఁ చుచు – విమానముల మీద గూరుచుండి వికృతముగా బరులు వీపుగీఱు కొనుచు నిక్కుచుబొమ లెత్తియుఱుగొట్టి బెదరించుచుఁ బండ్లిగి లించుచు ఇలా సాగుతుంది వానర స్వభావ వర్ణన. ఇంతకన్నా కోతుల చేష్టలెవరూ ఎక్కడా వర్ణించలేరు. సమగ్రమిది. వికలాంగంబులయి నేలంగూలిన శతాంగంబులును ఖండితశుండా దంతకాండంబులయి కొండల పిండు విడంబించు వేదండ తండంబులును ముంగాళ్లు విఱిగి డొక్కలు పెరిగి మాఱు మెడలు వైచి తాఱుమాఱుగఁ బడియున్న వారువంబులును నెఱమగంటిమి మెఱయ వాతెఱం గొఱుకుచుఁజాపు జంకె నల పొంకంబు వదలని శిరంబులును వాలుదొఱుంగని కరంబులును కరంబు మెఱయ వీరశయనంబు నొందిన యోధవారంబు గలిగి

ఘోరంబయి వివిక్తం బయిన యొక్క పొలికలవింగని. ఇది ఒక యుద్ధ భూమి వర్ణన. 'సమయ జామదగ్న్యుండు కరసహస్రంబు ఖండింప రక్త ప్రభా భాసమానుండను బ్రతాప హీనుండు నయి కృతవీర్య సూనుండునుంబోలె భానుండు చూపట్టుడు' ఇది సంధ్యాకాల సూర్యమండల వర్ణన 'అందలి రాజాంగనలు క్రీడార్థంబు వనంబున కుం బజని కుసుమాపచయం బొనరించి శ్రాంతియడంగజలంబు లాడం గోరి యొక్క సరసింగాంచి యనూనం బగు దాని మానోజ్ఞకంబునకు మానసంబుల నానందంబు నిట్ట వొడువం దత్తీరంబుc జేరి హారాది పరిష్కారంబు లూడ్చియ చ్చోట నునిచి చను కట్టులు గట్టి యొండొరుల చెట్టలు పట్టుకొని సుందర మంద గమనంబుల నొయ్యారంబు మీఱ నీరంబులడిగి... సలిల విహారంబు సలుపుచుండ నొక్కల తాంగి తోయంబులు దోయిలించి దోయిలించి యొక తోయ జాక్షి పయింజల్లి యది మాఱు కొని యేదే ది నిలువక చల్లుమా చూతమని మీఱం జల్లిన ధారాసారంబునకుc గేలొడ్డి పెడమొగంబిడి పెఱకే లెత్తి మ్రొక్కుచు నమ్మమ్మ చాలుంజాలు నీ జోలికింక రాను మాను మన - నయ్యది యస్సిరో యింత పిఱికివెనా - మఱియొక్క తెఱవ నెఱజాణవేని నావంక మఱలుము - చిఱుతుక దాని తోడ నాయింత బింకంబులు పొంకించెదవని పురికొలిపి తాను నదియు మలంగక తొలగక పట్టువదలక నట్టు గదలక పరస్పర కరకమల సమీరిత వారి ధారలలో గకతోగుచు నొండొరుల హెచ్చుచు మెచ్చుచు - ఇలా సాగిపోతుందొక జలక్రీడా వర్ణన. మొత్తం కావ్య వాఙ్మయంలో ఉన్న జలవర్ణనలన్నీ ఒకచోట కుప్ప పోశాడా అనిపిస్తుంది పరవస్తువారు.

పోతే ఇక పింగళిక సంజీవకుల యుద్ధ వర్ణన. అమోఘ మద్భుతం. 'ఆహాహా సాహసంబు. ప్రలయజ్వలనంబు పయి శలభంబు విలంఘింప

దలంచె – నౌరా కావరంబని యధిక్షేపించుచు హర్యక్ష వల్లభుండు విపక్ష శిక్షా దీకక్షంబూనిసముత్థితుండయి నిర్గ మించి – ఖురప్రహారం బులదుమారంబులాకాశం బునిరవ కాశంబుగ తిరోహించి ప్రావృషేణ్య ధారా ధరవారంబు విడంబింప ధరాతలంబ దుర దురవలోక భీకరా కారంబు మీఱం బాఱు దెంచు నుక్షాధ్యక్షు వీక్షించి ధరాధరంబులు మాఱు చెలంగ క్ష్వేళారావంబు గావించి సటాధూటంబు నిక్కం గర్ణంబులు తీక్ష్ణించి పింగళేక్షణంబుల విస్ఫులింగంబు లెగయ నరాళ దంష్ట్రాకరాళంబుగ నాస్య గహ్వారంబు దెఱచి జిహ్వా పల్లపంబల్లార్ప్చు. గుప్పింపం జొప్పుదప్పించి వృషభేంద్రుండు సముక్షి ప్తవాల విక్షేపంబు మీఱం బెల్లుద్రుళ్కి – భూనభోంతరంబులు బూరటిల్ల నుదారారావంబు గావించుచు మస్తకంబు వాంచి యేట వాలుగం గొమ్ములొడ్డు కొని యురమ్ము గ్రుమ్మ' ఇలా చాలా దూరం నడుస్తుంది వర్ణన. ఇది సంస్కృత భూయిష్ఠమైన దైతే అచ్చ తెలుగు వర్ణనతో ముగుస్తుందది చివరకు. తదవసరంబున మెగంబుల రాయండు వొడవొందిన కాతాళంబనం గడు న డరి మెడజుంజుఱులు నిక్క బెడిదంపుటుఱుమునుఱు లుని నెఱ బొబ్బయిడి చెంగున నెగిరి కోలగగ్గెరకుఁబోలె నేలఁగూలఁద్రోచి ముంగాళ్ల నొత్తి పట్టి కుత్తుకం గఱచి నెత్తురు గుటగుటం ద్రావియా బసవని నుసుఱున కుంబాచి ప్రశాంత క్రోధుం డయ్యాడని ముగిస్తాడు. కాని ఆ తరువాత ఆ సింహం పడ్డ పశ్చాత్తాపం వర్ణిస్తాడు కవి. హృదయ విదారకమది.

ఏది చూచినా అది అతిలోకమే గాక ఆయా సందర్భాలకు అతికినట్టు వర్ణన సాగటమింకా లోకోత్తరం. కడకు నల్లీ చీరపోతూ మాటాడుకొనే మాటలలో రాజుల భోజనమెలాటిదో వర్ణిస్తాడు. అదీ

ఎంతో మనోజ్ఞం. సందర్భోచితం. 'శాల్యోదనంబును హైయంగ వీనంబును మధురసూపంబును సారతర శాకంబులును రుచ్యంబులగు భక్ష్యంబులును నానాఫలంబులును రసాయనంబులును వివిధ మాంసంబులును గోక్షీరంబులును మద్యంబులును నానా విధోపదంశంబులును బిచ్చిల దధియును శర్కరయుఁబుల కండంబును గంధోదకంబులును లోనగు మంచి పదార్థంబులను భవించుచు నెండ కన్నెఱుంగని రాజులట రాజులు. ఈ రాజు భోజన వర్ణన చూస్తుంటే శ్రీనాథుని భోజన వర్ణన జ్ఞప్తికి వస్తుంది. అదీ ఎవరు వర్ణిస్తున్నారు. ఒక మత్కుణం. ఇలాంటి భోజనం చేసే రాజులమేని రక్తంబుకరంబు స్వాద్యంబయి యుండునని 'విన్నదట అది – ఇలా ఏది వర్ణించినా వర్ణన కోసమని వర్ణించటం గాదు. ఆయా సందర్భాలకు తగినరీ తిలో సాగుతుందాయన వర్ణన. అలా కాకుండా చేస్తే అది తన పాండిత్య ప్రకర్ష చూపాలని చేసే చాపల్యమని పించుకొంటుంది.

సౌందర్యంతో పాటు ఇలాంటి ఔచిత్యం కూడా ఎంతో గొప్పగా పాటిస్తాడు చిన్నయసూరి. 'రాచకొమారు డాచమనము చేయను వసారాలో' వస్తున్నాడంటాడు. మూత్రోత్సర్గ మనవచ్చు. కాని అది మరీ పేలవమూ ఉద్వేజకమూ రసజ్ఞులకు. దానికి బదులాచమనమనే మాట చాలా నాజూకైన మాట. దీని జత మాట శౌచం శాచాచమనా లంటే విణ్మూత్రాలని అర్థం. అలాగే ఒక కోడి వచ్చి తిలల మీద 'మూత్రంచకార' అని ఉన్నది మూలంలో. అది ఎబ్బెట్టుగా తోచి 'ఒక కోడి వచ్చి యాతిలలు కాళ్లతోఁ జీరి చల్లులాడె' నని వర్ణిస్తాడు సూరి. అంతకన్నా ఇది ఇంకా సహజంగా సుందరంగా లేదూ.' ఆహార నిద్రా భయ మైథునాని' అని ప్రసిద్ధమైన శ్లోక పాదం. అది అనువదిస్తూ మైథునమనే

మాట వదిలేసి మిగతా మూడే పేర్కొంటాడాయన 'ఎల్ల జంతువుల కాహార నిద్రా భయములు సహజ ధర్ములు' అని దమనకుడు కరటకునితో అన్న మాట. మైథునమని అదే పనిగా వాకొనటం దేనికి. పగలు ఆహారం రాత్రి నిద్ర – ఈ రెండు మాటలలో కలిసి రాదా అది అని ఆయన హృదయం. మరి ' ఒక ముసలి మల్లుచేవ దూలముడాసి దాని నెఱియలోఁదనము ష్కము వ్రేలం గూర్చున్న' దని వర్ణిస్తాడు. ముష్కమంటే వృషణమని అర్థం. ముష్కోండకోశో వృషణ అని అమరకోశం. వృషణమూ అండకోశమూ అని పేర్కొంటే అంత బాగా ఉండదు. బాలురకు గదా నీతి కథలు చెబుతున్నాడు. ఇప్పుడే వారి చెవులలో ఇలాటి మాటలు పడటమెందుకని కొంత గోప్యంగా ఉంటుందని ముష్కమనే శబ్దమే మూడు నాలుగుసార్లు వాడుతాడు గాని మార్పు కోసమైనా మరొక మాట వాడడు. మఱి ధావకనుల్లుడనే చాకి వాడు తన భార్యను కౌగిలించుకొని సురత శ్రమఖిన్నుఁ గాఢం సుష్వాప' అని మూలంలో ఉంటే అది మార్చి 'ఒకనాడు వాడు మిగుల బట్టలు గుంజిన బడలిక చేత మయిమఱచి గుఱుపెట్టి నిద్రపోవు చుండె'నని వర్ణిస్తాడు. అలాటి అశ్లీల వర్ణన కంటే ఇది ఎంత సహజంగా సముచితంగా ఉందో చూడండి. ధావకమల్లుడని పేరు పెట్టి నందుకు బట్టలు గుంజిన బడలికతో నిద్రించాడంటే బాగుంటుంది కూడా. ఇలాటి ఔచిత్య పాలనలో నిష్ణాతుడు చిన్నయసూరి. చాలా పెద్దమనిషి తరహా కనిపిస్తుంది రచయితలో ఇలాటి రచనా ధోరణి చూస్తున్నప్పుడు. ఔచిత్యమనేది కావ్య రస స్ఫూర్తి కొక ఉపనిషత్తులాంటి దంటాడు ఆనందవర్ధనుడు. అది అక్షరాలా పాటించినవాడు సూరి మహాశయుడు. ఆఖరుకు ఆయా ప్రదేశాలకూ పాత్రలకూ పేర్లు పెట్టడంలో కూడా

ఎంతో జాగ్రత్త చూపుతాడు. మందారవతి యను వనమట అజస్తుందం జనావతి అనే పట్టణాలట. మామూలుగా అజతుందం జనవతి అనే రూపాలే ఏర్పడాలి. కాని సంస్కృత వ్యాకరణాన్ని అనుసరించి అజస్తుందమని అమరావతిలాగా జనావతి అని ఏర్పడతాయి రూపాలు. అది తెలిసి పేర్లు పెడతాడు రచయిత. దర్పసారం సత్త్వసారమని సింహానికి పేర్లు. చీరపోతు పేరు మంద విసర్పిణి – నెమ్మదిగా ప్రాకి పోయేది. మత్కుణం పేరు డిండిమం. ఒక దుందుభి లాగా శబ్దం చేసేది. అలాగే ధావక మల్లుడనే పేరా చాకలికి. బాగా బట్టలుతకటంలో ఆరితేరినవాడు గనుక ఆ పేరు.

అంతేగాదు. నానార్థాలూ పర్యాయ పదాలూ వాడటంలో – అదీ ఎక్కడ ఏ సందర్భంలో ఎలాటి పదం వాడాలో – ఆయనకు తెలిసినట్టు ఎవరికీ తెలియదు. అందులోనూ అనుప్రాసాది శబ్దాలంకారాలు కూడా తొంగి చూస్తుంటాయి. ఇది ఎంతో అందమిస్తుంది పద ప్రయోగానికి. చూడండి. కొన్ని మాటలు మీరే ఆశ్చర్యపోతారు. 'అంతనొక్కనక్క ఒక మాయావియయిన గోమాయువు. తొల్లి యెకజంబుకమ్ము వనమ్మునంగ్రుమ్మరుచు – నల్లంగారి పేరిన దాని ఫేరవం బొక్కండు గాంచి – ఆవంచకంబు పంచత్వంబు నొందె' నక్క అనే మాటకెన్ని పర్యాయాలు వాడాడో చూడండి. మఱి పరివ్రాజక బ్రువుండు – అయ్యోగి – యామస్కరి ధనంబు తస్కరింపగోరి – స్వాములు కడు బడలి యున్నారు ఒకనాడా పారాశరి దారిం బోవుచుండ నాటక్కు దారి – ఆ కర్మంది వెఱగంది – ఆ సన్న్యాసి యయ్యది విలోకించి' చూడండి సన్న్యాసి కాయన వాడిన పర్యాయపదాలు. మరి ధ్రునోదము సారోదం నిత్యాప మనే మాటలెంత లాక్షణిక శబ్దాలు. ప్రతీప ప్రతాప దీప నిర్వాపణ మహాబలుఁడగు మహాబలుడు. మహాబల శబ్దానికెన్ని అర్థాలు. 'తఱి

దప్పి నాకాహారంబు పనుచుట చూడ నావేడిమి చవి ఇంకొక్క మఱి చూడ వేడి కాబోలు' ఇది ఎంత సొగసుగా ఉన్నదీ ప్రయోగం. వేడి అంటే కోరి. వేడిమి అంటే ప్రతాపం చూడ అంటే ఆలోచించగా. చూడ అంటే రుచి చూడట మను భవించటం. ఇలా శబ్దాలు తిప్పి తిప్పి ప్రయోగించినా గొప్పగా ఉంటాయి.

అంతేకాదు. ఏ పదానికే పదం ప్రక్కన వాడితే సరిపోతుందో అతికినట్లుంటుందో ఆ మర్మం తెలిసిన వాడాయన. 'కిరాత వరాహా లట - పందియు మృతిఁబొందెను. త్రొక్కుడులఁబడి మడిసెను. ఇన్ని పాట్లు వడు కుక్క కొక్క ముద్ద వంటకము - శునకము తన కోగిరము పెట్టువాని కడఁజేరి - ఏలిక నాయందు సాకతము లేక యున్నాడు. అరాళ దంష్ట్రా కరాళము - ఆప్యగహ్వారంబు - జిహ్వోపల్లవంబు - ఖుర ప్రహారంబుల దుమారంబులు - పరస్పర కరకమల సమీరిత వారి ధారలు' ఇలాంటి వెన్నో కుప్ప తెప్పలు. ఆఖరుకాహా ఇట్టి యాహారంబు - దళంబగు కొందళంబు అందలి దందశూకంబు' అని అలవోకగా అంటున్నా ఆయన - మాటలు వాటిపాటి కవి ఒకదానితో ఒకటి **March** అవుతూనే ఉంటాయి.

ఇంకొక చమత్కారమేమంటే ఒక అర్థం పైకి కనిపిస్తుంటే మరొక అర్థం లోపల ధ్వనిస్తుంటుంది. ఒకరు ఒకటి గ్రహిస్తే ఇంకొకరు ఇంకొక అర్థం గ్రహించటాని కుద్దేశించి ప్రయోగిస్తాడు రచయిత. 'ఓయి కర్కటకోత్తమా! నీవు మిక్కిలి బుద్ధిమంతుడవు. ఆకారంబు చేతన భావంబు భావింప సమర్థుండవు' అని ఆ కొంగ అన్నట్టే ఆ ఎండ్రి దాని వాలకం కనిపెట్టి చివరకు దాన్ని హతమారుస్తుంది. అంతే కాదు 'నిపుణు గప్పిన నిప్పువలె నున్నాడని' ఆ చేపలన్నీ ప్రశంసించి నందు కది సాధుపలవే ఆ బకం. ఆకారంలోని భావాన్ని భావించగలవని గదా

ఆ చేపనే ఎంద్రిని కీర్తించిందా కొంగ. అలాగే దూరం నుంచే ఇది నన్ను కొండ కొమ్ము చెంతకు కొని పోతున్నది. ఇక్కడ నీళ్లు లేవని ఆప్తుల వలన విన్నాడను. చూడబోతే ఈ కొంగ మోసగాడని గ్రహించిందది. అంతేగాక దానితో దుసికిల కుండ నన్ను పట్టుకొని పోజాలవు. జాటిపడితే నీ అభిమతంబు సిద్ధించ దంటుంది. ఏమిటి దాని అభిమతం వాటిలాగా దీన్ని భక్షించటం. నేను నీ కంఠంబు కవుగిలించి పట్టుకొని వచ్చెదను 'గమ్యస్థానమునకు బోక మునుపు నా పట్టు విడువ' నంటుంది. రెండర్థాలిక్కడ. ఒక పట్టు పట్టుకోవటం. ఒక పట్టు పంతం. గమ్యస్థానమో, కొండమీది కని ఒక అర్థం. కొంగకైతే యమలోకమే గమ్యస్థానమని మరొక అర్థం. ఒక్కమాట ఆప్తుల వలన అని ఆప్తశబ్దం వాడాడింతకు ముందు. ఆప్తి ఎవడికుంటే వాడాప్తుడు. ఆస్తి అంటే ప్రత్యక్ష దర్శనం. ఆప్త వాక్యం ప్రమాణమని శాస్త్రం. ఎంద్రి ఆ మాట అనటంలో రచయిత శాస్త్ర పరిభాషా జ్ఞానమెంత గొప్పగా ధ్వనిస్తున్నదో చూడండి.

ఇక ఆషాఢభూతి మాటలు వినండి. ఎన్ని వ్యంగ్యార్థాలు ధ్వనిస్తుంటాయో మనకు 'స్వామీ తమయందు గుప్తంబయి యనన్య సాధ్యం బైనయర్థంబు తమకు శుశ్రూష యొనరించి పడయంగోరిన వాడ' ఏమిటి వేదాంతార్థమా గుప్తమైన అర్థం. ఆ సన్న్యాసి ధనమా. ఏదైనా కావచ్చు. నా యాప్సితార్థమదే. అది తప్ప మతియొక్కండే నొల్లనంటాడు. ఇక్కడ మాటలు విఱిచి మన మర్థం చెప్పుకోవాలి. మతియొక్కండే – నొల్ల. వేదాంతార్థం తప్ప మరేదీ అక్కర లేదని పైకి. మరియొక్కండు – ఏనొల్ల – నా కెందుకు వేదాంతం నీ డబ్బు తప్ప నాకేదీ అక్కరలేదని లోపల. 'మనలం జేరిన వారి కతను క్షోభంబు దుర్వారంబుగాదే' అనిచదురులాడు తారు రాజాంగనలు. ఇందులో

చేరిన వారి నీరని పైకి – పురుషులని లోనికి. అతను క్షోభం అధికమైన కలత నీటికైతే. మగవారికైతే మదనతాపం. 'నీ సొమ్ము నా సొమ్ముగాc జూతుcగాని వేఱుగాcజూడ'నంటా డొక వర్తకుడు. అలాగే చూస్తాడు కూడా. చివర న్యాయస్థానంలో గాని ఎవరి సొమ్మైనదీ తెలియదది. తృణమైనంబరుల సొమ్ము. 'తృణమైనా తీసుకోగూడదని ఒక అర్థం. తృణమైతే నాకెందుకు. మణులూ మాణిక్యాలుంటే చెప్పు అది కావాలి నాకని కూడా స్ఫురిస్తుందొక అర్థం.

అసలూరక మాటాడుతుంటే ఆయా పాత్రలు – మాటలలోనే ఎంతో హాస్యం నిగూఢంగా స్ఫురిస్తుంటుంది మనకు. మనలో నవ్వుకొంటాము కూడా. 'ఇక్కడ గంగలో నిత్యము స్నానము చేసి బ్రహ్మచారి నైచాంద్రాయణ వ్రతము చేయుచున్నాడను. ఆహా ఎంత మాటాడితిరి. ఎంత పాపము చేసి యీ పిల్లి జన్మమెత్తితినో యిది చాలక యీ పాపము సయితము కట్టుకోవలెనా – కృష్ణ కృష్ణ అని చెవులు మూసికొన్నదట' మార్జాలం, 'అయ్యో పెనుతొంపిలో దిగcబడితివి గదా. నేను వచ్చి నిన్ను లేవనెత్తెదను' పెద్ద పులి మాటలివి. తగిలియుండె నాయింతకు యమలోకములోc బ్రాత కాపనయి యుండవా. ఇక్కడ నుండనేల యీ చెడగఱపు బోడ కట్టి మోదులు పడి ప్రాణములు కోలుపోనేల' ఎలుక మాటలు – దానిcబట్టి నేలం గొట్టి కాలంబు తుదముట్టించె' 'ఈడువంజాలంక యీడిగిల బడిన యొక్క బక్క యెద్దు. మనకంటె శూరుడు మనరాజు. చేరువంజేరి యెవ్వరో చెవి గఱచెదరు. చేటెఱుగని పాటు పడియెదవు. కొంద ఱర్ధశాస్త్రానభిజ్ఞు లయ్యుంబండిత మానులయి. పండితమ్మన్యులని అసలర్థం. పండితులు కారు వారు చెట్లూ చేమలని మరొక అర్థం. అది అసలు మ్రానునే శబ్దమైనా మాననే వ్యావహారిక స్ఫూర్తినిస్తున్నది. ఇలాంటి చమక్కులెన్నో అడుగడుగుకూ

తారసిల్లుతాయి రచనలో. ఇక సామెతలైతే కుప్పతెప్పలు. ఓటిలోఁ దల దూర్చి రోకటి పోటునకు వెఱవదీఱునా. తన్ను గట్టఁడ్రాళ్లు తాదెచ్చుకొన్నట్లు– పయో ముఖ విషకుంభం. గత జలసేతుబందనం – ఎన్ని చెప్పమంటారు. చూడండి మీకే అర్థమవుతుంది.

అసలిదంతా ఏముంది. ఈ సామగ్రి కంతా మకుటాయమానమైన ఆయన వచనా రచనా కౌశలం చూడాలి. అది అనన్యాదృశ మాంధ్ర భాషలో. వచనామృత మన్నందుకు నిజంగా వచనామృతమే. అమృతంలాగా అది మన తెనుగు భాష బ్రతికున్నంత వరకూ అజరామరంగా బ్రతికి ఉండేదే. ఎప్పటికీ కనుమఱుగయ్యే ప్రశ్నే లేదు. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం మీకు స్పష్టం చేయవలసి ఉంది. వ్యావహారికమనీ గ్రాంధికమనీ మన తెనుగు భాష రెండు పాయలుగా చీలిపోయింది. ఇది ఒక వందా రెండు వందల సంవత్సరాల నుంచీ భాషలో ఏర్పడిన సమస్య. రచయిత లందరూ అదా ఇదా ఏది అనుసరించాలి ఏది తమ రచనలో ప్రయోగించాలని మల్లగుల్లాలు పడుతూ వచ్చారు. అలాంటి సమయంలో వచ్చాడు చిన్నయసూరి. నన్నయ కాలం నుంచీ వస్తున్న భాష చూచాడు. అప్పుడప్పుడే తల ఎత్తుతున్న భాషా గమనించాడు. ఏది అనుసరిద్దామా అని ఎంతో కాలం మథనపడి ఉంటాడు. తోడి దాక్షిణాత్య భాషలే గాక ఔత్తరాహమైన హిందీ మరాఠీ గుజరాతీ బెంగాళి భాషలు కూడా ఎలా నడుస్తున్నాయో వారి నడిగి తెలుసుకొని ఉంటాడు. పైగా ఆంగ్లేయ విద్వాంసులతో సంబంధ ముంది కాబట్టి వారి అభిప్రాయమూ సేకరించాడు. వారి భాషలో లోక వ్యవహారానికీ గ్రంథ వ్యవహారానికీ ఎక్కువ తేడా ఉన్నట్టు కనపడలే దాయనకు. పైగా వ్యాకరణ సమ్మతంగా భాష నడుస్తున్నట్టు గమనించాడు. అలాంటప్పుడొక తెలుగులోనే ఎందుకింత తేడా

వచ్చిందని ఆలోచించి వ్యవహారానికి అంతగా దూరంగాని గ్రాంధికమైతే బాగుంటుందని దానికే ఓటు వేస్తూ పోయాడాయన.

కనుకనే ఆయన భాష వ్యావహారిక మనుకొంటే వ్యావహారికం. గ్రాంధికమంటే గ్రాంధికమన్నట్టుంటుంది. రెండు మార్గాలూ చూపటానికా అన్నట్టు మిత్రలాభమంతా ఒక శైలిలో నడిపితే మిత్రభేదం మరొక శైలిలో నడిపాడు. మిత్రలాభంలో చాలావరకూ కాకంబు కూర్మంబు అని బిందు పూర్వకబు వర్ణాలు గాని - చూడా కర్ణుండు వీణాకర్ణుండని బిందుపూర్వడు వర్ణాలు గాని కనపడవు. జంబుకమ్ము వనమ్మని మా ముడులు కూడా కానరావు. కానంబడియెడిని. లభించెడిని అని ఎడిఎడు వర్ణాంత క్రియలు కూడా దొరకవు. అవన్నీ మిత్రభేదంలో తరుచుగా దర్శనమిస్తాయి. కాని ఒక్కమాట. ఆయన గ్రాంధికంలో వ్రాసినా వాక్యరచన లోకవ్యవహారానికి చాలా దగ్గరగా ఉండి సహజంగా తెనుగు నుడికారానికి సమ్మతంగా కనిపిస్తుంది. మరి కేవలం వ్యావహారికంగా వ్రాస్తున్నామని గొప్పలు చెప్పుకొనే తరువాత వారి రచనలో అది వ్యావహారికమే గాదు. కృత్రిమమైన వ్యావహారిక మనిపిస్తుంది. మరి వేదం వేంకటరాయ శాస్త్రి కొక్కొండ వెంటక రత్నం వీరేశలింగంగారి గ్రాంధిక భాష కూడా వ్యవహారానికి దూరమైన కృత్రిమ గ్రాంధికంగా గోచరిస్తుంటుంది. అటువారికి గాని ఇటువారికి గాని చిన్నయసూరి శైలి ఏమాత్రమూ పట్టుపడలేదు. అది ఎవరికీ ఏనాడూ పట్టుపడదని పిస్తుంది నాకు. నేనే మొదట మొదట ఆయన వాక్యరచన లాగా వాక్యాలు వ్రాయాలని ఎంతగానో ప్రయత్నించాను. కాని అది తెచ్చిపెట్టుకొన్నది గానే కనిపించేది గాని సహజంగా కనిపించేది గాదు. అందుకే మన సొమ్ముగాదని సహజమైన వ్యావహారిక శైలిలో నా పుస్తకాలు వ్రాస్తూ వచ్చాను. అలాటిదీ సూరిగారి గ్రాంధిక భాష.

గ్రాంధికమైనా సరే ఆ శైలి సహజమైనదీ సజీవమైనదీ. జోడు గుఱ్ఱాల స్వారీ ఆయన ఒక్కడే చేయగలిగాడు. మరి ఎవరికీ సాధ్యపడ లేదప్పటికీ ఇప్పటికీ. వ్యవహారంలో గ్రాంధికం గ్రాంధికంలో వ్యావహారికం చూడగల చూపి మెప్పింపగల మహా మాంత్రికుడాయన. చెలికాడా నీవు పరుల సొమ్మున కాశపడవు. పరులను బాధింపఁబోవు. అడవిలోని గడ్డిమేసి పడియ నీరు త్రాగి యొక చెట్టు నీడలోఁబడి యుండి ప్రొద్దు బుత్తువు. నీవొక్క కడుఁజేత యెఱుఁగవు. నీవంటి సాధువునకా యిట్టి యాపద రావలె. ఇంత దూరము చింతింప నేల. ఎంత వారికిఁగాని దైవ మలంఘ్యము. నీకు మాఱు లేదు గనుక నీతులని నోరికి వచ్చినవి వదరుచున్నావు. వీడు తనవాడని వీడు పరుడని యెన్నిక లఘుబుద్ధులకు. మహాత్ములకు లోకమే కుటుంబము. ఇది వ్యావహారికమా గ్రాంధికమా చెప్పండి. వ్యాకరణ సమ్మతంగా వ్రాసినా ఎంత సహజంగా సుందరంగా సాగుతున్నదో చూడండి భాషాశైలి.

ఇక కొంత ప్రౌఢంగా వ్రాసినా అది వ్యావహారికమే ననిపిస్తుంది. 'భోగత్యాగములకు వినియోగింపని ధనముంట వలన ఫలమేమి. పోకడ వలన హానియేమి – లోభి ధతనికుడయ్యు భోగ విరహముచే దరిద్రునితో సమానుడే. లోభి తన ధనము పేదలకు, బెట్టఁడు. చుట్టములకు వినియోగింపడు. తామం గుడు వడు. కడపట నేల పాలో దొంగల పాలో చేయచున్నాడు. చూచారా ఈ శైలి. గ్రాంధికమా వ్యావహారికమా మీరే చెప్పండి. ఏదనుకొంటే అది. ఇంకా ప్రౌఢ తరమైన శైలి చూస్తారా. ఎవ్వడు హంసములను శుకములను మయూరములను శుక్లహరిత చిత్రములఁగా వించెనా యీశ్వరుడాయీయి జంతువుల కనురూపమైన వృత్తిని గల్పించువాడు. మూఢులీయర్థమెఱుగక వృత్తి కయి పడరాని పాట్లు పడి కాలము వ్యర్థముగాఁబో గొట్టుచున్నారు. దరునకా నీవు

మాకు హిత భృత్యుండవు. నీవచనంబు మాకపశ్య గ్రాహ్యంబు – మేము నీకుఁగ్రొత్త వారమే. ఏల జంకువడి. యెదవు. నీయిచ్చ వచ్చిన చొప్పునం జెప్పవచ్చును.

ఇంకా ప్రౌఢ తమమైన వచన శైలి వింటారా. లోకుంబున నుత్తముండగు శూరునకుం బర ప్రకర్షంబు సహ్యంబగునే. అలతివాని నేనింబగవాని నొప్పరి కింపం జనదన లాతివానిం జెప్పనేల. ఎట్టివానికేని బలదర్పంబున బగతు నొప్పరికించునట్టి వానిక శక్తి భీరుత్వంబులు లోకు లారోపింతురు. ఈయరణ్యంబు మదధీనంబు. ఈ దేశంబున నాయా దేశంబునంగాక యాకయినం గదల వెఱచు. వింటివా నేడొక్క విపరీతంబు. ఇసుమంతయయిన నంతరం గంబున భయం బునం బొరయక యిట్లు ఘోరంబయిన యారాపము గావించిన జంతువలంతి గనుగుదని చింతించెద. దమనకా వినుము. కలకాలంబు బ్రదుకంబోము. చావు నిక్కంబు. మనకన్నుల ముందఱంబుట్టి గిట్టినవారి నెందఱం గానము. నిన్నయున్న వాఁడు నేఁడు లేఁడు. మరి అత్యంత ప్రౌఢమైన రచన చూస్తారా. 'దేవాతావకంబగు నపాంగావ లోకంబున కుం బాత్రం బైనయీ వన క్షేత్రంబున జంతు సంతానంబున కావంతయైన – గొఱంత కుశలంబునం గలుగ దనం దావక సేవకులగు మాపంటివారి కయ్యది యడుగం బనియేమి' ఇలా నడుస్తూ పోతుంది. ఇలా పొడిపొడి మాట లేమిటి. కట్టుదిట్టమైన మాటలేమిటి. చట్టుబండ లలాంటి అతి గట్టి మాటలేమిటి. ఏమాటలతో వాక్యమనే గోడ గట్టినా కట్టుగలడు. కట్టి మనకు చూపగలడు. చూపి ఇది గ్రాంధికమా వ్యావహారికమా. లక్షణ బద్ధమా లక్షణ విరుద్ధమా. ఎలాంటిదైనా అసలు తెనుగు జాతీయానికి దూరమా దగ్గరా మీరే తేల్చుకొండి నేను చెప్పేది కాదది. నా అంతరాత్మే నాకు చెబుతున్నదిది సజీవమైన తెనుగు భాష

అని. మీరేమనుకొన్నా సరేనని మౌనంగా మనలను హెచ్చరిస్తున్నట్టుటుం దాయన వచన రచన.

పోతే ఇక ఆ వచనంలో ఆయన త్రొక్కిన మార్గాలంటారా. చూపిన చమత్కారాలాంటారా. అతిలోకం. ఆలంకారికులు - మనవారే గాదు - పాశ్చాత్య విమర్శకులూ బోధించిన సూత్రాలకెంత అనురోధంగా ఉంటాయో చెప్పనలవి గాదు. మన ఆలంకారికులు వచన మెలా నడిస్తే బాగుంటుందో మూడు మాటల్లో చెప్పారు. ఒకటి వృత్తగంధి రెండవది చూర్ణితకం మూడవది ఉత్కలికా ప్రాయం. వృత్తగంధి. అంటే పద్యంలాగా పద్యపాదంలాగా నడవటం. చూర్ణితమంటే పొడిపొడిగా శిధిల బంధంతో సాగటం. ఉత్కలిక అంటే జిగేలు జిగేలుమని మెరిసి పోతున్నట్టు ఉజ్జ్వలంగా సాగటం. 'మగధ దేశమందు మందార వారి యనువనము గలదు.' ఈ వాక్యంలో వతి యను వఱకూ వృత్తగంధి. యతి కూడా సరిపోతుంది. అలాగే 'నిన్నయున్నవాడు నేడు లేడు' ఆది ఆట వెలది బేసి పాదమైతే ఇది దాని సరిపాదం. నిన్న నేడని యతిస్థానం కూడా చక్కగా కుదిరింది. ఇలాంటి వెన్నో. అసలు బాలవ్యాకరణంలోనే 'యువతివి టీరజస్వలలు గుబ్బెత మిండత ముట్టుతలు నాఁబడుదుర'ని సూత్రం చదువుతుంటేనే ఇది చంపకమాలా వృత్త పాదమా ఏమని పిస్తుంది మనకు. ఇలా తెలుగులోనే గాదు 'సూచీముఖాలంకృత నాతసికాగ్ర'లని వర్ణిస్తుంటే సూచీముఖాలంకృత నాసికాగ్రా' అని ఏ సంస్కృత శ్లోక పాదమో జ్ఞప్తికి వస్తుంది. అసలు వృత్తగంధే గాదు. గేయ గంధి అని ఆలంకారికులు మరొక విభాగం జేసినా బాగుండునని పిస్తుంది. ఆయన వాక్యరచన అక్కడక్కడా చూస్తే. 'డాయఁబోయి పట్టుకొని గనయమునఁగట్టు కొని మూఁపుమీదఁ బెట్టుకొని పోవుచుండెను' ఈ ఒయ్యారం చూడండి. పారంబు సేర వేగంబు మీర

నీదుచుం బోన – ఈ చిత్రగతి చూడండి. పాడినెఱినెఱిగిన గఱువఱి వలుకుదురు. ఈ గమన వేగం చూడండి. పదాద్యంబులు ఋతు వర్ణంబులు రల తుల్యంబులు. ఊయెల పయ్యెద తాయెతులం ద్రిక్క నామంబుల మధ్య యాకుందాలవ్య వక్రయోగంబు లేదని' వ్యాకరణ సూత్రాలు చదువుతున్నా కనిపిస్తుందీ గేయ సంధి.

సంగీతంలో లాగా ఆరోహణావరోహణాత్మకంగా కూడా నడుస్తూ పోతుంది రచన. 'కేసరి యాసన్నమైన ఱుక్కడి మృగమును లెక్కింపక నిజఖర నఖర విదారిత హస్తిమస్త మస్తిష్కమె కోరును. ఇది ఆరోహణ అయితే 'శునకము తన కోగిరము పెట్టువాని కడఁజేరితో కాడించును. నోరుకడుపు చూపును. ఇది అవరోహణ. అలాగే మొదట అవరోహణ అనిపిస్తూ పోను పోను ఆరోహణ మార్గమందుకొన్నా ఆశ్చర్యం లేదు. 'ఇన్ని పాట్లు వడుకుక్కకొక్క ముద్ద వంటకము కంటె మిక్కిలి పెట్టరు. ద్విరదము కరము ధీరముగా విలోకించుచు సారె కాధోరణోపలాలితమై మెల్లగా కబలము గొనియెడిని. హీనుడెంత దీన భావముతో వేడినను వానికెవ్వరునుదనియఁ బెట్టరు. అవరోహణ. గారవముగల వారికిఁ గోరికకు మీఱ నిత్తురు.' ఆరోహణ. ఇలా మీరు జాగ్రత్తగా పరిశీలిస్తూ పోవాలేగాని ఎంతో చిత్రవిచిత్రంగా కనిపిస్తుందా గేయ గంధి. ఆఖరుకు రాజాంగనల జలక్రీడా వర్ణనలో పరాకాష్ఠ నందుకొన్నదది. 'అస్పంద మిళింద సుందర వికసిత కుసుమరాజి విరాజమాన మల్లికా వల్లికా మతల్లికా విభ్రమాను కారిణు' లటవారు. ఆకాకీ క్రిందికి సూటిగా విడిచిన హారం క్రింది పుట్టలో పడుతుంటే ఎలా ఉందో తెలుసా. 'తత్రత్య కాల వ్యాళ వినాశ పిశునోల్కా పాతాను కారి' యగుచు కోమక్రంతలో పడ్డదది. ఎలా సాగుతూ క్రిందికి పోయిందో ఆహారమలాగే సాగుతూ పోతున్నదీ సమాసం.

వృత్తిగంధి గేయగంధి అయింది. చూర్ణితకం చూస్తారా కావలసినంత దొరుకుతుంది కావ్యంలో. 'తేపమావాస్య, బ్రహ్మణులకు భోజనము పెట్టవలెను. ఏమేమి భోజ్యపదార్థములు కూర్చిన దానవు. పురుషులు పదార్థములను సేకరించి యింటికి దెచ్చిరేని వానిని స్త్రీలు వలసిన పనులకు వాడుకొందురు గాని మీరు తేని పదార్థము లెక్కడి నుండి వచ్చును. కానిమ్ము మిగిలిపోయినది యిప్పుడు త్రవ్వుకోనేల. బుద్ధిమంతులు రాని దానికెదురు చూడరు. పోయిన దానికి వగవరు. విపత్తు వచ్చినప్పుడు వితాకుపడరు. ధనము పాతఱలో దాపటీకము చేయుట దాని వినాశమునకు దారి చేయుట గాని వేఱుగాదు. తటాకోదర జలములకుఁబరీ వాహము వలె సమార్జిత విత్తములకుఁ ద్యాగమే రక్షణము. దమనకా వినుము. కలశాలంబు బ్రదుకం బోము. చావు నిక్కంబు. మన కన్నుల ముందఱం బుట్టి గిట్టిన వారి నెందఱంగానము. నిన్న యున్న వాడు నేఁడు లేఁడు' ఇలాగా ఎన్నో ఉన్నాయి చూర్ణిత కాని కుదాహరణలు. అది శిథిల బంధము ప్రౌఢ బంధమని గాదు. ఎక్కడికక్కడ శిథిలమనిపించే ప్రౌఢం. ప్రౌఢమనిపించే శిథిలం. అది సూరి హృదయానికే తెలుసు. సహృదయుల హృదయాలకు తెలుసు.

ఇక ఉత్కలి కాప్రాయమంటే ఏమిటో చూస్తారా. 'హిమవంతంబు ప్రాంతంబునం గుసుమఫలసంతాన కాంతంబగు కాంతారంబు గలదు. అందలి కపిసందోహంబొక్క నాడు శీతంబు చేత బాధితంబయి జ్యోతిరింగణ సంఘం బుఁగాంచి యనలంబను బుద్ధిం జేసి డాసి చలిగాచి కొనుచుండ సూచీ ముఖంబను పక్షి వీక్షించి – భువన సారంబను కాసారంబు గలదు. అయ్యది చక్ర చక్రాంగ ప్రముఖ వివిధ జల విహంగమ సంచార రమ్యంబయి పుండరీకషండ సాంద్ర మరంద ధారాసార సంభ్రమ భ్రమ ద్భ్రమర ఝుంకార సంకులంబయి యెసంగు.

అనారతంబు లేనికి లగ్గు దలంతుంగాని యెగ్గు కలయందయినం దలంచి యెఱుంగ. లాఁతివారికైన నొక యెప్పమి గావింపమనంబు చొప్పడి యుండునే. అకారణంబ లేని కిట్టి బెట్టిదంపు గ్రోధంబు పుట్టించి సాధువులం జెఱుపనొడి గట్టిన పుణ్యాత్ములా బ్రహ్మకల్పంబు మనియెదశు గాఁబోలు. మీకిట్టి యుపకారంబొనరించు పుణ్యుండు సజ్జనాగ్ర గణ్యుండు గాడె దేవర యను గ్రహంబు గలిగిన నాతని సందర్శనంబునం జేసి మానేత్రంబులు సాఫల్య పాత్రంబులు గావించెదము. లేని పాలనెవ్వండొఖలుండు కల్ల నిజంబులు విపరీతంబులుగం బలికి యాతనికి నాయంద ప్రతి రోధంబగు క్రోధంబు పుట్టించినవాడు. పర్వదివసంబుల సముద్రుండు సముత్తుంగ రంగత్త రంగంబులు నింగి ముట్ట పొంగి వచ్చును. మన యావాసంబు కరం బాసన్నబగుటం జేసి నాయిడిన యండంబులు కాండా క్రాంతంబులగు. నావుడు నావిహంగంబు తన యంగన పలుకు లాలంబు చేసి మందహాస సుందర వదనంబుతోఁ గువలయ నివహంబునకుఁ దుహిన కిరణుండును బుండరీక షండంబునకు జండభానుండు ను జాతక వ్రాతంబునకు నాగాత కుండు ప్రభుండు. అతండు నిజపక్ష విక్షేప జాతవా తో ద్భూత కాండ కాండ చండబలుండు. తదాశ్రయుల మనల నిజడాశయుండు చెనకి మయి మయిం బోన నోపునే. ఏల యీలీల నాతరం బెఱుంగక కొఱమాలిన విచారంబులం జిత్తంబుహత్తించెదు. సమాహితం చిత్తమున నుండుము. ఇలా నడుస్తుంది ప్రౌఢ రమణీయంగా పరవస్తు వారి ఉత్కళికా ప్రాయమైన వచన రచనా రధం.

ఇంతే కాదు. భారతీయుల రీతి లక్షణాలే గాక పాశ్చాత్యులు పరిగణించిన రచనా రీతులు కొన్ని ఉన్నాయి. ఒకటి **Narrative Style** ఆఖ్యానశైలి. రెండు **Descriptive style** వర్ణనాత్మక శైలి. మూడు **Con-**

versational style సంవాత్మకమైన శైలి. నాలుగు **Argumentative sytle.** విచారణాత్మక శైలి. ఇవి కూడా బ్రహ్మాండంగా చూపుతూ వచ్చాడు చిన్నయసూరి తన రచనలో 'కల్యాణ కటకమను పట్టణ మందు భైరవుడను వ్యాధుడు కలడు. వాడొక నాడు వేటకయి సింగాణి తూపులు పలయురులు చిక్కము లోనగు సాధనములు పూని వింధ్యాటవికి బోయెను. అక్కడ వాడొక వది గావించుకొని మచ్చుపెట్టి పొంచి యుండి యొక పోతరించిన మృగము నేసి చంపి యెత్తియఱకడc బెట్టుకొని వచ్చుచుండగా నడగొండ వలెనొక పందికానబడెను. 'ఇలా ప్రశాంతంగా స్తిమితంగా సాగే ఆఖ్యాన శైలీ ఎంతో ఉంది. మఱి ఇంతకు ముందు నేనుదాహరించిన కోతుల చేష్టలు గాని సింహ వృషభముల యుద్ధ వర్ణనగాని ఒక మారు మీరు వెనక్కు తిరిగి చూడండి. అది ఆయన వర్ణనాత్మక శైలి ఎలా ఉంటుందో రుచి చూడగలరు. పోతే సంవాద శైలి అంటారా. 'లోనికి దొంగ చొచ్చినాడు చూచితివా – చూచితి జూనితి – మఱియేల మొఱుగవు. నా పని విచారింప నీకేమి నిమిత్తము. మన దొర యిల్లు దొద్ద వోగా నొప్పరికింప వచ్చునా. నీవే మొఱుగుదువు. రాత్రిం దివము నిమిష మాత్రమైన ప్రమాదపడక తలవాకిలి కాచుకొని యుండుదును. ఆవంతవైన నావలని ప్రయోజన మొఱుగక యేలిక నాయందు సాకతము లేకయున్నాడు. ఇలాంటి వెన్నో తారసిల్లుతా యక్కడక్కడా.

మరి విచారణాత్మకమంటారా. కావలసినన్ని సందర్భా లున్నాయి. 'కుసుమస్తబకమువలె మానవంతుడు సర్వజనుల మూర్ధము మీదనయిన సుండపలె లేదా వనమందు సమసిపోవలె. ఇక్కడనే వాసము చేసికొని యాచనతో జీవించెద నంటినా దానికంటె గర్హితము లేదు. ఒక ఱుక్కడిని యాచించు కంటి నిప్పులోcబడి శరీరము తొఱగుటమేలు.

పరధనా పహరణము కంటెఁ దిరియుట మంచిది. వివేక హీనుఁడైన ప్రభువును సేవించుట కంటె వనవాస ముత్తమము. యాచించుకొని బ్రతుకుటకంటె మరణము శ్రేయము. ఒకరి యిల్లు కాచి వారి పెట్టువో తలకు దోసిలి యొగ్గి యునికియు మిక్కిలి నింద్యము' ఇలాంటి వెన్నో ఉన్నాయి ఆయన కావ్యంలో ఉదాహరించ వలసిన ఘట్టాలు.

అనలింకొక్క విషయముంది మనం చెప్పుకోవలసింది. సంస్కృతాంధ్రాలు రెండూ సమపాళ్లలో నడపగలడు. అందులో అల్లసాని పెద్దన లాంటివాడు. కేవలం సంస్కృతం కేవలం తెలుగులో నడిపినా నడపగలడు. అది యుద్ధవర్ణనలో చూచాము మనం. అంతేకాదు. ఒక వాక్యం అనులోమమైతే ఒకటి ప్రతిలోమం. ఒకటి దీర్ఘమైతే ఒకటి హ్రస్వం. ఒకటి ప్రశ్నాత్మకమైతే ఒకటి అవధారణాత్మకం. రకరకాల సామాన్లతో సాగిపోయే పెండ్లి బండిలాగా సాగిపోతుంది కూడా ఆయన రచన. అలా అయితేనే అది విసుగని పించదు. అలా అనిపించక పోగా ఇంకా చదువుతూ పోదామనే కుతూహలం కలుగుతుంది పాఠకుడికి. చూడండి మీరే. ప్రధానుడు కావుట కెంత సేపు పట్టును. పురాకృత సుకృతము వలనఁ బ్రజ్ఞావంతుడవును. ప్రాజ్ఞుడు రాజపూజితుండవును. రాజ సమ్మానము చేతఁ బ్రజ్ఞ మిక్కిలి ప్రకాశించును. ఎట్టి ప్రజ్ఞావంతుడు గాని పేటి కాంతర్గత రత్నముఁబోలె నినా లోకయోగము లేక ప్రకాశింపఁడు. పురుషుఁడు సాధువర్తనుఁడయ్యె నేని సర్వలోక పూజ్యుడగును. కానిచో గర్వ్యుడగును. ఈ తావు తాత ముత్తాతలు సంపాదించిన కాణాచి గాదు భూమండలములో నింకఁ దావు దొరకదా. ఇక్కడ నుండ నేల. ఈ చెడగరపు బోడ గట్టి మోడులు వడి ప్రాణములు కోలు పోనేల – ఇలా **Variety in Style and syn tax** వాక్య నిర్మాణ వైవిధ్య మెంతైనా చూపగలడాయన.

ఇలా ఎంతని చెప్పమంటారు. ఎన్నని చూపమంటారు – ఆయన వచన రచనలోని సొగసులు. సొగసు చూడతరమా అన్న త్యాగయ్య కీర్తన జ్ఞాపకం వస్తుంది. అన్నట్టు త్యాగయ్యకు సమకాలికుడే చిన్నయసూరి. సంగీతం అభ్యసించిన వాడే అసలా మాటకు వస్తే. ఆయన వచనం గాని సూత్రాలుగాని నాదాత్మకంగానే సాగుతూ పోతాయి. చదివే తీరులో చదివితే. మొత్తానికలాంటి వాక్యరచనా శైలి మరలా మన మాంధ్ర దేశంలో ఎక్కడా చూడఁబోము. ఇక ఎప్పుడూ చూడబోమన్నా అతిశయోక్తి కాదు. కాళిదాసు తరువాత శ్లోకరచన సంస్కృతంలో ఎలా లేదో భట్టబాణుడి తరువాత గద్యరచన ఎలా లేదో – తెలుగులో పెద్దన తరువాత అలాంటి అల్లిక జిగిబిగి పద్యరచనలో ఎలా కనపడదో – అలాగే పరవస్తు వారి తరువాత అలాటి తెలుగు వచన రచన కూడా చూడబోము. నిజంగా వచన రచన ఆయనతోనే పుట్టి ఆయనతోనే అంతరించింది. అజరామరమది అమృతాయమానం.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

వీడుకోలు

ఇక్కడికి ద్వాదశాదిత్యులనే గ్రంధం మూడవ సంపుటం కూడా సమాప్తమయింది. నన్నయభట్టు మొదలుకొని చిన్నయసూరి వఱకు పన్నెండు గురుకవులు వారి కావ్యాలను గూర్చి నేను చర్చించిన చర్చాఫలమిది. వారి కావ్యాలను కూడా సర్వాంగీణంగా కాకుండా ఏ కవి కెందులో పట్టుందో దేని మూలంగా ఆయనకు లోకంలో ప్రసిద్ధి వచ్చిందో - అదే ప్రధానంగా తీసుకొని వారిలో ఏ ఒక్క అంశమో పట్టుకొని వ్రాసినా - అంతగా పాఠకులకు సంతృప్తి ఇవ్వదని నాకు తెలుసు. ఆ మాటకు వస్తే నాకే కలగదు తృప్తి. అంచేత ప్రధానంగా ఒకే అంశం పట్టుకొన్నా మిగతా కావ్య గుణాలను పోనివ్వకుండా వాటిలో కూడా వారికున్న ప్రవేశం తక్కువది కాదంటూ - అవి కూడా అక్కడక్కడా తడవి చూచాను. మొత్తానికి మూడు సంపుటాలలో ఒక్కొక్క సంపుటానికి నలుగురు చొప్పున మూడింటికీ మూడు నాలుగులు పన్నెండుగురు మహాకవులనే ఆదిత్యుల కవితా ప్రకాశ మెలాంటిదో యధాశక్తిగా నాకు తోచిన రీతిలో బయటపెట్టి ద్వాదశాదిత్యులనే ఈ సాహిత్య సమీక్షా గ్రంధాన్ని సహృదయ శిరోమణుల చేతులలో పెడుతున్నాను.

అయితే ఒక్క మాట. ఆ మాటంటే మీలో చాలామందికి బాధగా ఉంటుంది నాకు తెలుసు. అసలీ గ్రంధాలను చదివే నాధుడున్నాడా అని నా అనుమానం. నేను అద్వైత వేదాంత శాస్త్రం మీద ఎన్నో గ్రంధాలు వ్రాశాను. వాటిని శాస్త్రీయంగానే గాక భారత భాగవతాది పురాణ సాహిత్య గ్రంధాలకు ఎన్నో విధాల అన్వయించి కూడా చూపాను. మొదటి తరగతికి తత్త్వసాహిత్యమనీ రెండవ దానికి సాహిత్య తత్త్వమనీ

పేరు పెట్టి ప్రచురించానొక 20 వరకూ గ్రంధాలు. జగద్గురు మహోపదేశమేమి – ప్రస్థాన త్రయ పారిజాతమేమి – దక్షిణామూర్తి ప్రదక్షిణమేమి అవి శాస్త్ర ప్రధానమైతే – రామాయణ రామణీయక భాగవత సామ్రాజ్య మహాభారత వైభవాదులు – సాహిత్య ప్రధానమైనవి. అద్వైత వేదాంత క్షేత్రంలో నేను 40 సంవత్సరాల నుంచీ చేస్తూ వచ్చిన కృషికంతా అవి ఫల స్వరూపమైతే దానితో తృప్తి పడక ఇన్ని సంవత్సరాలూ తత్త్వ జిజ్ఞాసువులైన వారికెందరికో వాచా ఆయా ప్రదేశాలలో ప్రవచనం కూడా ఎంతో సాగిస్తూ వచ్చాను.

ఆసించినంత ఫలితం లేకపోయినా చాలావరకెంతో ఆసక్తితో ఆ పుస్తకాలు చదువుతూ దానితోపాటు నా మాటలు వింటూ దేశ విదేశాలలో నాకెంతో మంది శిష్య వర్గం తయారయినారు. వీరందరికీ మనన నిదిధ్యాసనలంతగా లేకపోయినా శ్రద్ధా భక్తులూ శ్రవణాభిలాష అయినా ఉన్నవని కొంతవరకూ నాకు సంతృప్తి. కాని ఇదేమి కర్మమో నేను చివరిసారిగా వ్రాయ సంకల్పించిన ఈ సాహిత్య విమర్శ గ్రంధంలో ఒక్కరికీ అభిలాష కనపడటం లేదు. ఇది వేదాంతంలాగా సార్వాజనీనం కాదు. చాలావరకు సాంకేతికమైన విద్య గదా. అందరికీ ఎలా ఉంటుందాసక్తి అనవచ్చు మీరు. ఒప్పుకొంటా, ఆ బాల గోపాలం అందరూ చదవరేమా అని గాదు నాదుగ్ధ. వేదాంత వాసన లేకపోయినా తెలుగు సాహిత్యంలో మొదటి నుంచీ కృషి చేసి అందులో **M.A. Ph.D.** పట్టాలు సైతం పుచ్చుకొన్న తెలుగు ఉపాధ్యాయుల విషయం నేనడుగుతున్నది. అలాంటి వారు కూడా పుస్తక మిస్తే పక్కన పెడుతున్నారే గాని ఇది వేదాంతం గాదు సాహిత్యం గదా ఏమి వ్రాశాడో చూద్దామనే కుతూహలమే లేదెవరికీ. మా ఇంటి పరిసరాలలో నివసించే

సన్నిహితులకూ లేదు. ఆయా పట్టణాలలో దూరంగా నివసించే వారికీ లేదు. వయసులో ఉన్నవారికీ లేదు. వయసు మళ్లిన వారికీ లేదు. ఇదంతా చూస్తే కొంతకాలానికీ నన్నయ ఎవరు చిన్నయ ఎవరు. వారు మానవులా ఎవరైనా దేవతలా లేక రాక్షసులా అని కూడా ప్రశ్నిస్తారేమోనని నా భయం.

ఈ నిక్షేపరాయల్ల వ్యవహారం చూస్తే నాకిప్పుడనిపిస్తున్నది ఎందుకా నేనింత శ్రమపడి ఈ సాహిత్య విమర్శ వ్రాశానా అని – వేదాంత గ్రంధ రచనతో నా రచనావ్యాసంగానికి మంగళం పాడి ఉంటే ఎంత బాగుండేదని. పైగా మొదటి రెండు సంపుటాలు వ్రాసి మూడవదింకా మొదలుపెట్టి అది ముగించకుండానే ఆలోపల మా కుటుంబంలో ఒక విషాద సంఘటన జరిగింది. ఉన్నట్టుండి మా ఆవిడ గుండె పోటుతో హఠాత్తుగా కన్నుమూసింది. ఈ పెద్ద వయసులో అనుకోకుండా ఇలాటి దెబ్బ తగిలేసరికి నా మనసు కేమీ బాగలేక అసలీ రచన ఇక్కడికి మానివేద్దా మనిపించింది. కాని కొందరు శిష్యులూ మిత్రులూ వేదాంత సాహిత్యాలు రెండింటిలో సమానమైన అభిలాష ఉన్నవారయ్యా గురువుగారూ మధ్యలో మానేయకండి. దయ ఉంచి ఆ మూడవది కూడా వ్రాసి ముగించండి. ఎవరూ లేకపోయినా మే మున్నాము చదవాలని కోరిక ఉన్నవాళ్ల మని మరి మరీ బలవంత పెట్టారు. నాకు కూడా మనసంత బాగాలేకపోయినా మొదట సంకల్పించిన దానికి విఘాతం చేయటం బాగుండదనిపించి మొక్కుబడి తీర్చినట్టే మూడవ సంపుటం వ్రాసి ఇప్పటికి ముగించి ప్రచురించాను. ఇక నేను వ్రాసేది లేదు. పెట్టేది లేదు. పబ్లిక్కుగా వందలమంది కుపన్యాసా లిచ్చేది లేదు.

ఇప్పుడున్న మనస్తత్త్వాన్ని బట్టి నా జీవితానికున్న ధ్యేయమొక్కటే. అది నిరంతరాత్మాను సంధానం. శ్రవణం కాదు. మననం కాదు. అద్వైతులు చెప్పే నిదిధ్యాసన. నాలుగు మహావాక్యాల సారాంశమది. అవి సిద్ధాంతమైతే దానికి దృష్టాంతమిది. బ్రహ్మాత్మభావం దృష్టమయ్యేంత వరకూ మానవుడికి – ముఖ్యంగా 85 సంవత్సరాలు పైబడి దానికి తోడు పత్నీ వియోగమొకటి సంభవించి మనసు వికలమైన నాకు మనోతీతమైన సర్వాత్మ భావాన్ని అందుకోటం కన్నా చరమదశలో కర్తవ్యమే మున్నదిక. ఇంకా ఏదో వ్రాసి ఏదో చెప్పి లోకాన్ని ఉద్ధరిద్దామను కోటం చాపల్యం. తెలివితక్కువ. నీవుద్ధరిస్తానన్నా ఉద్ధరించబడటానికి సిద్ధంగా ఉందా లోకం. అలా ఉందనుకోటం నీ భ్రాంతి. అందుకే ఉద్ధరే దాత్మనాత్మాన మన్నాడు భగవానుడు. లోకాన్ని ఏముద్ధరిస్తావు నిన్ను నీవుద్ధరించుకొంటే చాలు పొమ్మన్నాడు. కాకపోయినా నాకంటే అన్యంగా లోకమెక్కడ ఉంది. ఆత్మకు భిన్నంగా అసలేదీలేదు. జీవుడూ లేడు జగత్తూ లేదు. ఈశ్వరుడూ లేడు – అంతా ఆభాస. వస్తువుగాదు – వస్తువు నా శరీరమైతే ఆభాస దాని నీడ. నీడనా నీవు పోషిస్తున్నది నీ శరీరాన్నా. నీడ ఎక్కడ ఉన్నదది నీ శరీరమే. అలాగే లోకమెక్కడ ఉంది అది నీ ఆత్మే. అనాత్మగా చూచేదంతా ఆత్మస్వరూపమే వాస్తవానికి.


అందుకే ఎవరూ లేరు నేను సుభాషితం బోధించటానికి. నాకు నేనే చెప్పుకొంటున్నా నంటాడు భర్తృహరి. అలాగే "స్వాంతస్సుఖాయ" నా తృప్తి కోసమంటాడు తులసీదాసు. నేనూ అలాగే **Teaching is the best way of learning** అన్నట్టుగా ఆత్మోద్ధరణకే వ్రాసుకొన్నా నింతకాలమూ ఈ గ్రంధాలన్నీ. చేస్తూ వచ్చా నిన్నేండ్ల నుంచీ ఈ

ప్రవచనాలన్నీ. ఇక గ్రంధ రచన లేదు. ప్రవచనమూ లేదు. మహా అయితే మా ఇంట్లోనో మా శిష్యుల ఇంట్లోనో ఎప్పుడైనా ఏ కొద్ది మందితోనో వేదాంత గోష్ఠి చేయట మొక్కటే. అదైనా ఎందుకంటే తదవిస్మర ణార్థమన్నారు భగవత్పాదులు. అంచేత అటు వేదాంతమైనా ఇటు సాహిత్యమైనా అన్ని విజ్ఞానాలకూ పరాయణం చివరకద్వైతాత్మ జ్ఞానమే ననే సత్యం మరచిపోకుండా సదాతద్భావ భావనతో జీవితం నేనూ నడపుతూ – వివేచనా పరులైన మీరూ అలాగే నడపాలని ఆసిస్తూ ఆఖరిసారిగా 'మాతర్మేదిని' అని భర్తృహరి చెప్పినట్టు మీకందఱికీ వీడుకోలు చెబుతున్నాను.

సెలవు

ఇతి భవదీయః

శ్రీనివాసరాయుః



Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in